అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సోమవారం 01-01-2024
సమగ్ర తెలుగు దినపత్రిక



సంపుటి : 9 సంచిక : 361 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు వెల : 6.50



ప్రజల ఆశలు నెరవేరుస్తాం

రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు : సీఎం రేవంత్‌రెడ్డి

ప్రతి ఇంటా వెలుగులు నింపుతాం

- అందరి సహకారంతో రాష్ట్రాభివృద్ధి
- రైతు, మహిళ, యువ నామ సంవత్సరంగా కొత్త ఏడాది
- అమరులు, ఉద్యమకారుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం


నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్.

రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కొత్త ఏడాదిని రైతు, మహిళ, యువత నామ సంవత్సరంగా సంకల్పం తీసుకున్నట్టు ప్రకటించారు. "అందరి సహకారంతో రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్నాం. నిర్బంధాలు, ఇనుప కంచెలను తొలగించాం. పాలనలో ప్రజలను భాగస్వాములను చేశాం. ప్రజాస్వామ్య పునరుద్ధరణ, పౌరులకు స్వేచ్ఛ ఉంటుందన్న హామీని నిలబెట్టుకున్నాం. ఆరింటిలో రెండు గ్యారెంటీలు అమలు చేశాం. కొత్త ఏడాదిలో మిగతా గ్యారెంటీల అమలుకు సిద్ధంగా ఉన్నాం. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమం అందాలి. అభివృద్ధిలో రాష్ట్రం అగ్రభాగాన ఉండాలి అన్నదే ప్రభుత్వ ఆకాంక్ష" అని సీఎం పేర్కొన్నారు. యువతకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించి, వారి భవిష్యత్‌కు గ్యారెంటీ ఇచ్చే దిశగా ఆలోచన చేస్తున్నామని తెలిపారు. స్తంభించినపోయిన పాలనా వ్యవస్థలో సమూల ప్రక్షాళనకు సంకల్పించామనీ, జనం గోడు వినేందుకు ప్రజా భవన్‌లో ప్రజావాణి కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. కార్యనిర్వాహక వ్యవస్థలో మానవీయత జోడించే ప్రయత్నం చేస్తున్నామని వివరించారు. గత ప్రభుత్వంలో జరిగిన అవినీతిపై చర్యలు తీసుకుంటామనీ, దోపిడీకి గురైన తెలంగాణ ప్రజల సంపదను తిరిగి ...13లో

అడవిపై గొడ్డలి వేటు..!

ఛత్తీస్‌గఢ్ ఆదివాసీ ప్రాంతాల్లో బొగ్గు మైనింగ్

- అదానీ కంపెనీలకు 370 కోట్ల టన్నుల నిక్షేపాల అప్పగింతకు బీజేపీ ఆతృత
- మన్యం బిడ్డలు, పర్యావరణవేత్తలకు తొలి గిరిజన సీఎం హయాంలో బెదిరింపులు



రాయ్‌పూర్ : ఛత్తీస్‌గఢ్‌లో ఇటీవల ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసిన బీజేపీ అదానీ కంపెనీలకు బొగ్గు నిక్షేపాలను కట్టబెట్టేందుకు ఆత్రం ప్రదర్శిస్తోంది. ఆదివాసీ ప్రాంతాల్లో బొగ్గు తవ్వకాలకు అనుమతి ఇస్తోంది. దీనిపై గిరిజనులు, పర్యావరణవేత్తలు మండిపడుతున్నారు. డిసెంబర్ 21న డాక్యుమెంటరీ చిత్రాల నిర్మాత టిజి అజయ్‌ని, అటవీ వనరుల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్న ఛత్తీస్‌గఢ్ బచావో ఆందోళన్ కన్వీనర్ అలోక్ శుక్లాను గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేశారు. ఆ సాయంత్రమే వారిని విడిచిపెట్టారు. గిరిజనుల ప్రభావం ఎక్కువగా ఉన్న సర్‌గుజా జిల్లాలో కొందరు అటవీ కార్యకర్తలను పోలీసులు నిర్బంధించారు. రాష్ట్రంలో జీవవైవిధ్య ప్రాంతమైన హస్‌దియో అరండ్‌లో జరుగుతున్న అడవుల నరికివేత పనులను అడ్డుకోవద్దంటూ పోలీసులు గ్రామస్తులను బెదిరింపులకు గురిచేశారు. గ్రామస్తుల నోరు మూయించేందుకే వారిని నిర్బంధించారంటూ వచ్చిన వార్తలను పోలీసులు తోసిపుచ్చినప్పటికీ ఈ ఘటన ఛత్తీస్‌గఢ్‌లో కార్పొరేట్ రాజ్ ప్రారంభానికి ఓ సంకేతమని పలువురు వ్యాఖ్యానించారు.

వివాదాస్పద అటవీ భూములు మూడు జిల్లాలలో విస్తరించి ఉన్నాయి. వీటిపై ప్రభుత్వ మద్దతున్న మైనింగ్ కంపెనీలు కన్నేశాయి. ప్రధానంగా అదానీ గ్రూపు రంగంలో దిగింది. రాష్ట్రంలోని 3.7 బిలియన్ టన్నుల బొగ్గు నిక్షేపాలను సొంతం చేసుకోవాలని ఆ గ్రూపు లక్ష్యంగా పెట్టుకుంది. అధికార వర్గాల సమాచారం ప్రకారం 2022లో 41 హెక్టార్ల విస్తీర్ణంలోని చెట్లను కూల్చివేశారు. 2023 నవంబరులో మరో 93 హెక్టార్లలో చెట్ల కూల్చివేతకు అనుమతులు ...13లో




ఆదివాసీల నిర్బంధం చట్టవిరుద్ధం

ఆదివాసీల నిర్బంధం చట్టవిరుద్ధం, ప్రమాదకరమని ఛత్తీస్‌గఢ్ బచావో ఆందోళన్ కన్వీనర్ అలోక్ శుక్లా వ్యాఖ్యానించారు. నిరసన గళం విన్పించిన అనేక మందిని నిర్బంధించారని ఆయన తెలిపారు. కొన్ని సందర్భాలలో అయితే పోలీసులు వారిని బట్టలు కూడా మార్చుకోనివ్వకుండా ఇళ్ల నుండి తీసుకెళ్లారని తెలిపారు. నవంబర్ 28న శుక్లా నేతృత్వంలో రాజధాని రాయ్‌పూర్‌లో నిరసన ప్రదర్శన జరిగింది. అనంతరం వారు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్‌కు మెమొరాండాలు అందజేశారు. ఆదివాసీల హక్కుల రక్షణలో జోక్యం చేసుకోవాలని వాటిలో కోరారు.

దాటవేతలొద్దు..

ఎంపీ ఎన్నికల కోడ్ పేరిట ఎగవేతలు, కోతలు పెట్టొద్దు...



- ఫిబ్రవరి 20 లోపే ఆరు గ్యారెంటీలపై విధానపర నిర్ణయం తీసుకోండి
- ఓటాన్ అకౌంట్ కాదు.. పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టండి
- అప్పుడే మీ హామీల అమలు సాధ్యం
- యాసంగి పంటకు బోనస్‌పై తక్షణమే నిర్ణయం తీసుకోండి : మీడియాతో ఇష్టాగోష్టిలో ప్రభుత్వానికి మాజీమంత్రి హరీశ్‌రావు సూచన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాబోయే లోక్‌సభ ఎన్నికల కోడ్ పేరిట ఆరు గ్యారెంటీలకు ప్రభుత్వం ఎగవేతలు, దాటవేతలు, కోతలు పెడుతుందేమోననే ఆందోళనలో రాష్ట్ర ప్రజలున్నారని బీఆర్‌ఎస్ సీనియర్ నేత, మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. తాను ఇటీవల పలు జిల్లాల్లో పర్యటించినప్పుడు ఇదే అనుమానాన్ని పలువురు వ్యక్తం చేశారని ఆయన తెలిపారు. అందువల్ల ఆరు గ్యారెంటీలపై ఎగవేతలు, దాటవేతలు, కోతలొద్దంటూ ప్రభుత్వానికి సూచించారు. ఫిబ్రవరి చివరి వారంలో లోక్‌సభ ఎన్నికల కోడ్ రానుందనే వార్తల నేపథ్యంలో ఆ లోపే (ఫిబ్రవరి 20) వాటిపై ఒక విధానపరమైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఎంపీ ఎలక్షన్ల కారణంగా రాష్ట్ర ప్రభుత్వం ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు రంగం సిద్ధం చేస్తోందనీ, అలా కాకుండా పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెడితేనే హామీల అమలు సాధ్యమవుతుందని స్పష్టం చేశారు.

ఆదివారం హైదరాబాద్‌లోని బీఆర్‌ఎస్ శాసనసభాపక్ష కార్యాలయంలో హరీశ్‌రావు... మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఎన్నికల్లో కాంగ్రెస్ హామీనిచ్చిన ఆరు గ్యారెంటీలు, ప్రజా పాలన, అసెంబ్లీలో ప్రవేశపెట్టిన శ్వేతపత్రాలు, యాసంగి పంటకు బోనస్, లోక్‌సభ ఎన్నికలు తదితరాంశాలను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. పాత్రికేయులు అడిగిన వివిధ ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామంటూ కాంగ్రెస్ ప్రకటించిందని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆ గడువు మార్చి 17తో ముగుస్తుందని తెలిపారు. ఈలోపే లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్, కోడ్ రానున్నాయని ...13లో

కేసీఆర్ అలా చేసుంటే మరోలా ఉండేది

32 మెడికల్ కాలేజీలకు బదులు 32 యూట్యూబ్ చానల్స్ పెట్టాల్సింది


- ఎన్నికల ఫలితాలపై కేటీఆర్ ఆసక్తికర ట్వీట్

వివరాలు 13లో

ఊపిరికి కష్టం

పెరిగిన శ్వాససంబంధ రోగుల సంఖ్య

- వాతావరణం, కరోనా ఎఫెక్ట్ కావచ్చంటున్న వైద్యులు : ఐఎంఏ అధ్యయనం
- కరోనా టెస్టులు పెంచాలని సూచిస్తున్న సైంటిఫిక్ కమిటీ





నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో శ్వాససంబంధ ఇబ్బందులతో బాధ పడుతున్న రోగుల సంఖ్య పెరిగింది. గత రెండు నెలలుగా ఇలాంటి రుగ్మతలతో వస్తున్న రోగుల సంఖ్య పెరుగుతున్నట్టు ఐఎంఏ చేసిన అధ్యయనంలో వెల్లడైంది. హైదరాబాద్, నిజామాబాద్, సిరిసిల్ల తదితర జిల్లాల నుంచి డాక్టర్ల అభిప్రాయాలను సేకరించారు. ఇందులో జనరల్ ఫిజీషియన్లు, పీడియాట్రిషిన్లు, పల్మనాలజిస్ట్ తదితర ప్రత్యేక వైద్య నిపుణులున్నారు. ప్రభుత్వాస్పత్రులతో పాటు ...13లో

పోరాట నామ సంవత్సరం



2023 రౌండప్

న్యూఢిల్లీ : కాలగర్భంలో మరొక ఏడాది కలిసిపోయింది. 2023 గత జ్ఞాపకంగా మిగిలిపోయింది. అయితే 2023ను పోరాట నామ సంవత్సరంగా మనకు గుర్తిండిపోతుంది. కేంద్రంలో ప్రధానమంతి నరేంద్ర మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా,కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్తంగా 2023లో అనేక సామూహిక పోరాటాలు, ఆందోళనలు జరిగాయి. ఈ ఐక్య, బలమైన పోరాటానికి మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించే పూర్తి శక్తి ఉంది. కేంద్ర దర్యాప్తు సంస్థలను మోడీ ప్రభుత్వం తమ పావులుగా ఉపయోగించుకోవడంపైనా పోరాటాలు ఉధృతమయ్యాయి. 2023లో జరిగిన కొన్ని ముఖ్యమైన రాజకీయ పరిణామలు..

జర్నలిస్టులపై దాడులు

ప్రతిపక్ష నేతలతో పాటు తమకు వ్యతిరేకంగా గళం వినిపిస్తున్న ఉద్యమకారులు, జర్నలిస్టులపై మోడీ ప్రభుత్వం నిరంకుశ దాడులకు పాల్పడింది. అక్టోబర్‌లో ఢిల్లీ పోలీసులు సమారు 50 మంది జర్నలిస్టులు, రచయితల ఇళ్లపై దాడులు చేశారు. 'న్యూస్‌క్లిక్' వెబ్‌సైట్ ఎడిటర్ ప్రబీర్ పుర్కాయస్థ, న్యూస్ మీడియా అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అమిత్ చక్రవర్తిలను అరెస్ట్ చేశారు. వీరిద్దరిపై యూఏపీఏ చేర్చారు. జర్నలిస్టులపై దాడులు చేసి ల్యాప్‌టాప్‌లు, ...5లో

మోడీ క్రూరత్వానికి నిదర్శనం

ఏ ఆడబిడ్డకైనా ఆత్మగౌరవమే తొలి ప్రాధాన్యం

- దాన్ని గుర్తించని ప్రధాని ఉదాసీనత బాధ కలిగిస్తోంది
- రెజ్లర్ల కన్నీళ్లు ఆయన్ని కదలించలేకపోయాయి.. : రాహుల్ గాంధీ

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఇటీవల భారత రెజ్లింగ్ సమాఖ్యలో (డబ్ల్యూఎఫ్ఐ) చోటుచేసుకున్న పరిణామాలకు నిరసనగా.. స్టార్ రెజ్లర్ వినేశ్ ఫోగాట్ తన ఖేల్‌రత్న, అర్జున అవార్డులను తిరిగి వెనక్కి ఇచ్చేసింది. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోడీలపై ఆరోపణలు గుప్పించారు. 'జాతి సంరక్షకుడు' అని పిలిచే ప్రధాని మోడీ క్రూరత్వానికి ఇది నిదర్శనమంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు.

"దేశంలోని ప్రతి కూతురికి ఆత్మ గౌరవమే తొలి ప్రాధాన్యం. ఆ తర్వాతే పతకం, గౌరవం, మరేదైనా వస్తాయి.

ఈ ధీర వనితల కన్నీళ్ల కంటే.. తమని తాము 'బాహుబలి'గా రాజకీయ ప్రయోజనాలు ఎక్కువ అయ్యాయా? దేశానికి సంరక్షకుడైన ప్రధానమంత్రి నుంచి ఇలాంటి క్రూరత్వం, ఉదాసీనత చూస్తుంటే చాలా బాధగా ఉంది" అంటూ రాహుల్ గాంధీ ఎక్స్ వేదికగా ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ ట్వీట్‌కి తన పతకాల్ని ప్రధాని మోడీకి అందజేసేందుకు



శనివారం వినేశ్ ఫొగాట్ బయలుదేరిన వీడియోను కూడా ఆయన షేర్ చేశారు.

జనగణన మళ్లీ వాయిదా

- 2024 అక్టోబర్ వరకూ లేనట్లే
- తాజా నోటిఫికేషన్ విడుదల

వివరాలు 3లో

డేంజర్ బెల్స్



- ఒక్క రోజే 841 కొత్త కేసులు నమోదు : కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ సమాచారం

వివరాలు 5లో



మెస్సీ కాదు కోహ్లి

ప్యూబిటి అథ్లెట్ ఆఫ్ ది ఇయర్ అవార్డు సొంతం




న్యూఢిల్లీ : ప్రపంచ స్పోర్ట్స్ స్టార్స్ లియోనల్ మెస్సి, విరాట్ కోహ్లి. ఫుట్‌బాల్ రారాజు మెస్సి కాగా.. క్రికెట్‌లో కింగ్ విరాట్ కోహ్లి. మరి ఈ ఇద్దరు దిగ్గజాలు ఓ అవార్డు రేసులో నిలిస్తే ఏంటీ పరిస్థితి!. ప్యూబిటి అథ్లెట్ ఆఫ్ ది ఇయర్ అవార్డు రేసులో లియోనల్ మెస్సిని వెనక్కి నెట్టిన విరాట్ కోహ్లి.. ప్రతిష్టాత్మక పురస్కారం దక్కించుకున్నాడు. నొవాక్ జకోవిచ్, కార్లోస్ అల్కరాజ్, లెబ్రాన్ జోన్స్, మాక్స్ వెర్‌స్టాపెన్‌లు సైతం రేసులో నిలిచినా.. అంతిమంగా అవార్డు కోసం మెస్సి, కోహ్లి నడుమ పోటీ నెలకొంది. ఓటింగ్‌లో అవార్డును విన్నర్‌ను తేల్చగా.. కోహ్లి ఏకంగా ఐదు లక్షల ఓట్లతో అథ్లెట్ ఆఫ్ ది ఇయర్‌గా నిలిచాడు. 2023 ఏడాదిని కోహ్లిని గొప్పగా ముగించాడు. టెస్టులు, వన్డేల్లో ఎదురులేని రికార్డులు నెలకొల్పాడు. వన్డే వరల్డ్‌కప్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా నిలువటంతో పాటు 50 వన్డే శతకాల రికార్డును సైతం నెలకొల్పాడు. మరోవైపు 2022 ఫిఫా ప్రపంచకప్ విజయానంతరం మెస్సి పెద్దగా ఏం చేయలేదు. ఈ ఏడాది అమెరికాకు వచ్చిన మెస్సి.. డెవిడ్ బెక్‌హామ్ యాజమాన్యంలోని ఇంటర్ మియామి తరఫున ఆడుతున్నాడు.

డిసైడర్‌లో కివీస్ గెలుపు

బంగ్లాతో టీ20 సిరీస్ సమం



మౌంట్‌మౌంగానుయ్ : న్యూజిలాండ్ గడ్డపై చారిత్రక సిరీస్ విజయం సాధించాలనే పట్టుదల ప్రదర్శించిన బంగ్లాదేశ్‌కు కివీస్ చెక్ పెట్టింది. నిర్ణయాత్మక మూడో టీ20లో గెలుపొందిన న్యూజిలాండ్ టీ20 సిరీస్‌ను 1-1తో సమం చేసింది. వర్షం ప్రభావిత మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌పై 17 పరుగుల తేడాతో విజయం సాధించింది. టాస్ నెగ్గి తొలుత ఫీల్డింగ్ ఎంచుకున్న న్యూజిలాండ్.. బంగ్లాదేశ్‌ను 19.2 ఓవర్లలో 110 పరుగులకే కుప్పకూల్చింది. కెప్టెన్ మిచెల్ శాంట్నర్ (4/16) మ్యాజిక్‌కు తోడు సౌథీ, మిల్నె, సీయర్స్ రెండేసి వికెట్లతో చెలరేగారు. బంగ్లా తరఫున శాంటో (17), తౌహిద్ (16), అఫిఫ్ (14) టాప్ స్కోరర్లుగా నిలిచారు. ఛేదనలో కివీస్ 14.4 ఓవర్లలో 5 వికెట్లకు 95 పరుగులు చేసింది. సీఫర్ట్ (1), మిచెల్ (1), చాప్‌మన్ (1), ఫిలిప్స్ (1) విఫలమైనా.. ఓపెనర్ ఫిన్ అలెన్ (38), జేమ్స్ నీషమ్ (28 నాటౌట్), మిచెల్ శాంట్నర్ (18 నాటౌట్)లు కివీస్‌ను ముందంజలో నిలిపారు. మరో 32 బంతుల్లో 16 పరుగులు అవసరమైన దశలో వర్షం ఆటకు అడ్డు తగిలింది. దీంతో డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో న్యూజిలాండ్ 17 పరుగుల తేడాతో విజయం సాధించింది. మిచెల్ శాంట్నర్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్నాడు.



స్టేడియం ఎక్కడ?

- పార్క్‌లో భారత్, పాక్ మ్యాచ్ షెడ్యూల్
- ఇంకా మొదలవని స్టేడియం నిర్మాణం పనులు
- మరో ఆరు నెలల్లో 2024 టీ20 ప్రపంచకప్

న్యూయార్క్ : భారత్, పాకిస్థాన్ క్రికెట్ పోరు. ప్రపంచ క్రికెట్‌లో అభిమానులు అత్యంత ఆసక్తిగా, ఉత్కంఠగా ఎదురుచూసే దాయాదుల సమరం. ఈ రెండు జట్లు ఎప్పుడు తలపడినా స్టేడియం కిక్కిరిసిపోవటంతో పాటు టెలివిజన్, డిజటల్ వ్యూయర్‌షిప్‌లో సరికొత్త రికార్డులు నమోదవుతాయి. దాయాదుల మెగా మ్యాచ్‌కు ఆతిథ్యం అందించే భాగ్యం దక్కటమో పెద్ద విషయం. ఐసీసీ టోర్నీల్లో భాగంగా ఏ దేశంలో భారత్, పాక్ తలపడినా అత్యుత్తమ సౌకర్యాలు, అత్యధిక సీటింగ్ కెపాసిటీ కలిగిన స్టేడియంనే వేదికగా ఎంపిక చేస్తారు. కానీ తొలిసారి అసలు స్టేడియమే లేని చోట భారత్, పాకిస్థాన్ మ్యాచ్‌ను షెడ్యూల్ చేశారు. అందుకు మరో ఆరు నెలల్లో ఆరంభం కానున్న ఐసీసీ 2024 టీ20 ప్రపంచకప్ వేదిక కానుంది. ఈ విషయం క్రికెట్ అభిమానులను కాస్త షాక్‌కు గురి చేసినా.. ఇదే కఠోర వాస్తవం.

ఫిబ్రవరిలో నిర్మాణం మొదలు! : భారత్, పాకిస్థాన్ టీ20 ప్రపంచకప్ మ్యాచ్ న్యూయార్క్‌లో జరుగనుందని ఐసీసీ ఇటీవల షెడ్యూల్ ప్రకటిస్తూ.. గొప్పగా ప్రచారం చేసింది. ఇరు దేశాల అభిమానులు సైతం న్యూయార్క్‌లో దాయాదుల ధనాధన్‌పై భారీగా అంచనాలు పెంచుకున్నారు. కానీ తీరా చూస్తే.. అసలు ఈసన్‌హోవర్ పార్క్‌లో ఎటువంటి స్టేడియం లేదు. ప్రస్తుతానికి అక్కడ మార్నింగ్, ఈవెనింగ్ వాకింగ్ చేసేందుకు స్థానికులు వస్తున్నారు. క్రికెట్‌కు సంబంధించి ఎటువంటి కార్యకలాపాలు జరుగటం లేదు. కనీసం క్రికెట్ పిచ్ కూడా లేదు. ఇటువంటి చోట భారత్, పాకిస్థాన్ మ్యాచ్‌ను షెడ్యూల్ చేయటంపై సోషల్ మీడియాలో అభిమానులు మండిపడుతున్నారు. ప్రపంచకప్‌కు మరో ఆరు నెలల సమయం ఉంది. ఫిబ్రవరిలో స్టేడియం నిర్మాణం పనులు ఆరంభం అయ్యే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది.

అసలు జరుగుతుందా? : అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం ఎంత వేగంగా చేపట్టినా కనీసం 40 నెలల సమయం పడుతుంది. కాన్సెప్ట్, డిజైన్, కన్‌స్ట్రక్షన్‌లకు కలుపుకుంటే మరింత అధిక సమయం తీసుకుంటుంది. ప్రస్తుతానికి ఈసన్‌హోవర్ పార్క్ సాధారణ ఓ ఖాళీ స్థలమని చెప్పవచ్చు!. క్రికెట్ పిచ్‌లు రూపొందించటం పెద్ద కష్టం కాదు. కానీ కనీసం 34 వేల మంది కూర్చునేందుకు అనువైన స్టేడియం నిర్మాణానికి కనీస సమయం పడుతుంది. ఈ విషయం ఐసీసీ పెద్దలకు తెలియనిది కాదు. అయినా, స్టేడియం లేని చోట భారత్, పాక్ మ్యాచ్‌కు షెడ్యూల్ చేసింది. విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్ సహా బాబర్ ఆజం, మహ్మద్ రిజ్వాన్ వంటి స్టార్ క్రికెటర్లు మరో ఆరు నెలల్లో ఇక్కడే సాధన చేయనున్నారు. నాలుగు నెలల్లో స్టేడియం నిర్మాణం పూర్తి చేస్తారా? అనే అనుమానం అంతటా నెలకొంది. లేదంటే ఆఖరు క్షణంలో వేదికను ఫ్లోరిడా లేదా కరీబియన్ దీవులకు మార్పు చేసేందుకు అవకాశం లేకపోలేదు.

'ఈసన్‌హోవర్‌పార్క్.. భారత్, పాక్ టీ20 ప్రపంచకప్ మ్యాచ్‌కు వేదిక. ఇది కనీసం నిర్మాణంలో కూడా లేదు. నిర్మాణ పనులు ప్రారంభం కావడానికి సైతం మరో నెల రోజుల సమయం పడుతుంది. మరో ఆరు నెలల్లోనే ఐసీసీ టీ20 ప్రపంచకప్ జరుగనుంది. ప్రస్తుతం ఈసన్‌హోవర్‌పార్క్ పరిస్థితి ఇది అంటూ' ఓ క్రికెట్ జర్నలిస్ట్ ఈసన్‌హోవర్‌పార్క్ ఫోటోలను సోషల్ మీడియాలో పంచుకున్నారు.

ఆటలు

దూకుడు తగ్గించాలి

- టెస్టుల్లో గిల్ బ్యాటింగ్‌పై గవాస్కర్



ముంబయి : స్వదేశంలో 2023 ప్రపంచకప్ ఫైనల్ ఓటమి, దక్షిణాఫ్రికాతో సెంచూరియన్ టెస్టులో మూడు రోజుల్లోపే పరాజయం భారత క్రికెట్ అభిమానులను తీవ్రంగా నిరాశపరిచింది. మాజీ క్రికెటర్లు సైతం విమర్శలకు పదును పెడుతున్నారు. పసలేని పేస్ బౌలింగ్, బాధ్యత లేని బ్యాటింగ్ లైనప్‌పై పదునైన విమర్శలు వచ్చాయి. టీమ్ ఇండియా ఆల్ ఫార్మాట్ స్టార్‌గా ఎదుగుతున్న శుభ్‌మన్ గిల్ అటు ప్రపంచకప్‌లో, ఇటు టెస్టుల్లో అంచనాలను అందుకోలేదు. వైట్‌బాల్ ఫార్మాట్‌లో సక్సెస్ సాధించిన గిల్.. టెస్టు క్రికెట్‌లో తనదైన సత్తా చూపించాల్సి ఉంది. సఫారీతో తొలి టెస్టులో శుభ్‌మన్ గిల్ టెంపర్‌మెంట్, దూకుడుపై లిటిల్ మాస్టర్ సునీల్ గవాస్కర్ కీలక వ్యాఖ్యలు చేశాడు. టెస్టు క్రికెట్‌లో రాణించేందుకు శుభ్‌మన్ గిల్ బ్యాటింగ్‌లో దూకుడు కాస్త తగ్గించాలని సూచించాడు. సెంచూరియన్ టెస్టులో శుభ్‌మన్ గిల్ వరుస ఇన్నింగ్స్‌లో విఫలమయ్యాడు. కీలక నం.3 స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చి 2, 26 పరుగులే చేశాడు. 2023 ఏడాదిలో వన్డేల్లో 63.36 సగటుతో 1584 పరుగులు చేసిన గిల్.. టీ20ల్లో 44.21 సగటుతో 1202 పరుగులు చేశాడు. కానీ టెస్టుల్లోనే గిల్ సగటు 30కి దిగువగా ఉంది. టెస్టుల్లో 30కి లోపు సగటు కలిగి ఉండటం గిల్‌కు ఇది వరుసగా మూడో ఏడాది. ఇది భారత క్రికెట్ విశ్లేషకులను ఆందోళనకు గురి చేస్తోంది.

'టెస్టు క్రికెట్‌లో శుభ్‌మన్ గిల్ మరీ దూకుడుగా ఆడుతున్నాడని అనుకుంటున్నాను. వన్డేలు, టీ20లతో పోల్చితే.. టెస్టులు ఆడేటప్పుడు కొంత వ్యత్యాసం ఉంటుంది. వైట్, రెడ్‌బాల్ క్రికెట్‌లో బ్యాటింగ్‌కు కఠినతరం చేసేది బాల్. వన్డేలు, టీ20ల్లో వాడే వైట్‌బాల్‌తో పోల్చితే.. టెస్టులో వినియోగించే రెడ్ బాల్ గాల్లో, పిచ్ పడిన అనంతరం కాస్త ఎక్కువ తిరుగుతుంది. బౌన్స్ విషయంలోనూ రెడ్ బాల్‌కు అధిక అనుకూలత ఉంటుంది. బ్యాటర్లు ఈ విషయాన్ని గమనంలో ఉంచుకోవాలి. శుభ్‌మన్ గిల్ కెరీర్‌ను చక్కగా మొదలెట్టాడు. అతడు ఆడిన షాట్లు విమర్శకుల మెప్పు పొందాయి. అతడు భవిష్యత్‌లో ఫామ్ అందుకుంటాడని ఆశిస్తున్నాను. ప్రాక్టీస్‌లో కఠోరంగా సాధన చేసి.. రెండో టెస్టులో మెరుగు పడతాడని అనుకుంటున్నాను' సునీల్ గవాస్కర్ ఓ టీవీ చానల్ కార్యక్రమంలో అన్నాడు.

ప్రపంచవ్యాప్తంగా నూతన సంవత్సర వేడుకలు

సిడ్నీ, ఆక్లాండ్‌లో ముందుగా.

న్యూఢిల్లీ : 2024 నూతన సంవత్సర వేడుకలు ప్రపంచవ్యాప్తంగా హోరెత్తాయి. సిడ్నీ, ఆక్లాండ్ నగరాల్లో ఈ వేడుకలు ముందుగా ప్రారంభమయ్యాయి. సిడ్నీ హార్బర్, ఆక్లాండ్‌లోని స్కై టవర్ వద్ద అద్భుతమైన బాణసంచా ప్రదర్శనలతో వేడుకలు ప్రారంభమయ్యాయి. సిడ్నీ హార్బర్ వంతెనపై సుమారు 12 నిమిషాలపాటు టన్నుల కొద్దీ బాణసంచా కాల్చారు. ఈ వేడుకను చూడ్డానికి ఇతర దేశాల నుంచి కూడా పర్యాటకులు వచ్చారు. ఆక్లాండ్‌లోని 328 మీటర్ల ఎత్తయిన కమ్యూనికేషన్స్ అండ్ అబ్జర్వేషన్ టవర్‌పై కాల్చిన బాణాసంచా నగరం మొత్తాన్ని వెలుగులతో నింపింది. వాటికన్ సిటీలో నూతన సంవత్సర వేడుకల ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. 2023ను యుద్ధ బాధల సంవత్సరంగా పోప్ ఫ్రాన్సిస్ గుర్తు చేసుకున్నారు. సెయింట్ పీటర్స్ స్క్వేర్‌కు ముందున్న కిటికీ నుంచి పోప్ సాంప్రదాయ ఆశీర్వాదం ఇచ్చారు. బాధించబడుతున్న ఉక్రెయిన్, పాలస్తీనా, ఇజ్రాయిల్, సూడాన్ ప్రజలతోపాటు ఇతర ప్రాంతాల ప్రజల కోసం పోప్ ఫ్రాన్సిస్ ప్రార్థనలు చేశారు. 'యుద్ధంలో ఎన్నో మానవ జీవితాలు ఛిద్రమయ్యాయి. ఎంతోమంది మరణించారు. ఎన్నో బాధలు, ఎంతో పేదరికాన్ని బాధితులు అనుభవిస్తున్నారు' అని పోప్ తెలిపారు. న్యూయార్క్ నగరంలో టైమ్స్ స్క్వేర్ వద్ద వేడుకలు జరిగాయి. ఈ వేడుకలకు బెదిరింపులు రావడంతో భారీ భద్రతను ఏర్పాటు చేశారు. డ్రోన్లతోనూ నిఘా పెట్టారు. ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో నూతన వేడుకలకు భారీ స్థాయిలో ఏర్పాటు చేశారు. 2024లో పారిస్‌లో ఒలింపిక్స్ జరుగుతుండటంతో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. డిసెంబర్ 2న ఈఫిల్ టవర్ వద్ద కత్తిపోట్ల సంఘటన చోటు చేసుకోవడంతో భారీ భద్రత ఏర్పాటు చేశారు. జర్మనీ బెర్లిన్‌లోనూ వేడుకలకు భారీగా మోహరించారు. వీధుల్లో ఫైర్ క్రాకర్ల వాడకంపై అధికారులు నిషేధం విధించారు. పాలస్తీనా వాసులకు సంఘీభావంగా పాకిస్తాన్‌లో నూతన సంవత్సర వేడుకలపై ప్రభుత్వం నిషేధం విధించింది.


అలుపెరుగని కలం యోధుడు

- జాన్ పిల్జర్ కన్నుమూత

లండన్ : ప్రపంచ ప్రఖ్యాత జర్నలిస్టుల్లో ఒకరు, హక్కుల కార్యకర్త, డాక్యుమెంటరీ మేకర్ జాన్ పిల్జర్ (84) శనివారం తుది శ్వాస విడిచారు. పిల్జర్ ఇక లేరన్న వార్తను ఆయన కుటుంబ సభ్యులు ఎక్స్ (గతంలో ట్విట్టర్) ద్వారా వెల్లడించారు. పాలస్తీనా నుండి కంబోడియా దాకా, వియత్నాం, ఇరాక్ దాకా అమెరికన్ సామ్రాజ్యవాదుల దురాక్రమణపూరిత యుద్ధాల వల్ల ప్రజలు ఎదుర్కొన్న బాధలను కళ్లకు కట్టినట్లు తన వార్తా కథనాలు, డాక్యుమెంటరీల్లో చూపించారు. కలాన్ని అత్యంత పదునైన ఆయుధంగా ఉపయోగించడంలో ఆయనకు ఆయనే సాటి. సామ్రాజ్యవాదుల కుట్రలకు వ్యతిరేకంగా ప్రపంచాన్ని మేల్కొలిపేందుకు జీవితాంతం పోరాడిన వ్యక్తి ఆయన. తాజాగా ఇజ్రాయిల్ పాలస్తీనాపై సాగిస్తున్న ఊచకోతను పిల్జర్ తీవ్రంగా విమర్శిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. వికీలీక్స్ వ్యవస్థాపకుడు జులియస్ అసాంజెకు బాసటగా నిలిచారు. ఆస్ట్రేలియాలో జన్మించిన పిల్జర్ జర్నలిజంలో రాజీపడని వ్యక్తిగా పేరుతెచ్చుకున్నారు.

సిడ్నీలో హైస్కూల్ స్థాయిలోనే వార్తపత్రికను ప్రారంభించిన పిల్జర్ తరువాత యూరప్‌కు వెళ్లారు. 1962లో ఇంగ్లండ్‌లో ఫ్రీలాన్సర్‌గా పాత్రికేయ జీవితాన్ని ప్రారంభించారు. తరువాత రాయిటర్స్ వార్తా సంస్థలో చేరారు. అటు పిమ్మట లండన్ డైలీ మిర్రర్‌కు ప్రధాన విదేశీ కరస్పాండెంట్‌గా పనిచేశారు. ప్రపంచంలో వివిధ యుద్ధాలను కవర్ చేశారు. వీటిల్లో వియత్నాం యుద్ధం ప్రధానమైనది. ఇంగ్లండ్ నుంచి అమెరికా వెళ్లిన పిల్జర్ 1970వ దశకంలో అమెరికాలో జరిగిన తిరుగుబాట్లపై అనేక కథనాలు రాశారు. అలాగే కంబోడియా, తూర్పు తైమూర్ నుంచి పిల్జర్ రాసిన కథనాలు సంచలనం సృష్టించాయి. వార్త నివేదికలతో పాటు పలు డాక్యుమెంటరీలను ఆయన రూపొందించారు. పలు పుస్తకాలు రాశారు.

ముఖ్యంగా తన సొంత దేశం ఆస్ట్రేలియాపై రూపొందించిన ది సీక్రెట్ కంట్రీ (1983), బైసెంటరీ త్రయం ది లాస్ట్ డ్రీమ్ (1988), వెల్‌కమ్ టూ ఆస్ట్రేలియా (1999), యుటోపియా (2013) విశేష ప్రాచుర్యం పొందాయి. అలాగే జర్నలిజంపై రచించిన 'హిడెన్ ఎజెండాస్' పుస్తకం విశేషాదరణ పొందింది.



స్వాధీన నోటీసు
(స్థిరాస్తి కోసం)

పేర్కొనడమేమనగా,

దిగువ సంతకం చేసిన వారు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద ఇండియాబుల్స్ కమర్షియల్ క్రెడిట్ లిమిటెడ్ (CIN:L65922DL2005PLC136029) ... HHLHYM00438334 ... 12.10.2021 ... రూ. 62,36,643.06 ... 03.11.2021 ... 29.12.2023 ... 12.10.2021 ... రూ. 62,36,643.06 ...

స్థిరాస్తి వివరాలు

తేది : 29.12.2023 అధీకృత అధికారి
ప్రదేశం : హైదరాబాద్ ఇండియాబుల్స్ కమర్షియల్ క్రెడిట్ లిమిటెడ్

ఐబిసి, 2016 క్రింద అమ్మకపు ప్రకటన

మెసర్స్ జిబికె ఇండస్ట్రీస్ లిమిటెడ్ (జిపికెఐఎల్) (లిక్విడేషన్‌లో)

రిజిస్టర్డ్ ఆఫీసు: ప్లాట్ నెం.10, సైగా కాలనీ ఫేజ్-1, సర్దార్‌పటేల్ రోడ్, సికింద్రాబాద్, హైదరాబాద్, తెలంగాణ-500003.

ఐబిబిఐ (లిక్విడేషన్ ప్రాసెస్) రెగ్యులేషన్స్, 2016లోని రెగ్యులేషన్ 32తో చదవగల ఐబిసి, 2016 యొక్క సెక్షన్ 35(ఎఫ్) క్రింద లిక్విడేటర్‌చే లిక్విడేషన్ ఎస్టేట్ యొక్క పార్మింగ్ పార్ట్ జిపికెఐఎల్ యొక్క దిగువ ఆస్తులను అమ్మకానికి ఎన్ఇఎస్ఎల్ యొక్క ఇ-వేలం ప్లాట్‌ఫామ్ ద్వారా బిడ్లను ఆహ్వానిస్తున్నారు.

లాట్స్	రెగ్యులేషన్స్ 32(ఏ) నుండి (డి) క్రింద జిపికెఐఎల్ యొక్క ఆస్తుల అమ్మకం పూర్తి వివరాలు దిగువ ఇవ్వబడినవి	రిజర్వు ధర (రూ.)	ధరావత్తు (రూ.)	బిడ్ పెంపుదల మొత్తం (రూ.)
లాట్-1	ప్లాంట్ & మెషినరీ మరియు పవర్ ప్లాంట్ బిల్డింగ్స్: ప్రధానంగా జెగురుపాడు, రాజమండ్రీ, తూర్పు గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్ వద్దగల 1) 148.85 ఎండబ్ల్యు అల్‌స్టోమ్ (జిటి13ఇ2 డ్యుయల్ ఫ్యూయల్) గ్యాస్ టర్బైన్; 2) 80ఎండబ్ల్యు అల్‌స్టోమ్ (ఎస్ఇ33ఏపి ట్రిపుల్ ప్రెస్సర్) స్టీమ్ టర్బైన్ మరియు 3) 220డబ్ల్యుఎం కెపాసిటి కలిగిన ఫేజ్ 2 గ్యాస్ బేస్డ్ పవర్ ప్లాంట్ యొక్క బిల్డింగ్ & ఇతర ఇక్విప్‌మెంట్, ఎలక్ట్రికల్, ఫిట్టింగ్స్, ఇన్వెంటరీ, స్టోర్స్, ఫర్నిచర్ & ఫిక్చరు కలిగిన ప్లాంట్ & మెషినరీ మొత్తం.	88.74 కోట్లు	8.87 కోట్లు	1.00 కోటి
లాట్-2	కేశవరం గ్రామం, మండపేట (మం), రాజమండ్రీ, తూర్పుగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్ వద్దగల సర్వే నెంబర్లు 21/1, 21/3, 21/4, 21/5, 21/6 మరియు 21/7 క్రింద 9.85 ఎకరాల భూమి.	638 లక్షలు	63.8 లక్షలు	2 లక్షలు
లాట్-3	జెగురుపాడు గ్రామం, కడియం(మం), రాజమండ్రీ, తూర్పుగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్ వద్దగల సర్వే నెంబర్లు 51/3 మరియు 50/5-3 మరియు కేశవరం గ్రామం, మండపేట(మం) వద్దగల సర్వే నెంబర్లు 231/1, 231/2, 231/6 క్రింద 2.97 ఎకరాల భూమి.	155 లక్షలు	15.5 లక్షలు	2 లక్షలు

వివరాలు	Lot-I	Lot-II to III
అన్ని బిడ్ల పత్రాలతో ఇఓఐ సమర్పించుటకు చివరి తేది:	15-01-2024	
ధరావత్తు సమర్పించుటకు చివరి తేది:	15-01-2024	28-01-2024
ఇ-వేలం తేది & సమయం	తేది: 30-01-2024 (ఉ॥ 10.00 నుండి సా॥ 4.00 గం॥ల వరకు) ప్రతిలాట్‌కు కొరకు 5 నిమిషాల చొప్పున సా.7.00గం.ల వరకు అపరిమిత పొడిగింపుతో	

1. ఆసక్తిగల దరఖాస్తుదారులు ఆన్‌లైన్ ఇ-వేలం నియమ నిబంధనలు, బిడ్ ఫారం, అర్హత నియమావళి, బిడ్డరుదారులచే డిక్లరేషన్, ధరావత్తు మొత్తాలతో (1)లాట్-1 లేదా (2) లాట్-2 & 3 కొరకు వర్తించునట్లు సంబంధిత ఇ-వేలం ప్రాసెస్ ఇన్ఫర్మేషన్ పత్రం https://nesl.co.in/auction-notices-under-ibc/ నందు లభించు వాటిని రిఫర్ చేయండి.
2. బిడ్ సంబంధిత పత్రాలను ఒరిజినల్స్‌ను అనుసరిస్తూ నిర్దిష్ట ఫార్మాట్‌లోని ఇమెయిల్ ద్వారా మాత్రమే దాఖలు చేయబడాలి.
3. ...

... 9849039674 ... info@ksrfms.com ... liqgvk@gmail.com ... 9491791079 ...

సం/- సి.హెచ్. సాయి రమేష్ మధుర్తి
IBBI Reg No.: IBBI/IPA-001/IP-P00910/2017-2018/11510
తేది: 01-01-2024
ప్రదేశం: హైదరాబాద్

यूनियन बैंक ఆఫ్ ఇండియా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

UMFB గుడివాడ బ్రాంచి - 01461.
గుడివాడ, కృష్ణా జిల్లా - 521301
Email: - ubin0801461@unionbankofindia.bank

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరచు ప్రకటన (30 రోజుల ప్రకటన)

(RULE 6 (2) RULE 8(6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002)

ఋణగ్రహీత (లు) / కో అప్లికెంట్ (లు) / తనఖాదారు (లు) / హామీదారు (లు) / సహా ఆప్లికెంట్ (లు) ... 521301 ...

విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, (SARFAESI) ... 02-01-2014 ... 19-03-2016 ... 43,40,000/- ...

స్థిరాస్తి వివరములు

తేది : 14-11-2023 సం/- అధీకృత అధికారి,
స్థలం : గుడివాడ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

JM FINANCIAL

జెఎం ఫైనాన్షియల్ అస్సెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్

కార్పొరేట్ ఐడెంటిటీ నెంబర్: U67190MH2007PLC174287
రిజిస్టర్డ్ కార్యాలయం చిరునామా: 7వ అంతస్తు, క్యూబ్, అప్పాసాహెబ్ మరాఠే మార్గ్, ప్రభాదేవి, ముంబయి-400025.
ఫోన్: +91 22 6630 3030 F: +91 22 6630 3223 www.Jmfinancialarc.com

డిమాండ్ నోటీసు

... "SARFAESI చట్టం" ... 60రోజుల్లోపు తిరిగిచెల్లించాల్సి ఉంటుంది ...

ఋణగ్రహీత(లు), హామీదారు(ల) యొక్క పేరు	డిమాండ్ నోటీసు తేదీ మరియు ఎన్‌పిఏ తేదీతో మొత్తం	సెక్యూర్డ్ ఆస్తి యొక్క వివరాలు (స్థిరాస్తి)
(ఎల్ఏసి నెం.02600003310 కల్బుర్గి బ్రాంచ్) నారాయణ శ్రీకృష్ణప్ప పుల్లా (ఋణగ్రహీత)	28-11-2023 / రూ.578042/- (రూపాయలు ఐదు లక్షల డెబ్బైఎనిమిది వేల నలభై రెండు మాత్రమే) ఎన్‌పిఏ (11-03-2023)	ప్లాట్ నెం.27, ఎం.నెం.13-2-2/27, సర్వే నెం.237&237పైకి, పోత్గల్, పోత్గల్ గ్రామం, రాయిచూర్, రాయిచూర్, కర్ణాటక-584101
(ఎల్ఏసి నెం.00700006466 హైదరాబాద్ బ్రాంచ్) రాజీ అల్లూరి (ఋణగ్రహీత) శ్రీనివాస రాజు అల్లూరి (సహ-ఋణగ్రహీత 1)	28-11-2023 / రూ.1287251/- (రూపాయలు పన్నెండులక్షల ఎనభైఏడు వేల రెండువందల యాభైఒకటి మాత్రమే) ఎన్‌పిఏ (08-08-2023)	ప్లాట్ నెం.61పైగల ఇల్లు, కిస్టాపూర్ × రోడ్స్ దగ్గర, కిస్టాపూర్ హామ్లెట్, మేడ్చల్, (గ్రేటర్, హైదరాబాద్, రంగారెడ్డి, తెలంగాణ-501401
(ఎల్ఏసి నెం.17500000770 హైదరాబాద్ నాగోల్ బ్రాంచ్) అన్నపూర్ణ బొయ్యపాటి (ఋణగ్రహీత) శ్రీనివాస రావు బొయ్యపాటి (సహ-ఋణగ్రహీత)	28-11-2023 / రూ.1680748/- (రూపాయలు పదహారులక్షల ఎనభైవేల ఏడువందల ఎనభై ఎనిమిది మాత్రమే) ఎన్‌పిఏ (09-02-2023)	ప్లాట్ నెం.113డబ్ల్యు/పి, వై నెం.48 మరియు 63, శ్రీ రామంజనేయ నగర్, మునగనూరు గ్రామం, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, రంగారెడ్డి జిల్లా హైదరాబాద్, రంగారెడ్డి, తెలంగాణ-501511.

పైన పేర్కొన్న విధంగా జెఎం వారికి సంబంధిత ఋణగ్రహీతలు బకాయిలను తిరిగిచెల్లించడంలో విఫలమైనట్లయితే, సదరు చట్టంలోని సెక్షన్ 13(4) మరియు వర్తింపదగిన నిబంధనలకు ప్రకారం జెఎం వారు సదరు సెక్యూరిటీ ఆస్తులకు సంబంధించి అనుగుణంగా ముందుకెళ్తారని తెలియజేయనైనది. ...

తేది: 01-01-2024, సం/- (అధీకృత అధికారి)
ప్రదేశం: తెలంగాణ జెఎం ఫైనాన్షియల్ అస్సెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్

రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

- గవర్నర్, పలువురు మంత్రులు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రజలకు గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ నూతన సంవత్సరం (2024) శుభాకాంక్షలు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి , సీతక్క, తుమ్మల, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, జూపల్లి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. వీరితో పాటు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని, బీఎస్‌పీ అధ్యక్షులు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఏడాది.. కొత్త ఆశలు.. కొత్త కోరికలు.. కొత్త లక్ష్యాలు.. కొత్త ఆశయాలు.. కొత్త నిర్ణయాలు.. కొత్త వేడుకలు.. కొత్త ఉత్సాహం మీతో కలకాలం ఉండాలని వేర్వేరు ప్రకటనలో ఆకాంక్షించారు. 2024లో ఇంటింటా ఆనందాలు, ప్రతీ కుటుంబంలో అభివద్ధి కాంతులు వెల్లి విరియాలనీ, రాష్ట్రంలోని అన్ని సామాజిక తరగతులు, వర్గాలు సుస్థిరమైన అభివృద్ధి పథంలో ప్రయాణిస్తుందనీ, ప్రయాణించాలని ఆకాంక్షించారు.

ఎఫ్‌ఎన్‌సీసీలో ఘనంగా న్యూ ఇయర్ వేడుకలు



ఫిల్మ్‌నగర్ కల్చరల్ సెంటర్‌లో నూతన సంవత్సరం వేడుకలు ఘనంగా నిర్వహించారు. డిసెంబర్ 31 రాత్రి ఏర్పాటు చేసిన ఈ వేడుకలో ఇన్‌ఫ్యూజన్ బ్యాండ్ ఏర్పాటు చేసిన సంగీత విభావరి, బెల్లీ డాన్స్, 30 మంది ముంబై యువకులు చేసిన ఎరోబిక్స్ డాన్స్, జోడీ డాన్స్ ఆహుతులను విశేషంగా అలరించాయి. ఈ కార్యక్రమంలో సినీ, రాజకీయ నాయకులు పాల్గొని 2023 సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ, నూతన సంవత్సరానికి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఎఫ్‌ఎన్‌సీసీ సెక్రటరీ, నిర్మాత మోహన్ ముళ్ళపూడి మాట్లాడుతూ, "గతంలో ఉన్న కమిటీ ఫిలిం నగర్ కల్చరల్ సెంటర్ను ఎంతో అభివృద్ధి చేసింది. మేము కూడా అదే దిశగా ముందుకు తీసుకెళతాం. దక్షిణాదిలో నంబర్ వన్ కల్చరల్ సెంటర్‌గా తీర్చిదిద్దుతాం' అని చెప్పారు. ఈ వేడుకలో ఎఫ్ ఎన్ సీ సీ ప్రెసిడెంట్ జి. ఆదిశేషగిరిరావు, వైస్ ప్రెసిడెంట్ తుమ్మల రంగారావు, జాయింట్ సెక్రటరీ పెద్దిరాజు, ట్రెజరర్ బి రాజశేఖరరెడ్డి, కమిటీ సభ్యులు కాజా సూర్యనారాయణ, కె మురళీమోహన్ , శైలజా జుజల, బాలరాజు, గోపాలరావు, ఏడిద రాజా, మోహన్ వడ్లపట్ల, ఇంద్రపాల్‌రెడ్డి, వరప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

వనభోజనాలు సర్క్యులర్ ఉపసంహరించుకోవాలి:టీజేఎమ్‌యూ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఆర్టీసీ ఉద్యోగులకు వనభోజనాలు ఏర్పాటు చేయాలనే యాజమాన్య సర్క్యులర్‌ను ఉపసంహరించుకోవాలని తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ (టీజేఎమ్‌యూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే హన్మంతు ముదిరాజ్ డిమాండ్ చేశారు. 97 డిపోల్లో డబ్బులను ఖర్చుపెట్టి కోట్ల రూపాయలు వృధా చేయొద్దని కోరారు. ఆర్టీసీ ఉద్యోగులకు రావాల్సిన వేతన సవరణలు, బకాయిలు చెల్లిస్తే సంతోషిస్తారని ఆదివారంనాడాక పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. గడచిన తొమ్మిదిన్నరేండ్ల కేసీఆర్ పాలనలో ఆర్టీసీ ఉద్యోగులు అనేక ఇబ్బందులు పడ్డారనీ, ప్రగతిభవన్‌లో వనభోజనాలు పెట్టి సంస్థను సర్వనాశనం చేశారని తెలిపారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలపై సంక్రాంతి కానుకగా శుభవార్త అందించాలని కోరారు.

ఆర్టీసీలో అవే వేధింపులు: కే రాజిరెడ్డి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినా, ఇప్పటికీ మాజీ సీఎం కేసీఆర్ మార్కు వేధింపులే ఆర్టీసీలో కొనసాగుతున్నాయని టీఎస్‌ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఐఎన్‌టీయూసీ) ప్రధాన కార్యదర్శి కే రాజిరెడ్డి, అడిషనల్ ప్రధాన కార్యదర్శి జీ అబ్రహం విమర్శించారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం స్కీం అమలు కోసం ఆర్టీసీ కార్మికులు అనేక కష్ట నష్టాలు పడుతున్నారనీ, వారి ముఖాల్లో సంతోషం నింపేందుకు ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చర్యలు తీసుకోవాలని ఆదివారంనాడొక పత్రికా ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీలో వెల్ఫేర్ కమిటీలను రద్దు చేసి, యూనియన్ కార్యకలాపాలను అనుమతించాలని కోరారు. మాజీ సీఎం కేసీఆర్ పెట్టిన వనభోజనాలను కార్మికులు వ్యతిరేకిస్తున్నారనీ, ఆ నిర్ణయాన్ని యాజమాన్యం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఆ సొమ్ముతో నైట్‌అవుట్ సిబ్బందికి రెస్ట్ రూములతో పాటు మౌలిక సౌకర్యాలు కల్పించాలని కోరారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ తమ సంఘం డిపోల వద్ద పెట్టిన బ్యానర్లను తొలగించడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న జంట

- మిర్యాలగూడ రైల్వేస్టేషన్ పరిధిలో ఘటన

నవతెలంగాణ-మిర్యాలగూడ రూరల్


గుర్తు తెలియని యువతీ, యువకుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ రైల్వేస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే ఎస్ఐ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ నుంచి జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌లో వచ్చిన యువతి (25) యువకుడు(30) శనివారం రాత్రి మిర్యాలగూడ రైల్వేస్టేషన్ పరిధిలో 115 మైలు వద్ద ట్రాక్ పై రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఆర్పీఎఫ్ నల్లగొండ సబ్ ఇన్‌స్పెక్టర్ సారలక్క, సిబ్బంది ఘటనాస్థలికి చేరుకొని మృతదేహాలను పరిశీలించి పోస్ట్‌మార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియాస్పత్రికి తరలించారు. మృతుల వద్ద రైల్వే టికెట్ మినహా ఎటువంటి ఆధారాలు లేవని, వారి ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నామని పోలీసులు తెలిపారు. యువతీ, యువకులు భార్యాభర్తలా లేక ప్రేమికులా అనే కోణంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి దారుణ హత్య

- రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో యువకుడు దారుణ హత్య

నవతెలంగాణ-శంషాబాద్

గుర్తు తెలియని వ్యక్తుల చేతుల్లో యువకుడు దారుణ హత్యకు గురైన ఘటన రంగారెడ్డి జిల్లా శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఏ.శ్రీధర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని పహడీ షరీఫ్ ప్రాంతానికి చెందిన పీతాంబరం మల్లేష్ (28) పని నిమిత్తం కొన్ని రోజుల క్రితం మండల పరిధిలోని ఘాన్సీమియాగుడ గ్రామానికి వచ్చి.. ఓ టెంట్ హౌస్‌లో పనిచేస్తున్నాడు. అలాగే శంషాబాద్ లేబర్ అడ్డా వద్ద కూడా లేబర్ పని చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. కాగా, శనివారం అర్ధరాత్రి గ్రామం జాతీయ రహదారి - 44 పక్కన గుర్తుతెలియని వ్యక్తులు ఆ యువకుడ్ని కడుపులో పొడిచి దారుణంగా హతమార్చారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని హత్యకు సంబంధించిన వివరాలు సేకరించారు. క్లూస్ టీం డాగ్ స్క్వాడ్‌తో హత్య జరిగిన ప్రదేశాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. మృతుని వద్ద ఉన్న ఫోన్ నెంబర్ ఆధారంగా ఆయన సోదరుడు రాజుకు సమాచారం ఇచ్చారు. మృతుడు మల్లేష్ కర్నాటకకు చెందిన వ్యక్తిగా పోలీసులు నిర్ధారించారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



జనగణన మళ్లీ వాయిదా

- 2024 అక్టోబర్ వరకూ లేనట్లే
- తాజా నోటిఫికేషన్ విడుదల

న్యూఢిల్లీ : జిల్లాలు, తాలూకాలు, పట్టణాలు, మున్సిపల్ సంస్థలకు పరిపాలనా సంబంధమైన సరిహద్దులు నిర్ణయించేందుకు విధించిన గడువును కేంద్ర ప్రభుత్వం వచ్చే సంవత్సరం జూన్ 30వ తేదీ వరకూ పొడిగించింది. అంటే దీనర్థం జనాభా లెక్కల సేకరణ ప్రక్రియ కనీసం వచ్చే ఏడాది అక్టోబర్ వరకూ వాయిదా పడే అవకాశం ఉంది. వాస్తవానికి జనగణన కసరత్తు 2020లోనే ప్రారంభం కావాల్సి ఉంది. కోవిడ్, తదితర కారణాలు చూపుతూ ప్రభుత్వం దానిని వాయిదా వేస్తూ వస్తోంది. ప్రభుత్వం చెబుతున్నట్లు 2024 జూన్‌లో (సరిహద్దుల నిర్ణయం తర్వాత) ఈ ప్రక్రియ ప్రారంభమైనప్పటికీ ఎన్యూమరేటర్ల జాబితాను రూపొందించడానికే మూడు నెలల సమయం పడుతుంది. సరిహద్దులను నిర్ణయించేందుకు గతంలో విధించిన గడువును 2024 జూన్ 30వ తేదీ వరకూ పొడిగించడం జరిగిందని భారత అదనపు రిజిస్ట్రార్ జనరల్ శనివారం రాష్ట్రాలకు సమాచారం అందించారు. అంటే లోక్‌సభ ఎన్నికల లోగా జనగణన కసరత్తు ప్రారంభమయ్యే అవకాశాలు లేవన్న మాట. సరిహద్దులను నిర్ణయించేందుకు విధించిన గడువును పొడిగించడం ఇది తొమ్మిదోసారి. గత సంవత్సరంలో తీసుకొచ్చిన 128వ రాజ్యాంగ సవరణ చట్టం ప్రకారం లోక్‌సభలోనూ, రాష్ట్రాల శాసనసభలలోనూ మహిళలకు మూడో వంతు స్థానాలను రిజర్వ్ చేసే ప్రక్రియ నియోజకవర్గాల పునర్విభజన తర్వాతే జరగాల్సి ఉంటుంది. చట్టం అమలులోకి వచ్చిన తర్వాత చేపట్టే తొలి ప్రక్రియ ఆధారంగానే నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుంది. ఈ చట్టానికి సెప్టెంబర్ 29నే రాష్ట్రపతి ఆమోదముద్ర పడింది. సెప్టెంబర్ 20న కేంద్ర హోం మంత్రి అమిత్ షా లోక్‌సభలో ఓ ప్రకటన చేస్తూ ఎన్నికల తర్వాతే జనగణన, నియోజకవర్గాల పునర్విభజన జరుగుతాయని స్పష్టం చేశారు. అయితే ఏ సంవత్సరంలో ఇది జరుగుతుందో ఆయన చెప్పలేదు. 1881 నుండి ప్రతి పది సంవత్సరాలకు ఒకసారి మన దేశంలో జనగణన జరుగుతోంది. ఈ దశాబ్దపు జనగణన తొలి దశ 2020 ఏప్రిల్ 1న ప్రారంభం కావాల్సి ఉంది. అయితే కోవిడ్ కారణంగా దీనిని వాయిదా వేశారు.

ఆ తర్వాత జనగణనలో జరుగుతున్న జాప్యానికి కారణమేమిటో గడచిన మూడు నోటిఫికేషన్లలో కేంద్రం వివరించలేదు. తాజా సమాచారం లేకపోవడంతో 2011 జనాభా లెక్కల నుండి తీసుకున్న సమాచారం ఆధారంగానే ప్రభుత్వం విధానాలను రూపొందించుకుంటోంది. వివిధ వర్గాలకు సబ్సిడీలను కేటాయిస్తోంది. జనగణన మాత్రమే కాకుండా జనన మరణాల నమోదుతో పాటు 2021, 2022, 2023 సంవత్సరాలలో చోటుచేసుకున్న మరణాలకు దారితీసిన కారణాలకు సంబంధించి రెండు కీలక నివేదికలను విడుదల చేయలేకపోయింది.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందాలి

'ఎంజీఎం' సమీక్షలో మంత్రి కొండా సురేఖ

నవతెలంగాణ - మట్టెవాడ



పేదల ఆస్పత్రి ఉత్తర తెలంగాణకే వరప్రదాయనిగా పేరుపొందిన వరంగల్ ఎంజీఎంలో పేరుకు తగ్గట్టుగా వైద్య సేవల్లో లోటు లేకుండా రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ ఎంజీఎం అధికారులను ఆదేశించారు. దేశవ్యాప్తంగా కరోనా మహమ్మారి నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో కోవిడ్ కేసులు పెరుగుతున్న దృష్ట్యా వరంగల్ ఎంజీఎంలో ప్రజలకు అందిస్తున్న సేవలపై ఎంజీఎం సూపరింటెండెంట్ వి.చంద్రశేఖర్, వివిధ విభాగాల అధిపతులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఆస్పత్రిలో అందుతున్న సేవలు, కరోనా వైరస్‌ను ఎదుర్కొనేందుకు ఉన్న సౌకర్యాలపై సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. ఔషధాల అందుతున్న తీరు, 14 శస్త్ర చికిత్స కేంద్రాల్లో జరుగుతున్న ఆపరేషన్ల తీరుపై ఆరా తీశారు. శుక్రవారం రాత్రి విద్యుత్ అంతరాయంపై సూపరింటెండెంట్‌ను వివరణ అడిగారు. ఆస్పత్రిలో ఇలాంటి సంఘటనలు మరోసారి పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అక్కడే ఉన్న టీఎస్ఎన్‌పీడీసీఎల్ వరంగల్ డివిజనల్ ఇంజనీర్‌ను ఆదేశించారు. రెండు నిమిషాలు కూడా కరెంటు కోత అనేది ఉండకుండా చూసుకోవాలని తెలిపారు. కరోనా వైరస్ తీవ్రం అయిన దృష్ట్యా ఎంజీఎం ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు అందేలా సిబ్బంది, ఔషధాలు, ఆక్సిజన్ వెంటిలేటర్ల సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అనునిత్యం అప్రమత్తంగా ఉండాలని వివిధ విభాగాల అధిపతులను ఆదేశించారు. సమీక్ష అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తోందని, ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని తెలిపారు. ఎంజీఎంలో కరోనాను ఎదుర్కొనేందుకు అన్ని సౌకర్యాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈ నెల 21 నుంచి 170 పరీక్షలు చేయగా 25 పాజిటివ్ రాగా 10 మంది ఎంజీఎంలో చేరి చికిత్స పొందుతున్నారని, అందులో ఇద్దరూ కోలుకొని డిశ్చార్జ్ అయ్యారని చెప్పారు. ముగ్గురు చిన్నారులకు ప్రస్తుతం కరోనా చికిత్స అందిస్తున్నారని, వారి ఆరోగ్యం నిలకడగా ఉందని వెంటిలేటర్ అవసరం లేకుండా చిన్నారులు చక్కగా ఉన్నారన్నారు. మరో నలుగురు పెద్దవాళ్లతో కలిపి మొత్తం ఏడుగురు ప్రస్తుతం ఆస్పత్రి ఐసోలేషన్‌లో చికిత్స పొందుతున్నారని తెలిపారు. వైరస్ ఉధృతి ఎక్కువయినా రోగులకు ప్రాణవాయువు అందించడంలో ఇబ్బందులు తలెత్తకుండా 1200 ఆక్సిజన్‌తో అనుసంధానం చేసిన బెడ్స్, 3 ఆక్సిజన్ ట్యాంక్స్ సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. విద్యుత్ అంతరాయం తలెత్తినా 5 జనరేటర్ల ద్వారా నిరంతరాయంగా విద్యుత్తు సరఫరా చేసేలా సిద్ధంగా ఉంచినట్టు తెలిపారు. ఎంజీఎంకు కావలసిన సౌకర్యాలు ఏమైనా ఉంటే వాటికి సంబంధించి వైద్యారోగ్యశాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్లి సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో కేఎంసీ ప్రిన్సిపల్ దివ్వెల మోహన్ దాస్, టీఎంఐడీసీఎస్ ఈఈ దేవేంద్ర కుమార్, ఎన్‌పీడీసీఎల్ డీఈ మల్లికార్జున్, ఆర్ఎంఓ మురళి, అడిషనల్ ఆర్ఎంఓలు, ఆస్పత్రి వివిధ విభాగాల అధిపతులు తదితరులు పాల్గొన్నారు.

ములుగులో గంజాయి స్వాధీనం

- ములుగు ఎస్ఐ అప్పాని వెంకటేశ్వర్లు



నవతెలంగాణ - ములుగు

ములుగు జిల్లా శ్రీనగర్ క్రాస్ రోడ్ వద్ద ఐదు కిలోల గంజాయిని పట్టుకున్నట్టు ములుగు ఎస్ఐ ఏ.వెంకటేశ్వర్ తెలిపారు. ఆదివారం ములుగు పరిధిలో తన సిబ్బందితో వాహనాల తనిఖీ చేపట్టగా.. రామచంద్రాపురం వైపు నుంచి వస్తున్న తవేరా వాహనంలో నుంచి ఇద్దరు పోలీసులను చూసి పారిపోతుండగా వెంటపడి ఇద్దరిలో ఒకరిని (మహిళ) పట్టుకున్నారు. మరో వ్యక్తి పరారయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశాలోని మల్కాజిగిరి జిల్లా నిమ్మలపల్లికి చెందిన దసరా సత్యబతి, ములుగు మండలం మాన్‌సింగ్ తండాకు చెందిన మాలోత్ రవితో కలిసి కొంతకాలంగా గంజాయి వ్యాపారం చేస్తోంది. కాగా, ఒడిశా నుంచి కిలో గంజాయికి వెయ్యి రూపాయిల చొప్పున కొని వరంగల్‌లో రూ.25,000 అమ్ముతున్నారు. కాగా, కొన్ని రోజుల క్రితం రవి ఫోన్ చేసి 31 డిసెంబర్ రాత్రి నూతన సంవత్సర వేడుకల్లో గంజాయిని విక్రయించేందుకు ఆర్డర్ ఇచ్చాడు. దాంతో డిసెంబర్ 28న సత్యబతి సుమారు 6 కిలోల ఎండు గంజాయిని తీసుకొని రవి ఇంటికి వెళ్లింది. 30న మధ్యాహ్నం సత్యబతి, రవి కలిసి గంజాయి తీసుకొని రవికి చెందిన తవేరా వాహనంలో గంజాయి విక్రయానికి వెళ్లారు. ఈ క్రమంలో శ్రీనగర్ క్రాస్ రోడ్ వద్ద పోలీసులకు పట్టుబడ్డారు. మహిళ వద్ద లభ్యమైన 5.670 కిలోల గంజాయితో పాటు సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. సత్యబతిని రిమాండ్‌కు తరలించారు. పట్టుకున్న గంజాయి విలువ విలువ సుమారు రూ.1,50,000 విలువ ఉంటుందని సీఐ ఎం రంజిత్ కుమార్ తెలిపారు.

రైతులు ఆరుతడి పంటలపై దృష్టి సారించాలి

రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

- ఎల్‌ఎండీ నుంచి కాకతీయ కాలువ ద్వారా నీటి విడుదల



నవతెలంగాణ - తిమ్మాపూర్

ప్రస్తుతం చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించే పరిస్థితి లేదని, రైతులందరూ ఆరుతడి పంటలపై దృష్టి సారించాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని ఎల్ఎండీ రిజర్వాయర్ నుంచి కాకతీయ కాలువ ద్వారా దిగువకు నీటిని మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ పమేల సత్పతితో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొదటి ఏడు రోజులు 146.00 కి.మీ నుంచి 284.00కి.మీ ఆయకట్టు పరిధి వరకు, తర్వాత ఎనిమిది రోజులు 284.00కి.మీ కింది ఆయకట్టుకు ప్రస్తుతం 500 క్యూసెక్కుల నీటిని ఆన్ అండ్ ఆఫ్ పద్ధతిలో అందించనున్నట్టు చెప్పారు. రేపటి వరకు 4000వేల క్యూసెక్కుల వరకు పెంచుతామన్నారు. లోయర్ మేనేరు డ్యామ్, మిడ్ మానేరులో గతేడాది కంటే ప్రస్తుతం నీటి నిలువ తక్కువగా ఉండటం వల్ల మొత్తం స్టేజీ-1 అండ్ స్టేజీ-2 యాసంగి పంటకు నీరు సరిపోయే పరిస్థితి లేదని తెలిపారు. దాంతో ఆయకట్టు రైతులు ఆరుతడి పంటలు వేసుకోవాల్సిందిగా కోరారు. సాగునీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకొని, నీటిపారుదల శాఖకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఈఎన్‌సీ శంకర్, ఎస్ఈ శివ కుమార్, ఏఈలు వంశీ, కాళిదాస్, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

అందరికీ ఉచిత విద్య వైద్యం అందివ్వాలి



- ప్రజా సంక్షేమాన్ని కోరే ప్రభుత్వాలుంటేనే పెన్షన్‌కు గ్యారంటీ :

తప్రా డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణలో ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దేశంలో అందరికీ ఉచిత విద్య, వైద్యం అందించేలా పాలకులపై కొట్లాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి నొక్కి చెప్పారు. దేశంలోగానీ, రాష్ట్రంలోగానీ ప్రజా సంక్షేమాన్ని కోరే ప్రభుత్వాలుంటేనే రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్లకు గ్యారంటీ ఉంటుందన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని చిక్కడపల్లిలో గల తపాల ఉద్యోగుల కార్యాలయంలో తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్‌పర్సన్స్ అసోసియేషన్(తప్రా) డైరీ, క్యాలెండర్, ప్యాకెట్ క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ.. ఓల్డ్ పెన్షన్ స్కీమ్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పదేండ్ల కాలంలో కార్పొరేట్లకు రూ.19 లక్షల కోట్ల అప్పులను పాలకులు మాఫీ చేశారని విమర్శించారు. వాటిని గనుక ప్రభుత్వం డిపాజిట్ చేస్తే ఈపీఎఫ్, రిటైర్డ్ బెనిఫిట్స్, పెన్షన్లు ఇవ్వడానికి మంచి స్కీమ్‌ను అమలు చేయొచ్చన్నారు. కానీ, మోడీ సర్కారు అలా చేయకుండా ప్రజలకు ఉపయోగపడే స్కీమ్‌లన్నింటినీ నిర్వీర్యం చేస్తూ పోతున్నదని విమర్శించారు. దేశంలో నాలుగు లక్షల మందికి మేలు చేసే ధోరణిని విడనాడి 142 కోట్ల మందికి అభివృద్ధి ఫలాలు అందేలా నిర్ణయాలు తీసుకోవాలని కేంద్రప్రభుత్వాన్ని కోరారు. దేశంలో మతప్రమేయం లేని రాజకీయాలు రావాలని ఆకాంక్షించారు. నేడు విద్యారంగం సంక్షోభంలో ఉందనీ, పాలకులనే ప్రభుత్వవిద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారని ఆందోళన వెలిబుచ్చారు. దీంతో చిరుద్యోగులు, కూలినాలి చేసుకునేవాళ్లు తమ పిల్లలకైనా మంచి చదువు చెప్పించాలని ప్రయివేటు స్కూళ్లవైపు చూస్తున్నారన్నారు. చదువు అంతరాలను తగ్గించేందుకు దోహదపడాలిగానీ..నేడు ఎన్నిక లక్షల రూపాయలు పెడితే అంత మంచి చదువు అన్నట్టుగా వ్యవస్థ తయారైందని ఆందోళన వ్యక్తం చేశారు. యూఎస్‌లో నూటికి 91 శాతం మంది ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే చదువుకుంటున్న తీరును వివరించారు. విద్యారంగంలో అంతరాలను పూడ్చకుంటే దేశంలోని మిగతా అంతరాలను తగ్గించలేమన్నారు. మన దేశంలోనూ, రాష్ట్రంలోనూ ప్రభుత్వ స్కూళ్లను పెంచాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. పెన్షనర్లు తమ హక్కుల కోసం అవసరమైనపుడు స్వచ్ఛందంగా సహాయ కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. తప్రా గౌరవాధ్యక్షులు ఎంఎన్ రెడ్డి మాట్లాడుతూ సుప్రీం కోర్టు డియస్ నకారా కేసు విషయంలో పెన్షనర్ల సంక్షేమం ప్రభుత్వాల బాధ్యత అని చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. పాలకులు పెన్షనర్ల హక్కులను భారంగా కాకుండా బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. తప్రా వ్యవస్థాపక సభ్యులు ప్రభాకర్ నాయర్ మాట్లాడుతూ.. సర్వీసులోని ఉద్యోగులకు ఇస్తున్న వేతనాలకన్నా, రిటైర్డ్ ఉద్యోగులకు ఇచ్చే పెన్షన్ ఎక్కువ అవుతోందని ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం కొందరు చేయడం సరిగాదన్నారు. వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో ఏ ప్రభుత్వం ఉండాలనే విషయంగా ఇప్పటి నుంచే ప్రజలకు అర్థం అయ్యేలా పెన్షనర్లు వివరించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు పోతుల నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి పి.కృష్ణమూర్తి, ఉపాధ్యక్షులు మోతుకూరి నరహరి, అరుణ, కోశాధికారి నాగేశ్వర్‌రావు, జనార్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మార్చిలో మహిళా వికలాంగుల సాధికారతపై రాష్ట్ర సదస్సు

- హాజరుకానున్న వెయ్యిమంది ప్రతినిధులు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మహిళా వికలాంగుల సాధికారతపై మార్చిలో రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నామని ఎన్‌పీఆర్‌డీ సీనియర్ నాయకురాలు టి వరమ్మ సంఘం ప్రధాన కార్యదర్శి యం. అడివయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమాజంలో మహిళా వికలాంగులు అన్ని రంగాల్లో వెనకబడి ఉన్నారని పేర్కొన్నారు. వారిపై లైంగిక వేధింపులు, దాడులు పెరిగి పోతున్నాయనీ, వాటిని అరికట్టేందుకు ప్రత్యేక రక్షణ చట్టం చేయాలని డిమాండ్ చేశారు. మానసిక వికలాంగులను ఆదుకునేందుకు చర్యలు తీసుకువాలని కోరారు. నిరుద్యోగ మహిళా వికలాంగులకు శిక్షణ ఇచ్చి, స్వయం ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఒంటరి మహిళా వికలాంగుల కోసం ప్రతి జిల్లా కేంద్రంలో ప్రత్యేక హోంలను నిర్మించాలని పేర్కొన్నారు. మహిళా సాధికారత గురించి మాట్లాడుతున్న పాలకులు మహిళా వికలాంగుల సాధికారత గురించి ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. పని ప్రదేశాల్లో వారిపై వేధింపులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో వారికి ప్రత్యేక వాటా కేటాయించాలని డిమాండ్ చేశారు. సంక్షేమం, సాధికారత, విద్య ఉపాధి, ఆరోగ్యంపై మార్చిలో రాష్ట్ర సదస్సు నిర్వహించి, భవిషత్ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. రాష్ట్ర సదస్సుకు 33 జిల్లాల నుంచి వెయ్యి మంది మహిళా వికలాంగులు ప్రతినిధులుగా హాజరవుతారని తెలిపారు. మరోవైపు మహిళా విభాగం రాష్ట్ర స్థాయి సమావేశాన్ని హైదరాబాద్‌లోని రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. దీనిలో ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర కోశాధికారి ఆర్ వెంకటేష్, ఉపాధ్యక్షులు బి స్వామి, సహాయ కార్యదర్శి జె దశరథ్, మహిళా విభాగం రాష్ట్ర కో కన్వీనర్ నాగలక్ష్మి యశోద, రాష్ట్ర కమిటీ సభ్యులు శశికల, సావిత్రి, దుర్గ, జయలక్ష్మి, సాయిగీత, పార్వతి, కవిత తదితరులు హాజరయ్యారు.

కొత్త ప్రభుత్వానికి శుభాకాంక్షలు : టీజీవో

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఏర్పడ్డ నూతన ప్రభుత్వానికి తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ (టీజీవో) కేంద్ర సంఘం శుభాకాంక్షలు తెలిపింది. ఆదివారం హైదరాబాద్ నాంపల్లిలోని టీజీవో భవన్‌లో సంఘం అధ్యక్షురాలు వి.మమత అధ్యతన నిర్వహించిన సమావేశంలో కేంద్ర కార్యవర్గం, జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు విషయాలను చర్చించి తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ మేరకు టీజీవో ప్రధాన కార్యదర్శి ఎ.సత్యనారాయణ ఒక ప్రకటన విడుదల చేశారు.

ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలులను చిత్తశుద్ధితో అమలు చేస్తూ, పెండింగ్ సమస్యలను సానుకూల దృక్పథంతో పరిష్కరించుకోవాలని నిర్ణయించారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు వి.శ్రీనివాస్ గౌడ్, టీజీవో సంఘంపై కొంత మంది సంఘ వ్యతిరేక శక్తులు పత్రికల ద్వారా, సామాజిక మాధ్యమాల ద్వారా అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఖండించారు. కేంద్ర కార్యవర్గ కాల పరిమితి ముగిసినందున నూతన కమిటీని అసోసియేట్ నిబంధనల ప్రకారం ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించాలని తీర్మానించారు. పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసేందుకు వీలుగా ఎలక్షన్ ఆఫీసర్‌గా ఐటీఐ రిటైర్డ్ ప్రిన్సిపాల్ ఎమ్.మోహన్ నారాయణ, అసిస్టెంట్ ఎలక్షన్ ఆఫీసర్‌గా రిటైర్డ్ ఎంపీడీవో యాదయ్య గౌడ్‌ను నియమించారు. సమావేశంలో కేంద్ర సంఘం నాయకులతో పాటు వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

తెలంగాణ సాహిత్య సాంస్కృతిక రంగం - తీరూ దారీ!

మనకేం కావాలో ఎరుక కలిగి వుండటం, కావాల్సిన దానికోసం నిర్విరామంగా కృషి చేయటం అనేది మన సాంస్కృతిక, సామాజిక స్థాయిపైన ఆధారపడి వుంటుంది. ఇప్పటికీ శాశ్విత ప్రాతిపదికన మనం ఒనగూర్చుకోవాల్సిన వాటిపైన చర్చ కూడా జరుపుకోలేదు. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడి ఒక దశాబ్దం గడిచింది. తెలంగాణ సాహిత్య, సాంస్కృతిక ప్రత్యేకతలపైన, రాష్ట్ర ఏర్పాటు సమయంలో ఎన్నో ప్రస్తావనలు చేశాం. ఘనమైన సాంస్కృతిక చరిత్రపై విశ్లేషణలు చేశాం. ఆ వారసత్వాన్ని ముందుకు తీసుకుపోవాలన్న కలల్ని కలబోసుకున్నాం. పాల్కురికి సోమన సహజ పదసంపదల సొగసును, పోతనామాత్యుని మధుర కవితాసుధను, రామదాసు భక్తి సంకీర్తనలను, హరిభట్టు కవన కళను, చందాల కేశవదాసు సినీ ఆరంభగీతాల పరంపరను మననం చేసుకుని మురిసాము. ఆధునిక చైతన్య సాహితీమూర్తులు మఖ్దూం, దాశరథి, కాళోజి, వట్టికోట, సుద్దాల, సురవరం, సి.నా.రె. మొదలైన వారి అడుగుజాడలలో తెలంగాణ సాహితీ మాగాణం వెలుగులు విరజిమ్ముతుందని సగర్వంగా సంబరాలు చేసుకున్నాం. జానపద కళా సంగీతాలకు నెలవైన నేలలోని సాంస్కృతిక వైభవాన్ని చరిత్రగా భావితరాలకు అందించాలని, ప్రజలు కేంద్రంగా భాషను, సాహిత్యాన్ని ప్రజాస్వామ్యీకరించుకోవాలని భావించుకున్నాం. మరీ ముఖ్యంగా తెలంగాణ భాషా సంపదను భద్రపరిచే పనికి పూనుకోవాలని కోరుకున్నాం. ప్రజల భాషలో పాలన సాగటమే నిజమైన ప్రజాస్వామ్యం. అప్పుడే పాలనలో ప్రజలు భాగస్వాములవటానికి అవకాశం ఏర్పడుతుంది. చదువుల్లో మన తెలుగు వెలగాలని, భాషాభివృద్ధికి బాటలు ఏర్పడాలని కోరుకున్నాం.

ఎన్నెన్నో అనుకున్నాం. ఇంకా నిర్మాణాత్మకంగా పనులు చేపట్టలేక పోయాం. చరిత్ర ఘనతను చెప్పుకోవటం సరే, వర్తమానం, భవిష్యత్తును తీర్చుకోవాల్సిన అవసరం ఇంకెంతో వుంది. ఈ నేలలోని సామాన్య జనుల నిత్య శ్రమలలోంచి పుట్టిన పాటలు, కళలు, పదాలు, వాయిద్యాలు, నృత్యాలు మనమింకా రికార్డు చేయవలసే వున్నది. జానపదాలను ప్రజాకళగా తీర్చిన సాంస్కృతిక యోధుల చరిత్రను మన ముందు తరాలకు అందించాల్చి వుంది. మన భాష, కళలు, సమూహపు జనితాలు. అవి మన వారసత్వాలు. బడి నుండే ఆ పరంపర కొనసాగాలి. అందుకు ఒక సమగ్ర శాస్త్రీయ ప్రణాళిక కావాలి.


> తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఏమీ జరగలేదని అనలేం. కానీ సాహిత్య, సాంస్కృతిక రంగానికి సంబంధించి నిర్మాణాత్మక కృషిని కొనసాగించాల్సిన అవసరం చాలా వుంది. కేవలం రాజధానిలోనే కాదు, ప్రతి జిల్లా కేంద్రంలో కవులకు, కళాకారులకు సభా మందిరాలు నిర్మించాలి. సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహించాలి. తెలంగాణకు గర్వకారణంగా నిలచిన కవులు, రచయితలు, కళాకారుల జన్మ స్థలాలను వారి పేర సాంస్కృతిక కేంద్రాలుగా, సాహిత్య శాలలుగా అభివృద్ధి పరచాలి.



సజ్జ జొన్న కూడుతో, గంజి, నూకలన్నాలతో బతుకు నడిపిన గరుకు నేల ఇది. అక్షరాల తెలివికన్నా, లక్షలాది జీవనానుభవాల జ్ఞానమున్న నేల. ఇక్కడ కష్టానికి వెనుకడుగేయని కండ, గొంతు విప్పేందుకు వెనుకాడని గుండె గల జనుల సమూహం ఇది. అందుకే చైతన్యానికి మారుపేరుగా, ధిక్కార స్వరానికి ఆనవాలుగా నిలిచింది. ఇక్కడ పాటల జలపాతాలుంటాయి. కవన పూదోటలుంటాయి. కళలు కంజిర నాదాలు, కొండలు, కోయిల రేలా కోరస్‌లు ధ్వనిస్తాయి. పనికి, కళకు కలలకు, సంబంధాలు, అనుబంధాలు అన్నింటినీ అక్కున చేర్చుకోవాల్సిన తరుణమిది. ఎక్కడ పదిమంది వున్నా అందులో ఒక పాట పాడే వాడుంటాడు. పద్యం రాసే వాడుంటాడు. కవులకు కరువులేని నేల, సామాజిక స్పృహ కలిగిన కవనధార విరివిగా కొనసాగుతుంది. సృజనశీలత కళాసమూహాలను సమాదరించే వేదికలు ఊరూరా వెలయాలి. ఇక్కడి చరిత్ర, సంస్కృతి వికాసాల పరిణామాల అధ్యయనానికి కేంద్రాలు తెరవాలి. ప్రభుత్వాలు ఒక సాంస్కృతిక విధానాన్ని ప్రకటించాలి.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఏమీ జరగలేదని అనలేం. కానీ సాహిత్య, సాంస్కృతిక రంగానికి సంబంధించి నిర్మాణాత్మక కృషిని కొనసాగించాల్సిన అవసరం చాలా వుంది. కేవలం రాజధానిలోనే కాదు, ప్రతి జిల్లా కేంద్రంలో కవులకు, కళాకారులకు సభా మందిరాలు నిర్మించాలి. సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహించాలి. తెలంగాణకు గర్వకారణంగా నిలచిన కవులు, రచయితలు, కళాకారుల జన్మ స్థలాలను వారి పేర సాంస్కృతిక కేంద్రాలుగా, సాహిత్య శాలలుగా అభివృద్ధి పరచాలి. ఔత్సాహికులకు కార్యశాలలు నిర్వహించాలి. ప్రదర్శనలకు చేయూతనివ్వాలి. సాహితీకారుల రచనలను ప్రభుత్వమే వెలుగులోకి తేవాలి. సాహిత్య అధ్యయనానికి, చర్చలకు గ్రంథాలయాలను అభివృద్ధి పరచాలి.

గ్రంథాలయాలను బలోపేతం చేసి, యువతరానికి అవసరమైన విజ్ఞాన సముపార్జనకు అనువుగా తీర్చిదిద్దాలి. ఇప్పటికీ గ్రంథాలయాలు చిన్నచూపు చూడబడుతున్నాయి. నిధులకేటాయింపులు, పుస్తకాల కొనుగోళ్లు జరగడం లేదు. విజ్ఞాన, సాహిత్య సాంస్కృతిక కేంద్రాలుగా గ్రంథాలయాలు ఎదిగితేనే భావితరాలకు మేలు జరుగుతుంది.



ఇక ఇతిహాసపు చీకటి కోణాలలో... అట్టడుగున పడి కనిపించని కథలను, చరిత్రను వెలికితీయాలి. ఎంతోమంది యోధులు, వీరులు, సంఘ సంస్కర్తలు తమ ప్రాణాలను సైతం లెక్కచేయక సమాజం కోసం పాటుపడిన వారున్నారు. వారి కథలను మన తరాలకందించాలి. ఎందుకంటే నేడు మతం పేరుతో, కులం పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టించే శక్తులు పెరుగుతున్నాయి. ఇంకోవైపు పాశ్చాత్య సంస్కృతి దాడి చేస్తున్నది. వ్యాపార సంస్కృతి పెరిగి మానవీయతను విధ్వంసమొనరిస్తున్నది. వీటికి వ్యతిరేకంగా ఒక సాంస్కృతికోద్యమం నడపవలసి వున్నది. ఇందుకు సాహిత్యం, కళ ముఖ్యమైన పాత్రను పోషిస్తుంది. నేటి చైతన్యయుతమైన జ్ఞాన తెలంగాణను నిర్మించుకోవటం మనముందున్న కర్తవ్యం.

అంతేకాని అకాడమీలు, అవార్డులు, రివార్డులు, సన్మానాల వరకే పరిమితమై, వ్యక్తుల చుట్టూ తిరగకూడదు. కళను, కళాకారులను, సృజనకారులను కేవలం ప్రచారకులుగా పరిగణించకూడదు. సామాజిక హృదయ స్పందనలను వినిపించే గొంతుకలు గల రచయితలను మనం వినాలి. నేడు అణగారిన వర్గాల నుండి అనేకులు కళాసాహితీ రంగంలోకి విరివిగా వస్తున్నారు. ముఖ్యంగా మహిళలు, దళితులు, ఆదివాసీలు తమపై జరుగుతున్న వివక్షతలపై కలాలు ఎక్కుపెడుతున్నారు. యువత ముందుకొస్తున్నారు. వీరి రచనలను వెలుగులోకి తేవాలి. సమాజంలో మైనారిటీ సమూహాలు తీవ్రమైన ఒత్తిడి, భయాలకు గురవుతున్న పరిస్థితిని రచనల రూపంలో వెల్లడిస్తున్నారు. వీటన్నింటినీ విని అవగాహన చేసుకోవటం మనందరి బాధ్యత. బాధలను, గాథలను వినగలిగే సంస్కృతిని నిర్మించాలి. సమాజ చైతన్యం కోసం పనిచేస్తున్న సాహితీ, సాంస్కృతిక సంస్థలు, వ్యక్తులు, శక్తులు తెలంగాణలో అనేకమున్నాయి. వాటినన్నింటినీ సమన్వయపరచి, ఒక సామరస్య మానవతా గీతికను సృజించగలగాలి. అందుకు ఒక ప్రణాళికను వేసి ఆరంభించుకోవాలి.



- కె.ఆనందాచారి,
9948787660

శుభ స్వాగతం

కదిలే కాలానికి నూత్నశోభ
నిన్నటికి వీడ్కోలు
నేటికి ఆహ్వానం
నడక ఎప్పటికీ మారదు
అదే తూరుపు... అదే సూర్యోదయం
దారులే కొత్తవి కావాలి
కాలచక్రంతో పోటీ పడుతూ
ఎన్నో మలుపులు
కన్నీళ్ళు, ఆనందాలు
ఆత్మీయులతో పంచుకున్న
మధుర క్షణాలు ఎన్నో
పాతకొత్తల మేలు కలయికతో
కాలం ఒడిలో, అనుభవాల బడిలో
కాలెండర్ పాతబడి పోయింది
గత సంవత్సరంలో
నేర్చుకున్న పాఠాలు, గుణపాఠాలు
కష్టాలు, సుఖాలు...
అన్యాయాలు, అక్రమాలు
ప్రేమలు,ప్రతీకారాలు ఎన్నో చూసాం
ప్రతి హృదయం
ఏదో సాధించాలన్న తపన
మరేదో కోల్పోతున్న ఆవేదన
ఈ మూడువందల అరవైరోజుల కాలం
తీపి, చేదుల సంగమమై నిలిచింది
నిన్నటి అధ్యాయం చివరి పేజీలో
నిలిచిపోయిన ఆశలను, ఆశయాలను
నూతన అధ్యాయం
మొదటి పేజీలో మొదలెడదాం
గతకాలపు నిరీక్షణ నుండి
రేపటి అన్వేషణ సాగిద్దాం
నవ్యవత్సరంలో అడుగిడే
ప్రతి మలుపులోనూ
ఓ కొత్తదనం కోరుకుంటూ
జీవితాన్ని నిరంతరం ప్రేమిస్తూ
కొత్త సంవత్సరానికి
హార్దిక శుభాకాంక్షలతో, మంచినే కోరుకుంటూ
శుభస్వాగతం పలుకుదాం!



- ములుగు లక్ష్మీ మైథిలి, 9440088482

కొన్ని బాధలు మంచికే!

కొంత కాలం అట్లనే ఉంటది
ఇల్లు ఖాళీ చేస్తున్నంత ఫీలింగ్
ఈ శరీరమే అద్దె కొంపనుకున్నామా
మనలో ఏ ప్రకంపనలు ఉండవు!
అట్లెట్లా కుదురుతుందనుకుంటేనే
ఖాళీ చేయడం పెద్ద సమస్యైపోతది
అలవాటు పడేదాకనే నిర్వాసిత
అసౌకర్యమొకటి వెంటాడుతది
కాలం చేసే వైద్యం
ఏ కేర్ హాస్పిటల్ చేయలేదు
వసంతం విస్తరించినప్పుడు
గట్టిగా ఈలలు వేసి ఉండవచ్చు
ఉన్మత్త కాలంలో తన్మయత్వంతో
గొంతెత్తి గానం చేసి ఉండవచ్చు
అట్లని వైభవాలు శాశ్వతమనుకోరాదు!
ఆకురాలు కాలం దాపురించినప్పుడు
చెట్టులా మనిషి కూడా
ధ్యానంలోకి జారిపోవాలి!
జ్ఞానోదయమూ సూర్యోదయం వంటిదే
నిర్దిత కాలానికి విరగ్గాస్తుంది!
అతథిలాగ వచ్చిన వారికి తెలుసు
ఈ సౌకర్యాలు శాశ్వతం కావని
గెలుపు ఎంత పెద్దదైనా
నిద్రపుచ్చే లాలి పాటనే
ఓటమిని జీర్ణించుకున్నమా
గెలుపు మార్గాలు వేయి తోస్తాయి!
కొన్ని బాధలు మంచివే
లోపలికి చూసుకునే వీలు కల్పిస్తాయి!!

- కోట్ల వెంకటేశ్వర రెడ్డి, 9440233261

సాహితీ వార్తలు

'నెవర్ ఎండ్' పుస్తకావిష్కరణ

తెలంగాణలో గత నలభై ఏళ్లుగా యువజనోద్యమంలో ప్రాణత్యాగం చేసి అమరులైన విస్మృత వీరుల చరిత్రను, రాష్ట్ర వ్యాప్తంగా 822 కిలోమీటర్లు మోటారు సైకిల్ యాత్ర చేసిన ఎం. విప్లవకుమార్, ఎ. విజయ్ కుమార్ వెలికితీసి రాసిన పుస్తకం ఆవిష్కరణ "నెవర్ ఎండ్" జనవరి 5, మధ్యాహ్నం 2 గంటలకు, సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరుగుతుంది. ప్రజాకవి జయరాజన్న, భూపతి వెంకటేశ్వర్లు, ఎ. నర్సిరెడ్డి, కవి యాకూబ్, చింతల యాదగిరి, పసునూరి రవీందర్, తగుళ్ళ గోపాల్, ఆనగంటి వెంకటేష్, దాసరి యువరాణి, సాత్విక నన్నెబోయిన, నక్క అంజయ్య, జె.కె. శ్రీనివాస్, జి.గంగాధర్ రెడ్డి, భీరెడ్డి సాంబశివ, కోట రమేష్, సుబ్బు ఆర్వీ, ఈసంపల్లి బాబు, అనంతోజు మోహన కృష్ణ, నూకల అశోక్, బొంత వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొంటారు. - ఎ. విజయ్ కుమార్

'మాయని గాయాల నెత్తుటి చరిత్ర' పుస్తకావిష్కరణ

సీనియర్ జర్నలిస్టు మంగళారపు లక్ష్మణ్ రచించిన 'మాయని గాయాల నెత్తుటి చరిత్ర' (యదార్థ సంఘటనల సమాహారం) పుస్తకావిష్కరణ జనవరి 6 న సాయంత్రం ఆరు గంటలకు హైదరాబాద్, రవీంద్ర భారతి మినీహాల్‌లో జరుగుతుంది. సభాధ్యక్షులుగా అన్నవరం దేవేందర్ వ్యవహరిస్తారు. ఆచార్య ఘంటా చక్రపాణి పుస్తకాన్ని ఆవిష్కరిస్తారు. ముఖ్య అతిథిగా వి. ప్రకాష్, గౌరవ అతిథిగా నారదాసు లక్ష్మణ్ రావు, ఆత్మీయ అతిథిగా ఎస్కే జకీర్ పాల్గొంటారు. డా. వెల్దండి శ్రీధర్ పుస్తక పరిచయం చేస్తారు.
-సాహితీ సోపతి

"కవిత్వ సౌరభం" కవి సమ్మేళనం

జనవరి 1 2024 మధ్యాహ్నం రెండు గంటలకు రవీంద్ర భారతి మినీ హాల్లో తెలంగాణ సాహితీ సమాఖ్య నిర్వహణలో "కవిత్వ సౌరభం" శీర్షిక కింద కవి సమ్మేళనం జరగనుంది. 20 మంది ప్రముఖ కవులు పాల్గొంటున్న ఈ కవి సమ్మేళనంలో అతిథులుగా దేశపతి శ్రీనివాస్ ,కొప్పర్తి ,ఏనుగు నరసింహారెడ్డి, కాంచనపల్లి గోవర్ధన్ రాజు, వజ్జల శివకుమార్ పాల్గొంటారు. సాహిత్య అభిమానులంతా ఈ సదస్సుకు హాజరు కావలసిందిగా ఆహ్వానిస్తున్నాం.
- వేముగంటి మురళీకృష్ణ, ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్

ఎదిరెపల్లి మశమ్మ స్మారక పురస్కారం

ప్రతి ఏటా అందచేస్తున్న ఎదిరెపల్లి మశమ్మ స్మారక పురస్కారానికి ప్రముఖ కవయిత్రి డా. వినోదిని మాదాసు యోగివేమన విశ్వవిద్యాలయం ఎంపికైనారని తెలిపారు. ఈ నెల 31 ఉదయం 10గంటలకు నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రం సింగిల్ విండో హల్ లో జరిగే ఈ సభకు డా॥చింతకింది కాసీం హజరవుతారు. ఈ పురస్కారం కింద రూ/- 20 వేలు నగదు, జ్ఞాపికను అందచేస్తారు. - ఎదిరెపల్లి కాశన్న

ఈ నెల 5న రెండు పుస్తకాల ఆవిష్కరణ

తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ నవతెలంగాణ పబ్లిషింగ్ హౌస్, తెలంగాణ సాహితి సంయుక్త ఆధ్వర్యంలో 'రేపెక్కడికెళ్తావ్!' (భారతీయ అనువాద కథల సంపుటి, రచయిత: డా.రూప్‌కుమార్ డబ్బీకార్), మాటలో మనసునై (వ్యాస సంపుటి, రచయిత: కె. ఆనందాచారి) ఆవిష్కరణ సభ జనవరి 5, 2024 సాయంత్రం 6 గంటలకు రవీంద్రభారతి మినీహాల్‌లో జరుగుతుంది. ఈ సభలో డా॥ ఎస్. రఘు, ప్రొ॥ సూర్యా ధనుంజయ్, శ్రీ సుధా భాస్కర్, డా॥ ఏనుగు నరసింహారెడ్డి, డా॥ మామిడి హరికృష్ణ, చింతపట్ల సుదర్శన్, కవి యాకూబ్, సి.ఎస్. రాంబాబు, తంగిరాల చక్రవర్తి, ఆర్. వాసు, అనంతోజు మోహన్ కృష్ణ పాల్గొంటారు.

కవిత్వ పరిమళం ముకుందరామారావు

ముకుంద రామారావు గారితో నా అనుబంధం 20 ఏళ్ల నాటిది. నేను హైదరాబాద్ వెళ్ళిన కొత్తలో ఒకరోజు కె.పి.అశోక్ గారు 'ముకుంద రామారావు నిన్ను అడిగినాడబ్బా, నిన్ను కలవాలి అంటున్నాడబ్బా' అన్నాడు. నేను ఎట్లా తెలుసు ఆయనకు అన్నాను. 'అరే గదేంది వై ఆయనకు తెల్వక పోవుడేంది, ఇంతకుముందు కూడా ఆయన నీ గురించి మాట్లాడుతుండే' అన్నాడు కేపీ. ఆ తరువాత ఒక సభలో కలిశాను ముకుంద రామారావుగారిని. అప్పటినుండి మెల్లగా ప్రారంభమైన మా అనుబంధం ఇప్పుడు 10, 15 రోజులకు ఒకసారి అయినా పలకరించుకోవడం పరిపాటిగా మారే స్థితికి వచ్చింది.

ముకుంద రామారావుగారి పలకరింపు ఎంత ఆత్మీయంగా ఉంటుందో ఆయన కవిత్వపు పలకరింపు అంతకన్నా ఆత్మీయంగా ఉంటుంది. 'వలస పోయిన మందహాసం' నుంచి ఇటీవలి కవితా సంపుటి 'రాత్రి నదిలో ఒంటరిగా' వరకు అన్ని కవితా సంపుటులు, మెత్తమెత్తటి మాటలతో సున్నిత హృదయాలను అతి సున్నితంగా తాకే, లేలేత కవిత కిరణాలు మనలను హత్తుకుంటాయి.

"నాకు మొలకెత్తిన ఓ సుందర చైతన్యాకృతి/ నాకే వీడ్కోలిస్తున్నప్పుడు/ ఇన్నాళ్లు/ గుండె గదిలో వొదిగి వొదిగి/ కళ్ళకేదో మంచు తెర కప్పి/ చూస్తూ చూస్తూనే/ గువ్వలా ఎగిరిపోయినట్లయింది"

'వలస పోయిన మందహాసం' లో మనసును తాకే మాట ఇది. ఒక సుదీర్ఘ విరామం తర్వాత రాసిన మొదటి కవిత ఇది. పెద్దకూతురు పెళ్లి చేసుకుని వెళ్లిపోతున్నప్పటి మానసిక భావోద్వేగ స్థితిని తెలిపే కవిత ఇది. ఈ కవిత ఆంధ్రప్రభలో 1993లో ప్రచురితమైంది. 50వ పడికి దగ్గరగా ఉన్నప్పుడు అచ్చయిన ఈ కవిత ఆయనను సాహిత్య ప్రపంచానికి అతి చేరువగా తీసుకొచ్చింది. రచనా వ్యాసాంగం ప్రారంభమైన తొలినాళ్లలో కొన్ని కథలు రాసినప్పటికీ ఆయన దృష్టి మాత్రం కవిత్వం మీదనే నిలిచింది. కవిత్వం రాసేవాడు తప్పనిసరిగా దేశ దేశాల కవిత్వం చదవాలని తనకు తానే నిబంధన పెట్టుకుని ప్రపంచ దేశాల కవిత్వాన్ని అధ్యయనం చేయడం ప్రారంభించిన ముకుంద రామారావు ఆ కవిత్వంలో తనకు నచ్చిన వాటిని తెలుగు పాఠకులకు అందించాలని భావించడంతో ఆయన దృష్టి అనువాదం వైపుకు మళ్ళింది.

1995లో వెలువడిన 'వలస పోయిన మందహాసం' తొలి సంపుటి నుండి ఇప్పటివరకు ఎనిమిది కవితా సంపుటులు, 14 అనువాద కవితా సంపుటులు వెలువరించారు. లేటు వయసులో కవిత్వం రాయడం ప్రారంభించి తనకు తానే ప్రస్థానించినప్పటికీ ఇంత తక్కువ సమయంలో ఎంత విస్తృతంగా కవిత్వ సృజన చేయడం అనువాదాలు చేయడం అంటే చిన్న విషయం కాదు. జీవితకాలం సాహిత్య సృజన చేశామని చెప్పుకునే వారు సైతం చేయలేని విధంగా ముకుంద రామారావు సాహిత్య సృజన చేయడం అత్యంత విశేషమైనది.

ముకుంద రామారావు జీవితాన్ని కవిత్వపు కుంచెలతో ఎలా బొమ్మ కట్టిస్తాడో ఈ కవిత చూస్తే అవగతం అవుతుంది

"మహాసముద్రం/ మరో ఇసుకరేణువును కలుపుకున్నట్లు/ గురితప్పని కాలం కొక్కానికి/ వయస్సు చిక్కుకుంటుంది/ అదేటు లాగితే అటు/ జరుగుతూ జరుగుతూ/ పుటుక్కున తెగేవరకు" - కాలం కొక్కానికి చెక్కుతున్న వయస్సు అనే భావ చిత్రాన్ని ఊహించుకోవడం అంటే జీవితపు తాత్విక చిత్రణ మన కళ్ళ ముందు నిలుస్తుంది.




మనుషులతో ఆత్మీయ అనుబంధాల్ని కలుపుకోవడం ముకుంద రామారావుకు అత్యంత ప్రీతిపాత్రమైన అంశం.

మరొకచోట 'ఒక ఒంటరివేళ' ను వర్ణిస్తూ "ఏకాంతంలో/ దూరాలన్నీ నన్ను చుట్టూ ముడతాయి/ నేను నిరాయుధుడిగా మిగులుతాను" అంటాడు. నిజానికి ఏకాంత సమయంలోనే అనేక ఆలోచనలు మనలను చుట్టుముడతాయి. ఆలోచనల్లో ఉక్కిరిబిక్కిరవుతూ వాటిని ఎదుర్కొనే శక్తిని కోల్పోతాడు మనిషి. రంగులు మార్చిన మేఘాలో, నదిని ఇముడ్చుకున్న తీరాలో మనల్ని ఓదారుస్తుంటాయి. కానీ ఒంటరి బాధ తెలియనప్పుడు ఓదార్పు కూడా తెలియదు కదా! అందుకే కవి బాధ తెలిసిన తర్వాతే ఓదార్పు తెలిసింది అంటాడు.

ముందే అనుకున్నట్టు ముకుంద రామారావుకు కుటుంబ సంబంధాల పట్ల, మిత్రుల పట్ల, ఆత్మీయుల పట్ల అమితమైన ప్రేమ. అందుకే 'విడనిముడి' పేరుతో తన కవితల్లో ఆత్మీయ అనుబంధాలను తెలిపే కవితలన్నింటిని ఏర్చి కూర్చి ప్రత్యేకమైన సంపుటిగా తీసుకొచ్చారు. ఇందులో 'ప్రవహించే నీరు' కవితలో మట్టిని నమ్మినవాడు భూగోళమంతా ఒకటే మట్టని విశ్వసించి, కష్టాన్ని ఆసరాగా చేసుకుని దూర ప్రాంతాలకు వలస పోయినవాడు, ఎప్పటికీ తిరిగిరాలేని స్థితిని మనసుకు హత్తుకునే విధంగా వర్ణించారు చెరువులో నీరులా ఉండక సమస్తము వదిలి సముద్రాలు దాటిపోవడమెందుకు అంటూ ఒక నిరసన స్వరంతో ప్రారంభించి మట్టిని నమ్మేవాడికి ఏమట్టైనా ఒక్కటేనా భాష రుచి ఏమి అడ్డురావు అంటాడు కానీ చరిత్రకాల గమనంలో ఏ ఏ మానవజాతులు ఎక్కడెక్కడి నుండి ఎటువంటి వెళ్లి స్థిరపడ్డారో లేదు ఇంకా ప్రవహిస్తూనే ఉన్నారో తెలియంది కాదు కానీ మన పూర్వీకులు ఎక్కడెక్కడ ఉన్నారో తెలిసినప్పుడు కలిగిన మానసిక ఆవేదనను ముకుంద రామారావు తన కవిత్వంలో వ్యక్తం చేస్తారు.

సూఫీ కవిత్వ సారాన్ని శతాబ్దాల సూఫీ కవిత్వం పేరుతో తెలుగువారికి అందించారు. వీటన్నిటికంటే చాలా ముఖ్యమైన అంశం ఏమిటంటే 10వ శతాబ్దం నాటి మహాయాన బౌద్ధుల నిర్వాణ గీతాలైన చర్యా పదాలను తెలుగులోకి అనువదించడం. దాదాపుగా అనేక భాషలకు ప్రథమ కావ్యంగా చెప్పుకునే ఈ చర్యా పదాల ద్వారా సాంధ్యభాషలో దాగి ఉన్న మహాయాన బౌద్ధ సిద్ధాచార్యుల ఉపదేశాలను మనకు అందివ్వడం ముకుంద రామారావు గారి అనువాద సజనకు మరో మైలురాయి లాంటిది అనిపిస్తుంది. అంతేకాకుండా నోబెల్ బహుమతి పొందిన కవులందరిని వారి జీవిత విశేషాలతో సహా తెలుగు పాఠకులకు అందించారు. ఇటువంటి కవి నాకు మిత్రుడని చెప్పుకోవడం అంటే ఆయన ఒంటికి అంటిన కవిత్వ పరిమళాలని ఒకసారి ఆయనను కౌగిలించుకోవడం ద్వారా నాకు అంటించుకోవాలని ప్రయత్నించడమే. నిరంతరం కవిగా మసలుతున్న ముకుంద రామారావును గూర్చి రాసే ఈ వ్యాసాన్ని ఆయన మాటల్లోనే ముగిస్తాను." నా దృష్టిలో కవి నిత్య విద్యార్థి కవిత్వానికి చదువు వయస్సు కొంతవరకు ఒక ఉపయోగపడతాయేమో కానీ అవే ముఖ్యం కాదని నమ్ముతాను నేర్చుకోవాల్సింది అందరిలోనూ ఉంటుంది అన్నింట ఉంటుంది నేర్చుకోవాలన్న తపన ఎప్పుడో ఎక్కడో ఆగిపోవాల్సింది కాదనుకుంటాను కవిత్వ వాతావరణం ఆసక్తికి మరింత దోహదపడుతుంది ఉపయోగపడుతుందనుకుంటాను".

(ముకుందరామారావు జనవరి 7న అజోవిభో కందాళం వారి ప్రతిభామూర్తి జీవితకాల సాధన పురస్కారం అందుకుంటున్న సందర్భంగా)



- బండ్ల మాధవరావు,
8897623332

కాలధర్మం...

భద్రంగా దాచుకున్న బ్రతుకు పాయసం
చేదుగా ఒలికిపోయేదాక్కసారే
నిజజీవి కలబడే యుద్ధాలే
పదే పదే తారస పడతాయి

గుత్తులు గుత్తులుగా పూచిన గుల్ మోహార్ పూలు
అత్యంత సహజంగా ప్రకృతి ధర్మంగా
నేలరాలి పోయినట్టు

మన నుంచి విస్తృతంగా విస్ఫోటనమవుతున్న
భావాలు... బంధవ్యాలు...బాధ్యతలూ
ఒకానొక కాలంలో అసంకల్పితంగానే
స్థాన చలనమై పోతుంటాయి
ఎంతో ఆత్మీయంగా
గుండె కండకు చుట్టుకున్న దారాలన్నీ
చిక్కుముళ్లను విప్పుకొని
అలవోకగానే నిన్ను విదిల్చు కుంటాయి



ప్రయాణ మెప్పుడూ
సాఫీగానే సాగుతుందని తలంచకు
నువ్వు వెళ్ళే దారి విచ్చుకత్తుల వలయం కావచ్చు
పర్వతాలం నీ తలంపుతో తరుచూ ఏకీభవించవు

జీవన కుడ్యాలపై ఏర్పడ్డ బాధాప్త చిత్రాలతో
నీ కన్నుల జలపాతాలై పోవచ్చు
అనేకానేక వైరుధ్యాలను ధరించిన దశ్యాలన్నీ
హఠాత్తుగా మసక బారుతాయి

కంటక వత్తాల మధ్య కదలాడటం
పాతాళ బిలంలోకి నెట్టేయ బడటం
రెండూ ఒక్కటే...
అనుకున్నవి అనుకున్నట్లు జరిగితే
దుఃఖాల ప్రసక్తే ఉండదు కదా...
ఈ ఉన్మత్త క్షేత్రంలో
కష్ట సుఖాలు బొమ్మా బొరుసులే

ఓ స్వప్నద్రష్టా...
కాలధర్మం తిరగేసి రాసుకునే చిత్తుప్రతి కాదు
నిష్క్రమణలు కాలంలో పుటలుగా కాక పుటలు
అన్నింటినీ చదివేస్తూ...
అంతిమంగా ప్రస్థానం కాక తప్పదు.

- డా॥కటుకోఝ్వల రమేష్,
9949083327

మాంగల్య దీపం

ఆయన చేతి వేళ్ళ మధ్య ఇమిడిన కత్తెర
టకటకమని శబ్దంతో పుర్రెపైన
దూసే దువ్వెన పండ్ల నుంచి లేచిన
వెంట్రుకల పొగరును కటకట కత్తిరిస్తది
నెత్తి మీద దువ్వెనా పాపటపై తైలాక్షరాలతో
తల వెంట్రుకల క్షేత్రంలో సుందర నృత్యం
చిందర వందర పెరిగిన కేశాలను
తీర్చిదిద్ది
సౌందర్యాత్మకంగా మలచడమే కత్తెర కళ
పెట్టుబడి చంద్రయ్య కలపతో నడిచి
వస్తుంటే
తలకాయలు జొన్న కంకులోలె ఊగిన
ఆనందం
మౌనంగా కనిపించే మా ఊరి చంద్రుడు
ఇంటింటి మగ ముఖాలపై వెలుగు నింపే
సూర్యుడు
తాత నాన్న నేను, మా అందరి తలలను
వేప చెట్టు కింద ఆయనకు అప్పగించి
బుద్ధునిలా బుద్ధిగా కూర్చునేవాళ్లం
తను మా తలలను క్షౌరించి,
నూనెతోమర్దించి
తల చుట్టూరా కొత్త తేజస్సు నింపేవాడు
కాళ్లకు ముల్లు గుచ్చి నొప్పి లేస్తే
గోరు గాయాలతో కెల్లగించి తీసివేసిన జ్ఞాపకం
చంద్రయ్య భార్య లచ్చవ్వనైతే
మా పోతారం ఊరిలో
ఎన్ని వందల కాన్పులు చేసిందో
ఎన్ని మాయిమంతలు దాసిందో
ఆమె చేయి గుణమే నవ శిశువుల నవ్వు
మంత్రసాని లచ్చవ్వ అంటే జనులకు జనని
మంగలి తనం అంటే మాంగల్య దీపం
తలకు సుందర రూపాన్ని తెచ్చే
అపురూపం
అదొక సేవా జీవన కళాత్మక వృత్తి

- అన్నవరం దేవేందర్,
9440763479

దర్వాజ పేజీపై మీ అభిప్రాయాలను, సూచనలను, సలహాలను, రచనలను darwajapage@gmail.com కు పంపించగలరు. చిరునామా : దర్వాజ, నవతెలంగాణ, ప్లాట్‌నెం. 21/1, అజామాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్- 500020

డేంజర్ బెల్స్

- 841 కొత్త కేసులు నమోదు
- 4309కి చేరిన యాక్టివ్ కేసులు : కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ సమాచారం



న్యూఢిల్లీ : భారత్‌లో కరోనా మహమ్మారి కేసులు పెరుగుతున్నాయి. కొత్తగా 841 కేసులు నమోదయ్యాయి. గత 227 రోజుల్లో ఇవే అత్యధిక కేసులు కావటం గమనార్హం. దీంతో మొత్తం కరోనా యాక్టివ్ కేసుల సంఖ్య 4309కి చేరుకున్నాయి. కేరళ, కర్నాటక, బీహార్ రాష్ట్రాల నుంచి ఒక్కరు చొప్పున మరణించారు. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఈ విషయాన్ని వెల్లడించింది. భారత్‌లో చివరగా ఈ ఏడాది మే 19న 865 కరోనా కేసులు నమోదయ్యాయి. కొత్త వేరియంట్, శీతాకాలపు వాతావరణ పరిస్థితుల కారణంగా కేసులు తీవ్రమవుతున్నాయని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ

బీజేపీ ఎంపీ సోదరుడి అరెస్టు



బెంగళూరు : కోట్ల రూపాయల విలువైన చెట్లను నెలమట్టం చేసిన కేసులో బీజేపీ ఎంపీ ప్రతాప్ సింహా సోదరుడు విక్రమ్ సింహా అరెస్టయ్యాడు. అటవీ శాఖ కస్టడీలో ఉన్న ఆయనకు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. దీంతో ఆయన విడుదలయ్యాడు. కర్నాటకలోని హస్సన్ జిల్లాలో కోట్ల రూపాయల విలువ చేసే మొత్తం 126 చెట్లను నేల మట్టం చేసి వేరే చోటుకు తరలించినట్టు సమాచారం. అందుబాటులో ఉన్న డాక్యుమెంటరీ ఎవిడెన్స్ ప్రకారం జరిగిన నేరంలో ఆయన పాత్ర ఉన్నట్టు అధికారిక నివేదిక ఒకటి పేర్కొన్నది. అనంతరం విక్రమ్ సింహా కోసం అటవీ అధికారులు గాలించగా.. పరారయ్యాడు. ఆర్గనైజ్డ్ క్రైమ్ టీమ్‌తో అటవీ అధికారులు సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టి విక్రమ్ సింహాను అరెస్టు చేశారు. కోర్టు బెయిల్ మంజూరు చేసిన అనంతరం 'నిజం గెలిచింది' అని విక్రమ్ సింహా అన్నారు.

గ్లోవ్స్ ఫ్యాక్టరీలో భారీ అగ్ని ప్రమాదం

- ఆరుగురు మృతి
- మహారాష్ట్రలోని ఔరంగబాద్‌లో ఘటన



ముంబయి : మహారాష్ట్రలోని ఔరంగబాద్‌లో ప్రమాదం చోటు చేసుకున్నది. గ్లోవ్స్ ఫ్యాక్టరీలో భారీ అగ్ని ప్రమాదం జరగటంతో ఆరుగురు మృతి చెందారు. అర్ధరాత్రి చోటు చేసుకున్న ఈ అగ్ని ప్రమాదం సమయంలో ఫ్యాక్టరీ మూసివేసి ఉన్నదనీ, ఆ సమయంలో తాము ఫ్యాక్టరీ వద్ద నిద్రిస్తున్నామని కార్మికులు తెలిపారు. "మాకు ఉదయం 2.15 గంటలకు కాల్ వచ్చింది. ఘటనా ప్రదేశానికి చేరుకునే సమయానికి మొత్తం ఫ్యాక్టరీ మంటల్లో ఉన్నది. అధికారులు ప్రవేశించి ఆరుగురి మృతదేహాలను వెలికి తీశారు " అని అగ్నిమాప శాఖాధికారి మోహన్ ముంగ్సే తెలిపారు. తెల్లవారే సమయానికి మంటలను అదుపులోకి తీసుకొచ్చినట్టు చెప్పారు. అయితే, ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉన్నదని చెప్పారు.

కొత్త ఏడాది.. కొత్త ప్రయోగం

- నేడే నింగిలోకి ఎక్స్‌పోశాట్ ఉపగ్రహం
- అంతరిక్షంలోకి మోసుకెళ్లనున్న పీఎస్ఎల్వీ-సీ58 రాకెట్
- ఏపీలోని శ్రీహరికోట నుంచి ప్రయోగం
- ఇప్పటికే కౌంట్ డౌన్ షురూ



న్యూఢిల్లీ : భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరొక్క ప్రయోగానికి సిద్ధమవుతున్నది. కొత్త సంవత్సరంలో కొత్త ప్రయోగాన్ని చేపడుతున్నది. చంద్రయాన్-3తో చరిత్ర సృష్టించి ప్రపంచ అగ్రదేశాల సరసన నిలిచి, సోలార్ మిషన్ ఆదిత్య-ఎల్1ను విజయవంతంగా ప్రయోగించిన భారత్ అంతరిక్ష పరిశోధనల్లో తన పేరును నిలబెట్టుకున్నది. ఇప్పుడు 2024 ఏడాదిలో తొలి ప్రయోగానికి తయారవుతున్నది. నేడు ఎక్స్ రే పొలారిమీటర్ ఉపగ్రహం (ఎక్స్‌పోశాట్)ను నింగిలోకి పంపనున్నది. పీఎస్ఎల్వీ-సీ58 రాకెట్ దీనిని అంతరిక్షంలోకి మోసుకెళ్లనున్నది. దాంతోపాటు మరో 10 పేలోడ్‌లను నింగిలోకి తీసుకెళ్లనున్నది. ఏపీలోని శ్రీహరికోటలో ఉన్న సతీశ్‌ధావన్ స్పేస్ సెంటర్ నుంచి ఈ ప్రయోగాన్ని ఇస్రో చేపట్టనున్నది. ఈ ప్రయోగాన్ని చేపట్టేందుకు ఇస్రో సర్వం సిద్ధం చేసింది. ఇప్పటికే కౌంట్‌డౌన్‌ను షురూ చేసింది. ఆదివారం ఉదయం 8.10 గంటలకే కౌంట్‌డౌన్‌ను ప్రారంభించారు. ఇది సోమవారం ఉదయం 9.10 గంటల వరకు కొనసాగనున్నది. ఎక్స్‌పోశాట్ ఉపగ్రహం.. భారత్ అంతరిక్ష ఆధారిత ఎక్స్-రే ఖగోళ శాస్త్రంలో సంచలనాత్మక పురోగతికి నాంది కానున్నదని ఇస్రో శాస్త్రవేత్తలు తెలిపారు. ఇమేజింగ్,, టైం డొమైన్ అధ్యయనాలు, స్పెక్ట్రోస్కోపీపై ప్రధానంగా దృష్టి సారించిన గత ప్రయోగాల లాగా కాకుండా.. ఎక్స్-రే ఖగోళ శాస్త్రానికి ఒక కొత్త కోణాన్ని పరిచయం చేస్తూ, ఎక్స్‌రే మూలాలను అన్వేషించటం ఎక్స్‌పోశాట్ లక్ష్యమని చెప్పారు. ఎక్స్‌పోశాట్ ఉపగ్రహ జీవితకాలం ఐదేండ్లని తెలిపారు. ఈ ప్రయోగం విజయవంతమైతే భారత్ చరిత్ర సృష్టించే అవకాశం ఉన్నదని అంతరిక్ష పరిశోధకులు అంటున్నారు.

తాటిచెట్టు నుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

- పెద్దపల్లి జిల్లా రామగిరిలో ఘటన

నవతెలంగాణ - రామగిరి

ప్రమదవశాత్తు తాటి చెట్టు నుంచి పడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలైన ఘటన పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం ఆదివారం జరిగింది. రత్నాపూర్ గ్రామానికి చెందిన గీత కార్మికుడు ముక్కెర లక్ష్మణ్ గౌడ్ చెట్టు ఎక్కి తాటి కల్లు గిస్తుండగా మోకు జారీ చెట్టు పైనుంచి కింద పడ్డాడు. తీవ్ర గాయలవగా ఆ పక్కనే ఉన్న గీత కార్మికులు గమనించి హుటాహుటిన గోదావరిఖని ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రభుత్వ పరంగా ఆయన కుటుంబాన్ని ఆదుకోవాలని సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు, ఎంపీటీసీ ధర్ముల రాజసంపాత్, ఉప సర్పంచ్ దుబ్బాక సత్య రెడ్డి కోరారు.

విద్యార్థి పోరాటాల వారధి ఎస్ఎఫ్ఐ

- నూతన విద్యావిధానానికి వ్యతిరేకంగా పోరాడుతాం : ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు
- జెండాను ఆవిష్కరించిన అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

విద్యార్థి పోరాటాల వారధి, త్యాగాల రథసారధి ఎస్ఎఫ్ఐ అని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు, అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి అన్నారు. నూతన విద్యావిధానానికి వ్యతిరేకంగా పోరాడుతామన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని చిక్కడపల్లిలో ఎస్ఎఫ్ఐ 54వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. తొలుత ఎస్ఎఫ్ఐ జెండాను ఆర్ఎల్ మూర్తి ఎగురవేశారు. జాతీయోద్యమ వీరుడు భగత్ సింగ్ చిత్రపటానికి పూలదండలేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అందరికీ విద్య ఉపాధి కల్పించాలనీ, స్వాతంత్ర్య ఫలాలు అందరికీ అందాలనే లక్ష్యంతో ఎస్ఎఫ్ఐ కేరళలో ఆవిర్భవించిందన్నారు. నాటి నుంచి నేటి వరకు రాజ్యాంగ రక్షణ, విద్యారంగంలో సమాన విద్యావకాశాలు, అందరికీ చదువు, చదువుకున్న వారికి ఉపాధి కల్పించాలనే పోరాటాలను ముందుకు తీసుకెళ్తున్నామన్నరు. ఎస్ఎఫ్ఐ ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడిందనీ, విద్యార్థి హక్కుల కోసం నినదించిందని తెలిపారు. విద్యా ప్రయివేటీకరణ, వ్యాపారీకరణ, కేంద్రీకరణ, కాషాయికరణ వ్యతిరేకంగా తమ సంఘం నికరంగా పోరాడుతోందన్నారు. బీజేపీ తన మాతసంస్థ ఆరెస్సెస్ ఎజెండాను విద్యారంగంలో అమలు చేయాలని కుట్ర చేస్తోందనీ, అందులో భాగంగానే సిలబస్‌లో మార్పులు చేస్తూ జాతీయోద్యమ వీరుల చరిత్రను పాఠ్యాంశాల నుంచి తొలగిస్తున్నదని విమర్శించారు. మూఢవిశ్వాసాలను జొప్పిస్తోందన్నారు. నూతన విద్యావిధానం పేరుతో ప్రభుత్వ విద్యారంగంలో కార్పొరేట్‌శక్తులను, విదేశీయూనివర్శిటీలను తీసుకుని వచ్చి దేశ విద్యారంగాన్ని ధ్వంసం చేయాలని చూస్తోందని విమర్శించారు. కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ.. విద్యాసంస్థల్లో సామాజిక న్యాయం, రిజర్వేషన్ల అమలు కోసం పోరాడాలన్నారు. వివక్షకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. దళితులపై జరుగుతున్న దాడులను తిప్పికొట్టాలన్నారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేశ్, అధ్యక్షులు కోటరమేశ్ మాట్లాడుతూ..బీజేపీ అధికారంలోకి వచ్చిన పదేండ్లలో ఉద్యోగాలు భర్తీ చేయకుండా ఉన్న ఉద్యోగులను తీసేస్తున్న తీరును వివరించారు. దేశంలో నిరుద్యోగం పెరిగిందనీ, చదివే చదువులు, చేసే ఉద్యోగాలకు పొంతన లేకుండా పోతున్నదన్నారు. భవిష్యత్‌లో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఐక్యంగా పోరాటాలు చేస్తామన్నారు. దేశంలో, రాష్ట్రంలో అనేక విద్యార్థి ఉద్యమాలు నడిపిన ఘనమైన చరిత్ర ఎస్ఎఫ్ఐకి ఉందనీ, అదే స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి జునుగరి రమేశ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులు ఎం.మమత, కె.అశోక్ రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు అచ్చిన లెనిన్, రమ్య, హైదరాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు స్టాలిన్, నాగేందర్, నాయకులు సాయి, సలీం, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

భౌ...భౌ..



- పెరుగుతున్న కుక్కకాటు కేసులు
- ఏడాదిలో ఆరు లక్షల కేసుల పెరుగుదల

న్యూఢిల్లీ : దేశంలో కుక్కకాటు కేసులు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. 2022తో పోలిస్తే 2023లో దాదాపు ఆరు లక్షల కేసులు పెరిగాయి. కుక్కకాటుకు గురైన వారిలో రాబిస్ వ్యాధితో ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య అధికంగా ఉంటోంది. 2030 నాటికి దేశంలో రాబిస్ పూర్తిగా నిర్మూలించాలన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరేలా కన్పించడం లేదు. రాబిస్‌ను సమూలంగా నిర్మూలించే విషయంపై గత నెలలో నీతి ఆయోగ్ జాతీయ స్థాయిలో సంప్రదింపుల ప్రక్రియను ప్రారంభించింది. వ్యాధి కారణంగా చోటుచేసుకుంటున్న మరణాలపై ప్రజలలో పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కేంద్రానికి సిఫార్సు చేసింది.


డిసెంబర్ ప్రారంభం నాటికి దేశంలో మొత్తం 27.5 లక్షల కుక్కకాటు కేసులు నమోదయ్యాయి. 2022లో వచ్చిన 21.8 లక్షల కేసులతో పోలిస్తే ఇది చాలా ఎక్కువ. కుక్కకాటుకు గురై ప్రాణాలు కోల్పోతున్న వారిలో 96% మరణాలకు రాబిస్ వ్యాధే కారణమని అధికారులు చెబుతున్నారు. 2015లో దేశంలో రాబిస్ కారణంగా 20,847 మంది చనిపోయారు. ప్రపంచ దేశాలన్నింటితో పోలిస్తే ఈ సంఖ్య బాగా ఎక్కువ. ప్రపంచంలో ప్రతి సంవత్సరం 60 వేల మంది నయం చేయడానికి వీలుకాని వ్యాధితో ప్రాణాలు కోల్పోతున్నారు.

ప్రజలు, ఆరోగ్య సిబ్బందిలో అవగాహన లేకపోవడంతో రోగులకు సకాలంలో చికిత్స అందించలేకపోతున్నారు.

తెహ్రీక్ -ఎ-హురియత్‌పై కేంద్రం నిషేధం

న్యూఢిల్లీ : కాశ్మీర్ వేర్పాటువాద సంస్థ తెహ్రీక్-ఎ- హురియత్ (టిఇహెచ్)పై కేంద్ర ప్రభుత్వం ఆదివారం నిషేధం విధించింది. జమ్ముకాశ్మీర్‌లో ఈ సంస్థ ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తోందని, భారత్‌కు వ్యతిరేకంగా ప్రచారాన్ని, తీవ్రవాద కార్యకలాపాలను కొనసాగిస్తోందని గుర్తించినట్లు కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించారు. "చట్టవ్యతిరేక కార్యకలాపాల (నివారణ) చట్టం కింద తెహ్రీక్-ఎ-హురియత్ జెకెను చట్టవిరుద్ధ సంఘంగా ప్రకటించారు. భారత్ నుండి జమ్ముకాశ్మీర్‌ను వేరుచేసి ఇస్లామిక్ పాలనను స్థాపించేందుకు ఈ సంస్థ నిషేధిత కార్యకలాపాలలో పాల్గొంటోంది" అని అమిత్‌షా ఎక్స్ లో పేర్కొన్నారు. టిఇహెచ్‌కి గతంలో సయ్యద్ అలీ షా గిలానీ నాయకత్వం వహించారు. ఆయన మరణానంతరం మసరత్ ఆలం భట్ బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం భట్ జైలులో ఉన్నారు.

ఆయన పార్టీ ముస్లిం లీగ్ ఆఫ్ జమ్ముకాశ్మీర్‌ను డిసెంబర్ 27న కేంద్రం నిషేధిత సంస్థగా ప్రకటించిన సంగతి తెలిసిందే.



నెతన్యాహును యుద్ధ నేరస్తుడిగా ప్రకటించాలి

- ఐసీజే ను కోరిన దక్షిణాఫ్రికా



జొహానెస్‌బర్గ్: గాజాలో పాలస్తీనీయులను ఊచకోత కోస్తున్న ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహును యుద్ధ నేరస్తుడిగా ప్రకటించాలని అంతర్జాతీయ నేర విచారణ న్యాయస్థానం (ఐసీజే)ను దక్షిణాఫ్రికా కోరింది. యూదు దురహంకార సైన్యం గాజాపై దురాక్రమణ పూరిత దాడులు 84వ రోజు (డిసెంబరు29)కు చేరిన వేళ దక్షిణాఫ్రికాలోని రమాఫోసా ప్రభుత్వం అంతర్జాతీయ నేర విచారణ కోర్టులో ఈ మేరకు ఒక పిటిషన్ దాఖలు చేసింది. నెతన్యాహును ప్రాసిక్యూట్ చేయడంతో బాటు, గాజాపై ఇజ్రాయిల్ దాడులను తక్షణమే నిలుపు చేసేలా ఆదేశించాలనికోరింది. ఇజ్రాయిల్ హంతక దాడులు ఊచకోత స్వభావాన్ని కలిగి ఉన్నాయని , పాలస్తీనాలో చాలా ప్రాంతాన్ని నాశనం చేశాయని, ఇజ్రాయిల్ దళాలు జాతి నిర్మూలనే లక్ష్యంగా గాజాలో రక్తపుటేరులు పారిస్తున్నాయని, దీని వల్ల అక్కడి పాలస్తీనీయులు భౌతికంగా, మానసికంగా అనుభవిస్తున్న క్షోభ వర్ణనాతీతమని ఆ పిటిషన్‌లో దక్షిణాఫ్రికా పేర్కొంది. అంతేకాదు, పాలస్తీనీయులను తమ ఇండ్ల నుంచి బలవంతంగా గెంటివేయడం, సామూహికంగా నివాస ప్రాంతాలపై దాడులు, ఇండ్లను నేలమట్టం చేయడం వంటి దాష్టీకాలు నిత్యకృత్యంగా మారిపోయాయి. ఆహారం, మందులు, గూడు, పరిశుభ్రత, పారిశుధ్యం ఇలా అనేక సమస్యల మధ్య అక్కడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పిటిషన్‌లో తెలిపింది. పాలస్తీనా ప్రజల జీవితాలను నాశనం చేసే హక్కు ఇజ్రాయిల్‌కు ఎవరిచ్చారని ప్రశ్నించింది. పాలస్తీనీయులు గాజా గడ్డపై జన్మించకుండా చేసేందుకు ఆసుపత్రులపైనా దాడులకు తెగబడిందని విమర్శించింది. అక్టోబరు 7 నుంచి ఇప్పటివరకు 22 వేల మంది దాకా పాలస్తీనీయులు చనిపోయారు. మరో 7,780 మంది జాడ తెలియడం లేదు. బహుశా వీరంతా భవన శిథిలాల కింద సమాధి అయిపోయి వుండొచ్చని భావిస్తున్నారు. ఈ ఫాసిస్టు దాడుల వల్ల 19 లక్షల మంది అంటే గాజా జనాభాలో 85 శాతం మంది బాంబు దాడుల్లో ఇండ్లు కోల్పోయి వీధిన పడ్డారు. గాజాలో పాలస్తీనా కుటుంబాల్లో మరణాల రేటు పెరిగిపోయిందని డబ్ల్యుసిఎస్ఎఫ్ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ హంతక దాడుల్లో కొన్ని కుటుంబాల్లో గాయపడిన ఒక బాబు లేదా పాప మాత్రమే మిగిలి మిగతా వారంత చనిపోయిన పరిస్థితి ఉంది. మృతుల్లో పిల్లలు, మహిళలు ఎక్కువగా ఉంటున్నారు. ఏ ప్రాంతమూ సురక్షితం కాదు. అని ఆ పిటిషన్‌లో పేర్కొంది. హేగ్ కేంద్రంగా పనిచేస్తున్న ఈ అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు రాజకీయాలకు, పక్ష పాతానికి అతీతమైనదేమీ కాదని పలు సందర్భాల్లో రుజువైంది. ఉక్రెయిన్, రష్యా యుద్ధంలో పశ్చిమ దేశాల ప్రభావంతో పుతిన్‌ను యుద్ధ నేరస్తుడిగా ఏకపక్షంగా ప్రకటించిన ఐసిజె, గాజాలో ఇన్ని రోజులుగా, ఇంత భయానకంగా పాలస్తీనీయులను ఊచకోత కోస్తున్న నెతన్యాహు విషయంలో గమ్మున ఉండడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. దక్షిణాఫ్రికా ప్రభుత్వ అభ్యర్థనపై అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు ఏ విధంగా స్పందిస్తుందో వేచి చూడాలి.

ఎర్ర సముద్రంలో మరో నౌకపై దాడి

ఎర్ర సముద్రంలో మరోక వాణిజ్య నౌకపై దాడి జరిగింది. సింగపూర్ నుంచి ఈజిప్టులోని పోర్ట్ సూయెజ్‌కు బయలుదేరిన హాంగ్‌జౌ అనే వాణిజ్య నౌక ఆదివారం ఉదయం 6:30 గంటలకు బాబ్ అల్-మాండెబ్ జలసంధి దాటి దక్షిణ ఎర్ర సముద్రంలోకి ప్రవేశించిన సమయంలో ఈ దాడి జరిగింది. దాడికి గురువుతున్న సమయంలో యెమెన్‌లోని హోడైదాకు నైరుతి దిశలో ఈ వాణిజ్య నౌక ఉందని అమెరికా సెంట్రల్ కమాండ్ సోషల్ మీడియా ఖాతా ద్వారా వెల్లడించింది. ఈ దాడిలో నౌక పెద్దగా నష్టానికి గురికాలేదని తెలిపింది. అయితే నౌకపై దాడి చేయడానికి ప్రయత్నించి హౌతీ ఫైటర్స్‌కు చెందిన నాలుగు చిన్న పడవల్లో మూడు పడవలను సముద్రంలో ముంచివేశామని అమెరికా సెంట్రల్ కమాండ్ వెల్లడించింది.

గుడిసెలను దహనం చేసిన నిందితులను శిక్షించాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి బోట్ల చక్రపాణి



నవతెలంగాణ - హన్మకొండ

హన్మకొండ జిల్లా న్యూశాయంపేటలోని కందులబండ భూ పోరాట ప్రాంతంలో సర్వే నెంబర్ 579, 599లో ఏడాది కిందట వేసిన సమారు 175 గుడిసెలను శనివారం రాత్రి దహనం చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి బోట్ల చక్రపాణి పోలీసులు, జిల్లా రెవెన్యూ యంత్రాంగాన్ని కోరారు. ఆదివారం న్యూ శాయంపేటలో దహనమైన గుడిసెల ప్రాంతాన్ని సీపీఐ(ఎం) బృందం సందర్శించి వారిని ఓదార్చారు. గుడిసెల్లో ఉన్న నిత్యావసర సరుకులు, వంట సామగ్రి తదితర సామాగ్రి తగలబడి సుమారు రూ.15 లక్షల నష్టం వాటిల్లిందని గుడిసెవాసులు పార్టీ నాయకులకు తెలిపారు. ఈ సందర్భంగా చక్రపాణి మాట్లాడుతూ.. కాజీపేట మండల రెవెన్యూ యంత్రాంగంతో మాట్లాడామని, ఈ సంఘటనపై పోలీసులు వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏం.చుక్కయ్య మాట్లాడుతూ కందులబండ ప్రభుత్వ భూమిని ఎలాగైనా కాజేయాలని కొందరు భూకబ్జాదారులు ఈ భూమిపై కన్నేశారని ఆరోపించారు. పేదలను భయభ్రాంతులకు గురిచేసి వాళ్లను ఇక్కడి నుంచి వెళ్లగొట్టాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా మండల రెవెన్యూ అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని కోరారు. ప్రభుత్వం కందుల బండ భూ పోరాటాన్ని రక్షించి, గుడిసెలు వేసుకున్న వారికి భూమిని పంచి ఇవ్వాలని, పట్టాలు అందజేయాలని కోరారు. సందర్శించిన వారిలో.. పార్టీ కాజీపేట మండల కమిటీ సభ్యులు ఓరుగంటి సాంబయ్య, జంపాల రమేష్, భూ పోరాట కమిటీ సభ్యులు భాగ్యలక్ష్మి, శిరీష, లలిత రేణుక, అనుష, లక్ష్మి, జంపాల మురళి, ఉమావిమల, సుజాత తదితరులున్నారు.

పోరాట నామ సంవత్సరం



(మొదటి పేజీ తరువాయి)

కంప్యూటర్లు, మొబైల్ ఫోన్లు పోలీసులు ఎత్తుకెళ్లారు. రాజధాని ఢిల్లీలోనే కాదు ఏకంగా 5 నగరాల్లో దాదాపు యాభై చోట్ల పోలీసులు దాడులు చేశారు. ఎడిటర్స్ గిల్డ్‌తో సహా అనేక జర్నలిస్టుల సంస్థలు ఈ ఆపరేషన్‌ను ప్రజాస్వామ్యం, పత్రికా స్వేచ్ఛపై దాడిగా అభివర్ణించాయి.

ఫోన్లపైనా..నిఘా

మోడీ ప్రభుత్వం ప్రతిపక్ష నాయకులను, జర్నలిస్టులను వేధించడంతో వారి ఫోన్లను స్పైవేర్‌తో నిఘా ఉంచుతుందనే వార్తలు 2023లో వెలుగు చూడ్డం పెద్ద ఎత్తున కలకలం రేపింది. సంవత్సం మందులోనూ ఇలాంటి వార్తలు వచ్చినా.. చివరిలో కూడా సీతారాం ఏచూరి, రాహుల్ గాంధీ, శశి థరూర్ వంటి ప్రతిపక్ష నేతలు తమ ఫోన్‌లు హ్యాక్ అవుతున్నారని ఐఫోన్ తయారీ సంస్థ యాపిల్ నుంచి హెచ్చరికలు అందాయని ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ ఆధ్వర్యంలోని హ్యాకర్లు ఈ పని చేస్తున్నారని, ఎవరు ఏం చేస్తారో తెలుసుకోవడానికి ఫోన్‌లను హ్యాక్ చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఐఫోన్ హెచ్చరించినట్లు ఈ నాయకులు తెలిపారు. సంవత్సరంలో ముందుగా వచ్చిన పెగాసస్ స్పైవైర్ ఆరోపణలపై మోడీ ప్రభుత్వం ఇప్పటి వరకూ సమాధానం చెప్పలేదు. ఇక ఐఫోన్ హ్యాకింగ్ ఆరోపణలుపై అస్సలు స్పందించనేలేదు.

146 మంది ఎంపీలపై వేటు

భారత పార్లమెంట్ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా మోడీ ప్రభుత్వం ఏకంగా ఈ ఏడాది 146 మంది ఎంపిలపై బహిష్కరణ వేటు వేసింది. ప్రశ్నలను లేవనెత్తడం, న్యాయమైన డిమాండ్లు చేయడమే ఈ 146 మంది ఎంపిల నేరమయింది. ప్రతిపక్ష ఎంపీల ప్రవర్తనను 'అన్‌పార్లమెంటరీ బిహేవియర్'గా ఆరోపిస్తూ మోడీ ప్రభుత్వం ఈ వేటు వేసింది. అయితే వివాదాస్పద బిల్లులను ఆమోదింపజేసుకునేందుకు, వ్యతిరేక స్వరాలకు అడ్డుకట్ట వేసేందుకు మోడీ ప్రభుత్వం ఈ వ్యూహం పన్నినట్లు విమర్శలు వెల్లువెత్తాయి. ప్రతిపక్ష పార్టీలు దేశవ్యాప్తంగా నిరసనలు చేశాయి. అయితే తమ ఎంపీని సస్పెండ్ చేసినా తృణమూల్ కాంగ్రెస్ ఈ నిరసనల్లో పాల్గొనలేదు.

పార్లమెంట్‌లో భద్రతా వైఫల్యం

అంత్యకట్టుదిట్టమైన భద్రత ఉండే పార్లమెంట్‌లో భద్రతా వైఫల్యం జరగడం 2023లో మరొక ముఖ్యమైన ఘటన. అదీ కూడా పార్లమెంట్‌పై ఉగ్రవాదుల దాడి జరిగి 22 ఏళ్ల పూర్తయిన రోజున ఇద్దరు యువకులు లోక్‌సభ ప్రేక్షకుల గ్యాలరీ నుంచి ఎంపీల సీట్లపైకి హఠాత్తుగా దూకారు. వారు డబ్బాలో నుండి పసుపు రంగు వాయువును విసిరారు. ఈ సంఘటనతో ఎంపీలు, పార్లమెంట్ సిబ్బంది ముందుగా ప్రాణభయంతో పరుగులు తీశారు. అయితే కొంతమంది ఎంపీలు ఈ ఇద్దరు యువకులను బంధించారు. పట్టుబడిన సాగర్ శర్మ, మనోరంజన్ అనే ఇద్దరు యువకులు బిజెపి ఎంపీ ప్రతాప్ సింహా 'పాస్'తో లోక్‌సభ గ్యాలరీకి ప్రవేశించారు. ఏదీమైనా ఈ ఘటన కొత్త పార్లమెంట్ భవనం వద్ద భద్రతా లోపాలను ఎత్తిచూపింది.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్

2023లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) వార్తల్లోని నిలిచిన మరోక ముఖ్యమైన అంశం. అయితే ఈ ఎఐ కొత్త ఆశలను, భయాలను రెండింటినీ పెంచింది. 2023లో భారతదేశపు మొట్టమొదటి కృత్రిమ మేధస్సుతో నడిచే న్యూస్ రీడర్ ఒక టెలివిజన్ ఛానెల్‌లో దర్శనమిచ్చి అందరి దృష్టిని ఆకర్షించింది. దీంతో ఇప్పటికే మందగమనంలో ఉన్న ఆర్థిక వ్యవస్థలో ఉపాధి అవకాశాలు తగ్గిపోతున్నాయని, ఎఐ విస్తృత ఉపయోగంతో కొన్ని రంగాల్లో అవకాశాలు మరింత మృగమవుతాయని ఆందోళనలు పెరిగాయి. అయితే ఎఐతో కొన్ని ఉద్యోగాలు పెరుగుతాయని నిపుణులు అంటున్నారు.

17 రోజులు సొరంగంలోనే.

ఉత్తరాఖండ్‌లోని సిల్కియారా సొరంగంలో 17 రోజులు పాటు 41 మంది కార్మికులు చిక్కుకుని ఉండటం అందర్ని ఆందోళనకు గురిచేసింది. అయితే వీరిని ఎట్టేకేలకు సురక్షితంగా బయటకు తీసుకుని రావడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అయితే అత్యాధునిక యంత్రాలు, ఆగర్ మెషిన్లు, ఉన్నత చదువులు చదివిన ఉద్యోగులు చేయలేని పనిని ర్యాట్ హోల్ వర్కర్లు చేశారు. సొరంగంలో చిక్కుక్కుపోయిన కార్మికులను కాపాడారు. ఈ క్షణాలను దేశం మొత్తం ఆత్రుతగా చూసింది, మతం, భాష, కుల భేదాలను చెరిపివేసి ర్యాట్ వర్కర్లు సొరంగం లోపల నుండి వారిని ఒక్కొక్కరుగా బయటకు తీసుకువచ్చారు.

బాలేశ్వర్‌లో ఘోర రైలు ప్రమాదం

జూన్‌లో ఒడిశాలోని బాలేశ్వర్‌లో జరిగిన ఘోర రైలు ప్రమాదంతో దేశం ఒక్కసారిగా ఉల్కిపడింది. ఈ రైలు ప్రమాదంలో 300 మందికి పైగా ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదంలో మూడు రైళ్లు ఒకదానికొకటి ఢీకొన్నాయి. చెన్నై వెళ్తున్న కోరమండల్ ఎక్స్‌ప్రెస్, హౌరా వెళ్తున్న యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్, ఒక సరుకు రవాణా రైలు కొన్ని నిమిషాల వ్యవధిలోనే ఒకే లైన్‌లో ప్రమాదానికి గురికావడంతో రైల్వే భద్రతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

దేశ ప్రజల్లో వికసిత్ భారత్ స్ఫూర్తి

- కొత్త ఏడాదిలో కూడా కొనసాగించాలి: ప్రధాని మోడీ

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

దేశ ప్రజలకు ప్రధాని మోడీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఏడాది దేశం ఎన్నో ఘనతలు సాధించిందని గుర్తు చేశారు. 2023లో దేశ ప్రజల్లో వికసిత్ భారత్ స్ఫూర్తి రగిలిం దన్నారు. దాన్ని కొత్త సంవత్స రంలోనూ కొనసాగి ంచాలని పిలుపునిచ్చారు. ఆదివారం ప్రసారమైన 2023 చివరి 'మన్ కీ బాత్'లో భాగంగా సాధించిన విజయా లను ఆయన గుర్తు చేశారు. సుదీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న మహిళా బిల్లుకు ఈ ఏడాదిలోనే ఆమోదం లభించిందని మోడీ గుర్తు చేశారు. భారత్ ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని పేర్కొన్నారు. దీనిపై దేశ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తూ లేఖలు రాస్తున్నారని వెల్లడించారు. ప్రతిష్టాత్మక జీ20 సదస్సును విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. ప్రస్తుతం భారత్ లోని ప్రతి ప్రాంతం ఎంతో ఆత్మవిశ్వాసంతో నిండి ఉందని తెలిపారు. దేశ ప్రజల్లో వికాస, స్వయం సమృద్ధి భారత్ స్ఫూర్తి రగిలిందని చెప్పారు. 2024లోనూ దాన్ని కొనసాగించాలని పిలుపునిచ్చారు ఈ ఏడాది 'నాటు నాటు' పాటకు ఆస్కార్ అవార్డు దక్కడంతో దేశం మొత్తం ఉర్రూతలూగిందని మోడీ తెలిపారు. 'ఎలిఫెంట్ విస్పరర్స్'కు సైతం ప్రతిష్టాత్మక అవార్డు రావటంతో భారతీయుల ప్రతిభ వెలుగుచూసిందని వ్యాఖ్యానించారు. 2023లో భారతీయుల సృజనాత్మకతను యావత్ ప్రపంచం వీక్షించిందని తెలిపారు. ఈ ఏడాదిలో మన క్రీడాకారులు అద్భుత ప్రదర్శన చూపారని మోడీ కొనియాడారు. ఆసియా క్రీడల్లో 107, పారా గేమ్స్ 111 పతకాలతో సత్తాచాటారని గుర్తు చేశారు. వన్డే ప్రపంచ కప్‌లో భారత క్రికెట్ జట్టు అందరి మనసులు గెలుచుకుందని ప్రశంసించారు. చంద్రయాన్-3 విజయవంతంపై చాలా మంది తనకు సందేశాలు పంపుతున్నారని మోడీ తెలిపారు. శాస్త్రవేత్తల కృషితో ఈ ప్రతిష్టాత్మక ప్రయోగం విజయవంతమైందని, ఇది అందరికీ గర్వకారణమని చెప్పారు.

విశాఖలో సామూహిక లైంగికదాడి

విశాఖ . విశాఖ నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో 17 ఏండ్ల బాలికపై పది మంది యువకులు లైంగికదాడి చేశారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం... ఒడిశా రాష్ట్రానికి చెందిన ఒక కుటుంబం విశాఖలోని నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ సమీపంలో ఉంటోంది. ఆ కుటుంబంలోని బాలిక తన ప్రియుడిని కలిసేందుకు విశాఖ నగరంలోని ఓ లాడ్జికి డిసెంబర్ 17న ఉదయం వెళ్లింది. అక్కడ ఆమెపై ప్రియుడు అఘాయిత్యానికి పాల్పడ్డాడు. అనంతరం అతను స్నేహితునికి సమాచారం ఇచ్చాడు. అతనూ లాడ్జికి వచ్చి బెదిరించి బాలికపై లైంగికదాడి చేశాడు.ఈ సంఘటనతో భయాందోళనకు గురైన యువతి విశాఖ ఆర్కే బీచ్ ప్రాంతానికి వెళ్లి అక్కడ ఏడుస్తూ ఉండగా ఓ ఫొటోగ్రాఫర్ చూశాడు. ఆమెను ఓదార్చి, మాయమాటలు చెప్పి తన స్నేహితుల గదికి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. దీనిని వీడియోలో చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో పెడతామని బెదిరించి అతని స్నేహితులు దారుణానికి దిగారు.

ప్రపంచ గమనం

కరుగుతున్న డాలర్

- ప్రపంచ రిజర్వ్ నిధులలో భారీక్షీణత -ఐఎంఎఫ్



ప్రపంచ కేంద్ర బ్యాంకులలోని రిజర్వ్ కరెన్సీలలో అమెరికన్ డాలర్ వాటా క్షీణించటం కొనసాగుతూవుంది. అంతర్జాతీయ ద్రవ్య నిధి(ఐఎంఎఫ్) విడుదల చేసిన తాజా డేటా ప్రకారం 2023లోని మూడవ త్రైమాసికంలో డాలర్ వాటా 59.2శాతానికి పడిపోయింది. ప్రపంచ వ్యాప్తంగా డాలర్ అవసరంలేని లావాదేవీలు జరుగుతున్న (డిడాలరైజేషన్) నేపథ్యంలో ఈ క్షీణత సంభవించింది. అంతర్జాతీయ ద్రవ్య నిధి అందించిన గణాంకాల ప్రకారం 2000సంవత్సరంలో ప్రపంచ రిజర్వ్ కరెన్సీ నిధులలో డాలర్ వాటా దాదాపు 70శాతం ఉండేది. ఇప్పటికీ డాలర్ ప్రధాన రిజర్వ్ కరెన్సీగానే ఉంది. ఆ తరువాత స్థానంలో యూరో ఉంది. యూరో వాటా కూడా 19.6శాతానికి పడిపోయింది. జపనీస్ యెన్ వాటా అంతకు ముందటి త్రైమాసికంలో 5.3శాతంగా ఉండగా అది మూడవ త్రైమాసికంలో 5.5శాతానికి పెరిగింది. చైనీస్ యువాన్, బ్రిటీష్ పౌండ్, కెనడియన్ డాలర్, స్విస్ ఫ్రాంక్ ల వాటాలలో స్వల్ప మార్పు సంభవించింది.

గ్లోబల్ ఫైనాన్షియల్ మెస్సేజింగ్ సర్వీస్ స్విఫ్ట్ సేకరించిన డేటా ప్రకారం నవంబర్ లో అంతర్జాతీయ చెల్లింపులలో ఎక్కువగా వాడిన కరెన్సీలలో చైనీస్ యువాన్ వాటా నాలుగవ స్థానానికి ఎగబాకింది. అలాగే వివిధ దేశాలకు యువాన్ లో అప్పులు ఇవ్వటం కూడా పెరిగింది. సౌదీ అరేబియా, అర్జంటీనాలతో కలిపి పీపుల్స్ బ్యాంక్ ఆఫ్ చైనా విదేశీ కేంద్ర బ్యాంకులతో 30 ద్వైపాక్షిక కరెన్సీ ఒప్పందాలను చేసుకుంది. అంతర్జాతీయ చెల్లింపులలో యువాన్ వాటా పెరగటం చైనా డాలర్ నుంచి దూరం జరగటాన్ని, యువాన్ వినియోగాన్ని పెంచటం కోసం చైనా చేస్తున్న క్రుషిని సూచిస్తోందని స్విఫ్ట్ పేర్కొంది.

అంతర్జాతీయ వాణిజ్యంలో డాలర్ కు బదులుగా జాతీయ కరెన్సీలను ఉపయోగించటం గత సంవత్సరం బాగా ఊపు అందుకుంది. పశ్చిమ దేశాల ఫైనాన్షియల్ వ్యవస్థ నుంచి రష్యాను బహిష్కరించటంవల్ల, రష్యాకున్న విదేశీ నిధులను ఘనీభవింపజేయటంవల్ల విదేశీ వాణిజ్య చెల్లింపులలో జాతీయ కరెన్సీ వినియోగం పెరిగింది. పశ్చిమ దేశాలు విధించిన ఆక్షలకు ప్రతిస్పందనగా రష్యా చైనీస్ యువాన్ లో చేస్తున్నవాణిజ్యంలో పెరుగుదల అమెరికన్ డాలర్ బలహీనపడటానికి దారితీస్తుందని యూరోపియన్ బ్యాంక్ ఫర్ రికన్స్ట్రక్షన్ అండ్ డెవెలప్మెంట్ (ఈబీఆర్డీ) హెచ్చరించింది. రష్యా అంతర్జాతీయ వాణిజ్యంపైన పశ్చిమ దేశాలు విధించిన ఆంక్షల కారణంగా చైనీస్ యువాన్ వాడకం పెరగటం డాలర్ నష్టపోవటానికి దారితీస్తుందని ఆర్థికవేత్తలు చెబుతున్నారు.

రష్యా సరిహద్దు నగరంపైన ఉక్రెయిన్ దాడి 24మంది మృతి



రష్యా, ఉక్రెయిన్ సరిహద్దు నగరమైన బెల్గోరాడ్ పైన శనివారం ఉక్రెయిన్ చేసిన దాడిలో 24మంది చనిపోయారని, మొత్తం 108మంది గాయపడ్డారని బెల్గోరాడ్ ప్రాంత గవర్నర్ వ్యాచెస్లావ్ గ్లడ్కోవ్ ఒక టెలిగ్రాం పోస్టులో చెప్పారు. ఈ దాడిలో 100 కార్లు పూర్తిగా కాలిపోయాయని, 30 భవనాలు, వాణిజ్య సముదాయాలు, అనేక గ్రుహాలు దెబ్బతిన్నాయని కూడా ఆయన తెలిపారు. బెల్గోరాడ్ రష్యా ఉక్రెయిన్ సరిహద్దుకు 40కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ దాడిలో నిషేధిత క్లష్టర్ బాంబులను వాడినట్టు రష్యన్ రక్షణ మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఐక్యరాజ్య సమితి కన్వెన్షన్ 2008ని అనుసరించి పౌరుల ప్రాణాలకు ప్రమాదకరమైనవనే కారణంగా ఈ బాంబులను 110 దేశాలు నిషేధించాయి. రష్యన్ వాయు రక్షణ దళాలు చాలా రాకెట్ బాంబులను నిర్వీర్యం చేసినప్పటికీ కొన్ని బాంబులు బెల్గోరాడ్ పైన పడ్డాయి.


రష్యా సరిహద్దు నగరమైన బెల్గోరాడ్ పైన ఉక్రెయిన్ జరిపిన దాడిని ఐక్యరాజ్య సమితి ఖండించింది. పౌరులను చంపాలనే లక్ష్యంతోనే ఉక్రెయిన్ ఈ దాడి చేసిందని రష్యా ఆరోపించిన తరువాత ఐక్యరాజ్య సమితి ఈ దాడిని ఖండించటం జరిగింది. పౌరులపైన దాడి చేయటం, పౌర నివాసాలపైన దాడులు చేయటం అంతర్జాతీయ మానవతా చట్టాల ఉల్లంఘన కిందకు వస్తుందని, ఈ దాడులను తక్షణం ఆపాలని ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్ ఒక ప్రకటన చేశారు.


ఇజ్రాయిల్ దాడులతో గాజాలో 100 మంది మృతి

గాజా : ఇజ్రాయిల్ దాడులు గాజాను సర్వ నాశనం చేస్తున్నాయి. ఆదివారం సాయంత్రం సమయానికి గత 24 గంటల్లో ఇజ్రాయిల్ దాడుల్లో 100 మంది మరణించగా, మరో 286 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఇవి గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ అధికారికంగా వెల్లడించిన వివరాలు మాత్రమే. 2023 అక్టోబర్ 7 నుంచి డిసెంబరు 31 వరకూ గాజాపై ఇజ్రాయిల్ జరిపినదాడుల్లో 21,672 మంది మృతి చెందగా, మరో 56,165 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఇక గాజా నుంచి ఇజ్రాయిల్ సైన్యం బలవంతంగా తరలించినవారు, సైన్యం దాడుల్లో నిరాశ్రయులైన వారు, ఆహారం, నీరు వంటి కనీస అవసరాల కోసం ఇబ్బందులు పడుతున్న వారి సంఖ్య వీటికి అదనం. మృత దేహాన్ని గౌరవించాలని, గుర్తించేలా ఉంచాలని అంతర్జాతీయ చట్టాలు పేర్కొంటున్నాయి. ఇజ్రాయిల్ సైన్యం దాడుల్లో మరణించిన పాలస్తీనియన్ల విషయంలో ఇది జరగడం లేదు. అలాగే ఆదివారం నాడు వెస్ట్‌బ్యాంక్‌పై ఇజ్రాయిల్ సైన్యం జరిపినదాడుల్లో 15 మంది గాయపడ్డారు.

సెలెబ్రిటీ రిసార్ట్స్ లో న్యూఇయర్ వేడుకలు

ఉర్రూతలూగించిన డీజే రాహుల్ భరద్వాజ్






హైదరాబాద్ : కొత్త సంవత్సరం ఆహ్వానిస్తూ సెలెబ్రిటీ రిసార్ట్స్ లో ఉత్సాహభరితంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న డీ జే రాహుల్ భరద్వాజ పాల్గొని ప్రేక్షకులను ఉర్రూతలూగించారు. సంవత్సరమంతా సాధించిన విజయాలు, అభివృద్ధి, కుటుంబ సంతోషాలు చర్చించుకొని కొత్త సంవత్సరం వేడుకలను ఆస్వాదించారు.ఈ కార్యక్రమంలో ప్రజయ్ సంస్థ చైర్మెన్ విజయ్ సేన్ రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ రోహిత్ రెడ్డి, జనరల్ మేనేజర్ అమిత్ మండల్, రిసార్ట్స్ మేనేజర్ హరి జోసెఫ్ పాల్గొన్నారు.

సార్వత్రిక పోరుకు సై...

ఫిబ్రవరి నుంచి ఎన్డీఏ-భారత్ ఎన్నికలకు సన్నాహాలు

- మార్చిలో ఎన్నికల నోటిఫికేషన్..!





న్యూఢిల్లీ : కర్నాటక ,తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్‌లో ఉత్సాహాన్ని పెంచగా.. రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ , మధ్యప్రదేశ్ ఫలితాలు మాత్రం తీవ్రంగా నిరాశపర్చాయి. దీన్ని అధిగమించేందుకు అధిష్టానం మార్గాలు వెతుకుతోంది..ప్రణాళికలు సిద్ధం చేసుకుంటోంది. 6200 కి.మీ భారత్ న్యాయ యాత్రకు రాహుల్ గాంధీ సిద్ధమవడం, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రాను ఉత్తరప్రదేశ్ బాధ్యతలనుంచి తప్పించడం ఇందులో భాగంగానే పరిశీలిస్తున్నారు.

కర్నాటకలో హస్తం గెలిచాక..

కర్నాటక అసెంబ్లీ ఎన్నికలను ఐదు రాష్ట్రాల ఎన్నికలను, ఫలితాల తర్వాత అటు కాంగ్రెస్,ఇటు బీజేపీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. మోడీ మొదలుకుని కేంద్రమంత్రులు, స్థానిక నాయకత్వాన్ని జత చేసుకుని, పార్టీకి చేరిన భారీ విరాళాలను ఓటర్లపై గుమ్మరించాయన్నది వాస్తవమేనని పరిశీలకులు అంటున్నారు. ఇక సెమీ ఫైనల్‌లో గెలిచాక, కమలం పార్టీ సార్వత్రికాని తన రాజకీయ అస్త్రంగా అయోధ్య అంశాన్ని తెరపైకి తెచ్చింది. అయితే బీజేపీ గెలిచిన మూడు రాష్ట్రాల్లో ఉన్న ముఖ్యమంత్రులను మార్చేసి, కొత్త వారిని ఎంపిక చేసింది. ఇది లోలోన మాజీ సీఎంలు, వారి అనుచరుల మనసుల్లో కుతకుత లాడుతోంది. వీరంతా ఇపుడు సార్వత్రికంలో బీజేపీకి ఎంతవరకు అండగా నిలుస్తారన్న దానిపై పెద్ద చర్చ సాగుతోంది.



బీజేపీ ఎజెండా ఇదే..

2024 లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీయే 350 సీట్ల మార్కును దాటుతుందని బీజేపీ నేతలు ముందే చెప్పడం మొదలుపెట్టారు. రామ మందిరంలో రాముడిని ప్రతిష్టించండి చాలు..అని ఉత్తరప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి ఒకరు చెప్పారు. 2024లో యూపీ నుంచి బీజేపీకి 70 సీట్ల కంటే తక్కువగా ఆశించవద్దు. మాదే గ్యారంటీ అంటున్నారు. ప్రపంచంలోనే దేశ విశ్వసనీయత పెరిగిందని ఆ పార్టీ, కార్పొరేట్ మీడియా చెప్పుకుంటున్నా...అంతర్జాతీయంగా దేశ పరువు రోడ్డున పడిందని నివేదికలు ధ్రువీకరిస్తున్నాయి.

ఇండియా కూటమిలో....

ప్రధాన ప్రతిపక్ష, ఇండియా కూటమి తొలి ముసాయిదాను బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ సమర్పించారు. బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీని కలిశాక ముందుకు సాగారు. ఈ ఫ్రేమ్‌వర్క్‌లో ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారు. ఈ కూటమి డ్రైవింగ్ సీటులోకి కాంగ్రెస్ వచ్చాక, దాని రోడ్‌మ్యాప్‌ను రూపొందించడంలో అనేక సమస్యలు ఇంకా దారిలో పడలేదన్న చర్చ నడుస్తోంది.

రాహుల్ భారత్ న్యాయ్ యాత్ర 2024 జనవరిలో ప్రారంభం కానుంది. ప్రతిపక్ష పార్టీల నాయకులు ఒక వేదికపైకి వచ్చి ఒక కూటమిగా ఏర్పడుతున్నప్పుడు దానిని అహంకారపూరిత కూటమి అని పేర్కొంటూ ప్రధాని అవహేళన చేశారు.చివరికి ఇండియా కూటమి అనే పేరు తెరపైకి తీసుకుని రాగానే మోడీ భారత్ అనే పేరుతో రాజకీయం చేస్తుండటం గమనార్హం.

యూపీ సీన్ ఛేంజ్ అవుతుందా..!

2014 నుంచి ఉత్తరప్రదేశ్‌లో బీజేపీకి అత్యధిక సీట్లు వస్తున్నాయి. ఉత్తరప్రదేశ్‌కు చెందిన బీజేపీ నేతలు. 2024లో కూడా 70కి పైగా సీట్లు వస్తాయని ఆశిస్తున్నారు. ఈ రాష్ట్రం ఒకప్పుడు కాంగ్రెస్‌కు జీవనాడి. ప్రస్తుతం కేవలం ఒక సీటు మాత్రమే ఉంది. అలీఘర్‌కు చెందిన బిజేంద్ర సింగ్ 90వ దశకం నుంచి క్రియాశీలక రాజకీయాల్లో ఉన్నారు. భారత కూటమి స్వరూపమే ఇంకా కాంక్రీట్ రూపు దాల్చలేదని అంటున్నారు.

ఇందులో బీఎస్పీ ప్రమేయం ఉంటుందో లేదో తెలియదు. సోనియా గాంధీ రాయ్‌బరేలీ నుంచి పోటీ చేస్తారా లేదా? ఎస్పీ,ఆర్ఎల్డీ లేదా కాంగ్రెస్ అభ్యర్థులు ఎవరు..ఎన్ని స్థానాల్లో పోటీ చేస్తారు? అన్నవి ఇంకా చర్చల స్థాయికే పరిమితమయ్యాయి.

మార్చి రెండో వారంలో నోటిఫికేషన్..

మార్చి రెండో వారంలోగా ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనున్నట్టు సంకేతాలొస్తున్నాయి. అయితే అంతకు ముందే మోడీ కావాల్సినంత ప్రచారం చేసుకున్నాక..ఇక ఓకే అన్నాకనే..సార్వత్రిక ఎన్నికలు జరుగుతాయన్నది జగమెరిగిన సత్యం.

బలోపేతం వైపు అడుగులు..

దేశంలో ఇంకా అనేక రాష్ట్రాల్లో ఇండియా కూటమి బలోపేతం కావాల్సిన అవసరం ఉంది. దేశవ్యాప్తంగా చూసుకున్నా. కర్నాటక, తెలంగాణ,హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో మాత్రమే కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నది. మిగతా రాష్ట్రాల్లో బీజేపీకున్న వ్యతిరేకత, అభ్యర్థుల ఎంపిక తదితర అంశాలు కీలకంగా మారనున్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నాయి.

బీజేపీకి ఎదురుదెబ్బలు,.

గత ఎన్నికల్లో బీజేపీ, దాని మిత్రపక్షాలకు అత్యధిక సీట్లు వచ్చాయని, అయితే ఈసారి అంతా మారిపోతుందని పార్టీ నేతలు భావిస్తున్నారు. పైకి గాంభీర్యం ప్రదర్శిస్తున్నా...లోలోన.. 2024లో ప్రజల ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందనే భయం బీజేపీని వెంటాడుతోంది. మరోవైపు కర్నాటక బీజేపీ నుంచి చేజారాక.. దక్షిణ భారతదేశంలో కాషాయపార్టీ ఉనికే లేదు. మరోవైపు ప్రాంతీయ పార్టీలతో కలిసి బీజేపీని ఓడిస్తామన్న దీమా కాంగ్రెస్ నాయకత్వంలో కనిపిస్తోంది.

అయితే కాంగ్రెస్‌కు ప్రధాన మద్దతు ఇచ్చి ఎక్కువ సీట్లు ఇస్తే.. తమ పార్టీలు కుంచించుకుపోయే ప్రమాదం ఉందని ప్రాంతీయ పార్టీల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.ఈ ఆందోళనలు, అసంతృప్తుల మధ్య అరకొర సన్నాహాలతో పోటీ చేసే పరిస్థితి వస్తే.. కాంగ్రెస్ సహా కూటమి పార్టీలన్నీ భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.



బీజేపీ 'వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర'లో మహిళ అశ్లీల డ్యాన్స్..

వీడియో వైరల్

లక్నో : బీజేపీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర' కార్యక్రమంలో ఒక మహిళ అశ్లీల డ్యాన్స్ చేసింది. స్థానిక బీజేపీ ఎమ్మెల్యే, ఎంపీ, గ్రామపెద్ద వేదిక వద్ద ఉండగానే ఈ సంఘటన జరిగింది. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. బీజేపీ పాలిత ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. కేంద్ర పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు 'వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర' పేరుతో కార్యక్రమాలను బీజేపీ నిర్వహిస్తున్నది. ఇందులో భాగంగా శనివారం భోజ్‌పూర్ ప్రాంతంలోని షకుర్‌పూర్ గ్రామంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. గ్రామ పెద్ద, ఆయన భార్య, స్థానిక బీజేపీ ఎమ్మెల్యే ఎంపీ తదితరులు హాజరయ్యారు.


తగ్గిన పప్పుధాన్యాల ఉత్పత్తి

- దిగుమతి సుంకం మినహాయింపు కొనసాగింపు
- 2025 వరకు పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం



న్యూఢిల్లీ: దేశంలో పప్పుధాన్యాల ఉత్పత్తి తగ్గిపోయింది. పప్పుధాన్యాల సంక్షోభం ప్రభుత్వాన్ని దిగుమతి సుంకం మినహాయించేలా చేసింది. దీనిని 2025 మార్చి వరకు పొడగించాలని నిర్ణయించింది. ఈ మేరకు కందులు, మినుములపై ఈ సుంకం మినహాయింపు ఉండనున్నది. గతవారమే కాయధాన్యంపై ప్రభుత్వం దిగుమతి సుంకాన్ని మినహాయించిన విషయం విదితమే. ముందుగా నిర్ణయించినట్టు వచ్చే ఏడాది మార్చి నాటికి దిగుమతి సుంకం మినహాయింపు గడువు ముగియాల్సి ఉన్నది. అయితే, వచ్చే ఏడాది లోక్‌సభ ఎన్నికలు ఉండటంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని విశ్లేషకులు అంటున్నారు.

సులభమైన దిగుమతుల కోసం భారత్ తన విధానాన్ని కొనసాగిస్తున్నదని ప్రపంచవ్యాప్తంగా



పైన పేర్కొన్న పప్పుధాన్యాల ఉత్పత్తిదారులకు ముందుగానే తెలిపేందుకు ఈ నిర్ణయం తీసుకున్నదనని సంబంధిత ప్రభుత్వ అధికారులు తెలిపారు. ఈ ఏడాది భారత్ దాదాపు 23 లక్షల టన్నుల పప్పుధాన్యాలను దిగుమతి చేసుకున్నది. ముఖ్యంగా, ఆస్ట్రేలియా, కెనడా, మయన్మార్, మొజాంబిక్, టాంజానియా, సూడాన్, మాలావి దేశాల నుంచి ఈ దిగుమతి జరిగింది.

కాగా, ప్రభుత్వ నిర్ణయం పప్పుధాన్యాల ఉత్పత్తిలో స్వావలంబన సాధించాలనే భారతదేశ ఆశయాన్ని దెబ్బతీస్తున్నదని విశ్లేషకులు తెలిపారు. ఖరీఫ్ పప్పుల ఉత్పత్తి తక్కువగా ఉండటం, ప్రస్తుత రబీ పప్పుధాన్యాల విస్తీర్ణం తగ్గిపోవటంతో ప్రభుత్వం దేశీయ ధరలను నియంత్రించేలా చేసిందని చెప్తున్నారు. ప్రధాన పప్పుధాన్యాలు ఉత్పత్తి చేసే రాష్ట్రాలైన కర్నాటక, గుజరాత్, మహారాష్ట్ర, రాజస్థాన్‌లు ప్రస్తుత రబీ సీజన్‌లో తక్కువ పప్పుధాన్యాలు విత్తే ప్రాంతాలను నమోదు చేయటం గమనార్హం. అంతేకాకుండా, 2022-23తో పోలిస్తే ప్రస్తుత 2023-24 ఖరీఫ్ సీజన్‌లో పప్పుధాన్యాల పంటల విత్తనం 5.41 లక్షల హెక్టార్లు తగ్గింది. ఎల్‌నినో కారణంగా సగటు కంటే తక్కువ వర్షపాతం ఖరీఫ్ విస్తీర్ణాన్ని 123 లక్షల హెక్టార్లకు పరిమితం చేసింది. దేశంలో సాధారణ ఖరీఫ్ పప్పుధాన్యాల విస్తీర్ణం దాదాపు 139.70 లక్షల హెక్టార్లు. గత రెండేండ్లుగా ఖరీఫ్ పప్పుధాన్యాల ఉత్పత్తిపై ప్రతికూల ప్రభావం పడింది. 2022-23లో ప్రధాన పప్పుధాన్యాలు పండే ప్రాంతాల్లో అస్థిర వర్షపాతం కారణంగా ఖరీఫ్ పప్పుధాన్యాల పంట విస్తీర్ణం దాదాపు 4 శాతం తగ్గింది. పప్పుధాన్యాల ఉత్పత్తి 15 శాతం పడిపోయింది. ప్రస్తుత 2023-24 ఖరీఫ్ సీజన్‌లో, పప్పుధాన్యాల మొత్తం ఉత్పత్తి 7.1 మిలియన్ మెట్రిక్ టన్నులుగా అంచనా వేయబడింది. ఇది గతేడాది కంటే దాదాపు 0.5 మిలియన్ మెట్రిక్ టన్నులు తక్కువ. 2016-17 నుంచి ఇదే అతి తక్కువ కావటం గమనార్హం.

పప్పుల ద్రవ్యోల్బణం నవంబర్‌లో 20.23 శాతానికి చేరుకున్నది. ఇది ఈ ఏడాది అక్టోబర్‌లో 18.79 శాతంగా ఉన్నది. గతేడాది ఖరీఫ్ సీజన్‌లో పప్పుల ఉత్పత్తి తగ్గటంతో ఈ ఏడాది జనవరి నుంచి ధరలు ఆల్‌టైమ్ గరిష్ట స్థాయికి చేరుకున్నాయి.

గవర్నర్‌తో స్టాలిన్ భేటీ

- పెండింగ్ బిల్లులపై చర్చ



చెన్నయ్ : తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తన క్యాబినెట్ సహచరులతో కలిసి రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవితో సమావేశమయ్యారు. అపరిష్క్రుత అంశాలను పరిష్కరించుకునేందుకు గవర్నర్‌తో భేటీ కావాలని సుప్రీంకోర్టు సలహా ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇరువురి మధ్య సమావేశం జరిగింది. పెండింగ్ బిల్లులు, ఫైళ్లకు ఆమోదం తెలపాల్సిందిగా ముఖ్యమంత్రి మరోసారి గవర్నర్‌ను కోరారు. రాజ్యాంగం ప్రకారం నడుచుకుంటానని గవర్నర్ ఈ సందర్భంగా హామీ ఇచ్చారని రాజ్‌భవన్ వర్గాలు తెలిపాయి. ముఖ్యమంత్రితో తరచూ సమావేశం కావాలని కూడా ఆయన ఆకాంక్షించారు.

కాగా పెండింగులో ఉన్న బిల్లులు, ఫైళ్లపై రాజ్‌భవన్ పెదవి విప్పలేదు. సమావేశం అనంతరం రాష్ట్ర న్యాయ శాఖ మంత్రి ఎస్.రఘుపతి విలేకరులతో మాట్లాడుతూ ఈ భేటీ సుహృద్భావ వాతావరణంలో జరిగిందని చెప్పారు. అయితే దీని ఫలితం న్యాయస్థానంలోనే తెలుస్తుందని అన్నారు. పెండింగ్ బిల్లులు, ఫైళ్ల వివరాలతో గవర్నర్‌కు స్టాలిన్ ఓ లేఖను అందించారు. రాజ్యాంగ పదవులపై తనకు అపార గౌరవం ఉన్నదని అందులో తెలిపారు. ప్రజలు, ప్రభుత్వ పరిపాలన ప్రయోజనాలను ద్రుష్టిలో పెట్టుకొని సమస్యలను త్వరగా పరిష్కరించాలని కోరారు. ఇద్దరు మాజీ మంత్రులను ప్రాసిక్యూట్ చేసేందుకు అనుమతించాల్సిందిగా తాము చేసిన అభ్యర్థన రాజ్‌భవన్‌లో పదిహేను నెలలుగా పెండింగులో ఉన్నదని గుర్తు చేశారు. రాష్ట్ర శాసనసభ తిరిగి ఆమోదించిన పది బిల్లులను గవర్నర్ రాష్ట్రపతి పరిశీలనకు పంపారని రఘుపతి చెప్పారు.



ఐఏఎస్ అధికారులు నిర్వహించిన నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు



మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట కార్పొరేషన్ నాదర్‌గుల్‌లో పలుచోట్ల జరిగిన అయ్యప్ప స్వామి మహా పడిపూజ మహోత్సవం, ఇరుముడి కార్యక్రమానికి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, చేవెళ్ల పార్లమెంట్, మహేశ్వరం నియోజకవర్గం బీజేపీ ఇంచార్జి అందెల శ్రీరాములు యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన గురుస్వాముల ఆశీస్సులు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - బడంగ్‌పేట్

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

7

ఎల్బీనగర్ -మహేశ్వరం- చార్మినార్

సోమవారం | జనవరి 01, 2024 | www.navatelangana.com

పొద్దెక్కినా

తొలగని మంచు



ఎల్బీనగర్ నియోజకవర్గం చంపాపేట్ డివిజన్ పరిధిలోని మంద మల్లమ్మ చౌరస్తా ఆలయం వద్ద పొద్దెక్కినా పొగమంచు తొలగిపోలేదు. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో వాహన దారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

నవతెలంగాణ - సంతోష్ నగర్

ఎల్బీనగర్ ప్రజలకు సుధీర్ రెడ్డి శుభాకాంక్షలు



నవతెలంగాణ - ఎల్బీనగర్

ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలోని ప్రజలందరికీ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు ఆదివారం సుధీర్ రెడ్డి మాట్లాడుతూ 2024 ఈ కొత్త సంవత్సరం ఎల్బీనగర్ ప్రజలందరూ ఆయు, ఆరోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని కోరారు. ఎలాంటి కోపతాపాలకు పోకుండా శాంతియుతంగా ప్రేమను పంచుకోవాలని సూచించారు. అలాగే రాబోయే రోజుల్లో ఎల్బీనగర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తానని, దీనికి అందరూ సహకరించాలని కోరారు. ఎల్బీనగర్ అభివృద్ధి కోసం కట్టుబడి ఉన్నానని అన్నారు. నియోజక వర్గంలో మిగిలి పోయిన పనులను పరిష్క రించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయడం జరిగిందని తెలిపారు. అలాగే రాబోయే రోజుల్లో నాగోల్ బండ్లగూడ నందు ట్రా ఫిక్ సమస్యల పరిష్కారం కోసం నూతన ఫ్లై ఓవర్, బీఎన్‌రెడ్డి నగర్ తెలంగాణ చౌరస్తా వద్ద రోడ్డు వెడల్పు పనులతో పాటు చిన్న చిన్న మార్పులు, సరూర్ నగర్ పోస్ట్ ఆఫీస్ మరియు గాంధీ బొమ్మ వద్ద ట్రాఫిక్ నియంత్రణ పనులు, కొత్తపేట ఒమ్ని హాస్పిటల్ నుంచి కొత్తపేట గ్రామానికి పోయే రోడ్డు వద్ద ట్రాఫిక్ నియ ంత్రణ, వనస్థలిపురం రైతు బజార్ వద్ద ట్రాఫిక్ నియ ంత్రణ మీద తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

పాజిటివ్ షీట్ ఓపెన్ చేస్తాం : సీపీ సుధీర్ బాబు



నవతెలంగాణ-హయత్ నగర్

నేరప్రవృత్తిని వీడే వారి మీద పాజిటివ్ షీట్ ఓపెన్ చేస్తామని రాచకొండ సీపీ సుధీర్ బాబు అన్నారు. భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని నేరచరిత్రగల రౌడీ షీటర్లలో మార్పు కోసం ఎల్బీనగర్‌లో ఉన్న సీపీ క్యాంప్ కార్యాలయంలో ఆదివారం రాచకొండ పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో నేరాలకు పాల్పడిన వారు నేరాలను వీడి ప్రస్తుత సమాజంతో నవజీవనాన్ని గడుపుతూ హుందాగా జీవించాల్సిన అవసరం ఉందని చెప్పారు. నేరస్తులు తొందరపాటులో నేరాలు చేసినా దాని వలన వారి కుటుంబ సభ్యులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని మార్పు తెచ్చుకోవాలని కౌన్సిలింగ్‌కు హాజరైన రౌడీ షీటర్స్‌కు సూచించారు. రౌడీ షీటర్ అనే ఓ పదం తమ బిడ్డల భవిష్యత్ కూడా నాశనం చేస్తుందని గుర్తు చేశారు. నేర ప్రవృత్తిని మార్చుకోవడానికి అవకాశం ఇస్తున్నామని, మార్పు రాకపోతే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. రౌడీ షీటర్ ఉన్న ప్రతీ ఒక్కరిపై ప్రత్యేక బృందాల ద్వారా ప్రత్యేక నిఘా ఉంటుందని, చట్ట వ్యతిరేక పనులు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. భూ కబ్జాలు, ప్రజలను భయపెట్టడం, ఆస్తుల ధ్వంసం వంటి చట్ట విరుద్ధ పనులకు పాల్పడే వారిపై ఉక్కు పాదం మోపుతామని హెచ్చరించారు. మార్పు కోసం ప్రయత్నించే వారికి సమాజ సేవ చేసే అవకాశం కూడా కల్పిస్తామని, పోలీసులు రౌడీ షీటర్ల నుండి కోరుకునేది మార్పు మాత్రమే అని అన్నారు. మీ చుట్టు జరిగే నేరాలపై సమాచారం అందించి మాకు సహకరించే వారికి, మార్పు వచ్చిన వారికి పాజిటివ్ షీట్ ఓపెన్ చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్గిరి డీసీపీ జానకి ధారావత్, యాదద్రి డీసీపీ రాజేష్ చంద్ర, ఎల్బీనగర్ జోన్ డీసీపీ సాయిశ్రీ, ఎస్ఓటి డీసీపీ -1 గిరిధర్ రావుల, మహేశ్వరం డీసీపీ శ్రీనివాస్, ఎస్ఓటి డీసీపీ మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

న్యూ ఇయర్‌లో డ్రగ్స్ వాడే వారిపై నిఘా..

సంతోషకరమైన వాతావరణంలో న్యూ ఇయర్ సెలబ్రేషన్ జరుపుకోవాలని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు సూచించారు. మొదటి రోజున నేరస్థునిగా మిగిలిపోకండని వెల్లడించారు. రాచకొండ కమిషనరేట్‌లలో 7 పబ్బులు ఉన్నాయన్నారు. నాగోల్, కామినేని, సాగర్ రింగ్ రోడ్డులలో ఉన్న ఫ్లైఓవర్లను రాత్రి పది గంటల నుండి ఉదయం 6 గంటల వరకు మూసి వేయడం జరుగుతుందన్నారు. రాత్రి ఒంటి గంట వరకు పర్మిషన్ ఇచ్చిమో దానికి అనుగుణంగా సెలబ్రేషన్స్ జరుపుకోవాలని సూచించారు. రాత్రి నుండి సెలబ్రేషన్ జరుపుకునే వాళ్ళు, డ్రగ్స్ సంబంధిత వాడకాలపై ప్రత్యేక నిఘా ఉంటుందని, దీనికి సంబంధించి ప్రత్యేక టీంను కేటాయించినట్లు పేర్కొన్నారు. వారికి ప్రత్యేక పరికరాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఓఆర్ఆర్ లను రాత్రి 10 నుండి ఉదయం 6 గంటల వరకు మూసి వేయడం జరుగుతుందని, ఓఆర్ఆర్ పై అత్యవసరమైన వారికి మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. ఫామ్ హౌస్‌లను కూడా పూర్తిగా చెక్ చేయడం జరుగుతుందన్నారు.

'మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడుదాం'



నవతెలంగాణ - ఎల్బీనగర్

మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడుదాం అని మలక్‌పేట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి షేక్ అక్బర్ పిలుపునిచ్చారు. ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో మలక్‌పేట్ నియోజకవర్గంలో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రారంభించిన ప్రచారానికి సంబంధించిన కరపత్రాలను ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా షేక్ అక్బర్ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన సమాజస్థాపనే ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రయత్నిస్తున్నారని, ఆయన ఆశయాలకు తగ్గట్టుగా ఎన్ఎస్‌యూఐ, యువజన కాంగ్రెస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలందరు పనిచేస్తున్నారని అన్నారు. ఈ కొత్త సంవత్సరం నుంచి డ్రగ్స్‌కు వ్యతిరేకంగా అందరం కలిసి పనిచేద్దామన్నారు. మలక్‌పేట్ నియోజకవర్గంలో యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని కోరారు.

మాదక ద్రవ్యాలపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదంతో అణిచివేస్తుందని, డ్రగ్స్‌పై జరిగే యుద్ధంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పోరాడుతూ, యువతలో అవగాహన తెచ్చేందుకు పోలీసులు, స్వచ్ఛంద సంస్థలతో కలిసి పనిచేస్తూ సమాజం నుంచి డ్రగ్స్‌ను తరిమికొడుదామన్నారు. మాదక ద్రవ్యాలు వ్యక్తులను, కుటుంబాలను, సమాజాన్ని నాశనం చేస్తాయని, ప్రతి ఒక్కరూ మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ నాయకులు సోయల్, యూనస్, ఇందుర్తి, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ- సంతోష్ నగర్



మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణను ఆదివారం సంతోష్ నగర్ డివిజన్ పరిధిలోని బాప్టిస్ట్ చర్చి సంతోష్ నగర్ పాస్టర్ రేవ్ కే. వెంకటేష్ పాల్, అధ్యక్షులు వి. భాస్కర్, వైస్ ప్రెసిడెంట్ జి.ఐ. ప్రేమ్ సాగర్, సెక్రెటరీ కవ్వంపల్లి ప్రకాష్, అసిస్టెంట్ సెక్రటరీ కనుమూరి యోన, ట్రెజరర్ జన్ను ప్రవీణ్ రాజ్, ఏడి ఫ్రైజ్ ఫండ్ చైర్మన్ ఆనంద్ వరగాని, చీఫ్ డెక్కన్ చిన్నం పోచయ్య, ఎగ్జిక్యూటివ్ సభ్యులు ఫౌండర్ మెంబర్ కోదూరి ప్రసాద్, ఉమెన్స్ సెక్రటరీ ఏ వీణ కృష్ణారావులు మర్యాదపూర్వకంగా కలిశారు.

బ్రిడ్జి నిర్మాణంపై కమిషనర్‌కు ఫిర్యాదు



నవతెలంగాణ - సంతోష్ నగర్

సైదాబాద్‌లో కొనసాగుతున్న ఎస్ఆర్డీపీ బ్రిడ్జి నిర్మాణ పనుల అవకతవలపై విచారణ జరిపించాలని కోరుతూ బీజేపీ నాయకులు జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్‌కు ఆదివారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బహుళ అంతస్తుల భవనాన్ని కాపాడేందుకు బ్రిడ్జి నిర్మాణ ప్లాన్‌ను హనుమాన్ దేవాయంపై నుంచి వెళ్లే విధంగా మార్చారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్ఆర్డీపీ నిధులతో చేపట్టిన స్టీల్ బ్రిడ్జి నిర్మాణ పనులు నిలిపి వేయాలని, సైదాబాద్‌లో పర్యటించి, పూర్తి నివేదిక ఇవ్వాలని ప్రాజెక్ట్ చీఫ్ ఇంజినీరుకు గ్రేటర్ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. ఫిర్యాదు చేసిన వారిలో మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ చందర్జీ, కుర్మగూడ మాజీ కార్పొరేటర్ కె.సహదేవా యాదవ్, కొత్తకాపు రవీందర్ రెడ్డి, వినయ్కొశోర్, శ్రీకాంత్ రెడ్డి, మహేశ్, శ్రీనాథ్, వినోద్ ఉన్నారు.

ప్రతినిత్యం అందరికీ అందుబాటులో ఉంటా



- ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

నవతెలంగాణ - చైతన్యపురి

తనపై నమ్మకం ఉంచి భారీ మెజార్టీతో గెలిపించిన మహేశ్వరం నియోజకవర్గ ప్రజలకు ప్రతినిత్యం అందుబాటులో ఉంటానని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. సరూర్ నగర్ డివిజన్‌లోని ఓ ఫంక్షన్ హాల్లో సరూర్నగర్ మాజీ కార్పొరేటర్ పారుపల్లి అనిత దయాకర్ రెడ్డి అధ్యక్షతన ఆదివారం ఏర్పాటు చేసిన ఆత్మీయ అభినందన సభకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో చేసిన అభివృద్ధి పనులే తనకు మెజార్టీ రావడానికి కారణమైందన్నారు. నియోజకవర్గంలో ఎంతో కష్టపడి ఫార్మాసిటీ తీసుకొని వస్తే కాంగ్రెస్ ప్రభుత్వం కారణాలు చూపకుండా రద్దు చేసిందని, వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించే అనేక ప్రాజెక్టులను మహేశ్వరం నియోజకవర్గంలో తీసుకొచ్చానని, ప్రజలు అన్ని గమనిస్తున్నారని అన్నారు. నియోజకవర్గంలో మిగిలిపోయిన పనులను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యకర్తలందరూ ధైర్యంగా ఉండాలని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు ఎగ్గే మల్లేశం, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ అయోచిత్తం శ్రీధర్, నియోజకవర్గ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ, బెర బాల కిషన్, మహేశ్వరం నియోజకవర్గం యూత్ వింగ్ మాజీ అధ్యక్షుడు లోకసాని కొండల్ రెడ్డి, వీరమల్ల రామ నరసింహ గౌడ్, సరూర్నగర్ డివిజన్ ఎన్నికల ఇంచార్జి మురళీధర్ రెడ్డి, డివిజన్ మాజీ అధ్యక్షులు అంకిరెడ్డి పాల్గొన్నారు.

గురు భక్తికి ప్రతిరూపం ఏకలవ్యుడు

నవతెలంగాణ - మీర్ పేట్

గురు భక్తికి ప్రతిరూపం ఏకలవ్యుడు అని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఆదివారం మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చందన చెరువు కట్టపై ఏకలవ్యుడు విగ్రహాన్ని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచ చరిత్రలో అనేక పోరాటాలు, ఉద్యమాలు, త్యాగాలకు నిలయం తెలంగాణ అని పేర్కొన్నారు. అలాంటి పోరాటయోధులు, మహనీయులను గుర్తించి, ప్రజల గుండెల్లో చిరకాలం నిలిచి పోయేలా మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మహనీయుల ఆశయాలను, ఆదర్శాలను ప్రజలు గుర్తుంచుకొని ఆచరించాలని కోరారు. భవిష్యత్ తరాలకు మహనీయుల చరిత్ర తెలియజేసేలా కుల, మతాలకు, రాజకీయ పార్టీలకు అతీతంగా పోరాట యోధుల విగ్రహాలను ఏర్పాటు చేస్తూ బహుజన వాదాన్ని బలపరుస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేశం, మేయర్ దుర్గా దీప్ లాల్ చౌహన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్ రెడ్డి, ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్ రెడ్డి, ఎరుకల సంఘం నాయకులు శ్రీనివాస్, సత్యనారాయణ, రఘు, నాగయ్య, సంఘం నాయకులు, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు అర్కల కామేష్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



'స్వయం ఉపాధితో యువత రాణించాలి'



నవతెలంగాణ-సంతోష్ నగర్

స్వయం ఉపాధి రంగాలను ఎంచుకొని యువత రాణించాలని ఎంఐఎం హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ అన్నారు. హైదరాబాద్ చంద్రాయన్ గుట్ట డివిజన్ ఆవరణలో రిలయన్స్ మార్ట్ పరిధిలోని ప్రధాన రహదారిపై నూతనంగా ఏర్పాటు చేసిన ఫుడ్ వే, రెస్టారెంట్ బేకరీ, స్వీట్స్ అండ్ అరబిక్ మండిను ఎంపీ, నిర్వాకులు మహమ్మద్ ఖలీల్, రహిమాన్ ఖలీల్, మహమ్మద్ సాహెబ్ లు ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన అన్ని రకాల భోజన బండరాలు, స్వీట్స్ బర్గర్ పిజ్జా, ఆల్ స్నాక్స్ అండ్ కూల్ కేక్‌లను ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన వెరైటీలను అందించి, ప్రజల మన్ననలు పొందాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, నాయకులు, సిబ్బందులు తదితరులు పాల్గొన్నారు.

యువకుడి మృతికి కారణమైన వ్యక్తి అరెస్టు

నవతెలంగాణ - సంతోష్ నగర్

వాహనంతో ఢీకొట్టి ఓ యువకుడు మృతికి కారణమైన వ్యక్తిని చాదర్ ఘాట్ పోలీసులు అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ ప్రకాశ్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..పల్టన్ ప్రాంతానికి చెందిన శ్రవణ్ కుమార్ డిసెంబర్ 6న మలక్ పేట యశోద ఆసుపత్రి వద్ద రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 9వ తేదీన మృతి చెందిన సంగతి తెలిసిందే. సీసీ ఫుటేజీ ఆధారంగా ఆ యువకుడి మృతికి కారణమైన వ్యక్తిని గుర్తించారు. నాగోల్ బండ్లగూడకు చెందిన సూర్యప్రకాశ్ రెడ్డి తన స్నేహితులతో కలిసి కారులో వెళ్తూ యశోద ఆసుపత్రి వద్ద రోడ్డు దాటుతున్న శ్రవణ్‌ను ఢీ కొట్టినట్లు గుర్తించారు. అనంతరం కారులో మదీనాకు వెళ్లి అక్కడ స్నేహితులతో కలిసి ఓ హెూటల్లో భోజనం చేశారు. అక్కడ నుంచి చాదర్ ఘాట్ మీదుగా గోల్నాకు బ్రిడ్జి నుంచి మూసారాంబాగ్ మీదుగా బండ్లగూడకు వెళ్లిపోయినట్లు పోలీ సుల దర్యాప్తులో తేలింది. ప్రమాదంలో కారు అద్దాలు పగలడంతోపాటు ముందు భాగం దెబ్బతిన్నది. మరుసటి రోజు కారుకు మరమ్మతులు చేయించాడు. రాత్రివేళలో నంబర్ ప్లేట్ సరిగా కనిపించకపోవడంతో వాహనాన్ని గుర్తించడం పోలీసులకు కష్టమైంది. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ప్రమాదానికి కారణమైన సూర్య ప్రకాశ్ రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు.

'ప్రభుత్వ నిబంధనలు పాటించాలి'



నవతెలంగాణ - సంతోష్ నగర్

సౌత్ ఈస్ట్ జోన్ పరిధిలో దుకాణాల నిర్వహణలో ప్రభుత్వ నిబంధనలు విధిగా పాటించాలని డీసీపీ బిరుదురాజు రోహిత్ రాజు వ్యాపారులకు సూచించారు. సైదాబాద్ పోలీస్ స్టేషన్‌లో మొదటి అంతస్తులో ఉన్న మల్టీపర్పస్ హాల్లో ఆదివారం అదనపు డీసీపీ మనోహర్తో కలిసి వైన్ షాపులు, బార్ అండ్ రెస్టారెంట్లు, హెూటళ్లు ఇతర దుకాణాల యజమానులతో మాట్లాడారు. సీసీ కెమెరాల నిర్వహణ సక్రమంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ట్రాఫిక్ కు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా సాధారణ దినాల్లో కంటే గంట పాటు సమయాన్ని పొడిగించినట్లు తెలిపారు. సైదాబాద్, సంతోష్ నగర్ ఏసీపీ మహమ్మద్ గౌస్, డి.వెంకన్న నాయక్, మహమ్మద్ గౌస్, సైదాబాద్ ఇన్‌స్పెక్టర్ కె.రాఘవేందర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

క్యాలెండర్- 2024 ఆవిష్కరణ



నవతెలంగాణ - చైతన్యపురి

జగిని ఫర్నిచర్ అధినేత జగిని శ్రీనివాస్ ఆధ్వర్యంలో రూపొందించిన 2024 క్యాలెండర్‌ను ధర్మో రక్షతి రక్షిత ట్రస్ట్ శివ స్వామి, ఎల్బీనగర్ బీజేపీ కాంటెస్టెంట్ ఎమ్మెల్యే సామ రంగారెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జగిని ఫర్నిచర్ షాప్ ఆధ్వర్యంలో క్యాలెండర్‌ను రూపొందిస్తామని తెలిపారు.

కొంత సమయాన్ని క్రీడలకు కేటాయించాలి

- హైకోర్టు న్యాయమూర్తి సురేందర్

నవతెలంగాణ- నాగోల్

ప్రతి ఒక్కరూ దినచర్యలో కొంత సమయాన్ని క్రీడలు, వ్యాయామానికి కేటాయిస్తే ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపవచ్చు అని హైకోర్టు న్యాయమూర్తి సురేందర్ అన్నారు. నాగోల్ డివిజన్‌లో న్యూ నాగోల్ లోని ఆర్ త్రీ బ్యాడ్మింటన్ స్టేడియంలో బ్యాడ్మింటన్ టోర్నమెంట్ 20 23 ప్రారంభ కార్యక్రమానికి హైకోర్టు న్యాయమూర్తి సురేందర్ , రాష్ట్ర పర్యాటక అభివృద్ధి చైర్మన్, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యనిర్వాక అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస గుప్తలు హాజరయ్యారు. ఈ టోర్నమెంట్లో 100 మంది బ్యాడ్మింటన్ క్రీడాకారులు పాల్గొన్నారు. 30 ప్లస్, 35 ప్లస్, 40 ప్లస్, 45 ప్లస్, 50 ప్లస్ వయస్సు లిమిట్‌తో క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి సురేందర్ మాట్లాడుతూ బ్యాడ్మింటన్ అనేది ప్రతి ఒక్కరు సులభంగా ఆడే ఆట అని అన్నారు.



తర్వాత ఉప్పల శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ క్రీడలు అనేవి మానసిక ఉల్లాసానికి దోహదపడుతాయన్నారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా వ్యాయామం చేయాలన్నారు. గెలుపు ఓటములు ముఖ్యం కాదని, టోర్నమెంట్లో ఆడడమే ముఖ్యమని క్రీడాకారులు భావించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ త్రీ స్టేడియం నిర్వాహకులు రఘు, రమేష్, రాఘవేందర్, వెంకటేష్ గుప్తా, మోహన్, సాయి రెడ్డి, అడ్వకేట్ జగదీష్, చైతన్యపురి సీఐ, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఘనంగా ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం



నవతెలంగాణ-తుర్కయంజాల్

భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి కమిటీ ఆధ్వర్యంలో ఎస్ఎఫ్ఐ 54వ ఆవిర్భావ దినోత్సవాన్ని రాగన్నగూడలోని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయం ఎదుట ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి. శంకర్, కె.వై ప్రణయ్ మాట్లాడుతూ కేరళ రాష్ట్రంలోని తిరువనంతపురం అనే పట్టణంలో డిసెంబర్ 30, 31న చదువుతూ పోరాడు చదువు కై పోరాడు అనే నినాదం తీసుకొని నాటి నుంచి నేటి వరకూ విద్యార్థుల సమస్యలపైన అలుపెరుగని పోరాటం చేస్తున్నది ఎస్ఎఫ్ఐ అని గుర్తు చేశారు. బీజేపీ తీసుకొచ్చినటువంటి నూతన జాతీయ విద్యా విధానం.. పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులను ఉన్నత చదువులకు దూరం చేయటంలో భాగమే అని ఆరోపించారు. ఈ నూతన జాతీయ విద్యా విధానాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. జనవరి 12న ఛలో పార్లమెంట్ కార్యక్రమం ఉందన్నారు. రాష్ట్రంలో విద్యార్థులకు పెండింగ్ లో ఉన్న ఉపకార వేతనాలు 7,792 కోట్ల రూపాయిలు నూతన ప్రభుత్వం విడుదల చేయాలని కోరారు. విద్యారంగా సమస్యలపై అలుపెరుగనిపోరాటం నిర్వహిస్తున్న ఏకైక విద్యార్థి సంఘం ఎస్ఎఫ్ఐ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు చరణ్, జిల్లా సహాయకార్యదర్శి శివ, జిల్లా కమిటీ సభ్యులు విప్లవ, శివ, స్టాలిన్, అరుణ్, వేణు, నాయకులు వంశీ, సషు, విద్యార్థులు పాల్గొన్నారు.

'క్రమశిక్షణతో కూడిన విద్య ఎంతో అవసరం'

నవతెలంగాణ - చైతన్యపురి

విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్య ఎంతో అవసరమని కల్నల్ లంక శ్రీనివాస్ అన్నారు. భాష్యం పాఠశాల దిల్‌సుఖ్‌నగర్ బ్రాంచ్ 11వ వార్షికోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత దేశానికి తమ వంతు సేవ చేయాలన్నారు. విద్యార్థులు చదువుతోపాటు సంస్కృతి కార్యక్రమాల్లో కూడా తమ ప్రతిభను కనబరిచాలన్నారు. తర్వాత జోనల్ ఇంచార్జి అంకమ్మరావు మాట్లాడుతూ భాష్యం పాఠశాల విద్యార్థుల్లోని కళలను ఎప్పటికప్పుడు ప్రోత్సహిస్తుందని అన్నారు. అనంతరం మెజీషియన్ రామ్ అఖిల్ విన్యాసాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో భాష్యం పాఠశాల ప్రిన్సిపాల్ పల్లవిరెడ్డి, లిటిల్ చాంప్స్ ప్రిన్సిపల్ భానుమతి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా సర్వేపల్లి రవికుమార్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-కాప్రా

గ్రేటర్ హైదరాబాద్ వైసీపీ నాయకుడు సర్వేపల్లి రవికుమార్ తన జన్మదిన సందర్భంగా ఆదివారం అభిమానుల మధ్య కేక్ కట్ చేశారు. అంతకుముందు ఉదయం కాప్రా చెన్నకేశవ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనాధాశ్రమంలో పేదలకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కేపీరావు, సుడిగు మహేందర్‌రెడ్డి, పవన్, ప్రవీణ్, బసవారెడ్డి, అయ్యప్ప, కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

శ్రీ బేకరిని ప్రారంభించిన సర్పంచ్ బాబు యాదవ్



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మండల పరిధిలోని పూడూరు గ్రామ చౌరస్తా వద్ద అన్నం వెంకటేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీ బేకరిని సర్పంచ్ బాబు యాదవ్ ఆదివారం ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ బాబు యాదవ్ నిర్వాహకులతో కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అయన మాట్లాడుతూ.. యువత స్వయం ఉపాధిని కల్పించుకొని భవిష్యత్తులో ఉన్నతగా రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు శ్రీకాంత్ ముదిరాజ్, మాజీ వార్డు సభ్యుడు కోలా వెంకటేష్, మాజీ సొసైటీ డైరెక్టర్ శేఖర్ రెడ్డి, మండల శంకర్ గౌడ్, సిద్దిక్ తదితరులు పాల్గొన్నారు.

డ్రయినేజీ సమస్యలను పరిష్కరించాలని వినతి



నవతెలంగాణ-కాప్రా

కాప్రా డివిజన్ పరిధిలోని నవోదయ నగర్ కాలనీలో తాగునీరు, అండర్ గ్రౌండ్ డ్రయినేజీ సమస్యలను పరిష్కరించాలని కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కత్తుల రాజకుమార్ ఆధ్వర్యంలో వాటర్ సెవరేజ్ బోర్డు ఏఈ వేణుగోపాల్‌కు వినతి పత్రం అందజేశారు. కాలనీవాసులు ఆదివారం ఏఈని వారి ఇంటి వద్ద కలిసి సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా ఈఈ స్పందిస్తూ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నవోదయ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు కత్తుల రాజకుమార్, ఉపాధ్యక్షులు చిట్యాల నాగరాజు, ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి లింగం, ప్రచార కార్యదర్శి చింతల అనీల్ తదితరులున్నారు.

నూతన సంవత్సర వేడుకలు ప్రశాంతంగా జరపాలి



- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

నవతెలంగాణ-కాప్రా

ప్రజలందరూ నూతన సంవత్సర వేడుకలు సంతోషంగా జరుపుకోవాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం ఉప్పల్ నియోజకవర్గం పరిధిలోని కాప్రా శ్రీనివాస్ ఆఫీసర్స్ కాలనీ, చర్లపల్లి శ్రీసాయి కృష్ణ ఎన్‌క్లేవ్, శివ సాయి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్, పద్మశాలీ సంఘం హెచ్‌బీ కాలనీ, బాబు జగ్జీవన్ రావు భవన్, గౌడ సంఘం మల్లాపూర్‌లో ఏర్పాటు చేసిన నూతన సంవత్సర క్యాలెండర్, సన్మాన కార్యక్రమానికి బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పన్నాల దేవేందర్ రెడ్డి, ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్లు కొత్త రామారావు, శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఘనంగా మహనీయుల జ్ఞానమాల కార్యక్రమం



నవతెలంగాణ-కాప్రా

జమ్మిగడ్డ బీజేఆర్ కాలనీలో జ్ఞానమాల టీం ఆధ్వర్యంలో చేపట్టిన మహనీయుల జ్ఞానమాల కార్యక్రమం ఆదివారం 83వ వారానికి చేరింది. ఈ సందర్భంగా మహాత్మ జ్యోతిరావు ఫూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ విగ్రహాలకు జ్ఞానమాల టీం ఆర్గనైజర్ తాడూరి గగన్ కుమార్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేఆర్, భగత్ నగర్ కాలనీల అధ్యక్షులు రహీం, శ్రీనివాస్, జ్ఞానమాల టీం సభ్యులు నరసింహ చారి, దయానంద్, రవి నాయక్, శేఖర్, నాగేష్ , మెకానిక్ కొండల్, శివసేన రాజు, రంగాచారి, పంతులు, రాజు, వెంకన్న, పట్లే వెంకస్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీల అభివృద్ధిలో సంక్షేమ సంఘాల పాత్ర కీలకం



నవతెలంగాణ-కాప్రా

కాలనీల అభివృద్ధిలో సంక్షేమ సంఘాల పాత్ర కీలకమైనదని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం కాప్రా పరిధిలోని శ్రీ శ్రీనివాస ఆఫీసర్స్ కాలనీ అసోసియేషన్ క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీల్లోని సమస్యలు తన దృష్టికి తెస్తే వెంటనే పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. కాలనీ సంక్షేమ సంఘాలు సేవా ధృక్పథంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, బీఆర్ఎస్ నాయకులు నవీన్ గౌడ్, శ్రీ శ్రీనివాస కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, అసోసియేషన్ నాయకులు ఠాగూర్, కృష్ణారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శంకర్రావు, ఇంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్రతో శబరిమలకు వెళ్లిన శ్రీనివాస్‌కు సన్మానం



నవతెలంగాణ-కాప్రా

కుషాయిగూడ నుంచి కేరళ రాష్ట్రంలోని శబరిమల క్షేత్రానికి కాలినడకగా మహా పాదయాత్రతో వెళ్లి వచ్చిన చర్లపల్లి డివిజన్ కుషాయిగూడ సోనియా గాంధీ నగర్ కాలనీ అధ్యక్షుడు శ్రీనివాస్ (వెల్డింగ్ శ్రీను)ను అయ్యప్ప స్వాములు ఘనంగా సన్మానించారు. ఆదివారం కమలానగర్‌లోని అయ్యప్ప స్వామి దేవాలయం వద్ద మాలధారణలో ఉన్న పలువురు అయ్యప్ప స్వాములు శాలువాతో సత్కరించారు. నవంబర్ 18వ తేదీన సికింద్రాబాద్ గణేష్ టెంపుల్ నుంచి నడకను ప్రారంభించి 38 రోజులు నడచి శబరిమలై చేరుకున్నట్లు శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా పలువురు స్వాములు అయ్యప్ప నామస్మరణలు చేస్తూ భజనలు చేశారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు సంతోష్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం

- టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేష్ యాదవ్
- కాంగ్రెస్‌లో భారీ చేరికలు



నవతెలంగాణ-కీసర

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజల వద్దకు పాలన వచ్చిందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. ఆదివారం దమ్మాయిగూడ పురపాలక సంఘం పరిధిలోని రాజీవ్ గృహకల్ప కాలనీలోని మున్సిపాలిటీ బీజేపీ పార్టీ ప్రధాన కార్యదర్శి గుజ్జుక నర్మద పరుశురాం, బీఆర్ఎస్ పట్టణ ముస్లిం విభాగం ప్రధాన కార్యదర్శి మమ్మద్ యూనీస్, మాల సంఘం అధ్యక్షుడు మోత రాజేంద్రప్రసాద్, టీడీపీ నాయకులు సలగాల కనకరాజుతో పాటు 100 మంది బీఆర్ఎస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు రామరావు, మహిళ విభాగం ప్రధాన కార్యదర్శి ఈగ శ్వేత రాజు ఆధ్వర్యంలో వజ్రేష్ యాదవ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారినీ కండువాలు కప్పి సాధారణంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ ఇన్నాళ్ల రాష్ట్రంలో గడీల పాలన, దోపిడీ పాలన సాగిందని ఆరోపించారు. నాలుగున్నర కోట్ల ప్రజలు కోరుకున్న ప్రజా ప్రభుత్వం తెలంగాణలో వచ్చిందన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీదేపై చేయి అవుతుందని అన్నారు. నాయకులు, కార్యకర్తలు చేయి చేయి కలిపి కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీ పథకాలను వంద రోజుల్లో అమలు చేస్తుందని చెప్పారు. అభయహస్తంలోని ఆరు గ్యారంటీ పథకాలకు ప్రజలతో దరఖాస్తులు ఇప్పించా లని కాంగ్రెస్ కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గోగుల సరిత, కౌన్సిలర్ వరగంటి వెంకటేష్, దమ్మాయిగూడ కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి ఏనుగు సంజీవరెడ్డి, దమ్మాయిగూడ పట్టణ కాంగ్రెస్ పార్టీ మహిళా ప్రధాన కార్యదర్శి ఈగ శ్వేతా రాజు, పట్టణ యూత్ అధ్యక్షుడు సుమేష్, నాయకులు ప్రసాద్ గౌడ్, ఈగ రాజు ముదిరాజు, పోలు సంతోష్ గౌడ్,సాయి గౌడు, దిలీప్, శ్రీనివాస్ నాయక్, సిరిసిల్ల శ్రీనివాస్, మధుకర్ రెడ్డి, టీడీపీ పార్టీ నాయకులు కృష్ణారావు, శ్రీనివాస్ గౌడ్, మాల సంఘం సభ్యులు సాయిబాబు, నాగరాజు, పాల్గొన్నారు.

కొత్త ఏడాదిలో లక్ష్యాలను ఏర్పర్చుకుని వాటి సాధనకు కృషి చేయాలి

- జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్



నవతెలంగాణ-సిటీబ్యూరో

నూతన సంవత్సరంలో జిల్లా ప్రజలు అన్ని రంగాల్లో రాణించి సుఖసంతోషాలతో ఉండాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆకాంక్షించారు. ఈ ఏడాదిలో ప్రతి ఒక్కరూ తమకంటూ ఒక లక్ష్యాన్ని ఏర్పర్చుకుని వాటిని సాధించే దిశగా ముందుకు సాగాలన్నారు. ఆంగ్ల నూతన సంవత్సరం 2024లో ప్రజలు కొత్త ఆలోచనలు, సరికొత్త నిర్ణయాలు, ఆశలు, ఆశయాలతో ముందుకెళ్లాలని కోరారు. ప్రకృతి అందాన్ని, సున్నితమైన భావాలను, మనస్సును హత్తుకునేలా ప్రతినిత్యం.. జీవితాంతం ఆస్వాదిస్తూ ఉండాలని కలెక్టర్ తెలిపారు. నూతన సంవత్సరం ప్రతి ఒక్కరి జీవితానికి వారి శ్రేయస్సుతో పాటు ఆనందాన్ని తీసుకువస్తుందని ఆకాంక్షిస్తూ, జిల్లా ప్రజలకు 2024 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. గతేడాది కంటే ఈ ఏడాది మరింత ఉన్నత ఆశయాలను ఏర్పర్చుకుని వాటిని సాధించే దిశగా కృషి చేయాలని తెలిపారు. ప్రభుత్వం సూచించిన నిబంధనలను పాటిస్తూ కొత్త సంవత్సర వేడుకలను సంయమనంతో జరుపుకోవాలని కోరారు. జిల్లా ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని అభిలాషించారు. కొత్త ఏడాదిలో ఎల్లవేళలా అందరికీ మంచి జరగాలని కలెక్టర్ గౌతమ్ ఆకాంక్షించారు.

కోఠి బస్ టర్మినల్ స్టేషన్ మేనేజర్‌గా నర్సయ్య గౌడ్



నవతెలంగాణ -సుల్తాన్‌బజార్

టీఎస్ఆర్టీసీ ముషీరాబాద్-2 డిపోలో సూపర్వైజర్‌గా విధులు నిర్వహిస్తున్న సీస నర్సయ్య గౌడ్‌కు టీఐ-3గా పదోన్నతి లభించింది. నర్సయ్య గౌడ్ కోఠి బస్ టెర్మినల్ స్టేషన్ మేనేజర్ పదవీ బాధ్యతలను స్వీకరించారు. డిపో అధికారులు, కండక్టర్లు, డ్రైవర్లు, కార్మికులు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నర్సయ్య గౌడ్ మాట్లాడుతూ.. .1988లో మెహిదీపట్నం డిపోలో కండక్టర్‌గా చేరి, 25 ఏండ్లు కండక్టర్‌గా కొనసాగిన అనంతరం 2013లో సూపర్వైజర్‌గా పదోన్నతి పొందినట్లు తెలిపారు. ముషీరాబాద్ 2 డిపోలో సూపర్వైజర్‌గా విధులలో చేరిన అనంతరం కోఠి బస్ టర్మినల్‌లో కంట్రోలర్‌గా ఐదేండ్లుగా ప్రయాణి కులకు సేవలందిస్తున్న నేపథ్యంలో టీఐ - 3 ఆఫీసర్‌గా పదోన్నతి లభించడం అభినందనీయమన్నారు. టీఐ- 3గా పదోన్నతి లభించినం దున కోఠి బస్ టర్మినల్ స్టేషన్ మేనేజర్ పదవీ బాధ్యతలను స్వీకరించ డం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ కిషన్‌రావు, సీఐ కల్యాణిలకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు

- మేయర్ మేకల కావ్య



నవతెలంగాణ-జవహర్‌నగర్

ఆంగ్ల నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని జవహర్ నగర్ ప్రజలకు మేయర్ మేకల కావ్య శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఏడాదిలో ప్రజలకు ఆయురారోగ్యాలు, సంతోషం, సంపదలు ఒనగూరాలని ఆకాంక్షిం చారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తూ సబ్బండ వర్గాల ప్రగతికి ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. 2023లో కష్టాలను అధిగమిస్తూ, అకుంఠిత దీక్షతో సుపరిపాలన కొనసాగిస్తామని, ప్రజా సంక్షేమే ధ్యేయంగా ముందుకు సాగుతామని పేర్కొన్నారు. కొత్త ఏడాదిలో ప్రజల కోరికలు నెరవేరాలని ఆకాంక్షించారు.

తూంకుంట ప్రజలకు కొత్త ఏడాది శుభాకాంక్షలు

- మున్సిపల్ చైర్మెన్ రాజేశ్వర్ రావు



నవతెలంగాణ-శామీర్‌పేట

ఆంగ్ల నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని తూంకుంట మున్సిపాలిటీ చైర్మెన్ కారంగుల రాజేశ్వర్‌రావు తూంకుంట పట్టణ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. 2024లో ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. ఈ సంవత్సరంలో ప్రజలకు మంచి జరగాలని కోరారు.

సాయి గీత ఆశ్రమంలో మహా యజ్ఞం



నవతెలంగాణ-మేడ్చల్

గుండ్లపోచంపల్లి మున్సిపల్ పరిధిలోని కండ్లకోయ సాయి గీతా ఆశ్రమంలో ఆదివారం సర్వదోష నివారణ మహోత్సవం సద్గురు శ్రీశ్రీ శ్రీ సాయికుమార్ బాబాజీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తుల చేత లోక కల్యాణార్థం వివిధ ప్రార్థనలు చేయించి సామూహికంగా కొబ్బరికాయలు కొట్టించారు. అనంతరం హారతినిచ్చి కార్యక్రమాన్ని ముగించారు. అంతకుముందు ఆశ్రమ ఉత్తరాధికారి కీర్తిమా మాట్లాడుతూ.. 2024 నూతన సంవత్సరంతో సాయి గీత ఆశ్రమం ఏర్పాటు చేసి 60 సంవత్సరాలు నిండుతాయని వెల్లడించారు. ఈ సందర్భంగా జనవరి నుంచి డిసెంబర్ వరకు ప్రతీ నెల ఒక్క రోజు సామాజిక దైవ కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు ఎదురుకాకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తుల సౌకర్యార్థం సికింద్రాబాద్ నుంచి సాయి గీతా ఆశ్రమం వరకు, మేడ్చల్ ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్, హనుమాన్ దీక్ష పీఠాధిపతి శ్రీ దుర్గా ప్రసాద్, మాజీ జిల్లా పరిషత్ వైస్ చైర్మెన్ ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎంపీపీ చంద్రశేఖర్ యాదవ్, మాజీ ఎంపీపీ చిన్నంగి వెంకటేష్ ముదిరాజ్, ప్రముఖ యాంకర్ రవి, భక్తులు, ఆశ్రమ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

- కాంగ్రెస్ తూంకుంట మున్సిపల్ అధ్యక్షుడు భీమిడి జైపాల్ రెడ్డి



నవతెలంగాణ-శామీర్‌పేట

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ తూంకుంట మున్సిపల్ అధ్యక్షుడు భీమిడి జైపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం తూంకుంట మున్సిపల్ పరిధిలోని 14వ వార్డు యెలిగలగూడలో ఉషోదయ లేజర్ కంటి ఆస్పత్రి వారి సౌజన్యంతో మోర లక్ష్మీనరసింహ జ్ఞాపకార్థం వారి కుమారుడు మోర దీపక్ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. 150 మందికి కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉషోదయ లేజర్ కంటి ఆస్పత్రి వారు 15 మందికి కంటి ఆపరేషన్లు ఉచితంగా చేశారని తెలిపారు. 75 మందికి ఉచితంగా కంటి అద్దాలను అందజేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సినిమా ఆర్టిస్ట్ ద్వారకేష్, హాస్పిటల్ డాక్టర్ సుమన్, సిబ్బంది పరుశురామ్, విజయ్, పూజశ్రీ, స్థానికులు మోర సత్యనారాయణ, మోర మహేష్, మోర బాలకృష్ణ, వెరీర భాను, వెరీర మల్లేష్, వెరీర దశరథ్, వెరీర నర్సింహ, వెరీర హరిబాబు తదితరులు పాల్గొన్నారు

యాప్రాలో హుక్కా సెంటర్‌పై దాడి .. ఇద్దరు అరెస్టు

నవతెలంగాణ-జవహర్‌నగర్

యాప్రాలో హుక్కా సెంటర్‌పై పోలీసులు దాడి చేసి హుక్కా సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుం ది. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీతారాం తెలిపిన వివరాల ప్రకారం.. యాప్రాలోని శైలిగార్డెన్ ప్రాంతంలో ఎలెవెన్ కేఫ్ బిస్ట్రోలో రహస్యంగా హుక్కా సెంటర్ నిర్వహిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి హుక్కా సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. హుక్కా సెంటర్ యజమానులు దీక్షిత్‌జిడి, శ్రీనివాస్, ప్రమోద్‌లు పరారీలో ఉన్నారు. సూపర్‌వైజర్లు రాజశేఖర్, రమణయ్యలను అరెస్టు చేశారు. మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



మండవ ప్రభాకరరావుకు గౌరవ డాక్టరేట్



- ప్రదానం చేసిన కాన్పూర్ యూనివర్సిటీ
- ఉత్తరప్రదేశ్ గవర్నర్ చేతుల మీదుగా అందజేత

నవతెలంగాణ-సిటీబ్యూరో

నూజివీడు సీడ్స్ లిమిటెడ్ అధినేత మండవ ప్రభాకరరావుకు మరో విశిష్ట గుర్తింపు లభించింది. కాన్పూర్‌లోని చంద్రశేఖర్ ఆజాద్ యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ టెక్నాలజీ ఆయనకు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఉత్తరప్రదేశ్ గవర్నర్, యూనివర్సిటీ ఛాన్సలర్ ఆనందిబెన్ పటేల్ చేతుల మీదుగా ఆయన ఈ డాక్టరేట్‌ను అందుకున్నారు. వ్యవసాయ రంగానికి మండవ ప్రభాకరరావు అందించిన విశిష్ట సేవలు, ఆయన నిబద్ధత, నాయకత్వ లక్షణాలకు గుర్తింపుగా ఈ ప్రతిష్ఠాత్మక డాక్టరేట్‌ను అందించారు. కాగా ప్రభాకరరావు అందించిన సేవలకు గాను పలు జాతీయ, అంతర్జాతీయ అవార్డులు అందాయి. వాటిలో డి.ఎస్.ఐ.ఆర్ 2002 నుంచి బెస్ట్ ఇన్-హౌస్ ఆర్ అండ్ డి నేషనల్ అవార్డు, 2007లో బెస్ట్ విండ్ ఫామ్ అవార్డు, 2008 నుంచి 2015 వరకు బయో-అగ్రి కంపెనీ, అగ్రికల్చర్ లీడర్‌షిప్ అవార్డు 2009, ఇంటర్నేషనల్ సీఈఓ క్లబ్ అవార్డు 2009, ఏబీఎస్‌ఏ 2023 నుంచి జీవన సాఫల్య అవార్డు లాంటివి ఉన్నాయి. ప్రభాకరరావు ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లాకు చెందిన ప్రముఖ వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. ఆయన బెనారస్ హిందూ యూనివర్సిటీకి చెందిన స్కూల్ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్స్ పూర్వ విద్యార్థి. బీఎస్సీ (అగ్రికల్చర్)లో యూనివర్సిటీలో రెండో ర్యాంకు, ఎంఎస్సీ (అగ్రికల్చర్)లో మొదటిర్యాంకు సాధించారు. పోస్టు గ్రాడ్యుయేషన్‌లో స్వర్ణపతకం, మెరిట్ స్కాలర్‌షిప్ సాధించారు. 1973లో తండ్రి స్థాపించిన నూజివీడు సీడ్స్ లిమిటెడ్ (ఎన్ఎస్ఎల్) పగ్గాలను 1982లో చేపట్టారు. అక్కడి నుంచి ఎన్ఎస్ఎల్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్‌ను దినదినాభివృద్ధి చెందించారు. ప్రస్తుతం ఆ సంస్థ నుంచి విత్తనాలు, వస్త్రాలు, మౌలిక సదుపాయాలు, పునరుత్పాదక విద్యుత్తు లాంటి పలు వ్యాపారాలున్నాయి.

నూతన సంవత్సర శుభాకాంక్షలు



- మబ్బు పరశురాం

నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ ప్రభుత్వ అధ్యాపకుల సంఘం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు, దళిత రత్న అవార్డు గ్రహీత మబ్బు పరశురాం ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. గతేడాదికి ముగింపు పలుకుతూ, నూతన సంవత్సరానికి స్వాగతం చెబుతూ, ఈ ఏడాదిలో అందరూ నూతన ఉత్తేజంతో, ఆయురారోగ్యాలతో బాగుండాలని ఆకాంక్షించారు.

ప్రతి ఒక్కరూ విజయం సాధించాలి



- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

నవతెలంగాణ-కూకట్‌పల్లి

2024 నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు నియోజకవర్గ ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరూ కొత్త సంవత్సరంలో తాము తీసుకున్న నిర్ణయాలతో ఉన్నత శిఖరాలకు చేరాలని ఆకాంక్షించారు. విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధమై జీవితంలో మంచి లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు వెళ్లాలని తెలిపారు. తల్లిదండ్రులు కూడా పిల్లలకు సున్నితంగా వివరిస్తూ ఉండాలన్నారు. ఈ కొత్త సంవత్సరంలో ప్రతి ఒక్కరూ కూడా జీవితంలో ముందుకు వెళ్లడానికి తాము నిర్దేశించుకున్న ప్రణాళికతో విజయ తీరాలకు చేరాలని ఆకాంక్షించారు.

రాజీవ్ గృహకల్పలో నూతన నీటి బోరు



- కె.పి.విశాల్ గౌడ్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

130 సుభాష్ నగర్ డివిజన్ పరిధిలోని, రాజీవ్ గృహకల్పలో, వారానికి రెండు రోజులు మాత్రమే మంచినీరు వస్తుంది. అది కూడా ఒక గంట సేపు మాత్రమే వస్తున్నందున తీవ్రమైన నీటి ఎద్దడి ఎదుర్కొంటున్నామని బ్లాక్ నెంబర్ 62,63,65 వాసులు అన్నారు. తమకు నీటి సౌకర్యం కల్పించామని, కాలనీ వాసులు, యువ నేస్తం ఫౌండేషన్స్ వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీ కె.పి. విశాల్ గౌడ్‌ని కోరారు. విశాల్ వెంటనే స్పందించి నీటి కష్టాలను తీర్చడానికి, యువ నేస్తం ఫౌండేషన్స్ ఆధ్వర్యంలో నీటిబోర్‌ను వేయించారు. ఈ యొక్క నీటి బోరును, వారి యొక్క ఆహ్వానం మేరకు ముఖ్యఅతిథిగా యువ నేస్తం ఫౌండేషన్స్ వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీ కె.పి. విశాల్ గౌడ్ విచ్చేసి ప్రారంభించారు. గతంలో రాజీవ్ గృహకల్పలో బ్లాక్ నెంబర్ 64, 71 వాసులు, నీటి ఎద్దడితో అల్లాడు తుండగా, వారి యొక్క విన్నపం మేరకు, వారికి కూడా యువ నేస్తం ఫౌండేషన్స్ ఆధ్వర్యంలో బోర్న్ వేయించారు. వారు ఎదుర్కొంటున్న టువంటి నీటి కష్టాలను తీర్చడం జరిగిందని తెలిపారు. రోడ్డును వేయించమని, మంచినీటి కొరతను తీర్చమని రాజీవ్ గృహకల్ప బ్లాక్ వాసులు విశాల్‌ని కోరగా, విశాల్ వెంటనే స్పందించి, వాటర్ వర్క్స్ జి.యం.శ్రీధర్ రెడ్డి తో, ఎ.ఈ.అనూషతో కుత్బుల్లాపూర్ సర్కిల్ -25 డి.ఈ.పాపమ్మతో, ఎ.ఈ.సురేందర్ నాయక్‌తో ఫోన్లో మాట్లాడి పరిస్థితిని వివరించారు. వారు సమస్యలను త్వరగా పరిష్కరిస్తామ న్నారు. ఈ సందర్భంగా రాజీవ్ గృహకల్ప బ్లాక్ నెంబర్ 62,63, 65 వాసులు విశాల్‌ను పూలమాల, శాలువాతో సత్కరించి, కృతజ్ఞతలను తెలియజేశారు. ఈ కార్యక్రమం లో రామాంజి, దశరథ్, అరుణ, నరేష్, సంగీత, శ్రీనివాసులు,రమణ, నాయుడు, మౌనిక, అనంతలక్ష్మి, దేవి, రమాదేవి, భానుమతి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య రక్షణకు వామపక్షాల ఐక్యత అవసరం

- ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్
- సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి జే.చంద్రశేఖర్



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

జీడిమెట్ల, ఎలీఫ్, గండి మైసమ్మ, పారిశ్రామిక ప్రాంత లోడింగ్ అన్లోడింగ్ హమాలీ యూనియన్ నూతన అడ్డ జీడిమెట్ల పారిశ్రామిక వాడ ఫేస్ - 4 లో ప్రారంభోత్సవం సందర్భంగా జండా ఆవిష్కరణకు ముఖ్య అతిథులుగా ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్, సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి జే.చంద్ర శేఖర్‌లు పాల్గొన్నారు. అనంతరం జెండా ఆవిష్కరణ చేసిన సందర్భంగ కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేనివిధంగా కుత్బుల్లాపూర్‌లో ఏఐటీయూసీ, సీఐటీయూ కలిసి హమాలి యూనియన్ 30 సంవత్సరాల క్రితం 80 మంది కార్మికులతో ఏర్పాటు చేసి ఇప్పుడు 400 కార్మికులతో పారిశ్రామిక ప్రాంతంలో లోడింగ్ అన్లోడింగ్ చేస్తూ ఉపాధి పొందుతూ ఐక్యంగా ఉండడం శుభపరిణామమని దీన్ని ఆదర్శంగా తీసుకొని దేశవ్యాప్తంగా అన్ని వామపక్ష కార్మిక సంఘాలు కలిసి ఐక్య ఉద్యమాలు నిర్వహించాలని కోరారు. కార్మిక సంఘాల ఐక్యత వల్లే కార్మికుల హక్కులు సాధించబడుతాయని దానికి నిదర్శనమే జీడిమెట్ల పారిశ్రామిక ప్రాంతంలోని అధికారులు ప్రజా ప్రతినిధుల సహాయ సహకారాలతో నూతన అడ్డాను సాధించు కోగలిగామన్నారు. భారతదేశానికి వామపక్షాలే శ్రీరామ రక్ష అని వామపక్షాలు బలహీన పడటం వల్లే మతోన్మాదం పెరిగిపోతున్న దని, నిరుద్యోగం, నిత్యావసర సరుకుల ధరలు పెరిగాయని దాన్ని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ప్రజల సమస్యలు పట్టించు కోకుండా కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్నారని కాబట్టే అన్ని రకాల సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని కావున వామపక్షాలు కలిసి పోరాటాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమానికి ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు స్వామి అధ్యక్షత వహించగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్, సీపీఎం మండల కార్యదర్శి కీలుకానీ లక్ష్మణ్, ఏఐటీయూసీ అధ్యక్ష,కార్యదర్శి హరినాథ్, శ్రీనివాస్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బి.లింగ స్వామి, ఐలాపురం రాజశేఖర్, సీపీఐ సహాయ కార్యదర్శి రాము, సీపీఎం నాయకులు, సునీల్‌లతో పాటు 300 మంది హమాలి కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు: కలెక్టర్



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఆంగ్ల నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని జిల్లా ప్రజలకు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి శుభాకాంక్షలు తెలిపారు. 2024 వ సంవత్సరం ప్రతి ఒక్కరికి శుభాలను చేకూర్చాలని, ప్రతి కుటుంబంలో ఆనందం వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. జిల్లా ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని అభిలషించారు. నూతన సంవత్సరంలో సరికొత్త ఆలోచనలు, ఆశయాలు, ఆకాంక్షలతో ముందుకు సాగాలని మరింత పట్టుదల, కృషితో విజయాలను కైవసం చేసుకోవాలని ఆకాంక్షించారు. నూతన సంవత్సరం ప్రతి ఒక్కరికి గెలుపునుందించే సంవత్సరం కావాలని కలెక్టర్ అభిలషించారు.

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



- పద్మశాలి సంఘం

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

అల్వాల్ సమాజ సేవలో భాగస్వామ్యం అవుతూ నే, పద్మశాలి సంఘం అభివృద్ధికి అవసరమైన తోడ్పాటును అందించేం దుకు ప్రతి పద్మశాలి బిడ్డ కృషి చేయాలని ఆల్ ఇండియా పద్మశాలి సంఘం అధ్యక్షులు మ్యాడం బాబురావు, సామాజిక సేవకులు పద్మ శాలి సంఘం మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షులు తాటికొండ పట్టాభిలు పిలుపునిచ్చారు. అల్వాల్ మండల పద్మశాలి సంఘం అధ్యక్షులు బోల్లు రమేష్ అధ్యక్షతన ఆదివారం అల్వాల్ మండల పద్మశాలి సంఘం నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ... సంఘానికి సొంత భవనం కోసం గతంలో మాజీ ఎమ్మెల్యే హనుమంతరావు ప్రభుత్వ స్థలం కేటాయిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. ప్రభుత్వ స్థలంను గుర్తించి చెప్పే బాధ్యతను స్థానిక సంఘం నాయకులు తీసుకోవాలని సూచించారు. భవన నిర్మాణానికి తాము సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. మహిళలను ప్రోత్సహిస్తామని, సంఘం అభివృద్ధికి తోడ్పాటును అందించేందుకు మహిళలు ముందుకు రావాలని కోరారు. సంఘానికి రెండున్నర ఎకరాల భూమిని, భవన నిర్మాణానికి రూ. 50లక్షలు ఆర్థిక సహాయాన్ని అందించినట్లు చెప్పారు. పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మార్కండేయ జయంతి, కొండా లక్ష్మణ్ బాపూజీ, వర్ధంతి, జయంతిని నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో నరసింహులు, విశ్వనాథ్ డాక్టర్ ఋషి, కే.జనార్ధన్, శ్రీహరి, లక్ష్మణ్, పద్మారావు, జ్యోతి, కుల బాంధవులు పాల్గొన్నారు.

మంత్రి శ్రీధర్ బాబును కలిసిన బండి



నవతెలంగాణ-కూకట్‌పల్లి/కేపీహెచ్‌బీ

ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందే విధంగా చూడాలని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. ఆదివారం కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ ఆధ్వర్యంలో, రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును రాష్ట్ర సచివాలయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు దాదాపుగా 200 మంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబుకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. పార్టీ అభివృద్ధి కోసం ప్రతి, కార్యకర్త, నాయకుడు శక్తి వంచన లేకుండా కృషిచేయాలన్నారు. మంత్రిని కలిసిన వారిలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు నేతి శ్యాంసుందర్, పి.నాగిరెడ్డి, షేరి సతీష్ రెడ్డి, యాదగిరి, నాగరాజు, తూము వేణు, తూము సంతోష్, సయ్యద్ బాబు పలువురు నేతలు తదితరులు పాల్గొన్నారు.

పీఆర్జీటీపీ హైదరాబాద్, రంగారెడి జిల్లాల నూతన కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-సిటీబ్యూరో

పీఆర్టీయూ టీఎస్ అనుబంధం సంఘం ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ గురుకుల టీచర్స్ అసోసియేషన్(పీఆర్జీటీపీ) రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల నూతన కార్యవర్గం ఎన్నికైంది. గురుకుల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఆదివారం ఎల్బీనగర్‌లో రంగారెడ్డి, హైదరాబాద్ మైనార్టీ సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలల ఉపాధ్యాయులు సంయుక్త సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎంఆర్ఈఐఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలిగా ఎస్. రాధిక, జనరల్ సెక్రటరిగా జి.శైలజ, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా జె.జగన్, ఉపాధ్యక్షునిగా ఈ.సాయిబాబ, సెక్రటరిగా ఎస్.శ్రీనివాసులు, హైదరాబాద్ జిల్లా అధ్యక్షునిగా వంగేటి రామకృష్ణారెడ్డి, జనరల్ సెక్రటరీగా శివకుమారి, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఎం. శ్రీనివాసులు, వైస్ ప్రెసిడెంట్‌గా మహ్మద్ సుభాని, సెక్రటరిగా ప్రకాశ్‌లను సభ్యులు ఓటింగ్ పద్ధతిలో ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్జీటీపీ రాష్ట్ర అధ్యక్షుడు వేమిరెడ్డి దిలీప్ కుమార్ రెడ్డి, ఉపాధ్యక్షుడు ఎం.వేణు ప్రసాద్, జాయింట్ సెక్రటరీలు ఉప్పు అశోక్, డాక్టర్ ఈ.శ్రీనివాసాచారి, డాక్టర్ ఐ.నిర్మాలానందం, ఆర్గనైజింగ్ సెక్రటరీలు కె.రామకృష్ణారెడ్డి, పి.విద్యాసాగర్, పీఆర్జీటీపీ మైనార్టీ గురుకులాల రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి విజయ్ కుమార్, జనరల్ సెక్రటరీ చీదేటి లక్ష్మారెడ్డి, ఉపాధ్యక్షుడు చెలకాని సంజీవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికయిన నూతన కార్యవర్గానికి పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షులు పింగిలి శ్రీపాల్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్ రావు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తం రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుర్రం చెన్నకేశవరెడ్డి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అన్ని మైనార్టీ గురుకులాల పాఠశాలల నుంచి అధ్యాపకులు, ఉపాధ్యాయులు అత్యధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

కాంగ్రెస్ ప్రజల ప్రభుత్వం



- ఇన్‌చార్జి కొలను హనుమంత్ రెడ్డి

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కాంగ్రెస్ ప్రజల ప్రభుత్వమని కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలను హనుమంత్ రెడ్డి అన్నారు. గాజులరామారం డివిజన్ మల్లారెడ్డి నగర్, ద్వారకానగర్, మహాదేవపురం వాసులు కృష్ణా రెడ్డి, దేవేందర్ రెడ్డి వారి మిత్ర బృందం 100 మంది రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి కాంగ్రెస్ సీనియర్ నాయకులు సిద్ధనోళ్ల సంజీవ రెడ్డి ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆదివారం సాయంత్రం మల్లారెడ్డి నగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలోనే రాష్ట్రం భిక్షంగా ఉంటుందని ప్రజలు విశ్వసిస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం ఆరు గ్యారంటీలతో ప్రజా రంజక పథకాలు ప్రవేశపెట్టడం తో తెలంగాణ రాష్ట్రం రూపురేఖలే మారనున్నాయన్నారు. రాబోయే రోజుల్లో కుత్బుల్లాపూర్‌లో కాంగ్రెస్ జెండా ఎగరేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యకర్తలు మనోధైర్యంతో ఉండాలని ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై, నాయకుడి పై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు నర్సింగరావు, దరువు అంజన్న, నర్సింహారెడ్డి, రాజేందర్ రెడ్డి, విజయ్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

దేవాలయంలో 32వ వార్షిక మహోత్సవం



నవతెలంగాణ-కూకట్‌పల్లి

కూకట్‌పల్లి వివేకానంద నగర్ శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయం 32వ వార్షిక మహోత్సవ కార్యక్రమాలు దేవాలయ కమిటీ చైర్మెన్, గురు స్వామి వడ్డేపల్లి రాజేశ్వర్ రావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శనివారం నాడు ఉదయం లక్ష్మి గణపతి హెూమం, గోమాత పూజ, 108 కలశముల పూజ, అన్నదానం, సాయంత్రం అయ్యప్ప స్వామి వారి ఊరేగింపుతో కూకట్ పల్లి ఆధ్యాత్మికమయంగా మారింది. శనివారం ఉదయం లక్ష్మి గణపతి హెూమం, అరాట్ మహోత్సవం, 18 కలశముల పడిపూజ కార్యక్రమం, మాన్యశ్రీ అరుణ్ గురుస్వామి, యోగేశ్వర శర్మలచేత వడ్డేపల్లి రాజేశ్వర్ రావు ఆధ్వర్యంలో, అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా వడ్డేపల్లి మాట్లాడుతూ. అయ్యప్ప స్వామి వార్షిక ఉత్సవాలతో కూకట్ పల్లి ఐక్యతకు మారుపేరని మరోమారు ఋజువైందని అన్నారు. ఉత్సవాలకు సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ఎల్లవేళలా దేవాలయానికి సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. సాయంత్రం భజన కార్యక్రమం, పుష్పాభిషేకం కార్యక్రమాలకు భక్తులు హాజరై విజయవంతం చేయాలని తెలిపారు. దేవాలయంలో అలంకరించిన పూల అలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆలయ ప్రాంగణం అయ్యప్ప స్వాముల శరణుఘోషతో మారుమ్రోగింది. అనంతరం అన్న సమారాధన నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో అయ్యప్ప స్వాములు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న మాజీ చాడ సురేష్



నవతెలంగాణ-మల్కాజిగిరి

అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని భారతీయ జనతా పార్టీ మాజీ పార్లమెంటు సభ్యుడు చాడ సురేష్ రెడ్డి అన్నారు. ఆదివారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఓల్డ్ మల్కాజిగిరిలో ఆ మహంకాళి అమ్మవారి ఆలయాన్ని దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు నిర్వహించిచ, అమ్మవారి ఆశీర్వాదాలు తీసుకున్నారు. స్థానిక ఓల్డ్ మల్కాజిగిరి బీజేపీ సీనియర్ నాయకులు సందిల రమేష్ గౌడ్,సునీల్ యాదవ్, వినోద్ కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలంగాణ హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-ముషీరాబాద్

తెలంగాణ హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ క్యాలెండర్‌ను మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ప్రెసిడెంట్ ఆంజనేయులు, జెనరల్ సెక్రటరీ జంగారెడ్డి, కోశాధికారి వెంకటేశ్వర్లు గుప్త, ఆర్గనైజషన్ సెక్రటరీ నిజాముద్దీన్ హాజరయ్యారు.

మేరు సంఘం నూతన సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మేరు సంఘం తెలంగాణ అల్వాల్ జోన్ - 11 వారి ఆధ్వర్యంలో తయారు చేసిన నూతన సంవత్సరం 2024 క్యాలెండర్‌ను ఆదివారం లోతుకుంటలోని వారి కార్యాల యంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు రాపర్తి చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి దీకొండ వెంకటేష్, ఉపాధ్యక్షులు రాపర్తి శివపాల్, మాడిశెట్టి బాలయ్య ,రామగిరి గోపాల్, బత్తుల కరణ్, సెక్రటరీ కీర్తి గణేష్, కీర్తి, రామకృష్ణ తదితర సంఘ సభ్యులు పాల్గొన్నారు.

గోషామహల్ సర్కిల్ పరిధిలో 14,009 దరఖాస్తుల స్వీకరణ



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

జీహెచ్ఎంసీ గోషామహల్ సర్కిల్ -14 పరిధిలో ప్రజా పాలనను 24 కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల నుంచి ఇప్పటివరకు 14,009 దరఖాస్తులు స్వీకరించినట్లు సర్కిల్ డీప్యూటీ కమిషనర్ బాలయ్య తెలిపారు. గోషామహల్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో సెంటర్లను ఏర్పాటు చేసి దరఖాస్తులను స్వీకరిస్తున్నామన్నారు. పెద్ద ఎత్తున లబ్ధిదారులు ప్రజా పాలనను సద్వినియోగం చేసుకుంటున్నారని చెప్పారు.

9 కిలోల గంజాయి స్వాధీనం



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఎక్సైజ్ కమిషనర్, సికింద్రాబాద్ యూనిట్స్ ఎక్సైజ్ సూపరిండెంట్ పవన్ కుమార్ ఆదేశాల మేరకు ఆదివారం నారాయణ గూడ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఎక్సైజ్ ఇంచార్జ్ సిఐ ఖాజా మొయినుద్దీన్ బృందం ఆధ్వర్యంలో సిబిఎస్ ఎక్స్ రోడ్ వద్ద తనిఖీలు చేపట్టారు. ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు కు తనిఖీలు చేపట్టామని చెప్పారు. ఈ తనిఖీల్లో సిబిఎస్ ఎక్స్ రోడ్ వద్ద వాహనాలు తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన ఒక ద్విచక్ర వాహనాన్ని తనిఖీ చేయగా చీటీ కింద బ్రౌన్ కలర్ టెపు వేసిన పాకెట్లు ఉన్నాయని వాటిని తెరిచి చూడగా 9 కిలోల రెండు గంజాయి ఉందన్నారు. దానిని స్వాధీనం చేసుకొని నిందితులను అదుపు తీసుకున్నామన్నారు. వారి వద్ద నుంచి రెండు సెల్ ఫోన్లు, 9 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నమన్నారు. ఒరిస్సా రాష్ట్రానికి చెందిన మానష్ కంటి బిశ్వాస్, బలరాం మండల్‌లపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ కొండల రావు. కే.సంజయ్ తదితరులు పాల్గొన్నారు

'ప్రజాపాలన'కు విశేష స్పందన



నవతెలంగాణ-అంబర్‌పేట

ప్రజాపాలన కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు ఎ. జ్యోతి యాదగిరిగౌడ్ అన్నారు. ఆదివారం నల్లకుంటలో యూత్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సాయి కిరణ్, నల్లకుంట డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లక్ష్మన్‌తో కలిసి ఇంటింటికి వెళ్లి ఉచితంగా దరఖాస్తులు అందించారు. ఈ సందర్భంగా జ్యోతి యాదగిరి గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన అభయ హస్తం ఆరు గ్యారెంటీల హామీలను అర్హులైన స్థానికులు దరఖాస్తు చేసుకో వాలని కోరారు. ఆరోగ్యశ్రీ రెండు లక్షల నుంచి 10 లక్షల వరకు, మహాలక్ష్మీ రూ.2500, రూ. 500కే గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి, అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకునే వారు ఆధార్, రేషన్‌కార్డు జిరాక్స్ ప్రతులతో పాటు ఇంటి యజమాని పాస్‌పోర్టు సైజు ఫొటో ఉంటే సరిపోతుందని వివరించారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఇచ్చే రశీదును జాగ్రత్తగా భద్రపరచుకోవాలని సూచించారు. ఆధార్ సవరణలు అవసరం లేదని, ప్రస్తుతం ఉన్న కార్డు జిరాక్స్ మాత్రమే జతపర్చాలని చెప్పారు. అర్హత ఉండి పెన్షన్ రాని వారు చేయూత పథకం కింద దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఏదైనా అనుమానం ఉంటే కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌లో సంప్రదించాలన్నారు.

రెవెన్యూ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

రెవెన్యూ శాఖ మంత్రి
పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి వినతి



నవతెలంగాణ-ముషీరాబాద్

రెవెన్యూ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని గ్రేటర్ హైదరాబాద్ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు కాంగ్రెస్ నాయకులు నీరడి భూపేష్ సాగర్ అన్నారు. రెవెన్యూ శాఖ మంత్రిపొంగులేటీ శ్రీనివాస్ రెడ్డిని తన కార్యాలయంలో కలిసి సన్మానించి అభినందన తెలియ జేశారు. అనంతరం భూపేష్ సాగర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ధరణి తీసివేసి రైతులకు న్యాయం చేస్తానని తెలపడం జరిగిందన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం ధరణిని ఎత్తివేసి ప్రజల కష్టాలను తీర్చాలని కోరారు. రెవెన్యూ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించి వీఆర్వోలను మళ్లీ విధుల్లోకి తీసుకోవాలన్నారు. రైతుబంధు, రైతు భరోసా నిధులను వెంటనే విడుదల చేసి రైతులకు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంతోష్, సాగర్, రాజు, శ్రీధర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం అధ్యక్షులుగా డి.వైద్యనాథ్ ఎన్నిక



నవతెలంగాణ-ముషీరాబాద్

తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా డి. వైద్యనాథ్, ప్రధాన కార్యదర్శిగా జి.కృపాకర్‌రెడ్డిలు ఎన్నికైయ్యారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన వ్యవసాయ అధికారుల సంఘం సర్వసభ్య సమావేశంలో ఈ ఎన్నికలు జరిగాయి. మొత్తం 244 ఓట్లు పోల్ కాగా వైద్యనాథ్‌కు 153, రవీంద్రనాథ్‌రెడ్డికి 91 ఓట్లు పోల్ అయ్యాయి. ప్రధాన కార్యదర్శిగా జి. కృపాకర్ రెడ్డికి 209 ఓట్లు రాగా, నదీముద్దీన్‌కు 34 ఓట్లు వచ్చాయి. దీంతో ఎన్నికల అధికారులు అధ్యక్షులుగా డి. వైద్యనాథ్, ప్రధాన కార్యదర్శిగా జి. కృపాకర్ రెడ్డిలు ఎన్నికైనట్లు ప్రకటించారు. అనంతరం అసోసియేట్ అధ్యక్షులుగా కాంతారావు, ఉపాధ్యక్షులుగా శైలజరెడ్డి, వీణారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా మహేందర్ రెడ్డి, జాయింట్ సెక్రటరీగా నాగమ్మ, సుధాకర్‌రావు, పబ్లిసిటీ కార్యదర్శిగా మానసా, కోశాధికారిగా రవీందర్, కల్చరల్ సెక్రటరీగా శ్రీనివాస్‌లు ఎన్నికైయ్యారు. ఎన్నికల అధికారులుగా జెడిఏలుగా రిటైర్డ్ అయిన ఆనంద్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రామచంద్రరావు, రామకృష్ణకళ్యాణ్, చంద్రశేఖర్లు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో సంఘం చైర్మెన్ బి.కృపాకర్‌రెడ్డి, వైస్ చైర్మెన్ అనురాధా, ప్రత్యేక ఆహ్వానితులు చంద్రమోహన్‌లు పాల్గొన్నారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు వైద్యనాథ్ మాట్లాడుతూ వ్యవసాయ అధికారుల సంక్షేమం కోసం తన శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. తనపై ఎంతో నమ్మకంతో అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

'దేవిలాల్ వారసుడిగా రాజకీయాలలో తనదైన ముద్ర'

ఓంప్రకాష్ చౌతాలా జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

మాజీ ఉప ప్రధానమంత్రి, రైతు బాంధవుడు దేవిలాల్ వారసుడిగా లోక్ దళ్ పార్టీ జాతీయ అధ్యక్షులు, హర్యానా మాజీ ముఖ్యమంత్రి ఓంప్రకాష్ చౌతాలా రాజకీయాలలో తనదైన ముద్ర వేసుకున్నాడని భారత లోక్ దళ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పుల్లూరి వెంకట రాజేశ్వరరావు కొనియాడారు. ఆదివారం హిమాయత్ నగర్ లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఓం ప్రకాష్ చౌతాలా జన్మదిన వేడుకలను పార్టీ నేతలు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓం ప్రకాష్ చౌతాలా రైతు సంక్షేమం కోసం నిరంతరం కృషి చేశారని గుర్తు చేశారు. కాంగ్రెసేతర శక్తుల ఏకీకరణలో చురుకైన పాత్రతో పాటు ఎందరికో రాజకీయ భవిష్యత్ కల్పించిన మహానేత ఓంప్రకాష్ చౌతాలా అని కొనియాడారు. చౌతాలా నాయకత్వంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు వ్యతిరేకంగా లౌకిక ప్రజాస్వామ్య రైతులు, కార్మికులు ఏకం కావాలని రాజేశ్వరరావు సూచించారు. మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చి తెలంగాణ అస్థిత్వాన్ని దెబ్బతీసే శక్తులకు వచ్చే లోక్ సభ ఎన్నికలలో తగిన గుణపాఠం చెప్పాలని అన్నారు.

ప్రైవేట్ యూనివర్సిటీలో ఎస్సీ, ఎస్టీలతో పాటు

బీసీ రిజర్వేషన్లు పెట్టాలి



బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎంపీ ఆర్.కృష్ణయ్య

నవతెలంగాణ-ముషీరాబాద్

ప్రైవేట్ యూనివర్సిటీలో ఎస్సీ,ఎస్టీలతోపాటు బీసీ రిజర్వేషన్లు పెట్టాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎంపీ ఆర్.కృష్ణయ్య అన్నారు. మెగా డీఎస్సీ ప్రవేట్ యూనివర్సిటీలో ఎస్సి , ఎస్టి రిజర్వేషన్లపై హర్షం వ్యక్తం చేస్తూ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం ఆధ్వర్యంలో విద్యానగర్ బీసీ భవన్ లో బీసీ నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆర్ కృష్ణయ్య హాజరై మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మెగా డీఎస్సీ వేసి పెద్ద ఎత్తున టీచర్ పోస్టులు వేస్తామని ప్రకటించడం హర్షనీయ మన్నారు. టీచర్ పోస్టులు సంఖ్య విషయంలో అధికారులు ఆధారపడకుండా నిరుద్యోగుల సంఘాలు, ఉద్యోగ సంఘాలతో సమావేశం జరిపి చర్చలు జరపాలని కోరారు. గత ప్రభుత్వం టీచర్ పోస్టులు భర్తీ చేయకపోవడం వేల పాఠశాలలో పాఠాలు చెప్పేవారు లేక విద్యార్థులు చదువుల్లో వెనుకబడిపోయారన్నారు. టీచర్ పోస్టుల భర్తీ ని నిరుద్యోగులకు ఉద్యోగం ఇస్తున్నామనే బడ్జెటు ఖర్చు అవుతుందని కోణంలో చూడరాదని భావి భారత పౌరు లైన బాలలను తీర్చిదిద్ది ఈ సమాజానికి ఉపయోగ పడే గొప్ప వారికి తయారు చేస్తామన్నామనే కోణంలో చూడాలని తెలిపారు. ప్రైవేట్ యూనివర్సిటీలలో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు పెట్టి యూనివర్సిటీ క్రమబద్ధీకరణ చేస్తామని సీఎం ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. ప్రైవేట్ యూనివర్సిటీలు స్థాపించిన ప్పుడు ఎస్సీ,ఎస్టీ,బీసీ రిజర్వేషన్లు పెట్టాలని, అసెంబ్లీ లోపల - బయట చాలా పోరాటం చేశామని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రిజర్వేషన్లు పెట్టలేదు. ప్రస్తుతం ముఖ్యమంత్రి ప్రకటనలో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్ ప్రకటించలేదు,బీసీల విషయం ప్రస్తావించలేదు, బీసీలకు కూడా రిజర్వేషన్లు పెట్టాలని డిమాండ్ చేశారు .ఈ సమావేశంలో గుజ్జ కృష్ణ, అంజి, సురేశ్, ఉదయ్, జయంతి, లింగయ్య యాదవ్, నిఖిల్, ఈలేశయ్య, ప్రియా, దుర్గా రాణి పాల్గొన్నారు.

'పెన్షనర్ల ఇళ్ల స్థలాల పంపిణీ ప్రక్రియను

అడ్డుకునే కుట్రలు మానుకోవాలి'



తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్ల సంఘం డిమాండ్

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

పెన్షనర్లకు కేటాయించిన ఇళ్ల స్థలాల పంపిణీ ప్రక్రియను అడ్డుకునే కుట్రలు మానుకోవాలని తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్ల సంఘం డిమాండ్ చేసింది. ఇళ్ల స్థలాల పంపిణీని విచ్ఛిన్నం చేయాలనే కుట్రదారుల చర్యలు పసిగట్టి పెన్షనర్లకు న్యాయం చేయాలని కోరింది. ఈ మేరకు అసెంబ్లీ వద్ద గల గన్‌పార్కు వద్ద తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షులు కనకం కొమురెల్లి, ప్రధాన కార్యదర్శి తూము అశోక్ రెడ్డి, నేతలు జి.సూర్యకళ, వేణుగోపాల్, దివాకర్, భద్రయ్య తదితరులు పాల్గొని మాట్లాడారు. 30 ఏళ్ల క్రితం శేరిలింగంపల్లిలోని గోపన్న పల్లిలో ఉద్యోగులకు నాటి ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయిం చగా కొంత మంది ఉద్యోగ సంఘాల నేతల స్వార్థపూరిత చర్యల వల్ల న్యాయస్థానం వివాదంలో చిక్కుకుని పంపిణీ ప్రక్రియ పూర్తి కాలేదని గుర్తు చేశారు. దీంతో 30 ఏళ్లుగా ఎదురు చూస్తూ పెన్షనర్లకు 76 ఏళ్ల నుంచి 81 సంవత్సరాల వయసు వచ్చిందని తెలిపారు. దీంతో ప్రస్తుత భాగ్య నగర్ టీఎన్జీవో గచ్చిబౌలి హౌసింగ్ సొసైటీ పాలకవర్గం ఈ స్థలాన్ని తన అధీనంలోకి తీసుకుని సర్వీస్ సీనియారిటీ ప్రకారం 845 మంది సీనియర్ పెన్షనర్లను లబ్ధిదారులుగా గుర్తించిందని చెప్పారు. కాగా సొసైటీతో సంబంధం లేని కొంత మంది ఈ ఇళ్ల స్థలాల పంపిణీ ప్రక్రియను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర మంత్రుల వద్దకు వెళ్ళి సొసైటీ పాలకవర్గాన్ని రద్దు చేయాలని, నిబంధనల ప్రకారం ఇళ్ల స్థలాల పంపిణీ చేయడం లేదని అవాస్తవాలతో మంత్రులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. పెన్షనర్ల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించి న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని వారు కోరారు.ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కాసుల కొండయ్య, లక్ష్మణ్ రావు, పుట్టలయ్య, ఝాన్సీరాణి, పవన్ కుమార్, రామనాథ చెట్టి, ఉద్యోగ సంఘం నేతలు అబ్దుల్ సాదిక్, జాకీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

'అస్సాం సీఎం హిమంత్ బిస్వా శర్మపై కఠిన చర్యలు తీసుకోవాలి'

దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణ స్వరూప్



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

ఇటీవల ప్రభుత్వ అధికార కార్యక్రమంలో అస్సాం సీఎం హిమంత్ బిస్వా శర్మ శూద్ర జాతులు, దళిత బహుజనులపై కించపరిచే వ్యాఖ్యలు చేసినందుకు ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణ స్వరూప్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం హిమాయత్ నగర్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కృష్ణ స్వరూప్ మాట్లాడుతూ ఆర్య బ్రాహ్మణ, క్షత్రియ, ఆర్యవైశ్యలు మూడు వర్ణాలకు సేవలు చేయడానికే శూద్రులను బ్రహ్మ పుట్టించారని, శూద్రులు మూడు వర్ణాలకు బానిసలుగా ఉండాలనే సనాతన ధర్మం మార్గంలో బీజేపీ సర్కార్ పని చేస్తుందని మాట్లాడడం, కుల విచ్ఛిన్నం, ద్వేషం, దురహంకారంతో రాజ్యాంగం నిబంధనలకు వ్యతిరేకంగా మాట్లాడిన అస్సాం సీఎంపై వెంటనే కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాను ఆయన డిమాండ్ చేశారు. హిమంత్ బిస్వా వ్యాఖ్యలను తమ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. శూద్ర జాతులు, దళిత బహుజనులకు ఆయన బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో పెద్ద ఎత్తున తిరుగుబాటు చేస్తామని హెచ్చరించారు.వెంటనే ఆయనను సీఎం పదవి నుంచి బర్తరఫ్ చేయాలని అస్సాం గవర్నర్, భారత రాష్ట్రపతిలను కోరారు.ఈ వ్యాఖ్యలతో బీజేపీ పార్టీ నిజ స్వరూపం బట్టబయలైందని ఆరోపించారు. ఇప్పటికైనా ఎస్సీ, ఎస్టీ, బీసీ నేతలు బుద్ధి తెచ్చుకొని పరివర్తన చెందాలని ఆయన హితవు పలికారు.ఈ కార్యక్రమంలో పార్టీ గ్రేటర్ హైదరాబాద్ శాఖ అధ్యక్షులు మద్దెల ప్రవీణ్ కుమార్, దళిత బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ ఇటికాల గణేష్, నాయకులు పెండ్యాల సుచంద్రరావు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మార్పు కోసమే మా ప్రయత్నం

మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి.ఎస్.ప్రేమావతి



నవతెలంగాణ-బంజారా హిల్స్

మెట్రోపాలిటన్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ గౌరవ జాతీయ రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ వారి ఆదేశాల మేరకు శనివారం మెట్రోపాలిటన్ క్రిమినల్ కోర్ట్ పరిధిలో గల అన్ని కోర్ట్ ప్రాంగణాలలో జాతీయ లోక్ అదాలత్‌ను ప్రారంభించారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో సుమారు రాజీకి ఆమోదయోగ్యమైన 1,65,446 క్రిమినల్ కేసులు అనగా కంపౌండబుల్ క్రిమినల్ కేసులు, ఎక్సయిజ్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, విద్యుత్ చోరీ కేసులు, ఇ-పెట్టీ కేసులు 17,69,882 ట్రాఫిక్ చాలాన్ కేసులు పరిష్కరించబడ్డాయి. ఈ కేసులు పరిష్కరించుట వలన కక్షిదారులకు ఊరట లభించింది. ఉదయం నాంపల్లి మెట్రోపాలిటన్ క్రిమినల్ కోర్ట్ ఆవరణలో గల లీగల్ సర్వీసెస్ వారి మీటింగ్ హాల్ లో జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి.ఎస్.ప్రేమావతి మాట్లాడుతూ ప్రతి లోక్ అదాలత్‌లో పోలీస్, అడ్వొకేట్లు కక్షిదారులకు తమ కేసులను పరిష్కరించుకోవడంలో వారి వంతు సహాయ సహకారాలను అందించి లోక్ అదాలత్ ను విజయవంతం చేయవలసిందిగా కోరారు. అలాగే ఇక ముందు కూడా కక్షిదారులను ప్రోత్సహించి పెండింగ్‌లో ఉన్న కేసులను కూడా పరిష్కరించుకునేలా చూడాలన్నారు. హైదరాబాద్ సీపీ కె.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ లోక్ అదాలత్ కేసులను పరిష్కరించుకోవడం అంటే వాది ప్రతివాది ఇద్దరు కూడా గెలిచినట్టేనని కాబట్టి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కేసుల గురించి నాంపల్లి కోర్ట్ ఆవరణలో మనోరంజన్ కోర్ట్ ఆవరణలో, సికింద్రాబాద్ కోర్ట్ ఆవరణలో, రైల్వే కోర్ట్, ఇంటిగ్రేటెడ్ కోర్ట్ ఆవరణలో, కక్షిదారులు సౌలభ్యం కోసం మొత్తం 35 లోక్ అదాలత్ బెంచులను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మొదటి అదనపు మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి, డి. రమాకాంత్, నాల్గవ అదనపు మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి, సి.వి.ఎస్.సాయి భూపతి, మెట్రోపాలిటన్ లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి కె. వి.చంద్రశేఖర్,జాయింట్ పోలీస్ కమీషనర్ ఎ.వి రంగనాథ్, డిప్యూటీ కమీషనర్ అఫ్ పోలీస్ ఎన్.శ్వేత, ఇతర న్యాయమూర్తులు, సెక్రటరీ ఎం.సి.సి.బార్ అసోసియేషన్ సభ్యులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

కాళేశ్వరం, పోలవరం ప్రాజెక్టులపై

సీబీఐచే విచారణ జరించాలి

నవరంగ్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు షేక్ జలీల్ డిమాండ్



నవతెలంగాణ-హిమాయత్ నగర్

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు తెలుగు రాష్ట్రాలలోని కాళేశ్వరం, పోలవరం ప్రాజెక్టులపై జరిగిన అవినీతిపై వెంటనే విచారణ చేపట్టి సీఎం జగన్, మాజీ సీఎం కేసీఆర్ లపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని నవరంగ్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు షేక్ జలీల్ డిమాండ్ చేశారు.ఈ మేరకు ఆదివారం సీబీఐ మాజీ డైరెక్టర్ జేడీ.లక్ష్మీనారాయణను కలిసి రెండు తెలుగు రాష్ట్రాల్లో జరుగుతున్న అవినీతిపై సలహాలు, సూచనలు స్వీకరించి రెండు రాష్ట్రాల ప్రజల మార్పుకు ముందుకు రావాలని వినతి పత్రం అందజేసి కోరారు.ఈ సందర్భంగా షేక్ జలీల్ మాట్లాడుతూ తెలంగాణ కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్టుపై న్యాయ విచారణ జరిపించి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి, మిగులు బడ్జెట్ ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని రూ.8.5 లక్షల కోట్లు అప్పు చేసి తెలంగాణ రాష్ట్రాన్ని నిర్వీర్యం చేసిన మాజీ సీఎం కేసీఆర్ పై న్యాయ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.ఆంధ్రప్రదేశ్ లో సీఎం వైయస్.జగన్ పోలవరం ప్రాజెక్టును కాంట్రాక్టర్లకు, నవయుగ కన్స్ట్రక్షన్ కంపెనీకి ప్రజా ధనాన్ని దోచి పెట్టారని ఆరోపించారు.పోలవరం ప్రాజెక్టుపై వెంటనే విచారణ జరిపించి, గడువు లోగా ప్రాజెక్టు పని పూర్తి చేయని యెడల కాంట్రాక్టు, సబ్-కాంట్రాక్టు, జగన్ లపై సీబీఐచే విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.కాళేశ్వరం, పోలవరం ప్రాజెక్టులపై గతంలో సీబీఐ విచారణ జరిపించాలని ప్రధాని నరేంద్ర మోడీకి పలుమార్లు లేఖలు పంపించడం జరిగిందని గుర్తు చేశారు.నదుల అనుసంధానం ఆసరాగా చేసుకొని కాళేశ్వరంపై రూ.50 వేల కోట్లు, పోలవరంపై రూ.45 వేల కోట్లు దోచుకు తిన్నారని ఆరోపించారు.సీఎం జగన్, కేసీఆర్ ఇద్దరూ తోడు దొంగలేనని విమర్శించారు.తెలంగాణలో కేసీఆర్ ను ఏ విధంగా అయితే అసెంబ్లీ ఎన్నికల్లో ఓడించారో అదే విధంగా రాబోయే 2024 ఎన్నికల్లో సీఎం జగన్ ను ఏపీ ప్రజలు ఓడించి గుణపాఠం చెప్పాలని సూచించారు.

బీఎస్సీ నర్సింగ్ కోర్సుల్లో మేనేజ్మెంట్ కేటగిరికి నీట్


అర్హత నిబంధనను తొలగించాలి

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



బీఎస్సీ నర్సింగ్ కోర్సులలో మేనేజ్మెంట్ కేటగిరీకి నీట్ అర్హత నిబంధనను తెలంగాణ ప్రభుత్వం తొలగించాలని పలువురు నర్సింగ్ విద్యార్థులు కోరుతు న్నారు. ఆదివారం కోఠిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నర్సింగ్ విద్యార్థులు మంజు, భార్గవి, సింధుజ, సృజన, సరితలు మాట్లాడుతూ... బీఎస్సీ నర్సింగ్ కోర్స్ 3000 సీట్లు ఖాళీగా ఉన్నాయని అడ్మిషన్లు నిబంధనలు సడలిం చాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు. బీఎస్సీ నర్సింగ్ కోర్సులలో కాళోజి నారాయణరావు యూనివర్సిటీలో 3వేల సీట్లను భర్తీ చేయలేదని వారు తెలిపారు. కన్వీనర్ కేటగిరిలో 500 సీట్లు, మేనేజ్మెంట్ కేటగిరీలో 2500 సీట్లు ఖాళీగా ఉన్నాయని వారు తెలిపారు. ఇండియన్ నర్సింగ్ నిబంధనల ప్రకారం కన్వీనర్, మేనేజ్మెంట్ కేటగిరీ రెండింటికీ ఒకే రకమైన విధానంతో విద్యార్థులకు ఎంసెట్ అర్హతతో జీరో పర్సంటేజ్‌తో చేర్చుకోవడానికి అర్హత కల్పిస్తూ సర్క్యులర్ జారీ చేయడం జరిగిందన్నారు. అయితే కాళోజీ నారాయణ రావు హెల్త్ యూనివర్సిటీ వారు వరంగల్ కన్వీనర్ కేటగిరికి ఎంసెట్ క్వాలిఫైడ్ జీరో పర్సెంట్ అర్హత కల్పిస్తూ, మేనేజ్మెంట్ కేటగిరికి నీట్ తర్వాత నిబంధన ప్రవేశపెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ నిబంధనలను కాళోజి నారాయణరావు యూనివర్సిటీ పాటించడంలేదన్నారు. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్ఘడ్ ,పంజాబ్, కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రా లు ప్రవేశ ప్రమాణాలు సడలించి నర్సింగ్ విద్యార్థులకు ప్రవేశాలు కల్పించారనీ తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో సైతం నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు మేనేజ్మెంట్ కేటగిరికి నీట్ అర్హత సడలించాలని వారు కోరారు. లేనిపక్షంలో ఎంతో మంది నర్సింగ్ విద్యార్థులు భవిష్యత్తు నాశనమవుతుందని వారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కాళోజి వైద్య విశ్వవిద్యాలయం పెట్టిన నిబంధనలను సడలించాలని విజ్ఞప్తి చేశారు.

శ్రీ వెంకటేశ్వర నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన సంవత్సరం 2024 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు శ్రీపతి, ప్రధాన కార్యదర్శి పి.వీరభద్రరావు, కోశాధికారి బాల్ రెడ్డి, ముఖ్య సలహాదారులు డి.వసంతరావు, అబ్దుల్ బాసిత్, సలహాదారు జే.దేవేందర్, ఉపాధ్యక్షులు నరసయ్య, భగత్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.
నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



'కరాటేలో శిక్షణ ఎంతో ముఖ్యం'

'లీ' అకాడమీ వ్యవస్థాపకుడు బొమ్మ యశ్వంత్

నవతెలంగాణ-హిమాయత్‌నగర్



నేటి సమాజంలో జరుగుతున్న దాడులను ఎదుర్కొవడానికి, ఆత్మరక్షణ కోసం యువతీ, యువకులకు తాయి క్వాండో విద్యా (కరాటే)లో శిక్షణ ఎంతో ముఖ్యమని 'లీ' అకాడమీ వ్యవస్థాపకుడు బొమ్మ యశ్వంత్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాత్రి వేళల్లో అమ్మాయిలు, అబ్బాయిలు ఒంటరిగా వెళుతున్న సమయంలో అకతాయిలు ఎవరు ఎక్కడ నుంచి దాడులు చేస్తారో తెలియని పరిస్థితి నెలకొందని, వారి నుంచి రక్షించుకోవడానికి ఆత్మ రక్షణకు ఈ విద్య ఎంతగానో ఉపయోగపడుతుంద న్నారు. ఈ విద్యను నేర్చుకునేందుకు ఆసక్తిగల చిన్నారులు, యువతీ, యువకులు అమీర్‌పేట్‌లోని ధరంకరం రోడ్డు లోగల వివేకానంద కమ్యూనిటీ హాల్‌లో 'లీ' అకాడమీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. యశ్వంత్ రాష్ట్ర, జాతీయ స్థాయిలో అనేక మెడల్స్‌ను సాధించడం జరిగిందని, అంతేకాకుండా ఎన్నో అవార్డులను సొంతం చేసుకున్నారని గురువులు తెలిపారు. ఈ మెడల్స్ సాధించడం వెనుక తల్లిదండ్రులు, గురువులైన మాస్టార్ జి.ప్రభాకర్ గౌడ్, కె.శ్రీహరి, సీనియర్ కోచ్‌ల సహాయంతో తాయి క్వాండో విద్యను నేర్చుకుని ఎంతో మందికి శిక్షణను ఇస్తూ జాతీయ స్థాయిలో నిలబెట్టడం జరిగిందన్నారు. ఈ విద్య ద్వారా చిన్నారుల్లో ఆత్మరక్షణ, ఫిజి కల్ ఫిట్ నెస్, మెంటల్ ఎబిలిటి పెంపొందించడం కోసం తమ అకాడమీ ద్వారా శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. అకాడ మీలో శిక్షణ పొందిన వారికి సర్టిఫికేట్లు, మెడల్స్, ప్రశంసా పత్రాలను అందజేయడం జరుగుతుందన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ నెంబర్: 8919002564లో సంప్రదించ గలరని ఆయన కోరారు.

భారతీయ సంస్కృతిని పరిరక్షిస్తున్న ఆటా

నవతెలంగాణ-కల్చరల్

విదేశాలలో వృత్తి ఉద్యోగలలో స్థిరపడినప్పటికీ మన దేశ సంస్కృతిని తెలుగు సంప్రదాయాన్ని పరిరక్షిస్తున్న ఆటా కృషి ప్రశంసనీయం అని కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. రవీంద్ర భారతి ప్రధాన వేదిక పై అమెరికా తెలుగు సంఘం వేడుకలు జరిగాయి. ముఖ్య అతిథిగా కిషన్ రెడ్డి జీవిత సాఫల్య పురస్కారం తో ప్రముఖ సినీ నటుడు రాజేంద్ర ప్రసాద్ ను సత్కరించి మాట్లాడారు. రాజేంద్ర ప్రసాద్ నటన సహజ సిద్ధంగా వుంటుందని మానసిక ఆనందానికి అయన సిని మాలు టానిక్ అన్నారు. భారత్ అమెరికా తో పోటీ పడుతోందన్నారు.దేశ అభి వృద్ధిలో ఆటా పాలు పంచుకోవాలని కోరారు. రాష్ట్ర ఐ.టీ.శాఖా మంత్రి డీ.శ్రీధర బాబు మాజీ మంత్రి టీ.హరీష్ రావులు అమెరికాలో ఉన్నపటికీ తెలుగు భాష సంస్కృతి ని ప్రేమిస్తున్న అట సభ్యులను అభినందించారు. అట అధ్యక్షుడు మధు మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాలలో విద్య వైద్య సేవా కార్యక్రమాలు నిర్వహి స్తూన్నమని తెలిపారు. ఎలెక్ట్ ప్రెసిడెంట్ జయంత్ చల్లా సభ్యులు సతీష్ రెడ్డి,కాశీ భీమ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. పలువురు శాసన సభ్యులు మండలి సభ్యులు హాజరు అయ్యారు.

బంగారు తెలంగాణ నాట్య సంరంభం

నవతెలంగాణ-కల్చరల్



బంగారు తెలంగాణ ఫోక్ ఆర్ట్స్ అకాడమీ నిర్వహణలో తెలంగాణ వజ్రా యుధం పేరిట భిన్న ప్రక్రియలలో నృత్య అంశాలు సినీ గేతల ప్రదర్శన శ్రీ త్యాగ రాయ గాన సభ ప్రధాన వేదిక పై జరిగింది. దీనిలో ప్ప్రదానం గా అయ్యప్ప నృత్య రూపకం ఆకర్షణీయంగా నిలిచింది. నాట్య గురువులు వాణి శ్రీ, స్వప్న,విక్కీ మాస్టర్ శిష్య బృందం తో పాటు రాజ రాజేశ్వరి కూడా నృత్యాలు నర్తించారు.. మోజెస్, వేణు మాధవ్ బృందం సినీ గీతలు మధురం గా గానం చేశారు. అకాడెమీ స్థాపకుడు విక్కీ మాస్టర్ తమ సంస్థ 143 వ కార్యక్రమం అని తెలిపారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని ప్రాంత కళాకారులను ఎంకరేజ్ చేశారని వారికి కార్యక్ర మం అంకితం అన్నారు. కళా కారులకు బంగారు తెలంగాణ షోలో పాల్గొన్న జాహ్నవి, కావ్యాలకుజ్ఞాపిక లు బహుకరించారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తులను పట్టుకున్న టాస్క్ ఫోర్స్ పోలీసులు

నవతెలంగాణ-ఓయూ

గంజాయిని అక్రమంగా తరలిస్తూ ,విక్రయిస్తున్న ఇద్దరినీ ఉస్మానియా యూని వర్సిటీ పోలీసులతో కలిసి సౌత్ ఈస్ట్ జోన్ టాస్క్ ఫోర్స్ బృందం పట్టుకుంది. పోలీ సులు తెలిపిన వివరాల ప్రకారం ఓయూ పోలీస్ స్టేషన్ పరిధిలోని హబ్సిగూడలో గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారంతో పొలుసులు దాడులు నిర్వహించి కను కుర్తి సాయినవీన్ అలియాస్ కుల్ఫీ (27)ను ఆది వారం పోలీసులు అదుపులోకి తీస ఎకున్నారు. ఈ సందర్భంగా అతడి విచారిస్తే సూర్యాపేట జిల్లాకు చెందిన చాట్ల వంశీ (19) నుంచి కొనుగోలు చేసినట్లు తెలిసింది. దింతో వంశీని అదుపులోకి తీసుకొని విచారిం చగా అతను డిసెంబర్ 2023లో ఒడిశా నుంచి 3 కిలోలు కొనుకొచ్చినట్లు పోలీసులకు తెలిపాడు. తెచ్చిన 3 కిలోల్లో 2 కిలోలు సాయి నవీన్‌కు అమ్మగా మిగి లిన 1 కిలోను తనే విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నాడు. నవీన్ నుంచి 1.7 కిలోలు, వంశీ నుంచి 900 గ్రాముల గంజాయితో పాటు ఒక సెల్ ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటికే



వివిధ పోలీస్,ఎక్సైజ్ స్టేషన్‌లలో సాయి నవీన్ పై 6 ఎన్‌డి పిఎస్, రెండు ఇతర కేసులు, వంశీ పై ఒక ఎన్‌డిపీఎస్ కేసు, మూడు ఇతర కేసులు నమోదైయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు.

నవవధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ- బంట్వారం



వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని మద్గుల్ చిట్టెంపల్లి గ్రామంలో జరిగిన వివాహ వేడుకకు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ఆదివారం హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీజేపీ నాయకులు శేరి అనంతరెడ్డి

నవతెలంగాణ-శంకరపల్లి

బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన శేరి అనంతరెడ్డి మరో 20 మంది చేవెళ్ల నియోజక వర్గ అసెంబ్లీ ఇన్‌చార్జి పామెన భీమ్ భరత్ ఆధ్వర్యంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. బీజేపీ, బీఆర్ఎస్‌కు చెందిన గుడి మల్కాపూర్ మార్కెట్ మాజీ డైరెక్టర్ శేరి అనంత రెడ్డి , రాకేష్, మల్లికార్జున్, రాజు, పరమేష్, రమేష్, శ్రీనివాస్, శేఖర్, గోపాల్ కృష్ణ, రవి, శ్రీకాంత్, వెంకటేష్, బిక్షపతి , జగదీష్, దశరథ్, భారత్, శ్రీధర్, అశోక్ ,ప్రశాంత్ ,మల్లేష్ ,సతీష్ విక్రమ్ , సాయి కిషోర్ , సాయి చందు ,పలువురు గ్రామస్తులు కాంగ్రెస్ పార్టీలో కలిశారు. దీంతో ఆయన కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న లోకల్ బాడీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. అపుడే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని తెలిపారు.

రామ మందిరం అక్షింతలు అందరికీ పంచుతాం

నవతెలంగాణ-తుర్కయంజాల్

శ్రీరామ జన్మభూమి అయోధ్యలో భవ్యమైన రామ మందిరం జనవరి 22 న ప్రారంభం కాబోతుంది. ఈ సందర్భంగా అయోధ్య రామ మందిరం నుండి శ్రీరాముని దివ్య అక్షింతలు ఆదివారం కుర్మగూడకు రావడం జరిగింది, ఇందులో భాగంగా హనుమాన్ దేవాలయం నుండి ఊరేగింపు చేయడం జరిగింది. అక్షింతలు నేడు కుర్మగూడలో ఇంటింటికీ అందజేయడం జరుగుతోందన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు బొడ్డు శ్రీను, గణేష్, గంగాధర్, జశ్వంత్ రెడ్డి, కె శ్రీను, కె నర్సింహ, కె వరప్రసాద్, బి కుమార్, నరేష్, కార్తిక్, శివ, కిషోర్ పాల్గొన్నారు.

యువత స్వయం ఉపాధిపై దృష్టి సారించాలి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

నవతెలంగాణ-కొత్తూరు

యువత ప్రభుత్వ ఉద్యోగాలకై ఎదురు చూడకుండా స్వయం ఉపాధిపై దృష్టి సారించి వ్యాపార రంగంలో రాణించాలని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కొత్తూరు మున్సిపాలిటీ కేంద్రంలోని పెంజర్ల రోడ్డులో నిర్వాహకులు మొహమ్మద్ యూసుఫ్, అస్లం, షాదుల్ గౌస్ లు నూతనంగా ఏర్పాటు చేసిన ఆల్ నూర్ బిర్యాని హౌస్ ఫాస్ట్ ఫుడ్ సెంటర్ ను మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి లు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... వినియోగదా రుల మన్ననలు పొందే విధంగా ఉంటూ వారికి నాణ్యమైన భోజనాన్ని అందించి వ్యాపారాన్ని మరింత అభివృద్ధి చేసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు గొంగోళ్ల హరినాథ్ రెడ్డి, ఉమ్మడి మండలాల మాజీ ఎంపీపీ మంచాన్‌పల్లి శివశంకర్ గౌడ్, మున్సిపల్ చైర్ పర్సన్ బాతుక లావణ్య దేవేందర్, నాయకులు వీరముని దేవేందర్ ముదిరాజ్, రాజు, మల్లేష్, జహంగీర్ జీ, బ్యాంకు సురేష్, డిష్ వెంకటేష్, నందిగామ ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.





గెలుపునకు నాంది సిద్దాపూర్

- షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

నవతెలంగాణ-కొత్తూరు

షాద్‌నగర్ నియోజకవర్గం ఎమ్మెల్యేగా గెలుపొందిన నాకు నాంది సిద్దాపూర్ అని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండలంలోని సిద్ధాపూర్, గ్రామంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు యెల్లరం శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన విజయోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సిద్దాపూర్ చేరుకున్న ఎమ్మెల్యేకు గ్రామస్తుల నుండి ఘన స్వాగతం లభించింది. భారీ గజమాలతో గ్రామ యువకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. నియోజకవర్గానికి ఈశాన్యం దిశగా ఉన్న సిద్దాపూర్ గ్రామం నుంచి ప్రచారం ప్రారంభించానని అన్నారు. సిద్దాపూర్ ప్రజల చల్లని ఆశీర్వాదంతో తనకు సంపూర్ణ మద్దతు ప్రకటించి భారీ మెజారిటీ అందించారని అన్నారు. గ్రామ ప్రజల రుణము తీర్చుకోలేనిదని సమస్యల పరిష్కారానికి శేఖర్ రెడ్డితో కలిసి గ్రామాన్ని వివిన్న రంగాల్లో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. దోచుకొని దాచుకోవడం తప్ప గ్రామానికి బీఆర్ఎస్ నాయకులు ఒరగబెట్టిందేమి లేదని అన్నారు. అనంతరం ఆయన గ్రామానికి చెందిన మహిళలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్యాంసుందర్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు గొంగళ్ల హరినాథ్ రెడ్డి, మాజీ ఎంపీపీ శివ శంకర్ గౌడ్, ఎంపీటీసీ డాకియా, ఎస్ బి పల్లి సర్పంచ్ అంబటి ప్రభాకర్, కొత్తూరు మాజీ సర్పంచ్ జండాగూడెం సుదర్శన్ గౌడ్, మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ జంగయ్య, గ్రామ కమిటీ అధ్యక్షులు రవీందర్ రెడ్డి, జి కుమార్, లింగ నోళ్ళ రామయ్య, మైనార్టీ అధ్యక్షులు మొహమ్మద్ ఖాజా, చెన్నారెడ్డి, గుబ్బ రాజయ్య, మహేందర్ రెడ్డి, సురేందర్ రెడ్డి, జాఫర్, తిరుపతిరెడ్డి, పాషా, బైండ్ల కృష్ణయ్య, దొబ్బల మైసయ్య, వడ్డే వెంకటయ్య, పారేశా, గుండెమోని యాదయ్య షరీఫ్, బాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి వ్యక్తి జ్ఞాన యోగీ కావాలన్నదే పత్రీజీ సంకల్పం





- ముగింపు సమావేశంలో పలువురు వక్తలు
- కన్నుల పండువగా 11 రోజుల పాటు వేడుకలు
- కైలాలపురిలో అంబరాన్నంటిన ధ్యాన సంబురాలు
- ప్రపంచ నలుమూలల నుంచి హాజరైన ధ్యానులు
- ముగింపు రోజు సందర్శకులతో కిటకిటలాడిన పిరమిడ్ ప్రాంగణం

నవతెలంగాణ-ఆమనగల్

ప్రతి వ్యక్తి జ్ఞాన యోగి కావాలన్నదే పత్రీజీ సంకల్పం అని పలువురు వక్తలు అన్నారు. యాగానికి సహాయ సహకారాలు అందించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు. ది హైదరాబాద్ పిరమిడ్ స్పిరి చ్యువల్ ట్రస్ట్ చైర్మెన్ విజయ్ భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు ప్రపంచ నలుమూలల నుంచి విచ్చేసిన ధ్యానుల కోసం సకల ఏర్పాట్లు చేశారు. ప్రాంగణంలో అడుగుపెట్టిన ప్రతి ఒక్కరు మొదట పత్రీజీ శక్తి స్థల్ వద్ద నివాళ్లర్పించారు. 2024 రాబోయే పత్రీజీ మహిళ ధ్యాన మహా యాగం వేడుకలను ఘనంగా నిర్వహిస్తామని వారు ప్రకటించారు. పత్రీజీ భౌతికంగా లేకపోయినా ఆయన మీద ఉన్న అభిమానంతో లక్షలాదిమంది ధ్యానులు హాజరై వేడుకలు విజయవంతం చేయడం అభినందనీయం అన్నారు. అనంతరం యాగానికి సకల సౌకర్యాలు కల్పించిన హైదరాబాద్ ట్రస్ట్ సభ్యులను, సంగీత విద్వాంసులను, ట్రస్ట్ సభ్యులను పత్రీజీ కూతురు పరిణతి పత్రీ ఘనంగా సన్మానించారు. ఈ 11 రోజులు ధ్యాన వేదికపై పలువురు కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు, గీతాలాపనలు అలరించాయి. నిర్వాహకులు పిరమిడ్ ఆవరణలో ఉచిత భోజన, వసతి సౌకర్యాలు కల్పించారు. కళాకారులు, కవులు, ఆధ్యాత్మిక వేత్తలను పిరమిడ్ నిర్వాహకులు సత్కరించి అభినందించారు. ఆధ్యాత్మిక గీతాలు, ధ్యాన గురువుల సందేశాలతో ధ్యాన సంబరాలు అంబరాన్నంటాయి. కార్యక్రమంలో పిరమిడ్ ట్రస్ట్ సభ్యులు సాంబశివరావు, హన్మంతరాజు, బాలకృష్ణ, లక్ష్మి, శ్రీరామ్ గోపాల్, జయశ్రీ, సౌమ్యకృష్ణ, దామోదర్ రెడ్డి, శివ ప్రసాద్, మాధవి, రాంబాబు, మారం శివప్రసాద్, చంద్రశేఖర్, కేశవరాజు, భారతి దామోదర్ రెడ్డి, సునీత బాలకృష్ణ, సురేష్, పత్తి రవి కుమార్, పిఎంసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు నవకాంత్, ఆనంద్, అనుమాస్ పల్లి సర్పంచ్ శంకర్ దితరులు పాల్గొన్నారు.



జూబ్లీహిల్స్‌లో డ్రగ్స్ గుట్టు రట్టు

నవతెలంగాణ-బంజారా హిల్స్

న్యూ ఇయర్ సందర్భంగా యువతి యువకులే టార్గెట్‌గా డ్రగ్స్ దందా కొనసాగుతున్న సందర్భంలో డ్రగ్స్ సరఫరా చేస్తున్న ఇద్దరు యువకులను వెస్ట్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్న ఘటన ఆదివారం డివిజన్ పరిధిలో చోటు చేసుకుంది. ఈ సందర్భంగా పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం లీల నవీన్ సాయి (25) తెనాలి గుంటూరు జిల్లా, బొర్రా వీరసాయి (25)ఒంగోలుజిల్లాలకు చెందిన వారు. వీరికి సొంత కార్ల వ్యాపారం ఉన్నది. వీరు ఇరువురు నగరంలోని మనికొండ ప్రాంతంలో నివాసముంటున్నారని తెలిపారు. వీరు డ్రగ్స్‌ను ఆర్డర్ ద్వారా సరఫరా చేస్తున్నారని, నూతన సంవత్సర యువతి యువకులను టార్గెట్ చేసుకుని బ్రౌన్ షుగర్ ఇతర మాదక ద్రవ్యాలును సరఫరా చేస్తున్నారని సమాచారంతో పోలీసులు వారిని పట్టుకున్నారు. సుమారు 7లక్షల50 వేల సొత్తు భారీగా పరు చు కొని అదుపులోకి తీసుకున్న వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు వీరిని జూబ్లీహిల్స్



పో లీసులకు అప్పచెప్పారు. డ్రగ్ ఫ్లేడా ర్‌తో పరిచయం ఉన్న వీరికి ఢిల్లీ నుంచి దిగుమ తి అవుతున్నట్లుతెలుస్తోంది. మాదక ద్రవ్యాలలో బ్రౌన్ షుగర్ 5.వేలకు, డ్రగ్స్ రూ.10 నుంచి రూ.15 వేలకు ఇతర 20 వేల పై చిలుకు అమ్ముతఃన్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైందని తెలిపారు.

IN THE COURT OF THE HON'BLE IV ADDL JUNIOR CIVIL JUDGE, CUM IV ADDITIONAL METROPOLITAN MAGISTRATE RANGA REDDY DISTRICT: AT L.B.NAGAR
O.S No. 399 OF 2020

Between:
M/s Jasper Industries Private Limited
Commercial vehicle dealer
Vasantha Cambers,
5-10173, FaitehMaidan Road
Basheerbagh, Hyderabad
Rep by its Authorized Signatory
.....Plaintiff

AND

JillelaShankaraih, S/o J.Yadaiah
Aged Major, Occ: Not known
R/o H.No. 5-297, Sai Nagar Colony,
Saroornagar, Rangareddy
Jillalaguda - 500072
.....Defendant

The Plaintiffhasfiled this OSNo. 399/2020 against the defendants for recovery of 2,51,753/- with interest @ 24 % p.a on the claim amount from the date of the suit till realization.
The OS is posted on 10.01.2024for appearance. Objections if any may be filed by 10.30 AM on 10.01.2024

// By order of the Honourable Court//
V.R.N.Prashanth, Advocate,
6-3-533-535, Villa No.7, Pavani Villas, Dwarakapuri Colony, Punjagutta, Hyderabad-82. 9989019530

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జగ్గయ్యపేట
I.A. No. 1/2022 In O.S. 4/2022

బిట్వీన్ :
వంగర ధనలక్ష్మి ....పిటీషనర్/వాది
మరియు
సంగెపు వెంకట నాగేశ్వరరావు సాయి మరియు ఇతరులు ....రెస్పాండెంట్స్/ప్రతివాదులు

టు,
ఆర్1) సంగెపు వెంకట నాగేశ్వరరావు సాయి, తండ్రి : లేటు పుల్లయ్య, వయస్సు : 54 సం.లు, వృత్తి : ఫోటోగ్రాఫర్, ఇ.నెం. 12-6-2/230, 503, వివేక్‌నగర్, కూకట్‌పల్లి, హైదరాబాద్.

పైన తెలిపిన రెస్పాండెంట్‌కి తెలియజేయునది ఏమనగా, పైన నెంబర్ దావాలోని పిటిషనర్/వాది అయిన వంగర ధనలక్ష్మి గారు మీపై మరియు ఇతర రెస్పాండెంట్స్‌పై దావాలో తెలిపిన ఆస్తులపై తనకు రావలసిన వాటా నిమిత్తం దావా వేసి యున్నారు. **సదరు దావా నందు మీ హాజరు నిమిత్తం ది. 22.01.2024న వాయిదా ఉన్నది.** కావున సదరు వాయిదా రోజు ఉ.గం. **10.30 ని॥లకు** మీరు స్వయంగా గానీ, మీ న్యాయవాది ద్వారా గాని పైన తెలిపిన కోర్టు నందు హాజరై మీ అక్షేపణలు తెలుపుకోగలరు. లేనిచో మీ పరోక్షములలో తీర్మానించబడునని తెలియజేయడమైనది.
(కోర్టు వారి అనుమతితో)

జగ్గయ్యపేట ఇట్లు
ది.31.12.2023
G.V. PRASAD
SD ZIA UL HASSAN
SK. SALEEMMIYA
G. SAVITHA
SHOBA THORANE
Advocates, Kothagudem
Cell :9440135725

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జగ్గయ్యపేట
O.S. No. 4/2022

బిట్వీన్ :
వంగర ధనలక్ష్మి ....వాది
మరియు
సంగెపు వెంకట నాగేశ్వరరావు సాయి మరియు ఇతరులు .....ప్రతివాదులు

టు,
డి1) సంగెపు వెంకట నాగేశ్వరరావు సాయి, తండ్రి : లేటు పుల్లయ్య, వయస్సు : 54 సం.లు, వృత్తి : ఫోటోగ్రాఫర్, ఇ.నెం. 12-6-2/230, 503, వివేక్‌నగర్, కూకట్‌పల్లి, హైదరాబాద్.

పైన తెలిపిన ప్రతివాది తెలియజేయునది ఏమనగా, పైన నెంబర్ దావాలోని వాది అయిన వంగర ధనలక్ష్మి గారు మీపై మరియు ఇతర ప్రతివాదులపై దావాలో తెలిపిన ఆస్తులపై తనకు రావలసిన వాటా నిమిత్తం దావా వేసి యున్నారు. సదరు దావా నందు **మీ హాజరు నిమిత్తం ది. 22.01.2024న** వాయిదా ఉన్నది. కావున సదరు వాయిదా రోజు ఉ.గం. **10.30 ని॥లకు** మీరు స్వయంగా గానీ, మీ న్యాయవాది ద్వారా గాని పైన తెలిపిన కోర్టు నందు హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోగలరు. లేనిచో మీ పరోక్షములలో తీర్మానించబడునని తెలియజేయడమైనది.
(కోర్టు వారి అనుమతితో)

జగ్గయ్యపేట ఇట్లు
ది.31.12.2023
G.V. PRASAD
SD ZIA UL HASSAN
SK. SALEEMMIYA
G. SAVITHA
SHOBA THORANE
Advocates, Kothagudem
Cell :9440135725

PUBLIC NOTICE

Public are hereby informed that **Boddupalli Venu S/o. B. Nagabhushanam** has approached my clients P.N.B. Housing Finance Limited for availing loan facilities by offering the property comprising of Plot No.20/Eastern Part, admeasuring 200.00 Sq.yards, in Survey Nos.522, 523 and 525, situated at Pedda Amberpet Village and Nagara Panchayat, Hayathnagar Revenue Mandal, R.R.District. It is represented that two of the original link documents i.e., (i) A.G.P.A. Document No. 1783/2008, Dt: 09.04.2008, registered before S.R.O., Pedda Amberpet, executed by R.Malathi in favour of Akula Srinivas and K.Gopal Reddy and (ii) Sale Deed Document No.2603/2008, Dt: 07.06.2008, registered before S.R.O., Pedda Amberpet, executed by R.Malathi, rep. by her A.G.P.A. Holders in favour of V.Madhusudhan Reddy are lost and that the same are not traceable. Any person finding the same, please handover the same to the undersigned, within 10 days from the date of publication of this notice.
Any person or persons having any objections or any claims of any nature in respect of the said property or in respect of the said loan transaction may meet the undersigned, between 10:30 A.M. to 5:00 P.M., with prior appointment, together with all relevant documents, within 10 days from the date of this notice. Any objections/claims made thereafter shall not be entertained and shall be deemed to have been waived and my clients will proceed with the said loan transaction.

Sd/-
(G.VENKATASUBBAIAH) Advocate.
Office No.221, 2nd Floor, Kubera Towers, Narayangugda, Hyderabad.-29
Cell: 9866573130

IN THE COURT OF THE VI ADDL. DISTRICT JUDGE :: RANGA REDDY DISTRICT: AT : KUKATPALLY
O.S.NO. 181 OF 2021

Between:
G.Shoba & another .....Plaintiffs
AND
E.Yadaiah & others .....Defendants

To,
B.Swaroopa W/o. B.Avinash,
R/o. H.No. 1-32/4, Madhapur Village, Serilingampally Mandal, Ranga Reddy District &
H.No. 7-1-395/II, Plot No.133/ Business, Sanjeeva Reddy Nagar, Hyderabad.
.....Defendant No.9

Take notice that the Plaintiffs filed the above case in O.S.No. 181 of 2021 seeking partition and separate possession of their share in respect of suit schedule properties before the Hon'ble VI Addl. District Judge, Ranga Reddy District, at Kukatpally against you and other defendants. The said case stands posted to **29-01-2024** for your appearance. Please make it convenient to appear either in person or through duly instructed agent on the said date at 10.30 a.m. before the Hon'ble Court, as otherwise, the Hon'ble Court will proceed with the matter in your absence.

// BY ORDER OF THE COURT //
G.KRISHNA B.COM, LLB.
ADVOCATE
H.NO.11-99, Prasanthi Nagar Colony, Road No.4, Near Vijaya Durga Bhavani Temple, Serilingampally, Hyderabad-500019. Mob : 97044-40216

IN THE COURT OF THE HON'BLE X JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT AT HYDERABAD
O.S NO. 5456 OF 2023

BETWEEN:-
Mr.Sripathi Vittal Panduranga Rao and others .... Plaintiffs
AND
The Tahsildar and another .... Defendants

Please take notice, the above named plaintiffs filed a SUIT FOR LEGAL HEIRS OF THE DECEASED SMT. SRIPATHI NAGALAXMI to be effected by the defendants. If anyone having any objection/Claim for grant of above relief may appear on **08-1-2024** at 10:30am before the said court, falling which the matter will be disposed off in accordance with law.

(BY ORDER OF THE COURT)
D. Vishal Anand, Tharun Raj. Advocates
2-2-147/A, First Floor, Above UCO Bank, M.G. Road, Secunderabad. 9246102037

NOTICE
IN THE COURT OF THE HON'BLE ADDL., JUNIOR CIVIL JUDGE RANGA REDDY DISTRICT AT HAYATHNAGAR.
O.S. No. 931 of 2023

Between:
A. Krishna Reddy and others. .....Plaintiffs
And
The Tahsildar, Office of Abdullapurmet Mandal, At, Abdullapurmet V & M, Ranga Reddy Dist., and others. .....Defendants.

To.
All concerned.

Take notice that the plaintiffs filed the above suit to declare them as class-I legal heirs of late Amuram Yadamma, and to succeed to the said property, of 1) all that the piece and parcel of Plot No. 30 (South-East part) totally admeasuring 156 sq. yards or 130.43 sq. mtrs., forming part of Sy. Nos. 101/P and 102/P situated at Pedda Amberpet village, Abdullapurmet mandal, R.R.District and bounded by: **North**: Plot No. 30 (North-East part); **South**: Plot No. 31; **East**: 25 ft. wide road; **West**: Plot No. 30 (Western part), 2) all that piece and parcel of Plot No. 30 (Northern part) admeasuring 32 sq. yards or 26.75 sq. mtrs., forming part of Sy. Nos. 101/P and 102/P situated at Pedda Amberpet village, Abdullapurmet mandal, R.R District and bounded by: **North**: Balijaguda village 30 feet wide road; **South**: Plot No. 30 (South part); **East** : 25 ft. wide road; **West**: Neighbors Land and 3) all that house premises bearing Unit No. HDL/126, admeasuring 240 sq. yards, II-Phase forming part of Sy.No.491, situated at Raipole village (Dream City-II), Sagar Block, Ibrahimpatnam Mandal, R.R. District and bounded by: **North**: Unit No.HDL-127; **South**: Unit No. HDL-125; **East**: Unit No.HDL-75; **West**: 33ft. wide road. Anyone having objection/s over the same may appear before the above Court on 23-01-2024 at 10.30 a.m either in person or through an authorized Advocate and answer the claim of the plaintiffs, failing which the matter will be decided as per material available on record.

Office at, D/No 1-5, Ragannaguda, Sagar Road, R.R. District.501 510.
(M) 98482 92515
//By order//
Nagam Srinivas Reddy K.Dhanpal Reddy, Advocates.
D.No.1-05, Ragannaguda, Sagar Road, Hayath Nagar (M) RR Dist-501 510.
Mobile: 9846292515, 7569512132

IN THE COURT OF THE HON'BLE V JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT HYDERABAD DISTRICT AT HYDERABAD.
O.S. NO. 4917 OF 2022

Between:
M/S INDIAN BANK
KHAIRTABAD BRANCH, H.No.6-1-1019, Sensation Theatre road, Khairthabad, Hyderabad, Telangana, PIN-500014
Represented by it's Branch Manager. ...Plaintiff
AND
Smt.Golla Bhagyasri ...Defendant

NOTICE TO DEFENDANT

Smt. Golla Bhagyasri W/o. G. Krishnaiah aged 32 years, Occ: Business R/o.H. No.3-97, Gayathri Nagaram, Near BJP Office, Kukatpally, Hyderabad- 72.

You, the Defendant of the above case is hereby informed that, the plaintiff bank has filed a suit against you to recover a loan of Rs. 1,22,335/-. The case is posted to **25-01-2024** for your appearance. Therefore, you are hereby informed to appear on the said date at 10-30 AM before the aforesaid court either in person or through counsel and submit your reply. Failing which the matter will be heard and exparte orders will be passed.

//BY ORDER OF THE COURT//
P.VENKATESHWAR RAO
Advocate,
H.NO. 13-23-134, Flat No. 401, Sony Sai Residency, T.Nagar, Kothapet, Hyderabad- 35.

IN THE COURT OF THE HON'BLE IIrd JR. CIVIL JUDGE, CITY CIVIL COURTS AT : HYDERABAD
OS No. 2711 of 2020

Between :
State Bank of India
RACPC-Himayathnagar .....Plaintiff
And
Mrs. Rajeshwari Ganjinala (Died) & others .....Defendants

To
G. Santosh
S/o. Late Mrs. Rajeshwari Ganjinala, H.No. 18-1-292/47/A/26, Shivaji Nagar, Uppududa, Hyderabad-3.

NOTICE

The abovenamed plaintiff filed suit for Money Recovery against both of you for Rs. 5,73,892/- (Rupees Five Lakhs Seventy Three Thousand Eight Hundred and Ninety Two only) before the Hon'ble IInd Jr. Civil Judge, City Civil Courts, at Hyderabad. The Hon'ble Court has directed notice against you through paper publication and the matter is posted to **05-01-2024** for your appearance. You have to appear before Hon'ble IInd. Jr. Civil Judge, City Civil Courts, at Hyderabad, at 10-30 AM or If you fail to appear before Hon'ble Court, the matter will be heard and you are set exparte.

By order of the Hon'ble IInd. Jr. Civil Judge,, City Civil Courts, at Hyderabad
M.P. SANJAY
Advocate for the Plaintiff
H.No. 31, Tarbund Bazar, Tarbund, Secunderabad – 500 009
Ph : 040-29558473, Cell : 8885625424

తొలగిన ముళ్ల కంచెలు, నిర్బంధాలు..



- కాంగ్రెస్ రాకతో ఊపిరి పీల్చుకున్న ఓయూ
- ఊ అంటే అరెస్ట్, ఉద్యమిస్తే ఉద్యమకారుల విద్యార్థులపై కేసులు ..
- ఓయూలో ఔట్ పోస్ట్, ప్రత్యేక పీఎస్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదన..
- విద్యార్థులతో ఫ్రెండ్లీగా నాటి ఏసీపీ, ఇన్‌స్పెక్టర్‌లు

నవతెలంగాణ-ఓయూ

నాటి వందేమాతర ఉద్యమం నుండి, నేటి ప్రత్యేక తెలంగాణ ఉద్యమ వరకు సమాజంలో ఎక్కడ అన్యాయం జరిగినా ప్రశ్నిస్తూ అట్టడుగు వర్గాల ప్రజలకు అండగా ఉద్యమ గొంతుక ఓయూ వేదికగా అనేక పోరాటాలు చేశారు. అటువంటి చరిత్ర కలిగిన ఓయూ తెలంగాణ ఉద్య మంలో ఓ ప్రధాన భూమిక పోషిం చింది. కానీ అటువంటి ఓయూ గత ప్రభుత్వం అధికారంలో వచ్చిన వెంటనే గతం మాజీ సీఎం కేసీఆర్ సికింద్రాబాద్ ఎన్నికల ప్రచారానికి వెళ్లే సమయంలో కొందరు హెలిప్యాడ్ వద్ద చెప్పులు చూపి నిరసన వ్యక్తం చేసిన విషయం తెల్సిందే. దానిని మనసులో పెట్టుకొని ఓయూ పట్ల కొందరు వేరే విధంగా వ్యహ రించారు. ఇక ఓయూ నిర్బం ధంలోకి నెట్టేశారని, అడుగడుగునా ఆంక్షలు, అక్రమ అరెస్టులు, ముళ్ల కంచెలతో విద్యార్థుల హక్కు లను కాలరాస్తూ ప్రశ్నించే గొంతుకులను నొక్కేశారని తెలిపారు. ఓయూ అధికారులు కేసీఆర్ అడుగులకు మడుగులు ఒత్తిన ప్రభుత్వ వ్యతిరేక గొంతు వినిపించకుండా క్రియాశీలకంగా పనిచేసి ఆర్ట్స్ కాలేజ్ అంటే కేవలం ప్రభుత్వ అనుకూల కార్యక లాపాలు తప్ప వ్యతిరేక గొంతు వినిపియ్యకుండా చేయడం అత్యం త దుర్మార్గంగా వ్యవహరించారన్నారు. వందేండ్ల ఓయూ చరిత్ర లో బహుశా ఇంతటి నిర్బంధాన్ని ఎప్పుడు చూడకపోవచ్చు.

ముళ్ల కంచెలు,భారీగ్రేడ్స్, మాజీ ఆర్మీ ఉద్యోగులతో సెక్యూరిటీ

ఓయూ అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ చుట్టు ముళ్లకంచెలతో, మాజీ ఆర్మీ సైన్యం ఉద్యోగులను ఇక్కడ అధికారులు విద్యార్థుల సమస్యలు చెప్పుకునేందుకు వీలు లేకుండా అడుగడుగునా అడ్డం కులను సృష్టించి గ్రామీణ ప్రాంతాల నుండి ఉన్నతకు విద్యకు వచ్చే విద్యార్థులను అనేక ఇబ్బం దులను గురిచేసింది. పరిపాలనా భవన్‌లో కొన్ని గేట్లు మూసివేసి, భారీగ్రేడ్స్ ఏర్పాటు చేశారు.

ఊ అంటే అరెస్ట్, ఉద్యమిస్తే, ప్రశ్నిస్తే కేసులే

ఇక గతంలో కన్న భిన్నంగా ఏదైనా పిలుపు ఇచ్చిన వేళా పోలీసులు నేరుగా విద్యార్థుల రూమ్స్ వెళ్లి అరెస్ట్ చేయడం, తెలంగాణ ఉద్యమంలో కూడా లేనంతగా ఓయూను పోలీసుల స్తావరంగా మార్చారు. విద్యార్థులు ఏ చిన్న ఆందోళన, ముట్టడికి పిలుపు ఇచ్చిన పోలీసులు రెట్టింపు సంఖ్యలో మొహరించారు. ఇది ఒక ఎత్తు అయితే ఇక ఇంటిలిజెన్స్, ఎస్బీ లాంటి నిఘా వర్గాలు ఇక్కడ రెట్టింపు సంఖ్యలో తరలివచ్చి ఇక్కడ ఎక్కడ ఏం జరిగిన వెంటనే ఉన్నత అధికారులకు చేరవేశారు.

ఓయూలో ఔట్ పోస్ట్, ప్రత్యేక పీఎస్ ఏర్పాటు కోసం నాడు యత్నాలు

అధికారుల వైఖరితో విద్యార్థుల, విద్యార్థి నేతలపై కేసులు మునుపెన్నడూ లేనంతగా నమోదు చేయడం, వాస్తవానికి ఓయూలో గత ప్రభుత్వం హయాంలో ఇక్కడ ఏసీపీ, ఇన్‌స్పెక్టర్స్ గా ఓయూ పూర్వ విద్యార్థులే ఉండటంతో వారు విద్యార్థుల పక్షనే ఫ్రెండ్లీ పోలీసులుగా వ్యహ రించారు. కానీ ఇది గిట్టని ఈ



విషయం లో ఓయూ పెద్ద ఏకంగా వీరిపై సీపీ వద్ద వీరిని బదిలీ చేయాలని పలుమార్లు ఫిర్యాదు కూడా చేశారు. ఓయూలో నాన్ బోర్డర్స్ ఏరివేత కోసం " పరి మిషన్‌ను తీసుకు వచ్చారు. ఓయూ పరిపాలనా భవన్ ఎదుట ఔట్ పోస్ట్ ఏర్పాటు చేయా లని, కొన్ని సందర్భాల్లో విద్యార్థులతో పరిపాలన వ్యహారాలు ఇబ్బందులు ఉన్నాయని, తనకు గన్ మేన్స్ ఇవ్వలని కూడా నాటి సీపీ దృష్టికి తీసుకు వెళ్లారు. అంతటితో ఆగకుండా ఓయూకు ప్రత్యేకంగా పీఎస్ కూడా ఏర్పాటు చేయాలని కోరగా, అలాంటి అవసరం లేదని మేమున్నాం అంటు, పిల్ల లతో వీరు సఖ్యతగా లేరని అందుకే ఇలా విద్యార్థులు ఉద్యమిస్తున్నట్లు వారికి వివరించారు. మేము ఎలాంటి సమస్యలు రానివ్వం అని తెలియజేశారు. నాటి ఏసీపీ,ఇన్‌స్పెక్టర్‌లు, ఇక ఓయూలో ఈ అధికారి వచ్చాక సమాచారం కోసం భారీగానే ఆర్టీఐ దరఖాస్తు చేసుకొన్నారు. కానీ కొన్ని కీలకమైన ఆర్టీఐలకు సకాలంలో సమాచారాన్ని కూడా సకాలంలో ఇవ్వవలేదని విద్యార్థులు, ప్రొఫెసర్స్ వాపోయారు.

కాంగ్రెస్ రాకతో మారిన ఓయూ ముఖచిత్రం.. స్వేచ్ఛ వాతావరణంలోకి ఓయు



మొన్న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపొందడంతో ఉస్మానియా యూని వర్సిటీ ఊపిరి ఊపిరి పీల్చుకుంది. స్వేచ్ఛ వాయులు పీల్చే అవకాశం వచ్చిందని విద్యార్థులు మళ్లీ ఓయూకి పూర్వ వైభవం వచ్చిందని చాలా సంతోషించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండవ రోజే విద్యార్థులు ఓయూ వీసీతో వాగ్వాదానికి దిగారు. ప్రగతిభవన గేట్లు బద్దలు కొట్ట డంతో, విద్యార్థు లంతా ఏకమై ఓయూలోని ముళ్లకంచెలు తొలగిం చారు. ఈ సందర్భంగా యూనివర్సిటీలో చదువు కునే విద్యార్థులు ప్రొఫెసర్లు, నాన్ టీజింగ్, ఉద్యోగులు, సిబ్బంది మళ్లీ మనకు పాత రోజులు వచ్చాయని గుర్తు చేసుకుంటూ సంతోషిస్తున్నారు.

యంగ్ స్టార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు



- మాజీ ఉపాధ్యక్షుడు ప్రతాప్

నవతెలంగాణ-కంటోన్మెంట్

యంగ్ స్టార్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం న్యూ బోయినపల్లి జామియా మస్జిద్ మైదానంలో అండర్ 22 టెన్నిస్, క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ కార్య క్రమానికి ముఖ్య అతిధులుగా కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు, స్పోర్ట్స్ అసోసియేషన్ చైర్మెన్ జంపన ప్రతా ప్, ముస్లిమ్ బోర్డు అధ్యక్షుడు హిఫ్జురహ్మాన్ షరీఫ్, వైస్ ప్రెసిడెంట్ అతావుల్లా షరీఫ్‌లు హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్బంగా జంపన ప్రతాప్ మా ట్లాడుతూ క్రీడలను క్రీడాకారులను ప్రోత్సహించేం దుకు కంటోన్మెంట్ స్పోర్ట్స్ అసోసియేషన్ విశేషంగా కృషి చేస్తోందని అన్నారు. యంగ్ స్టార్ స్పోర్ట్స్ అసోసియేషన్ వారు క్రీడా పోటీలు నిర్వహించడాన్ని ఆయన అభి నం



దించారు. కాగా విజేత జట్టుకు ట్రోఫీతో పాటు 10,000 నగదు బహుమతి రన్నర్స్ జట్టుకు ట్రోఫీతో పాటు 7000 నగదు బహుమతి అదేవిధంగా ఉత్తమ బౌలర్ ట్రోఫీ మ్యాన్‌ఆఫ్ ది మ్యాచ్ ట్రోఫీ బహుమతులను వీఅర్ హాస్పి టల్ ఎండి నందకిషోర్ అందజేస్తున్నట్లు నిర్వాహ కులు తెలిపారు. ఈ కార్యక్రమంలో షకీబ్ షరీఫ్ సయ్యద్ సిరాజ్ సయ్యద్ అర్షద్ యంగ్‌స్టర్స్ స్పోర్ట్స్ క్లబ్, సభ్యులు అర్షద్‌బేగ్ ఫిరోజ్‌ఖాన్ ఎం.ఎ.గఫర్ పాల్గొన్నారు.

పద్మశాలి సేవా సమాజం ట్రస్ట్ క్యాలెండర్ ఆవిస్కరణ



- పాల్గొన్న మాజీ మేయర్ బండ కార్తీక చంద్రారెడ్డి

నవతెలంగాణ-ఓయూ

లాలాపేట్ మార్కెండేయ పద్మశాలి సేవా సమాజం ట్రస్ట్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం నగర మాజీమేయర్ బండా కార్తి కా, చంద్రారెడి ముఖ్య అతిథులుగా హాజరై లాలా పేట్ లోని సంఘ కార్యాలయలో ఆవిష్కరించారు. అనం తరం ఆమె మాట్లాడుతూ తనకు ఎల్లప్పుడు మద్దుతు తెలు పుతున్న పద్మశాలి సేవా సమాజానికి కృతజ్ఞతల న్నారు. తార్నాక డివిజన్ అంటే తనకు స్వంత ఇంటి కం టె ఎక్క వ అన్నారు. పద్మశాలీల సంక్షేమం కోసం తన వంతు సహకారం ఉటుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పద్మ శాలి సంఘం కన్వీనర్ బూర మల్లేషం, పద్మ శాలి సేవా సమాజం ట్రస్ట్ చైర్మెన్ దోమల లక్ష్మణ్ దాస్ పద్మశాలి, వైస్ చైర్మన్ ఉద్దెమర్రి దేవేందర్ పద్మశాలి, ప్రధాన కార్యదర్శి తలకొక్కుల వెంకట స్వామి పద్మశాలి, కోశాధికారి కొండ్ల వెంకటేశం పద్మశాలి, సహాయ కార్యదర్శి నాగరాజు పద్మ శాలి, సలహాదారులు పద్మశాలి సభ్యులు పాల్గొన్నారు.

హైదరాబాద్ నగర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు



- డిప్యూటీ మేయర్

నవతెలంగాణ-ఓయూ

హైదరాబాద్ నగర ప్రజలకు నూతన సంవత్సర శు భాకాంక్షలు తెలుపుతూ కొత్త సంవత్సరంలో రాష్ట్రం మరింతగా పురోగమించాలని డిప్యూటీ మేయర్ తెలిపారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ నూతన సంవత్సరంలో ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ, రాష్ట్రంలో మళ్లీ కరోనా మహమ్మారి వస్తున్న నేపథ్యంలో ప్రజలందరూ తగిన జాగ్రత్తలు పాటించాలని కోరుతూ, నూతన సంవ త్సరంలో అందరూ ఆయురారో గ్యాలతో సుఖ సంతోషాలతో ఆనందంగా గడపాల న్నా రు. నగర ప్రజలకు గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు మోతె శోభన్ రెడ్డి నూతన సంవత్సర శు భాకాంక్షలు తెలియజేశారు.

పూర్వ విద్యార్థులు కళశాల ఉన్నతికి తోడ్పాటు ఇవ్వాలి



- ఘనంగా ఇంజనీరింగ్ కళాశాల గ్లోబల్ ఆలూమిని మీట్-2023
- విద్యార్థుల కోసం వివిధ క్లబ్స్ ఏర్పాటు

నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల ఉన్నత విద్యా, నూతన ఆవిష్కరణలకు, ఉపాధికి పెట్టింది పేరు అని ప్రత్యేక ఆహ్వానితులు రిటైర్ సివిల్ ఇంజ నీరింగ్ ప్రొఫెసర్ ఐఐటీ ఢిల్లీ ప్రొ. కె.సీతారాములు, ఇం జనీర్ ఇన్ చీఫ్ రిటైర్డ్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వి.రాంకిషన్ రావులు అన్నారు.(ఆలూమిని1956సివిల్‌ఇంజనీరింగ్ బ్యాచ్)..తాము ఇద్దరం ఇక్కడే విద్యను అభ్యశించి ఈ స్థాయికి వచ్చామని ఈ సందర్భంగా తెలియజేశారు. ఆది వారం ఓయూ ఇంజనీరింగ్ ఆలూమిని అసోసియేషన్ ఇంజనీరింగ్ కళాశాల వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్లోబల్ ఆలూమినిమీట్-2023 అసోసియేషన్ అధ్యక్షుడు డా.దేవరకొండ విజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి డా.వెంకట రామయ్యలు మాట్లాడుతూ ఎలక్ట్రికల్ ఇంజ నీరింగ్ విభాగం ప్లాటినం జూబ్లీ సందర్భంగా నిర్మా ణంలో భవనానికి నిధులు సమకూర్చాలని తీర్మానం చేశా రు. ఈ విద్యా సంవత్సరం నుండి కళాశాలాలో కమ్యూని కేషన్ క్లబ్,ఎంటర్ ప్రెన్యూర్ క్లబ్,మ్యూజికల్ క్లబ్, ఆడి యో,వీడియో, ఫిలిమ్ మేకింగ్ క్లబ్, క్రియోటివ్ క్లబ్ ఏర్పా టు చేయనున్నట్లు చెప్పారు. అనంతరం 7 విభాగాల విద్యార్థులకు పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలు నిర్వహించి విజేతలైన 16 మంది విద్యార్థులకు నగ దు బహుమ తు లు అందజేశారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిం చారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొ.శ్రీరాం వెంకటేష్ సభ అధ్యక్షతన ఈ కార్యక్రమంలో ఓయూ వీసీ ప్రొ.రవీందర్, రిజిస్ట్రార్ ప్రొ.పి.లక్ష్మి నారా యణ, మాజీ వీసీ ప్రొ.రామచంద్రం, అధ్యక్షుడు డా.దేవర కొండ. విజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి డా.వెంకట రామయ్యతో పాటుగా కార్యక్రమంలో 304 మంది వివిధ విభాగాల పూర్వ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

ప్రొ. గాలి వినోద్‌కుమార్

నవతెలంగాణ-ఓయు

ప్రయివేట్ విశ్వవిద్యాలయాల్లో రాజ్యాంగబద్ధంగా ఎస్సీ, ఎస్టీలకు రావలసిన రిజర్వేషన్లు కొనసాగే విధంగా ఉన్నత విద్యాశాఖ చర్యలు తీసుకోవాలని అవసరమైతే అసెంబ్లీలో ప్రయివేటు యూనివర్సిటీ బిల్లుకు చట్ట సవరణ చేసి ఎస్సీ ఎస్టీలకు రిజర్వేషన్లు అమలు చేస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నానని ఉస్మానియా తెలంగాణ విశ్వవిద్యాలయాల మాజీ డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ లా ప్రొ.గాలి వినోద్ కుమార్ అన్నారు. ఆదివారం తార్నాకలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో



ఆయన మాట్లా డుతూ ప్రయివేటు యూనివర్సిటీలతో పాటు ప్రైవేట్ పరిశ్రమల్లోనూ ప్రైవేట్ కాంట్రాక్ట్ ప్రభుత్వ కాంట్రాక్టర్లలో ఎస్సీ ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించి వారి సాధికారతకు కృషి చేయాలని ఆయన సీఎంను కోరారు.

ముద్దం నరసింహయాదవ్ జన్మదిన వేడుకలు నిర్వహించిన అభిమానులు



నవతెలంగాణ-కంటోన్మెంట్

ఓల్డ్ బోయినపల్లి కార్పొరేటర్ ముద్దం నరసింహయాదవ్ జన్మదిన వేడు కలు ఆదివారం కార్యకర్తలు అభిమానులు కొండపోచమ్మ దేవస్థానంలో ఘన ంగా నిర్వహించారు. డివిజన్ నాయకులు కార్యకర్తలు సంఖ్యలో పాల్గొని కార్పొ రేటర్ శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ సీనియర్ నాయకులు నరేం దర్ గౌడ్ కర్రెజంగయ్య మక్కాలా నర్సింగరావు ఏనుగుల తిరుపతి సయ్యద్ ఇజాజ్ ఇర్ఫాన్ భాయ్ హరినాథ్ లలిత బుర్రి యాదగిరి మహిళా నాయకురాలు మైనార్టీ సోదరులు పాల్గొని కార్పొరేటర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

డిప్యూటీ మేయర్‌తో నూతన కమిటీ



నవతెలంగాణ-ఓయూ

తార్నాకలోని హనుమాన్‌నగర్ కాలనీ నూతనంగా ఏర్పడ్డ కమిటీ సభ్యు లు శనివారం గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభ న్‌రెడ్డి, బీఆర్ఎస్ కార్మిక విభాగ అధ్యక్షుడు మోతేశోభన్‌రెడ్డి ని తమ క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హనుమాన్ నగర్ కాలనీ అభివృద్ధికై కమిటీ సభ్యులు పలు సమస్యలను డిప్యూటీ మేయర్ దృష్టికి తీసుకొచ్చారు. డిప్యూటీ మేయర్‌స్పందిస్తూ వారి సమస్యలను తక్షణమే అధికారులతో మాట్లాడి పరిష్కరించే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో హనుమాన్ నగర్ కమ్యూనిటీ సభ్యులు పాల్గొన్నారు.

సేవా, ఆధ్మాత్మిక రంగం ముందంజలో ఆర్యవైశ్యులు



ఘనంగా నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

నవతెలంగాణ-ఓయూ

స్వాతంత్ర్య పూర్వం నుంచి ఆర్యవైశ్య సంఘం సేవా కార్యక్రమాల్లో, ఆధ్యాత్మిక రంగానికి పెట్టి ంది పేరు అని తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మీ నారాయణ అన్నారు. ఇక రానున్న రోజుల్లో రాజకీయ రం గంలో ఆర్యవైశ్యులు రాణిస్తే మరిన్ని సమాజానికి మరిం తగా సేవా కార్యక్రమాలు చేయడానికి అవకాశం ఉంటుం దని ఆయన పేర్కొన్నారు. ఆదివారం లాలా పేట ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ పదవీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం నఫీజ్ గార్డెన్ లో ఘనంగా నిర్వహించారు. ఆయన ముఖ్యతిధిగా హాజరై నూతన కమిటీని అభినం దిస్తూ సంఘం పటిష్టత కోసం అందరూ పాటుపడాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో సంఘం సభ్యత్వ నమో దును రూ.2లక్షల వరకు పెంచాలని పిలుపునిచ్చారు. సంఘం ద్వారా చేస్తున్నా సేవా కార్యక్రమాలను నిరం తరంగా కొనసాగించాలనీ సూచించారు. గత ప్రభుత్వం ఉప్పల్ భగాయత్లో లో ఆర్యవైశ్య సంఘానికి కెటాయించిన స్థలంలో పెద్ద ఎత్తున కళ్యాణ మండపాన్ని నిర్మాణం చేస్తామని ప్రకటించారు. దీంతో ఇటు ఆర్యవైశ్యులకు, ఇతరులకు అద్దెలకు ఇవ్వడం ద్వారా సంఘానికి ఆదాయం చేకూరడంతో పాటు సంఘం అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. లాలాపేట ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడు మడిపడగ శ్రీనివాస్ గుప్త, ప్రధాన కార్యదర్శి పందిరి సాంబశివరావు గుప్త, కోశాధికారి యెనిశెట్టి భాస్కర్, ఇతర సభ్యులు, సలహాదారులను తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులు నేతి రాములు గుప్త ప్రమాణ స్వీకారం చేయి ంచారు. అనంతరం సంఘం ఆధ్వర్యంలో నూతన సంవ త్సరం 2024 క్యాలెండర్స్ వారు ఆవిష్కరించారు. కార్యక్ర మంలో ఒక వికలాంగునికి ట్రై సైకిల్ అందజేశారు. మున్సి పల్ సిబ్బందికి చీరెలను పంపిణీ చేశారు. ఈ కార్యక్ర మంలో సికింద్రాబాద్ పట్టణ ఆర్యవైశ్య మహాసభ అధ్య క్షులు మర్యాల జగదీశ్వర్ గుప్త, టిటిడి బోర్డు ఎల్ ఏ సి మెంబర్ మడిపడగ రాము గుప్త. యెనిశెట్టి కృష్ణ లాలపెట్ ఆర్యవైశ్య లు తో పాటుగా సికింద్రాబాద్, పరిసర ప్రాంతాల నేతలు పాల్గొన్నారు. నూతన కమిటీ యొక్క భవిష్యత్ కార్యాచరణ ను అధ్యక్షుడు శ్రీనివాస్ గుప్తా వివరించారు. పలువురు వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

సమస్య పరిష్కారించిన కార్పొరేటర్‌కు సత్కారం

నవతెలంగాణ-ఓయూ

హబ్సిగూడ డివిజన్ గణేష్‌నగర్ విశాల్ మెగామార్ట్ వెనకాల డాక్టర్ గంగాధర్ వీధిలో హబ్సిగూడ డివిజన్ కార్పొరేటర్ బీజేపీ జీహెచ్ఎంసీ ఫ్లోర్ సెక్రెటరీ కక్కిరేణి చేతన హరీష్ ప్రత్యేక చొరవతో ఆ వీధిలో డ్రయినేజీ సీసీ రోడ్డు నిర్మాణం చేయించారు. ఈ సందర్భంగా కాలనీ వా సులు ఆదివారం సాయంత్రం హబ్సిగూడ కార్పొరేటర్ చేతన హరీష్‌ని ఘనంగా శాలువతో సత్కరించి ధన్యవా దా లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గంగాధర్, రత్న పాని చారి, భాను ప్రసాద్, వేణుమాధవ్, మోహన్ రావు,



శ్రీనివాస్ ,కృష్ణ ,భారతి, రాజ్యలక్ష్మి ,శాలిని,బిజెపి ప్రధాన కార్యదర్శి చెల్లోజు ఎల్లాచారి, పాల్గొన్నారు.

ఎర్రగడ్డ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు జావిద్ కుమారుడి పుట్టినరోజు వేడుకను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జూబ్లీహిల్స్ నియోజక వర్గ శాసన సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు మాగం టి గోపీనాథ్ కార్యాలయంలో ఆయన చేతుల మీదుగ కేక్ కట్ చేసి పుట్టినం రోజు వేడుకలు జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో ఎర్రగడ్డ డివిజన్ అధ్య క్షుదు సంజీవ్,ఉమర్, అజర్, మజర్, మొయిద్ తదితరులు పాల్గొన్నారు.

-నవతెలంగాణ-జూబ్లీహిల్స్





న్యూ ఇయర్... అంటే క్యాలెండర్ మారడమే కాదు.. మనలో కూడా ఏదో మార్పు రావాలని కోరుకునే వాళ్లు చాలామంది ఉంటారు. దానిలో భాగంగానే న్యూ ఇయర్ రిజొల్యూషన్స్ తీసుకుంటారు. కొందరు వాటిని కచ్చితంగా ఫాలో అవుతారు. మరికొందరు పాటించదానికి ట్రై చేస్తారు. మరికొందరు పూర్తిగా విస్మరిస్తారు. అయితే 2024 అలా కాకూడదు.. కచ్చితంగా ఈ ఏదాది మంచి రెజొల్యూష్యన్ తీసుకోవాలి. ఇవి మీకు మానసికంగా, శారీరకంగా, ఆర్థికంగా కూడా మంచి చేస్తాయి. అందుకే ఈరోజు నుండే వీటిని ఫాలో అవుదాం... మరి అవేంటో తెలుసుకుందాం.

కొత్త ఏడాదిలో కొన్ని మార్పులు



చాలామంది పనులు వాయిదా వేస్తారు. దానికి వివిధ కారణాలు చెప్తారు. అలా ఆపేసిన పనులన్నీ కలిసి మీపై ఒత్తిడిని పెంచుతాయి. కాబట్టి సమయాన్ని వృథా చేసే అంశాలకు దూరంగా ఉంటూ నిర్వహించాల్సిన పనిపై దృష్టి పెట్టండి. మొత్తంగా కాకపోయినా కొంచెం కొంచెంగా అయినా గడువులోపు దానిని పూర్తి చేయండి. అది కేవలం ఆఫీస్ విషయాలే కానవసరం లేదు. ఉదాహరణకు మీరు ఓ బుక్ చదవాలనుకుంటే.. కనీసం రోజుకో పేజీ అయినా చదివేలా ప్లాన్ చేసుకోవాలి. ఒకరోజు ఎక్కువ చదివేశామని రెండో రోజు వద్దులే.. అన్నీ ఒకేసారి చదివేద్దాం అనుకోకూడదు. కొంచెం చదివినా రోజూ దానిని కంటిన్యూ చేయడం ముఖ్యం. ఇది మీపై ఒత్తిడిని తగ్గిస్తుంది. చాలా విషయాల్లో మీరు చురుగ్గా ఉండేలా చేస్తుంది.

కొంచెం గ్యాప్ తీసుకోండి..

'ఈరోజు ఊపిరాడని పని ఉంది, చాలా కష్టపడి పోయాను' అని అందరూ చాలా సందర్భాల్లో అంటూనే ఉంటారు. అంత అవసరం లేదు. అలాగని కష్టపడటాన్ని ఆపమనటం లేదు. ఎంత బిజీగా ఉన్నా.. రెండు మూడు గంటలకు ఓ సారి చిన్న బ్రేక్ తీసుకోండి. ఓ పది నిమిషాలు ఫోన్ కూడా చూడకుండా నచ్చినవారు దగ్గర ఉంటే వారితో మాట్లాడండి. లేదంటే ఎక్కడైనా కూర్చోని బ్రీత్ ఎక్సర్ సైజ్‌లు చేయండి. ఇది మిమ్మల్ని ఒత్తిడి నుంచి రిలాక్స్ ఇస్తుంది. బ్రేక్ తీసుకోవడం కుదరదు అంటే.. రోజులో ఓ అరగంట మీకు మీరు కేటాయించుకోండి. పార్కులోకి వెళ్లండి. లేదంటే ఒంటరిగా కూర్చోండి. నచ్చిన విషయాలు గురించి ఆలోచించండి. పని గురించి కాకుండా ఇంక దేని గురించైనా మీకు పాజిటివ్ ఇచ్చే విషయాలు గురించి థింక్ చేయండి. ఇవి మీరు రీఛార్జ్ అవ్వడానికి హెల్ప్ చేస్తాయి.

తీసుకునే ఆహారం

మనం కష్టపడేది కడుపు నిండా తినడం కోసమే. అయితే కొందరు ఏమి తింటున్నారో? ఎందుకు తింటున్నారో తెలియకుండా తినేస్తారు. అది హెల్త్‌కి మంచిదా చెడ్డదా అని ఆలోచించరు. అనవసరమైనవి ఎక్కువగా తింటే ఆరోగ్యం పాడైపోతుంది. కాబట్టి తీసుకునే ఆహారం విషయంలో శ్రద్ధ వహించండి. శరీరం డస్ట్ బిన్ కాదు. ఏది పడితే అది లోపల వేసేయడానికి. ఫుడ్ అంటే ఆసక్తి ఉంటే కొత్త వాటిని ట్రై చేయడంలో తప్పులేదు కానీ.. అదే పనిగా అనారోగ్యకరమైన ఫుడ్స్ తీసుకోవడం అస్సలు మంచిది కాదు.


ఆరోగ్యంపై దృష్టి..

డబ్బు కన్నా ఆరోగ్యం చాలా విలువైనది. డబ్బులు ఎన్ని ఉన్నా ఆరోగ్యం సరిగ్గా లేకుంటే ఎంత సంపాదించినా వేస్ట్. కాబట్టి ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవడం ప్రారంభించండి. ఏమి తింటున్నారు? ఎంత వర్క్ చేస్తున్నారు? ఎంత సేపు నిద్రపోతున్నారు? రోజులో మీ ఆరోగ్యం కోసం మీరు ఏమి చేస్తున్నారు వంటి విషయాలపై కచ్చితంగా శ్రద్ధ తీసుకోండి. మీరు ఎంత ఆరోగ్యంగా ఉంటే.. మీ భవిష్యత్ అంత బాగుంటుంది.

ఒత్తిడి తగ్గించుకోండి..

మానసికంగా, శారీరకంగా కృంగదీయడంలో ఒత్తిడి ముందు ఉంటుంది. దీనిని తట్టుకుని ముందుకు వెళ్లడం చాలా కష్టం. అనవసరమైన విషయాలకు ఎక్కువ ఆలోచించి స్ట్రెస్ తీసుకోకండి. కొన్ని విషయాలు మనం ఎంత చేసినా అవి మన కంట్రోల్‌లో ఉండవు. అలాంటి వాటి గురించి ఎక్కువ ఆలోచించకుండా ఉన్న సమయాన్ని హాయిగా, ప్రశాంతంగా గడిపేయండి.

ఇలాంటి చిన్న చిన్న విషయాలే మీ జీవితంలో ఎన్నో మార్పులు తీసుకొస్తాయి. ఇవి మానసికంగా, శారీరకంగా కూడా మిమ్మల్ని అభివృద్ధి చేస్తాయి. పెద్ద పెద్ద మార్పులే చేయాల్సిన అవసరం లేదు.. చిన్న చిన్న విషయాలు కూడా మీ జీవితంలో పెద్ద మార్పులు తీసుకువస్తాయి. కాబట్టి హ్యాపీగా వీటిని ఫాలో అయిపోతే కొత్త ఏడాదిలో మీరు కొత్తగా ఏదైనా చేసేందుకు వీలుంటుంది.



ఆదా చేయడం

ఇది ప్రతి ఏడాది అందరికీ ఉండే రిజల్యూషన్‌లో ఒకటి. జీవితాన్ని ప్రేమ, అనురాగం, ఆప్యాతలే ముందుకు నడిపిస్తాయి అంటారు. అయితే వీటన్నింటిని రూల్ చేసేదే డబ్బు. ఇది ఉంటేనే అన్ని మనకు వస్తాయి. డబ్బుతో పనేమి ఉందని కొందరు అంటారు కానీ.. ఇదే అన్నింటిని నడిపిస్తుంది. కాబట్టి మీ దగ్గరున్న డబ్బులో మీ ఖర్చులకు పోగా ఓ పదిశాతం డబ్బునైనా పక్కకు పెట్టడం నేర్చుకోండి. దానిని ఎట్టి పరిస్థితుల్లో బయటకు తీయకండి. ఇలా కొన్నాళ్లు జమ చేసిన సొమ్మును మంచి వాటిలో ఇన్వెస్ట్ చేయండి. ఫుడ్ బయట ఆర్డర్ చేయడం తగ్గించండి. అనవసరంగా బట్టలు కొనడం ఆపండి. అలా అని మరీ పిసినారిగా ఉండమని కాదు.. కాస్త పొదుపుగా ఉండడం నేర్చుకోండి. అనవసరమైన చోటు ఖర్చు చేయకండి. అవసరమైన చోట ఖర్చు పెట్టే ముందు ఓసారి ఆలోచించండి.



రిలేషన్స్..

ఏ రిలేషన్‌కి అయినా బౌండరీలు పెట్టుకోండి. ఇది మిమ్మల్ని మానసికంగా ఇబ్బంది పడకుండా చేస్తుంది. ఓ వ్యక్తి మీ లైఫ్‌లోకి రావాలన్నా.. మీరు ఇతరుల లైఫ్‌లోకి వెళ్లాలన్నా ఈ బౌండరీలు కచ్చితంగా ఉండాలి. ఇది వ్యక్తిగత జీవితాలకు, పర్సనల్ స్పేస్‌కు చాలా అవసరం. రిలేషన్‌లో ఉన్నాక పర్సనల్ స్పేస్ ఏంటి అనుకోవచ్చు. కానీ ఇది ఏ రిలేషన్‌కి అయినా అవసరం. లేదంటే ఇతరవ్యక్తులు మీకు ఇబ్బందిగా కనిపించే ప్రమాదముంది. కాబట్టి రిలేషన్‌లో కాస్త సెన్సబుల్‌గా ఉంటూనే బౌండరీలు పెట్టుకోవడం మంచిది.

తేలికపాటి వ్యాయామాలు

జిమ్‌కి డబ్బులు కట్టేసి తర్వాత మానేయడం కాదు. చాలామంది న్యూ ఇయర్‌కి చేసే మొదటి పని ఇది. కానీ మీరు నిజంగా హెల్తీగా ఉండాలంటే జిమ్‌కే వెళ్లాల్సిన అవసరం లేదు. ఇంట్లో ఉంటూనే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. బరువు తగ్గొచ్చు. హెల్తీగా, ఫిట్‌గా ఉండొచ్చు. రోజులో ఎంతో కొంత సమయం తేలికపాటి వ్యాయామాలు చేయండి. నిద్ర లేచిన వెంటనే బాడీ స్ట్రెచ్ చేయండి. ఎండలో కాసేపు నిలబడండి. కుదిరితే వాకింగ్ చేయండి. కానీ ఏది చేసినా.. రోజూ దానిని కంటిన్యూ చేయండి. కచ్చితంగా మీలో ఎంత మార్పు వస్తుందో మీకే తెలుస్తుంది.



16వ ఆర్థిక సంఘం చైర్మెన్‌గా అరవింద్ పనగరియా



నవతెలంగాణ -న్యూఢిల్లీ బ్యూరో

నిటి ఆయోగ్ మాజీ వైస్ చైర్మెన్ అరవింద్ పనగరియాను 16వ ఆర్థిక సంఘం చైర్మెన్‌గా కేంద్ర ప్రభుత్వం నియమించింది. దీనితో పాటు రిత్విక్ రంజనం పాండేను కమిషన్ సెక్రటరీగా నియమించింది. ఈ మేరకు కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. 16వ ఆర్థిక సంఘం టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ (టీఓఆర్)ను ప్రధాని మోడీ సారథ్యంలోని కేంద్ర మంత్రివర్గ గత నెలలో ఆమోదించింది. ఐదేండ్ల కాలానికి (2026-27 నుంచి 2030-31) సంబంధించిన రిపోర్ట్‌ను 2025 అక్టోబర్ 31లోగా రాష్ట్రపతికి కమిషన్ సమర్పించాల్సి ఉంటుంది.

కేంద్రం, రాష్ట్రాల మధ్య పన్నుల పంపిణీ, ఆదాయం పెంపుదలకు సంబంధించిన చర్యలను ఆర్థిక సంఘం సూచిస్తుంది. ఫైనాన్సింగ్ డిజాస్టర్ మేనేజిమెంట్ కోసం ప్రస్తుతం ఉన్న ఏర్పాట్లపై కూడా సమీక్ష జరుపుతుంది. కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంబంధాలపై సలహాలు ఇచ్చే రాజ్యాంగ వ్యవస్థగా ఫైనాన్స్ కమిషన్ ఉంటుంది. కాగా, ప్రణాళికా సంఘాన్ని రద్దు చేసి దాని స్థానంలో తీసుకువచ్చిన నీతి ఆయోగ్‌కు తొలి చైర్మెన్‌గా అరవింద్ పనగరియాను 2015లో మోడీ సర్కార్ నియమించింది. పనగరియా న్యూయార్క్‌లోని కొలంబియా వర్సిటీలో ఎకనామిక్స్ ప్రొఫెసర్‌గా పనిచేయడంతో పాటు ఏడీబీ, వరల్డ్ బ్యాంక్, ఐఎంఎఫ్, డబ్ల్యూటీఓలో వివిధ హోదాలలో పని చేశారు.

పెరుగుతున్న చలి

- పలు జిల్లాలకు పొగమంచు హెచ్చరిక



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో చలితీవ్రత పెరుగుతున్నది. రాత్రి పూట ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. రంగారెడ్డి జిల్లాలో అత్యల్పంగా 10.4 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. తెలంగాణలోని 33 జిల్లాలకు గానూ 31 జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 15 డిగ్రీల లోపే కనిష్ట ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. ఆదిలాబాద్, కొమ్రంభీమ్ అసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో పలు ప్రాంతాల్లో ఉదయంపూట పొగమంచు ఏర్పడే అవకాశముంది. రాష్ట్రం మీదుగా ఆగ్నేయం దిశ నుంచి కిందిస్థాయిలో గాలులు వీస్తున్నాయి. రాబోయే మూడు రోజులు కూడా రాష్ట్రంలో పొడి వాతావరణమే ఉంటుందని ఐఎమ్‌డీ తెలిపింది.

దాటవేతలొద్దు..

(మొదటిపేజి తరువాయి)

వివరించారు. అలాంటప్పుడు ఆ కోడ్ పేరుతో ఆరు గ్యారెంటీల అమల్లో జాప్యం జరిగే అవకాశముందని చెప్పారు. అందువల్ల ఈ లోపే వాటిపై ప్రభుత్వం ఒక విధానపరమైన నిర్ణయం తీసుకోవాలని సూచించారు.

ఆ వెంటనే జీవోలు, మార్గదర్శకాలు విడుదల చేయటం ద్వారా ఆరు గ్యారెంటీల అమలుకు ఎలాంటి అడ్డంకులు (ఆన్ గోయింగ్ స్కీమ్స్ అవుతాయి కాబట్టి) లేకుండా చూసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీంతోపాటు ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే ఓటాన్ అకౌంట్ బడ్జెట్ కూడా హామీల అమలుకు ప్రతిబంధకంగా మారనుందని హెచ్చరించారు. ఆ బడ్జెట్‌లో ఏ పద్దుకు ఎన్ని నిధులు, ఎంత కేటాయింపులు అనే విషయం ఉండబోదన్నారు. అందువల్ల ఫిబ్రవరిలోనే పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టటం ద్వారా గ్యారెంటీల అమలుకు పూనుకోవాలనీ, తద్వారా ప్రజల పట్ల చిత్తశుద్ధిని నిరుపించుకోవాలని ప్రభుత్వానికి సవాల్ విసిరారు. అందుకోసం ఇప్పటి నుంచే వివిధ పథకాలను గ్రౌండింగ్ చేయాలని కోరారు.

బోనస్‌కు విధి విధానాలు ఖరారు చేయండి...

మార్చి, ఏప్రిల్ నెలల్లో యాసంగి పంట రాబోతోందని హరీశ్‌రావు ఈ సందర్భంగా చెప్పారు. క్వింటాల్ వరికి రూ.500 బోనస్‌ను ఇస్తామంటూ ఎన్నికల్లో కాంగ్రెస్ హామీనిచ్చిందని గుర్తు చేశారు. అందువల్ల బోనస్ కోసం ఇప్పటి నుంచే విధి విధానాలను ఖరారు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అంతేతప్ప దీన్ని కూడా లోక్‌సభ ఎన్నికల కోడ్‌లో ఇరికించొద్దని సూచించారు. తద్వారా రైతులను ఇబ్బంది పెట్టొద్దన్నారు. అసెంబ్లీలో పలు అంశాలపై శ్వేతపత్రాలను ప్రకటించిన ప్రభుత్వం... డిసెంబరులో వేయాల్సిన రైతు బంధుపై ఎందుకు శ్వేతపత్రం విడుదల చేయలేదని ఎద్దేవా చేశారు. ఇప్పటికీ లక్షలాది మంది రైతులు తమ ఖాతాల్లో ఎప్పుడు డబ్బులు పడతాయా..? అని ఎదురు చూస్తున్నారని చెప్పారు.

మిగతా పదకొండు అంశాల సంగతేమిటి..?

కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీల్లో మొత్తం 13 అంశాలున్నాయని హరీశ్‌రావు ఈ సందర్భంగా తెలిపారు. వీటిలో ఇప్పటి వరకూ రెండింటినే ప్రారంభించారనీ, మిగతా పదకొండింటి సంగతేంటని ఆయన ప్రశ్నించారు.

తమ ప్రభుత్వ హయాంలో ఆరోగ్య శ్రీ కింద మూత్రపిండాలు, కాలేయం, ఊపిరితిత్తులు, గుండెకు సంబంధించిన చికిత్సలు, శస్త్ర చికిత్సల కోసం రూ.11.05 లక్షల ప్యాకేజీని ప్రకటించామని తెలిపారు. ఆరోగ్య శ్రీ పరిమితిని రూ.10 లక్షల వరకూ పెంచామని చెబుతున్న సీఎం రేవంత్... ఇప్పటి వరకూ ఆ ప్యాకేజీ కింద ఎవరెవరికి ఎన్నెన్ని చికిత్సలు చేశారో చెప్పాలన్నారు. 2023 డిసెంబరు మూడున బీఆర్ఎస్ ప్రభుత్వం దిగిపోతే... 2024 మార్చి వరకూ అప్పులపై వేసుకున్న అంచనాలను కూడా కలిపి శ్వేతపత్రంలో చెప్పటమేంటని వాపోయారు. రేవంత్ సర్కారు కూడా రూ.13 వేల అప్పు కావాలంటూ ఆర్‌బీఐకి విజ్ఞప్తి చేసిందన్నారు. ఇప్పటికే రూ.1,400 కోట్ల రుణం తీసుకున్నట్టు తెలిసిందని అన్నారు.

నిరుద్యోగ భృతిపై స్పష్టతేది...?

నిరుద్యోగ భృతి అమలుపై కూడా రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టత లేదని హరీశ్‌రావు విమర్శించారు. దీనిపై కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్, ప్రియాంక ఒక రకంగా ప్రకటనలు చేస్తే... డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మరో రకంగా స్టేట్‌మెంట్లు ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. ఫిబ్రవరిలో ఉద్యోగ నోటిఫికేషన్లు, జాబ్ క్యాలెండర్ వేస్తామంటూ ప్రభుత్వం ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. అయితే టీఎస్‌పీఎస్సీకి చైర్మెన్‌ను, సభ్యులను ఇంతవరకూ నియమించలేదన్నారు. అయినా సీఎస్‌తో లేదా ప్రస్తుతమున్న టీఎస్‌పీఎస్సీ కార్యదర్శితో అందుకనుగుణంగా కార్యాచరణ రూపొందించొచ్చని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో రూ.40 వేల కోట్ల బిల్లులు పేరుకు పోయాయనే విషయాన్ని పాత్రికేయులు ప్రస్తావించగా...'బిల్లుల చెల్లింపు అనేవి ఆన్‌గోయింగ్ ప్రాసెస్, అవి ఒకదాని తర్వాత ఒకటి చెల్లింపబడుతూనే ఉంటాయి...' అని సమాధానమిచ్చారు. 2014లో తాము అధికారం చేపట్టే నాటికి రూ.3,200 కోట్ల మేర ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకు పోయాయని తెలిపారు.

వాటిని దాచటం సాధ్యమా..?

బీఆర్ఎస్ సర్కారు రూ.66 కోట్ల విలువైన ల్యాండ్ క్రూజర్ వాహనాలను కొనుగోలు చేసి, విజయవాడలో దాచిందంటూ సీఎం రేవంత్ వ్యాఖ్యానించటం శోచనీయమని హరీశ్‌రావు పేర్కొన్నారు. వాటిని దాచటం సాధ్యమా..? అని ప్రశ్నించారు. ఏ రాష్ట్రానికి చెందిన వాహనాలనైనా బుల్లెట్ ప్రూఫ్ కోసం విజయవాడకు తరలించాల్సిందేనని స్పష్టం చేశారు.

ఘోరంగా ప్రొటోకాల్ ఉల్లంఘున...

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో ప్రొటోకాల్‌ను ఘోరంగా ఉల్లంఘిస్తున్నారని హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. నర్సాపూర్, జనగామ, హుజూరాబాద్, సంగారెడ్డిలో ఇదే జరిగిందని చెప్పారు. ప్రభుత్వ కార్యక్రమాలకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కాకుండా వారిపై ఓడిపోయిన కాంగ్రెస్ నేతలను పిలుస్తున్నారని తెలిపారు. ప్రజా పాలన కార్యక్రమంలో సైతం తమ పార్టీ ఎమ్మెల్యేల ఫొటోలను పెట్టటం లేదని విమర్శించారు.

'లోక్‌సభ'పై ఫోకస్...

రానున్న లోక్‌సభ ఎన్నికలపై ఇప్పటి నుంచే తమ పార్టీ దృష్టి సారిస్తోందని హరీశ్ తెలిపారు. మూడో తేదీ నుంచి ఒక్కో ఎంపీ స్థానంపై సమీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. మెదక్ నుంచి కేసీఆర్ పోటీ చేయటంపై అడగ్గా... ఆ విషయాలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉందన్నారు. ఆ స్థానం నుంచి కాంగ్రెస్, బీజేపీ అగ్రనేతలు బరిలోకి దిగబోతున్నారనే వార్తలను ప్రస్తావించగా... 'చూద్దాం...' అని వ్యాఖ్యానించారు. శస్త్ర చికిత్స అనంతరం విశ్రాంతి తీసుకుంటున్న మాజీ సీఎం కేసీఆర్...జనవరి చివరి నాటికి ఎలాంటి సాయం లేకుండానే తనంతట తాను నడవొచ్చంటూ డాక్టర్లు అభిప్రాయపడ్డారని వివరించారు.

ఊపిరికి కష్టం

(మొదటిపేజి తరువాయి)

ప్రయివేటు ఆస్పత్రుల్లో పని చేసే వారున్నారు. ఆయా డాక్టర్ల దగ్గరికి వచ్చే రోగుల సంఖ్య, వారిలో శ్వాససంబంధిత ఇబ్బందులతో వచ్చే వారి శాతం ఆధారంగా ఇవి పెరిగినట్టు గుర్తించారు. రెండు నెలల ముందుతో పోలిస్తే ఇలాంటి ఇబ్బందులతో వచ్చే వారి సంఖ్య 20 నుంచి 25 శాతం పెరిగినట్టు తేలింది. వీరిలో ఎక్కువగా జలుబు, పొడి దగ్గు, జ్వరం వంటి లక్షణాలు సాధారణంగా కనిపిస్తున్నాయని డాక్టర్లు తెలిపారు. ఇలాంటి లక్షణాలతో వచ్చే చిన్నపిల్లల్లో గవదబిళ్లలు, పెద్ద వయస్సు వారిలో కీళ్లవాతం వంటి రుగ్మతలు ఇబ్బంది పెడుతున్నాయి. రోగుల్లో 98 నుంచి 99 శాతం మందికి సాధారణ మందులతో నయం అవుతుండగా, ఒక శాతం నుంచి రెండు శాతం మందికి హాస్పిటల్ అడ్మిషన్ తప్పనిసరి అవుతున్నట్టు అధ్యయనంలో వెల్లడైంది.

జ్వరం, కీళ్లసంబంధిత వ్యాధులతో వచ్చే వారి సంఖ్య పెరిగిందని నిమ్స్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రతిభాలక్ష్మి తెలిపారు. ప్రతి రోజు ఔట్ పేషెంట్లుగా దాదాపు 80 మంది వస్తుండగా, అందులో 25 నుంచి 30 మంది జ్వరం, జలుబు లక్షణాలతో వస్తున్నట్టు సిరిసిల్ల ప్రభుత్వ వైద్యశాల జనరల్ మెడిసిన్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సంతోష్ వెల్లడించారు. 70 మంది పిల్లలు ఇబ్బందితో రాగా వారిలో ఇద్దరికి మాత్రం ఆస్పత్రిలో చేర్చాలని పరిస్థితి వచ్చిందని నిజామాబాద్ సీనియర్ పీడియాట్రిషియన్ డాక్టర్ శ్రీశైలం తెలిపారు.

జాగ్రత్తలు పాటించాలి



శ్వాససంబంధిత రోగుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని ఐఎంఏ రాష్ట్ర సైంటిఫిక్ కమిటీ కన్వీనర్ డాక్టర్ కిరణ్ మాదాల సూచించారు. ముఖ్యంగా రిస్క్ గ్రూప్ అంటే పదేండ్ల లోపు చిన్నారులు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు మరింత అప్రమత్తంగా ఉండాలని కోరారు. బయటికి వెళ్లే సమయంలో మాస్కులు ధరించడం, జనం రద్దీగా ఉండే ప్రదేశాల్లో తగినంత భౌతిక దూరం పాటించాలన్నారు. కరోనా కొత్త వేరియంట్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో జిల్లాల్లో టెస్టుల సంఖ్య పెంచాలని కిరణ్ ప్రభుత్వానికి సూచించారు.

-డాక్టర్ కిరణ్ మాదాల

ప్రజల ఆశలు నెరవేరుస్తాం

(మొదటిపేజి తరువాయి)

రాబడతామని తెలిపారు. ఫించన్లు, రేషన్ కార్డులు, ఇళ్ల కోసంఎదురు చూసిన వారి ఆశలు త్వరతో ఫలిస్తాయని పేర్కొన్నారు. అమరులు, ఉద్యమకారుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామనీ, వారిపై నమోదైన కేసులను ఎత్తి వేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఆటో కార్మికులు, అసంఘటిత కార్మికుల సంక్షేమం కోసం రూ.5 లక్షల బీమా సౌకర్యాన్ని తీసుకొచ్చామనీ, ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల సమస్యలకు త్వరలో పరిష్కారం లభిస్తుందని తెలిపారు. "నా తెలంగాణ కోటి రతనాల వీణగా... కోట్లాది ప్రజల సంక్షేమ వాణిగా... అభివద్ధిలో శిఖరాగ్రాన నిలవాలని...ప్రతి ఇంటా వెలుగులు నిండాలని" సీఎం ఆకాంక్షించారు.

కేసీఆర్ అలా చేసుంటే మరోలా ఉండేది

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై మాజీ మంత్రి కేటీఆర్ 'ఎక్స్' వేదికగా ఆసక్తికర ట్వీట్ చేశారు. "తెలంగాణలో కేసీఆర్ 32 మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేయడానికి బదులు, 32 యూట్యూబ్ ఛానెల్స్ పెట్టి ఉంటే బీఆర్ఎస్ ప్రభుత్వంపై తప్పుడు ప్రచారాన్ని తిప్పి కొట్టేవాళ్లం.. ఈ పరిశీలన కొంతవరకు ఏకీభవించేదిగా అనిపిస్తోంది" అని పోస్ట్ చేశారు. ఎన్నికల తర్వాత చాలా ఆసక్తికరమైన ఫీడ్‌బ్యాక్, పరిశీలనలు వస్తున్నాయనీ, అయితే ఇప్పటివరకు వచ్చిన ఫీడ్‌బ్యాక్‌లలో ఇదే ఉత్తమమైనదని పేర్కొన్నారు. అయితే ఈ ట్వీట్‌కు కొందరు మద్దతు తెలపగా మరికొందరు విమర్శిస్తున్నారు. తొలి ఐదేళ్ళ తర్వాత అధికారంలో ఉండాలంటే ఎలా పాలించాలో, ప్రజలతో ఎలా మమేకం కావాలో ఈ ఓటమి తప్పేదని అంటున్నారు.

అడవిపై గొడ్డలి వేటు..!



(మొదటిపేజి తరువాయి)

ఇచ్చారు. ఇటీవల బీజేపీ గెలుపొందడంతో, రాష్ట్ర ముఖ్యమంత్రిగా గత నెల 13న విష్ణుదేవ్ సాయి బాధ్యతలు చేపట్టారు. ఆ నాటి నుంచి అత్యంత కట్టుదిట్టమైన భద్రత మధ్య చెట్ల నరికివేత పనులు నిరాటంకంగా సాగిపోతున్నాయి. గత సంవత్సరం ఛత్తీస్‌గఢ్ శాసనసభ చెట్ల నరికివేతను నిరసిస్తూ ఏకగ్రీవంగా తీర్మానం ఆమోదించిన విషయం తెలిసిందే. అడవుల నరికివేతపై పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు జరిగాయి. పైగా దేవ్ సాయి రాష్ట్రానికి తొలి గిరిజన ముఖ్యమంత్రి. బొగ్గు తవ్వకం, చెట్ల నరికివేత గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలేనని, ఇప్పుడు జరుగుతున్న పనులు వాటికి కొనసాగింపేనని ఆయన వివరణ ఇస్తున్నారు.


ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికలలో సర్‌గుజా జిల్లాలోని మొత్తం 14 స్థానాలనూ బిజెపియే గెలుచుకుంది. ప్రజలు తమపై ఉంచిన విశ్వాసాన్ని వమ్ము చేస్తూ పలు గ్రామాలలో గ్రామసభలు నిరసన వ్యక్తం చేసినప్పటికీ అటవీ భూమిని తవ్వకాలకు ధారాదత్తం చేశారు. కొన్ని గ్రామ సభలను మైనింగ్ కంపెనీలే నిర్వహించి తీర్మానాలు ఆమోదించాయి. వాటిపై గత గవర్నర్ విచారణకు ఆదేశించారు కూడా. అయినప్పటికీ పోలీసు రక్షణలో మైనింగ్ పనులు నిరాటంకంగా కొనసాగుతున్నాయి. అడవుల నరికివేతపై కాంగ్రెస్, బీజేపీ పరస్పరం ఆరోపణలు చేసుకోవడంతోనే కాలం గడుపుతున్నాయి. వాస్తవానికి ఈ దారుణంలో ఆ రెండూ భాగస్వాములే.


రెట్టించిన ఉత్సాహంతో నూతన సంవత్సరంలోకి..

నవచిత్రం


'గుంటూరు కారం'లో మహేష్‌బాబు, శ్రీలీల

2023.. టాలీవుడ్‌కి బాగా కలిసొచ్చిన సంవత్సరం. స్ట్రయిట్, డబ్బింగ్ కలిపి 306 సినిమాల విడుదలతో తెలుగు చిత్ర పరిశ్రమ కళకళలాడింది. దశాబ్ద కాలం తర్వాత ఎక్కువ సినిమాలు రిలీజైన సంవత్సరం కూడా. ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రతిష్టాత్మక భావించే ఆస్కార్ అవార్డుల్లోను, దేశ వ్యాప్తంగా అత్యంత గౌరవంగా భావించే జాతీయ చలన చిత్ర అవార్డుల్లోనూ తెలుగు సినిమా తన సత్తాని బలంగా చాటింది. అవార్డులోనే కాదు కలెక్షన్ల రికార్డులోనూ తిరుగులేని విజయబావుటాని ఎగురవేసింది. నూతన నాయకానాయికలు, దర్శకులు, రచయితలు, సాంకేతిక నిపుణులు ఎక్కువమంది ఈ ఏడాది పరిచయం అవ్వడం ఓ విశేషమైతే, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ప్రేక్షకుల్ని మెప్పించే విషయంలో తెలుగు సినిమా విజయం సాధించడం మరో విశేషం. అయితే లెక్కకి 306 సినిమాలు విడుదలైనా కథల పరంగా మూస ధోరణి రొట్టకొట్టుడు కథలతోనే ఎక్కువ సినిమాలు రావడం ఆలోచించాల్సిన విషయం. సహజత్వాన్ని ప్రతిబింబించే నేటివిటీ కథలు, ప్రయోగాత్మక కథలతో ప్రేక్షకుల్ని అలరించే క్రమంలో ఈ ఏడాది చెప్పుకోదగ్గ విజయాలు దక్కించుకోవడం అభినందనీయం. మొత్తమ్మీద 2023.. తెలుగు చిత్ర పరిశ్రమకి అన్ని రకాలుగా మంచి ఊపుని, ఉత్సాహాన్నిచ్చిన సంవత్సరం. దీనికి కొనసాగింపుగా రెట్టించిన ఉత్సాహంతో తెలుగు సినిమా **2024**లోకి అడుగిడుతోంది. ఇందులో భాగంగా ఈ ఏడాది ఏకంగా ఐదు తెలుగు సినిమాలతోపాటు రెండు తమిళ సినిమాలు భారీ కలెక్షన్ల సీజన్ సంక్రాంతి బరిలోకి దిగుతున్నాయి. వీటి విజయాలు నూతన సంవత్సరానికి శుభారంభాన్ని ఇస్తాయని ఆశిద్దాం.


'సైంధవ్'లో వెంకటేష్


'ఈగల్'లో రవితేజ


'నా సామి రంగ'లో నాగార్జున


'హను-మాన్'లో తేజా సజ్జా

సంక్రాంతికి తగ్గేదేలే..

గాయని సునీత తనయుడు ఆకాష్ హీరోగా పరిచయం అవుతూ రూపొందిన **'సర్కారు నౌకరి'** ఈ ఏడాది తొలి సినిమాగా ప్రేక్షకులను పలకరించనుంది. దర్శకేంద్రుడు కె.రాఘవేంద్రరావు నిర్మించిన చిత్రమిది. జనవరి 1వ తేదీ నుంచి 11వ తేదీ వరకు '14 డేస్ లవ్' లాంటి పలు చిన్న సినిమాలు రిలీజ్ కానున్నాయి. వీటి తర్వాత సంక్రాంతికి సందడి చేయటానికి ఏకంగా 5 తెలుగు, 2 తమిళ సినిమాలు రాబోతున్నాయి. ఒకేసారి ఇన్ని సినిమాలు విడుదలైతే కలెక్షన్ల విషయంలో ఏ నిర్మాతకీ న్యాయం జరగదనే కఠోర వాస్తవం తెలిసినప్పటికీ ఈ సినిమాల నిర్మాతలు తగ్గేదేలా.. అన్న చందంగా బరిలోకి దిగుతున్నారు.

జనవరి 12

మహేష్‌బాబు, త్రివిక్రమ్ వంటి క్రేజీ కాంబినేషన్‌లో హారిక అండ్ హాసిని పతాకంపై ఎస్.రాధాకృష్ణ నిర్మించిన చిత్రం **'గుంటూరుకారం'**. 'అతడు', 'ఖలేజా'వంటి సినిమాల తర్వాత మహేష్, త్రివిక్రమ్ కాంబోలో వస్తున్న చిత్రం కావడంతో అటు ప్రేక్షకుల్లోను, ఇటు మహేష్, త్రివిక్రమ్ అభిమానుల్లోనూ భారీ అంచనాలు ఉన్నాయి. ఈ భారీ అంచనాల నడుమ **'హను-మాన్'** సినిమా పోటీకి సై అంటోంది. తేజా సజ్జా, ప్రశాంత్ వర్మ కలయికలో పాన్ ఇండియా సినిమాగా రూపొందిన ఈ సినిమా తన భవితవ్యాన్ని తేల్చుకోనుండగా, పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వంలో ధనుష్ నటించిన **'కెప్టెన్ మిల్లర్'** సైతం ఇదే రోజు ప్రేక్షకుల ముందుకు వస్తూ గట్టి సవాల్ విసురుతోంది. ఇక వీటితోపాటు **'అయలాన్'** సినిమాతో శివకార్తికేయన్ కూడా తగ్గేదేలే.. అంటూ పోటీకి దిగుతున్నారు. ఏడేళ్ళుగా పలు మార్లు వాయిదా పడుతూ వచ్చిన ఈ సినిమా ఎట్టకేలకు రిలీజ్ అవుతోంది. అయితే తెలుగులో విడుదల ఉంటుందా లేదా అనేది ఇంకా తెలియాల్సి ఉంది. ఈ నాలుగు సినిమాలు వేటికవే మంచి బజ్‌ని క్రియేట్ చేశాయి.


'అయలాన్'లో శివ కార్తికేయన్

జనవరి 13

వెంకటేష్ నటించిన **'సైంధవ్'** సంక్రాంతి బరిలో అమీతుమీ తేల్చుకోనుంది. శైలేష్ కొలను దర్శకత్వం వహించిన ఈ పాన్ ఇండియా మూవీని నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై వెంకట్ బోయనపల్లి నిర్మించారు. రవితేజ **'ఈగల్'** సినిమాతో పొంగల్‌కి రాబోతున్నారు. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు. 'సైంధవ్'గా వెంకీ, 'ఈగల్'గా రవితేజ సై అంటూ బరిలోకి దిగటం ఈ సంక్రాంతి ప్రత్యేకత. ఈ పోటీని మరింత రసవత్తరం చేసేందుకు నెక్స్ట్ డే **'నా సామిరంగ'** అంటూ నాగ్ రంగంలోకి దిగుతున్నారు.

జనవరి 14

నూతన దర్శకుడు విజయ్ బిన్నీ దర్శకత్వంలో నాగార్జున నటించిన చిత్రం **'నా సామి రంగ'**. శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్‌పై శ్రీనివాస చిట్టూరి పక్కా మాస్ సినిమాగా నిర్మించారు.


'కెప్టెన్ మిల్లర్'లో ధనుష్


కాంగ్రెస్ కసరత్తు షురూ

- పార్లమెంట్ ఎన్నికలపై గాంధీభవన్‌లో 3న విస్తృతస్థాయి సమావేశం
- 17 సీట్లపై ఫోకస్
- బరిలోకి బలమైన అభ్యర్థులు
- అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలైన స్థానాలపై ప్రత్యేక దృష్టి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

పార్లమెంటు ఎన్నికలపై టీపీసీసీ కసరత్తు ప్రారంభించింది. గత ఎన్నికల్లో మూడు ఎంపీ స్థానాలను సొంతం చేసుకున్న ఆ పార్టీ ఈసారి ఎన్నికల్లో 17 స్థానాలనూ కైవసం చేసుకునే లక్ష్యంగా ముందుకు సాగుతున్నది. కాంగ్రెస్ సారథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆ పార్టీకి పార్లమెంటు ఎన్నికలు మొదటి సవాల్‌గా మారాయి. దీన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు పార్టీ పావులు కదుపుతున్నది. ఈనెల 3న టీపీసీసీ విస్తృతస్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నది. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరగనున్న మొదటి పార్టీ సమావేశం కావడంతో దీనికి ఎంతో ప్రాధాన్యత ఏర్పడింది. పార్లమెంటు ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, కార్యాచరణ, ప్రభుత్వ ప్రజాపాలన, ఆరు గ్యారంటీల కోసం ప్రభుత్వం విడుదల చేసిన దరఖాస్తులకు వస్తున్న స్పందన తదితర అంశాలపై క్షేత్రస్థాయి నుంచి అభిప్రాయాలు తెలుసుకోనున్నారు. వారి నుంచి తగిన సూచనలు, సలహాలు స్వీకరించనున్నారు. వాటిన్నింటిని క్రోడికరించిన నివేదికను ఈనెల 4న ఢిల్లీలో జరగనున్న పార్లమెంటు ఎన్నికల సన్నాహక కమిటీ సమావేశంలో సీఎం రేవంత్ సమర్పి ంచనున్నారు. ఇప్పటికే ఆయా పార్లమెంటు నియోజకవర్గాలకు మంత్రులను ఇన్‌చార్జీలుగా నియమించింది. ఏఐసీసీ, టీపీసీసీ నేతలకు బాధ్యతలు అప్పగించనున్నారు. మొత్తంగా రాష్ట్రంలోని 17 పార్లమెంటు నియోజక వర్గాలపై ఏఐసీసీ కూడా ప్రత్యేక ఫోకస్ పెట్టింది. అన్ని స్థానాలను కైవసం చేసుకునేందుకు ప్రణాళి కలు రూపొందిస్తున్నది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచిన స్థానాల్లో ఆ పార్టీకి వచ్చిన ఓట్ల శాతం, పార్టీ ఓడిపోయిన చోట్ల వచ్చిన ఓట్ల శాతాన్ని బేరీజు వేస్తున్నట్టు తెలిసింది. ఎక్కడెక్కడ కాంగ్రెస్‌కు ఓట్ల శాతం తక్కువగా వచ్చిందో, అక్కడక్కడ ఓట్ల శాతాన్ని ఎలా పెంచుకోవాలనే దానిపై పార్టీ తీవ్ర కరసత్తు చేస్తున్నది. అధికార కాంగ్రెస్‌కు, ప్రతిపక్ష బీఆర్‌ఎస్‌కు మధ్య ఓట్ల తేడా 1.8 శాతమే ఉన్నది. అయినప్పటికీ కాంగ్రెస్‌కు 64 సీట్లు, బీఆర్‌ఎస్‌కు 39 సీట్లు వచ్చాయి. బీజేపీకి 8, ఎంఐఎం 7, సీపీఐకి ఒక సీటు వచ్చింది. ఈ ఫలితాలను సమీక్షించి భారీగా ఓట్ల శాతాన్ని పెంచుకునేందుకు కాంగ్రెస్ కార్యచరణ రూపొందిస్తున్నది. వీటన్నింటితోపాటు ఎంపీ స్థానాలకు అభ్యర్థుల పరిశీలన కూడా పార్టీకి పెద్దగా సవాల్‌గా మారింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో టికెట్లు దక్కని నాయకులకు ఎంపీ సీట్లు ఇస్తామనీ, కార్పొరేషన్ చైర్మెన్ పదవులిస్తామనీ, ఎమ్మెల్సీ పదవులిస్తామంటూ పార్టీ హామీ ఇచ్చింది. పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తుండటంతో ఆశావహులు కూడా రంగంలోకి దిగుతున్నారు. అటువంటి నాయకులను ఎట్లా సర్దుబాటు చేయాలనే అంశాన్ని కూడా పార్టీ సీరియస్‌గా చర్చించనుంది. అంతకంటే ముఖ్యంగా అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతి పార్లమెంటు నియోజకవర్గానికి బీసీలకు రెండు సీట్ల చొప్పున ఇస్తామన్న హామీ నెరవేరలేదు. ఈ ఎన్నికల్లో కచ్చితంగా సామాజిక సమీకరణాలను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరముందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేసేందుకు బలమైన అభ్యర్థులను బరిలోకి దించేందుకు పార్టీ చర్చలు చేస్తున్నది. దీంతో బలమైన అభ్యర్థులా? సామాజిక సమీకరణాలా? అనేది పార్టీ ఎదుర్కొబోతున్న మరో సమస్య. సొంత పార్టీ నాయకులతోపాటు ఇతర పార్టీల్లోని బలమైన నేతలు సైతం కాంగ్రెస్‌లోకి వచ్చేందుకు ఆసక్తిగా ఉన్నట్టు ప్రచారం జరుగుతున్నది. అటువంటి వారికి టికెట్ ఇచ్చి గెలిపించుకోవాలనే పార్టీ ఆలోచన చేస్తున్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో అభ్యర్థుల పోటీ మాత్రం పార్టీలో దీటుగా ఉన్నది. దీంతోపాటు మంత్రులు కూడా తమ అనుచరులకు టికెట్లు ఇప్పించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఒక్కొక్క నియోజకవర్గం నుంచి 4 లేదా 5 మంది నాయకులు ఎంపీ టికెట్ ఆశిస్తున్నారు. అయితే గెలుపే లక్ష్యంగా అభ్యర్థులను ఎంపిక చేసే అవకాశం ఉన్నట్టు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతున్నది.








Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

సముద్రపు ఆమ్లీకరణ దృగ్విషయానికి కారణం ఏమిటి?



రోజురోజుకి పెరుగుతున్న కాలుష్యం వల్ల తలెత్తుతున్న పర్యావరణ సంక్షోభం ప్రపంచానికి ఒక పెను సవాల్‌గా మారింది. పర్యావరణ వ్యవస్థలు మునుపెన్నడూ లేనంత గడ్డు స్థితిని ఎదుర్కొంటున్నాయి. వాతావరణంలోకి పెద్ద ఎత్తున విడుదలవుతున్న హానికరమైన కాలుష్యకాలు సహజ ఆవరణ వ్యవస్థలతో పాటు జీవుల ఆరోగ్యంపై కూడా అనేక ప్రతికూల ప్రభావాలకు గురి చేస్తుంది. నిత్యం పర్యావరణంలోకి విడుదలవుతున్న కాలుష్య కారకాల వల్ల గాలి, నీరు, భూమి అత్యంత వేగంగా కలుషితమై పోతున్నాయి. వ్యవసాయ రంగంలో అవసరానికి మించి వినియోగిస్తున్న పురుగు మందుల వ్యర్థాల కారణంగా భూమి తన సారాన్ని కోల్పుతుంది. పట్టణీకరణ, రవాణా, వేగవంతమైన పారిశ్రామికీకరణ, అటవీ నిర్మూలన, అధిక జనాభాతో పాటు పర్యావరణ విధానాలు సక్రమంగా అమలు చేయకపోవడం వల్ల పర్యావరణ వ్యవస్థల ఆరోగ్యం రోజురోజుకి క్షీణిస్తుంది. పర్యావరణం ఎదుర్కొంటున్న ఈ సమస్యలను పరిష్కరించడానికి చిత్తశుద్ధితో పర్యావరణ చట్టాలను అమలు చేయడం, పునరుత్పాదక ఇంధన వనరులను ప్రోత్సహించడం, వ్యర్థ పదార్థాల నిర్వహణ పద్ధతులను మెరుగుపరచడం, పర్యావరణ వ్యవస్థలను పరిరక్షించడం, పర్యావరణ పరిరక్షణ దిశగా ప్రజలలో అవగాహన పెంచడంతో పాటు పర్యావరణ క్షీణతను అరికట్టడానికి ప్రపంచ దేశాలన్నీ ఒక్కటి కావాల్సిన తరుణమిది.

1. గ్రీన్‌హౌస్ ప్రభావానికి కిందివాటిలో ఏది ప్రాథమికంగా బాధ్యత వహిస్తుంది?
   ఎ) నైట్రోజన్ బి) ఆక్సిజన్
   సి) కార్బన్ డయాక్సైడ్ డి) హైడ్రోజన్
2. యాసిడ్ వర్షానికి కారణమేమిటి?
   ఎ) నత్రజని విడుదల
   బి) కార్బన్ మోనాక్సైడ్ విడుదల
   సి) సల్ఫర్ డయాక్సైడ్ మరియు నైట్రోజన్ ఆక్సైడ్ల విడుదల డి) ఆక్సిజన్ విడుదల
3. ఓజోన్ పొర క్షీణతకు కారణమయ్యే వాయువు ఏది?
   ఎ) మీథేన్ బి) క్లోరోఫ్లోరో కార్బన్‌లు
   సి) కార్బన్ డై ఆక్సైడ్ డి) నైట్రస్ ఆక్సైడ్
4. కాడ్మియం కాలుష్యం వల్ల కలిగే వ్యాధి పేరు ఏమిటి ?
   ఎ) మినమెటా బి) బ్లూ బేబీ
   సి) బ్లాక్ ఫుట్ వ్యాధి డి) ఇటాయి ఇటాయి
5. గ్రేట్ పసిఫిక్ గార్బేజ్ ప్యాచ్ ప్రధానంగా దేని వల్ల ఏర్పడింది?
   ఎ) మైక్రోప్లాస్టిక్స్ బి) సహజ వృక్షసంపద
   సి) సేంద్రీయ వ్యర్థాలు డి) రసాయన వ్యర్థాలు
6. కింది వాటిలో ఏది మానవ కార్యకలాపాల ఫలితంగా ఏర్పడే వాతావరణ నమూనాలలో మార్పులని సూచిస్తుంది ?
   ఎ) ఎల్ నినో బి) సూర్యగ్రహణం
   సి) చంద్ర చక్రం డి) విషువత్తు
7. నగరాల్లో వాయు కాలుష్యానికి ఈ కింది వాటిలో ఏది ఎక్కువగా దోహదపడుతుంది?
   ఎ) నీటి ఆవిరి బి) నైట్రోజన్
   సి) కార్బన్ మోనాక్సైడ్ డి) ఆక్సిజన్
8. ఈ కింది వాటిలో ఎడారీకరణకు ప్రధాన కారణం ఏమిటి?
   ఎ) అధిక వర్షపాతం
   బి) అతిగా మేత మరియు అటవీ నిర్మూలన
   సి) పట్టణీకరణ డి) అగ్నిపర్వత విస్ఫోటనం
9. ఈ కింది వాటిలో సముద్ర మట్టాలు పెరగడానికి ప్రధాన కారణం ఏమిటి?
   ఎ) భూమి యొక్క భ్రమణం
   బి) ధ్రువ మంచు గడ్డలు వేగంగా కరగటం
   సి) సౌర వికిరణం డి) సముద్ర ప్రవాహాలు
10. ఈ కింది వాటిలో పొగమంచు ఏర్పడటానికి కారణమైన ప్రధాన కాలుష్యకం ఏది?
    ఎ) ఆక్సిజన్ బి) నైట్రోజన్
    సి) కార్బన్ డయాక్సైడ్ డి) సల్ఫర్ డయాక్సైడ్
11. యూట్రోఫికేషన్ ప్రధానంగా దేని వల్ల కలుగుతుంది?
    ఎ) భారీ లోహాల విడుదల
    బి) నీటి వనరులలో అధిక పోషకాలు
    సి) చమురు చిందటం డి) యాసిడ్ వర్షం
12. వాతావరణం వేడిని బంధించడం వల్ల భూమి ఉపరి తలం వేడెక్కడానికి కారణమయ్యే దృగ్విషయం ఏది?
    ఎ) గ్లోబల్ కూలింగ్
    బి) గ్లోబల్ డిమ్మింగ్
    సి) గ్లోబల్ వార్మింగ్
    డి) మంచు యుగం
13. ఈ క్రింది వాటిలో రేడియోధార్మిక పదార్థాల వల్ల ఏర్పడే మానవ నిర్మిత పర్యావరణ విపత్తు ఏది?
    ఎ) చెర్నోబిల్ విపత్తు బి) ఎల్ నినో
    సి) యాసిడ్ వర్షం
    డి) కొండచరియలు విరిగిపడటం
14. పగడపు దిబ్బల వినాశనానికి ప్రధాన కారణమేమిటి?
    ఎ) నేల కోత
    బి) ఓవర్ ఫిషింగ్ మరియు కాలుష్యం
    సి) అధిక వర్షపాతం డి) అగ్నిపర్వత కార్యకలాపాలు
15. ఈ కింది వాటిలో ఉబ్బసం వంటి శ్వాసకోశ వ్యాధులను కలిగించే కాలుష్య కారకం ఏది?
    ఎ) కార్బన్ డయాక్సైడ్ బి) ఓజోన్
    సి) నైట్రోజన్ డి) ఆక్సిజన్
16. ఈ కింది వాటిలో జీవవైవిధ్య వినాశనానికి ప్రధాన కారణం ఏమిటి?
    ఎ) గ్లోబల్ వార్మింగ్
    బి) అటవీ ఆవాసాల విధ్వంసం
    సి) యాసిడ్ వర్షం డి) భూకంపం
17. ఏ విపత్తు వల్ల సముద్ర మట్టంలో ఆకస్మిక, శక్తివంతమైన మరియు దీర్ఘకాల మార్పులు కలుగుతాయి ?
    ఎ) సునామీ బి) వరద
    సి) సుడిగాలి డి) హరికేన్
18. ఈ కింది వాటిలో ఏది ఎక్కువగా పాదరసం కాలుష్యాన్ని కలిగిస్తుంది ?
    ఎ) వ్యవసాయ ప్రవాహం బి) పారిశ్రామిక ఉద్గారాలు
    సి) బొగ్గు దహనం డి) చమురు చిందటం
19. నీటి అడుగున భూకంపం లేదా అగ్నిపర్వత విస్ఫోటనం కారణంగా సంభవించే విపత్తు ఏది ?
    ఎ) హరికేన్ బి) వరద
    సి) హిమపాతం డి) సునామీ



డాక్టర్ కె. శశిధర్
పర్యావరణ నిపుణులు
94919 91918

20. మినమేటా అనే వ్యాధిని కలిగించే కాలుష్యకం ఏమిటి?
    ఎ) కాడ్మియం బి) ఆర్సెనిక్
    సి) మెర్క్యూరీ డి) లేడ్
21. ఈ కింది వాటిలో సముద్రపు ఆమ్లీకరణ దృగ్విషయానికి కారణం ఏమిటి ?
    ఎ) సల్ఫర్ డయాక్సైడ్ విడుదల
    బి) అటవీ నిర్మూలన
    సి) కార్బన్ డయాక్సైడ్ శోషణ
    డి) నైట్రోజన్ ఆక్సైడ్ల శోషణ
22. ఈ-వేస్ట్ ఉత్పత్తి చేసే దేశాల్లో భారత్ ఎన్నో స్థానంలో ఉంది?
    ఎ) 12వ స్థానం బి) 8వ స్థానం
    సి) 5వ స్థానం డి) 10వ స్థానం
23. ఈ కింది వాటిలో నీటిని శుభ్రం చేయడానికి దేనిని వినియోగిస్తారు ?
    ఎ) హీలియం బి) క్లోరిన్
    సి) ఫ్లోరిన్ డి) బొగ్గు పులుసు వాయువు
24. సెల్‌ఫోన్ వ్యర్థాలలో అధికంగా ఉండే లోహం ఏమిటి?
    ఎ) కోబాల్ట్ బి) నికెల్
    సి) పెల్లాడియం డి) సిల్వర్
25. ఓజోన్ పొర క్షీణతను ఈ సంవత్సరంలో గుర్తించారు?
    ఎ) 1885 బి) 1985
    సి) 1989 డి) 1998

సమాధానాలు

1. సి	2. సి	3. బి	4. డి	5. ఎ
6. ఎ	7. సి	8. బి	9. బి	10. సి
11. బి	12. సి	13. ఎ	14. బి	15. బి
16. బి	17. ఎ	18. సి	19. డి	20. సి
21. సి	22. సి	23. బి	24. సి	25. బి

కరెంట్ అఫైర్స్



- కె. నాగార్జున
కరెంట్ ఎఫైర్స్ సీనియర్ ఫ్యాకల్టీ
9490352545

ఆర్టికల్370 రద్దును సమర్థించిన సుప్రీంకోర్టు



జమ్మూ కాశ్మీర్‌కు ప్రత్యేక హెూదాను ఉపసంహరిస్తూ 2019లో కేంద్ర ప్రభు త్వం 370 ఆర్టికల్‌ను రద్దు చేయడాన్ని సవాలుచేస్తూ దాఖలైన పలు పిటిషన్‌ల పై సుప్రీంకోర్టు తాజాగా తీర్పు వెలువరిం చింది. ఇటీవల వెలువరించిన తీర్పులో ఆర్టికల్ 370ని రద్దు చేయడం అనేది. కేంద్ర ప్రభుత్వ పరిధిలో తీసుకొన్న నిర్ణయం అని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. ఆర్టికల్ 370 యుద్ధ నేపథ్యంలో కుదుర్చుకున్న తాత్కాలిక ఏర్పాటు మాత్రమే అని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ డి.వై చంద్ర చూడ్ నేతృత్వంలో ఐదుగురు సభ్యుల బెంచ్ తీర్పు ఇచ్చింది.

బోయిమ్, అవ్వాద్‌లకు ఇందిరాగాంధీ శాంతి బహుమతి

ఇజ్రాయిల్-పాలస్తీనా సమస్యకు శాంతియుత పరిష్కారం కనుగొనడంలో కృషి సాగిస్తున్న డేనియల్ ఒరెన్ బోయిమ్, అలీ అబు అవ్వాద్‌లకు 2023 సంవత్సరానికి ఇందిరాగాంధీ శాంతి బహుమతి ప్రకటించారు. ఒరెన్ బోయిమ్ పాలస్తీనాకు చెందిన ఉద్యమకారుడు. అవ్వాద్ పాలస్తీనా తఫీర్ జాతీయ ఉద్యమ స్థాపకుడు



ఇస్రోకు ఐస్‌ల్యాండ్ 'అన్వేషణ' అవార్డు



చంద్రునిపై జీవం జాడ కోసం అన్వేషిస్తున్న ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఐఎస్ఆర్ఓ)కు ఐస్‌ల్యాండ్‌కు చెందిన సంస్థ నుంచి అవార్డు లభించింది. చంద్రయాన్ -3 ద్వారా చంద్రుడిపై సాఫ్ట్ ల్యాండింగ్‌ను విజయవంతంగా పూర్తి చేసినందుకు గాను 2023 ఏడాదికి 'లీఫ్ ఎరిక్ సన్ లూనార్ ప్రైజ్‌'ను ఇస్తున్నట్లు హుసావిక్ నగరంలోని ఎక్స్‌ప్లోరేషన్ మ్యూజియం తెలిపింది.

కోవిడ్-19కి కొత్త వేరియంట్ జె.ఎన్.ఐ

కేరళలో కోవిడ్-19 సబ్ వేరియంట్ జె.ఎన్.ఐ కేసు బయటపడింది. ఈ విషయాన్ని ఆ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి ప్రకటించారు. అయితే దీనిలో ఎలాంటి ఆందోళన అవసరం లేదని స్పష్టం చేశారు. కొన్ని నెలల కిందట సింగపూర్ ఎయిర్‌పోర్ట్‌లో భారతీయ ప్రయాణికుల స్క్రీనింగ్ సందర్భంగా ఈ సబ్ వేరియంట్‌ను గుర్తించారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు జాగ్రత్తలు తీసుకోవాలని ఆరోగ్య శాఖ సూచిస్తుంది.



33 దేశాలకు వీసా రహిత ప్రయాణాలు అనుమతిచ్చిన ఇరాక్



విదేశీ పర్యాటకులను, సందర్శకులను ఆకర్షించేందుకు ఇరాన్ ప్రభుత్వం భారత్ సహా 33 దేశాలకు వీసా లేని ప్రయాణాలకు అనుమతి ఇస్తున్నట్లు ప్రకటించింది. తమ దేశానికి వీసాతో పని లేకుండా రావొచ్చంటూ ఇటీవలే మలేసియా, శ్రీలంక, వియత్నాం దేశాలు ప్రకటించిన విషయం తెలిసిందే.

'ర్యాగింగ్'.. ఓ రాక్షస క్రీడ!



డి.జె. మోహనరావు
8247045230

డిసెంబర్ 23 వ తేదీన వరంగల్ కాకతీయ యూనివర్సిటీలో ర్యాగింగ్ చాలా దారుణమైన విషయం. ఈ ఘటనలో 81 మంది విద్యార్థులు సస్పెన్షన్ అయ్యారు. ఆదిమ మానవుడు నుండి నాగరిక సమాజంలోకి మనిషి అడుగు పెట్టినా బుర్రలో ఎక్కడో దాగి ఉన్న పైశాచిక బుద్ధి అనుకూల పరిస్థితులలో బయటకు వచ్చి బుసలు కొడుతోంది. ఎదుటివారి నిస్సహాయక పరిస్థితే ఇవతలి వాడికి అనుకూల పరిస్థితి. విద్యార్థుల స్థాయిలో ఇది ర్యాగింగ్ రూపంలో బయటపడుతోంది. ర్యాగింగ్ ఓ పైశాచిక క్రీడ. సైకోయిజం. సూక్ష్మంగా చెప్పాలంటే ర్యాగింగ్ అనేది ఎదుటివాడిని ఇబ్బంది పెట్టి దానిని చూసి ఆనందపడే ఒక పాశవిక చర్య. కళాశాలల్లో సీనియర్ విద్యార్థులు కొత్తగా వచ్చిన విద్యార్థులకు మనస్థాపం కలిగించే రీతిలో ప్రవర్తించడం. మన దేశంలోని ఉన్నత విద్యావ్యవస్థలో ర్యాగింగ్ అనేది కలవం పెట్టే వాస్తవం. దీని వలన అమాయకుల ప్రాణాలు బలవుతున్నాయి. వేలాది మంది తెలివైన విద్యార్థుల భవిష్యత్ నాశనం అవుతున్నాయి. లోతుగా చూస్తే ఇది జూనియర్ల పై వివక్షత చూపడమే. ఈ వివక్షత అనేది రంగు, జాతి, మతం, కులం, లింగం, ప్రాంతీయత, పుట్టిన ప్రదేశం, నివాస స్థలం, ఆర్థిక నేపథ్యం వంటి అనేక రూపాలలో ఉంటుంది. జూనియర్ శారీరకంగా, సామాజికంగా, ఆర్థికంగా అన్ని విధాలుగా అధిక స్థాయిలో ఉంటే ర్యాగింగ్ చేయడానికి భయపడతారు. ఏతావాతా తెలివితేటలు ఉన్నా కూడా బలహీనులే బలవుతున్నారు. ఒక్కోసారి ఈ వేదనను భరించలేక తగు సమయంలో పరిష్కరించే వారు లేక ఆత్మహత్యలు కూడా చేసుకుంటున్నారు. ఈ ర్యాగింగ్‌లో లైంగిక వేధింపులు, స్వలింగ సంపర్కదాడులు, బట్టలు విప్పడం, బలవంతంగా అశ్లీల చర్యలు, సంజ్ఞలు, శారీరక హాని లేదా ఆరోగ్యానికి లేదా వ్యక్తికి ఏదైనా ఇతర ప్రమాదం కలిగించే చర్యలు ఉంటాయి. సీనియర్లు వారి నోట్సులు రాయించుట, అకాడమిక్ టాస్కులను జూనియర్లతో చేయిస్తున్నారు. ఈ ర్యాగింగ్‌కు ఓ రిషితేశ్వరి, ప్రీతి లాంటి వారు ఎంతో మంది బలయ్యారు.

కమిటీలు ఏం చెప్పాయి?: ఏకే గంగూలీ నేతృత్వంలోని ధర్మాసనం "అందరూ ఒకే విధమైన మనస్తత్వంతో ఉండరు. కొందరు అత్యంత సున్నిత మనస్కులై చిన్నపాటి విషయాలకే ఉద్రేకానికి గురవుతుంటారు" అని పేర్కొంది. 1999లో విశ్వ జాగృతి విషయంలో సుప్రీం కోర్టు ర్యాగింగ్‌ను "మాట్లాడిన లేదా రాసిన మాటల ద్వారా లేదా ఇతర విద్యార్థిని ఆటపట్టించడం లేదా అసభ్యంగా ప్రవర్తించడం, రౌడీ లేదా క్రమశిక్షణా రాహిత్యం వంటి ప్రభావంతో కూడిన ఏదైనా క్రమరహిత ప్రవర్తన. ఒక ఫ్రెషర్ లేదా జూనియర్ విద్యార్థిలో చికాకు, కష్టాలు లేదా మానసిక హాని కలిగించే లేదా భయం లేదా భయాన్ని పెంచే కార్యకలాపాలు లేదా విద్యార్థి సాధారణ కోర్సులో చేయని ఏదైనా చర్య లేదా ఏదైనా చేయమని విద్యార్థులను అడగడం, ఒక ఫ్రెషర్ లేదా జూనియర్ విద్యార్థి శరీరాకృతి లేదా మానసిక స్థితిని ప్రతికూలంగా ప్రభావితం చేసే విధంగా అవమానం లేదా ఇబ్బందిని కలిగించే లేదా సృష్టించే ప్రభావాన్ని కలిగించడమని నిర్వచించింది. డెబ్భైవ దశకం చివరిలో ఒక ప్రాంతీయ ఇంజినీరింగ్ కళాశాలలో ఇద్దరు ఫ్రెషర్లు మరణించిన తరువాత భారత ప్రభుత్వం దేశంలో ర్యాగింగ్‌ను నిషేధిస్తూ మొదటిసారి నోటిఫికేషన్‌ను జారీ చేసింది.

ర్యాగింగ్‌ను అరికట్టేందుకు విశ్వవిద్యాలయాలకు మార్గదర్శకాలను జారీ చేయాలని విశ్వ జాగృతి మిషన్ దాఖలు చేసిన పిల్‌పై గౌరవనీయులైన సుప్రీంకోర్టు 1999లో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్‌ని కోరడంతో న్యూఢిల్లీలోని జవహర్ లాల్ నెహ్రూ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కేపీఎస్ ఉన్ని ఆధ్వర్యంలో ర్యాగింగ్‌పై పరిశీలించి నివేదిక సమర్పించేందుకు యూజీసీ నలుగురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేసింది.

ఉన్నీ కమిటీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ర్యాగింగ్‌పై చట్టాలు తీసుకురావాలని సూచించింది. ర్యాగింగ్‌కు వ్యతిరేకంగా సున్నితత్వం కోసం చేపట్టాల్సిన పలు చర్యలను కమిటీ సిఫార్సు చేసింది. విద్యార్థులను ర్యాగింగ్ వ్యతిరేక కార్యకలాపాలకు ప్రోత్సహించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పింది. ర్యాగింగ్‌ను అరికట్టడంలో విఫలమైన సంస్థలను అడ్మిషన్లకు దూరంగా ఉంచాలని కూడా సూచించింది. విద్యార్థుల అడ్మిషన్ రద్దు నుంచి రూ.లక్ష వరకు జరిమానా విధించే వరకు శిక్షలు



ర్యాగింగ్ జరిగినట్లయితే యాజమాన్యం, ప్రిన్సిపల్ బాధ్యత వహించాలని సుప్రీంకోర్టు ఆదేశాలు ఉన్నాయి. ర్యాగింగ్‌ను అరికట్టేందుకు కమిటీ 'ఐ' కొన్ని బలమైన సిఫార్సులు చేసింది. క్యాంపస్‌లలో ర్యాగింగ్ కేసుల పెరుగుదల సమస్యను పరిష్కరించడానికి, యూనివర్సిటీ గ్రాంట్స్ కమీషన్ (యు.జి.సి) ఉన్నత విద్యా సంస్థలలో ర్యాగింగ్ ముప్పును అరికట్టడంపై నిబంధనలు 2009 పేరున తీసుకువచ్చింది. దీని ప్రకారం ర్యాగింగ్‌కి పాల్పడిన వారికి సస్పెన్షన్లు విధించవచ్చని, స్కాలర్‌షిప్, ఫెలోషిప్పు నిలిపివేయొచ్చు. పరీక్షలకు హాజరుకాకుండా డీబార్, పరీక్షల ఫలితాలు నిలుపుదల , హాస్టల్ నుండి బహిష్కరణ, అడ్మిషన్లు రద్దు వంటివి చేయొచ్చు.

విధించాలని ఈ కమిటీ సూచించింది. తీవ్రతను బట్టి మూడేండ్ల వరకు కఠిన కారాగారశిక్ష విధించవచ్చని తెలిపింది. 2006లో గౌరవ సుప్రీం కోర్టు ర్యాగింగ్‌ను నిరోధించడానికి మార్గాలు, పద్ధతులను సూచించడానికి సి.బి.ఐ డైరెక్టర్ డాక్టర్ ఆర్ కె రాఘవన్ ఆధ్వర్యంలో మరొక కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీ పలు కీలక పరిశీలనలు చేసింది. ర్యాగింగ్‌కు మానసిక, సామాజిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక సహా అనేక అంశాలు కారణాలుగా ఉన్నాయని, ఇది ఉన్నత విద్యా ప్రమాణాలపై ప్రతికూల ప్రభావం చూపుతుందని పేర్కొంది. పాఠశాల దశ నుంచే మానవీయ విలువలను పెంపొందించడంలో మన వైఫల్యం ర్యాగింగ్‌గా పరిగణించబడుతుంది అని చెప్పింది. ర్యాగింగ్ జరిగినట్లయితే యాజమాన్యం, ప్రిన్సిపల్ బాధ్యత వహించాలని సుప్రీంకోర్టు ఆదేశాలు ఉన్నాయి. ర్యాగింగ్‌ను అరికట్టేందుకు కమిటీ 'ఐ' కొన్ని బలమైన సిఫార్సులు చేసింది. క్యాంపస్‌లలో ర్యాగింగ్ కేసుల పెరుగుదల సమస్యను పరిష్కరించడానికి, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యు.జి.సి) ఉన్నత విద్యాసంస్థలలో ర్యాగింగ్ ముప్పును అరికట్టడంపై నిబంధనలు 2009 పేరున తీసుకువచ్చింది. దీని ప్రకారం ర్యాగింగ్‌కి పాల్పడిన వారికి సస్పెన్షన్లు విధించవచ్చని, స్కాలర్‌షిప్, ఫెలోషిప్‌లు నిలిపి వేయొచ్చు. పరీక్షలకు హాజరు కాకుండా డీబార్, పరీక్షల ఫలితాలు నిలుపుదల, హాస్టల్ నుండి బహిష్కరణ, అడ్మిషన్లు రద్దు వంటివి చేయొచ్చు.

ఇంకా ఏదైనా ఇతర సంస్థలో ప్రవేశం నుండి డిబార్ చేయొచ్చని తెలిపింది. వీటిని ఉన్నత విద్యా సంస్థలు తప్పని సరిగా పాటించాలని తెలిపింది. 1997లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ర్యాగింగ్ నిషేధ చట్టాన్ని ప్రవేశ పెట్టింది. ర్యాగింగ్ అనేది కళాశాలలే కాకుండా విద్యను బోధించే ఏ సంస్థ అయినా, అనాథశరణాలయం, విద్యార్థి వసతి గృహం, ట్యుటోరియల్ కాలేజీ వంటి విభాగాలన్నీ ఇదే కోవలోకి వస్తాయని, ఇవీ కాక ఈ సంస్థల వెలుపల కూడా అనగా రోడ్లు, బస్సులు ఆగే ప్రాంతం, రైల్వే స్టేషన్లు, విమానాశ్రయాలు, వైద్యశాల వంటి ప్రదేశాలన్నింటిలోనూ ర్యాగింగ్ చేయటం నేరం. ఒక విద్యార్థికి ర్యాగింగ్ ద్వారా అవమానం చేసి అతన్ని బాధించడం జరిగితే 6 నెలల వరకు జైలు శిక్ష వెయ్యి రూపాయల వరకు జరిమానా విధింపబడుతుంది. ర్యాగింగ్ సందర్భంలో మరణించటం జరిగిన లేదా ఆ విద్యార్థి ఆత్మహత్యకు లోనైనా నేరస్తునికి జీవిత ఖైదు లేదా పదేండ్ల వరకు జైలుశిక్ష, 50వేల రూపాయల వరకు జరిమానా విధింపబడతాయి. యు.జి.సి ర్యాగింగ్ బాధితులకు సహాయం చేయడానికి 12 భాష లలో 1800-180-5522 యాంటీ ర్యాగింగ్ టోల్-ఫ్రీ "హెల్ప్ లైన్"ని ఏర్పాటు చేసింది. ఇంకా యాంటీ ర్యాగింగ్ వెబ్ సైట్‌ను అభివృద్ధి చేసింది. ఇందులో ఫిర్యాదులు చేయొచ్చు. పరిష్కారస్థితిని రియల్ టైంలో తెలుసుకోవచ్చు.

పరిష్కారాలు : ర్యాగింగ్ నిరోధానికి కళాశాలలు, ప్రత్యేక బాధ్యత వహించాలి. కళాశాలలో చేరే సమయంలో అండర్ టేకింగ్ తీసుకోవాలి. సీనియర్‌లు, జూనియర్‌లు కల వకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. వారికి విడివిడిగా హాస్టల్ వసతి కల్పించాలి. ర్యాగింగ్ ఎంత పెద్ద నేరమో అవగాహన కలిగించాలి. విద్యాలయాలలో ఏర్పాటు చేసిన కౌన్సిలింగ్ కేంద్రాలు, యాంటీ ర్యాగింగ్ కమిటీలు ఏవిధమైన ఒత్తిడికి గురికాకుండా చురుగ్గా పనిచేసి సత్వర నిర్ణయాలు తీసుకోవాలి. ముఖ్యమైన ప్రాంతాలలో సీసీ కెమెరాలు ఉంచాలి. కొన్ని సినిమాలు, వెబ్ సీరియల్స్‌ను నిషేధించాలి. యువత విచ్చలవిడితనాన్ని విడిచిపెట్టాలి. విద్యార్థుల తల్లిదండ్రులు వారి పిల్లలకు ర్యాగింగ్ ఎంత నేరమో తెలియజేయాలి. దోషులకు కఠిన శిక్షలు వేయాలి. వీరి పేర్లు, వారికి పడ్డ శిక్షలు ప్రతీ కాలేజీ నోటీసు బోర్డులో ఉండేటట్లు చూడాలి. ర్యాగింగ్ గురించి ఉన్నత పాఠశాల స్థాయిలో పాఠాలుగా చేర్చాలి. ర్యాగింగ్‌ను అరికట్టాల్సిన ప్రాథమిక బాధ్యత విద్యా సంస్థలపైనే ఉంటుంది. వాటిని నియంత్రించడంలో మీడియా, పౌర సమాజం చురుకుగా పాల్గొనవలసిన అవసరం ఉంది.

సాంకేతిక విప్లవాన్ని సరిగ్గా వాడుతున్నామా..?

ఆధునిక టెక్నాలజీ మనకు అందుబాటులోకి వచ్చినప్పటి నుండి ఎంతో పురోగతిని సాధించినప్పటికీ, అవి చేసే లాభాలతో పాటు నష్టాలను కూడా మనం భరించాల్సి వస్తుంది. టెక్నాలజీ రెండు వైపులా పదునున్న కత్తి లాంటిది.సక్రమంగా వినియోగిస్తే పురోభివృద్ధికి తోడ్పుతుంది.కానీ దాన్ని దుర్వినియోగ పరిస్థితి అనేక సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. నేడు ఈ టెక్నాలజీ తెచ్చిన సౌకర్యం మూలంతో అరచేతిలో ఆండ్రాయిడ్ ఫోను ఉంది. అంతర్జాలం డేటా చౌకగా అందుబాటులోకి వచ్చింది. దీనితో సామాజిక మాధ్యమాలను విరివిగా వాడుతూ మానవులు వాళ్ల విలువైన కాలాన్ని వృథా చేస్తున్నారు. ఈ సామాజిక మాధ్యమాలు అందుబాటులో ఉంది కదా అని ఇష్టం వచ్చినట్లుగా మెసేజ్‌లను వచ్చినవి వచ్చినట్లు వాటిలో నిజానిజాలు మంచేదో, చెడేదో రూఢీ చేసుకోకుండానే ఇతర గ్రూపులకు ఫార్వర్డ్ చేస్తున్నారా.. అయితే ఇకపై ఇలా చేసే ముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించాల్సిందే, ఎందుకంటే? నకిలీ వార్తలు అర్థ సత్యాలు, అసత్యాల మెసేజ్‌లను వ్యాప్తి చేసిన వారిపై పోలీసులు కేసులు నమోదు చేసే అవకాశం ఉంది. ఒకవేళ ఈ పరిణామాలపై నేరం నిరూపితమైతే మూడేళ్ల శిక్ష పడేందుకు ఆస్కారం కూడా లేకపోలేదు.



- మేకిరి దామోదర్
9573666650

ప్రస్తుతం ప్రజలకు నిత్య జీవితంలో సామాజిక మాధ్యమాలతో విడదీయరాని బంధం ఏర్పడింది. అదే అదునుగా వీటి ద్వారా కొందరు వాస్తవాల కంటే! వదంతులను అర్థ సత్యాలను, అసత్యాలను ఎక్కువగా వ్యాప్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. వాటి కారణంగా ఇబ్బందులు ఉండటంతో వీటిని కట్టడి చేసేందుకు పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారు. జాతీయ నేరాల నమోదు సంస్థ (ఎన్సీఆర్‌బీ)నివేదిక ప్రకారం.. గత ఏడాది నకిలీ అర్థ, అసత్య వార్తలు సమాచార వ్యాప్తికై అత్యధిక కేసులను తెలంగాణలో నమోదయినాయి. గత ఏడాది ఈ నకిలీ వార్తల ప్రచారానికి సంబంధించి రాష్ట్రంలో 264 కేసులు, రెండవ స్థానంలో ఉన్న ఉత్తర ప్రదేశ్‌లో 147 కేసులు నమోదయ్యాయి. దేశం మొత్తం మీద ఈ తరహా కేసులు 858 నమోదు కాగా, ఇందులో నాలుగోవంతు ఒక్క మన తెలంగాణ రాష్ట్రంలోనే కావడం గమనార్హం. ఇలాంటి వదంతులు ప్రచారం చేస్తే అవి తట్టుకోలేని అనేక మంది మానసిక వేదనకు గురైన సంఘటనలను చూసినం. ఇలా అమానవీయంగా వదంతుల ప్రచారం చేయడం క్షమించరాని నేరమని గ్రహించండి. ఇదిలా ఉంటే.. డీప్ ఫేక్ పరిజ్ఞానం వల్ల అనేక నష్టాలు జరుగుతున్నట్లు వీటిని దుర్వినియోగం చేస్తున్నట్లు ఈ మధ్య అనేక సంఘటనలు చూస్తున్నాం.



తెలంగాణలోని కొన్ని ఘటనలను పరిశీలిస్తే ఓ మహిళ రాజకీయ నేతకు విదేశాల్లో ఖరీదైన ఇల్లు ఉన్నాయంటూ తమ యూట్యూబ్ ఛానల్‌లో ప్రసారం చేసినందుకు హైదరాబాద్, హుజురాబాద్‌లకు చెందిన ఇద్దరు విలేకరులను పోలీసులు అరెస్ట్ చేశారు.ఓ కలెక్టర్‌కు కరోనా వచ్చిందని వార్తలు ప్రచారం చేసిన వ్యక్తిపై నిర్మల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఒకప్పుడు ఇలాంటి వదంతులు వ్యాప్తి చేసిన చాలామంది చూసీచూడనట్లు వ్యవ హరించేవారు. కానీ ఇప్పుడు ఎవరికి వారు కేసులు పెట్టేందుకు సిద్ధమవు తున్నారు. దాంతో తప్పుడు వార్తలను, అర్థసత్యాలను, అసత్యాలను సామా జిక మాధ్యమాల్లో ప్రచారం చేసే ముందు అప్ర మత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది.

సాంకేతిక విప్లవం సామాజిక మాధ్యమాలను సామాన్యుడి చేరువ చేసింది. సులభంగా వాడే అవకాశం రావడంతో దాని మాటున రకరకాల ప్రచారాలకు తెరలేస్తుంది. ప్రజల అభిప్రాయాలను సైతం మార్చే స్థాయికి సామాజిక మాధ్యమాలు చేరుకున్నాయంటే అతిశయోక్తి కాదు. దీనికి డీప్ ఫేక్ వంటి పరిజ్ఞానం తోడవడంతో ఏ విషయాన్ని అయినా సరే తమకు కావలసిన విధంగా మార్పులు చేసి సామాజిక మాధ్యమాల్లో గుప్పించడం పరిపాటిగా మారింది. ఇటీవల ఓ హీరోయిన్‌కు సంబంధించిందంటూ సృష్టించిన డీప్ ఫేక్ వీడియో దేశవ్యాప్తంగా కలకలం రేపిన విషయం మనకు తెలిసిందే. అనని విషయాన్ని అన్నట్టుగా, చిత్రీకరిస్తుండటంతో సమస్యలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా మతాలు, వర్గాల మధ్య వైరం సృష్టించేందుకు కొందరు పనిగట్టుకొని వదంతులను, అర్థసత్యాలను,అసత్యాలను సృష్టిస్తూ ఉంటారు. కొన్ని రాజకీయ పార్టీలు కూడా సామాజిక మాధ్యమాలను ప్రత్యర్థులపై దుష్ప్రచారాన్ని ఆయుధాలుగా మలుచుకుంటున్నాయి. వదంతులు, అర్థసత్యాలు, అసత్యాలను వ్యాప్తి చేయడం భారతీయ శిక్షాస్మృతి (ఐపీసీ) సెక్షన్ 505 ప్రకారం నేరం. దీనికి ఐటీ చట్టం జోడించి పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారు. ఇందులో నేరం నిరూపితమైతే మూడేళ్ల వరకు శిక్ష పడుతుంది.

తెలంగాణలోని కొన్ని ఘటనలను పరిశీలిస్తే ఓ మహిళా రాజకీయ నేతకు విదేశాల్లో ఖరీదైన ఇల్లు ఉన్నాయంటూ తమ యూట్యూబ్ ఛానల్‌లో ప్రసారం చేసినందుకు హైదరాబాద్, హుజురాబాద్‌లకు చెందిన ఇద్దరు విలేకరులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఓ కలెక్టర్‌కు కరోనా వచ్చిందని వార్తలు ప్రచారం చేసిన వ్యక్తిపై నిర్మల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఒకప్పుడు ఇలాంటి వదంతులు వ్యాప్తి చేసిన చాలా మంది చూసీచూడనట్లు వ్యవహరించేవారు. కానీ ఇప్పుడు ఎవరికి వారు కేసులు పెట్టేందుకు సిద్ధమవుతున్నారు. దాంతో తప్పుడు వార్తలను, అర్థసత్యాలను, అసత్యాలను సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేసే ముందు అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. వార్తలు సృష్టించడమే కాదు వాటిని ప్రచారం చేసిన పోలీసులకు సమాధానం చెప్పుకోవాల్సి ఉంటుందన్న విషయాన్ని నేడు సామాజిక మాధ్యమాలను విరివిగా చూస్తున్న విలువైన కాలాన్ని వృథా చేస్తున్న ప్రతి ఒక్కరు ఈ వాస్తవాన్ని గ్రహించాలి. చేతిలో సెల్‌ఫోన్ చౌకగా (డాటా) సౌకర్యం వచ్చినప్పటి నుండి, వయసు తారతమ్యాలు లేకుండా రాత్రి పగలనకుండా పోర్న్ వీడియోలు చూస్తూ అనేక అఘాయిత్యాలకు, అత్యాచారాలకు పాల్పడుతున్న ఘటనలు పెరుగుతున్నాయి. ఎంతో విజ్ఞానాన్ని సంపాదించాల్సిన యువత, విలువైన కాలాన్ని వృథా చేస్తూ సమాజంలో నైతిక విలువలకు తిలోదకాలిస్తూ అమానవీయంగా వ్యవహరిస్తున్నారు. ఇలా మద్యం మత్తు తోడవడంతో సమాజంలో ఆధునిక టెక్నాలజీ తోడ్పాటుతో అనేక దాష్టికాలకు, దుర్ఘటనలకు, అత్యాచారాలకు పాల్పడుతున్నారు. యూనివర్సిటీల్లో, కాలేజీల్లో యువత చదువులు పక్కనపెట్టి డ్రగ్స్ (మారక ద్రవ్యాల)కు అలవాటు పడి విలువైన కాలాన్ని, వయసును వృథా చేస్తున్నారు.

ఇలాంటి వాటి మూలంగా మానసికంగా, ఆరోగ్య పరంగా బలహీనంగా తయారవుతున్నారు. అందుకే ఈ ప్రభుత్వం మాదక ద్రవ్యాల (డ్రగ్స్) మద్యపానం విపరీత వినియోగంపై కఠి నంగా వ్యవహరించి డ్రగ్స్ రహితంగా తెలంగాణ ఏర్పాటుకు పూనుకోవడం అభినందనీయం. అలాగే పోర్న్ వీడియోలను నిషేధిస్తూ, విలువలతో కూడిన సమాజం ఏర్పాటుకు అసత్య ప్రచారాలు సామాజిక మాధ్యమాలలో కట్టడి చేస్తూ నైతిక విలువలను పెంపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మనిషి అనైతిక ప్రవర్తన, అసత్య ప్రచారం మారణాయుధాల కంటే ప్రమాదకరమని భావించి నేరాలకు గురికాకుండా ఆధునిక టెక్నాలజీని జ్ఞాన విస్తృతిక ఉపయోగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.